ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

**Advaita Vedanta Parichayam**

# అద్వైతవేదాన్త పరిచయము

## తత్త్వబోధ సహితము

తరతి శోకమాత్మవిత్ ఇతి శ్రుతేః

**స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో**

**వారి ఆశీస్సులతో**

**తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

Fourth edition – Year 2023 Gita Jayanthi day 1000 copies

For Copies
K V Raghava Rao
C – 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com

for softcopy
http://telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Title - **Advaita Vedanta Parichayam**

Sanskrit Support - Sri Desu Chaitanya Krishna
DTP - Smt. Syamala Devi Sripathi, 9966383661

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 150

# బ్రహ్మయజ్ఞం

**తక్కువేమి మనకూ విష్ణుండొక్కడుండు వరకూ! ఇది అక్షరసత్యం.**

**శ్రీ విష్ణుప్రసాదు గారు** ఎప్పుడూ **ఓం నమో భగవతే వాసుదేవాయ** అంటూ అందరినీ నోరారా పలకరిస్తారు. అదే ఆయన అపారమైన దైవభక్తికీ, ఆధ్యాత్మిక చింతనకూ, తీవ్రముముక్షుత్వానికీ నిదర్శనం. ఆయన భగవద్గీత ఎన్ని లక్షల కాపీలు పంచారో లెక్కలేదు. అందువల్ల కృష్ణుడే దగ్గరుండి మరీ విష్ణువుచేత భగవద్గీత సారం చెప్పించుకున్నాడు. అంతేకాదు, ఆయన అనన్యభక్తికి మెచ్చి, భగవంతుడు ఆయనపై కురిపించిన లీలలు ఎన్నో, ఎన్నెన్నో!

**శ్రీ విష్ణుప్రసాదు, శ్రీమతి లక్ష్మీకుమారి** దంపతులతో మా అనుబంధం ఈనాటిది కాదు. ఈ దంపతులు, మా జీవితంలో అడుగడుగునా అన్ని వ్యవహారాలలో అండదండలుగా ఉంటూ, మా కుటుంబంలో ముఖ్యమైన సభ్యులయ్యారు. వారు లేకుండా మాకు సంబంధించిన ఏ కార్యక్రమమూ అవదని చెప్పటంలో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు. **శ్రీ విష్ణుప్రసాదు గారు** ఆధ్యాత్మిక జీవనంలో తాను ఎదుగుతూ, మేము కూడా ఎదగటానికి తోడ్పడుతూ వస్తున్నారు. పరమార్థానంద స్వామీజీ బోధలు 19 పుస్తకాలుగా ప్రచురించామంటే, ఈ బ్రహ్మయజ్ఞానికి శ్రీకారం చుట్టింది ఆయనే. ఇన్ని గ్రంథాలు వ్రాసే ఉద్దేశ్యం లేని రోజుల్లేనే రాజీ 11 ఉపనిషత్తులు వ్రాయాలి, అవి మనం ప్రచురించాలి అనేవారు. వారి సత్సంకల్పం ఈనాడు ఫలించింది.

**బాష రాజీది, భావం రాఘువది, సత్సంకల్పం విష్ణువుది.**

**శ్రీ విష్ణుప్రసాదు గారు** స్వామీజీ ద్వారా నేర్చుకున్న విద్య నలుగురికీ పంచాలి, వారు మోక్షం పొందాలి, దానికి తగ్గట్టుగా వారిని తీర్చిదిద్దాలి అనే తపనతో ఆన్‌లైన్ క్లాసులు తీసుకుంటున్నారు. **ఆత్మబంధువులారా** అంటూ ఆప్యాయతతో సంబోధిస్తూ, సభ్యులను ప్రోత్సహిస్తూ, అవసరమైతే మందలిస్తూ, నవ్వుతూ, నవ్విస్తూ తనదైన బాణిలో ప్రకరణగ్రంథాలను బోధిస్తూ సభ్యులను ఆత్మజ్ఞానంలో నిష్ణాతులను చేస్తున్నారు.

**శ్రీమతి లక్ష్మీకుమారిగారు** సదా తమ నియమబద్ధమైన, నిరాడంబరమైన జీవనవిధానంతో శ్రీ విష్ణుప్రసాదుగారిని అనుసరిస్తారు. **అద్వైతవేదాన్త పరిచయము** పుస్తకప్రచురణ అనే **బ్రహ్మయజ్ఞానికి** ఇతోధికంగా సహాయం చేశారు.

ఈ పుణ్యదంపతులకు, వారి కుటుంబసభ్యులకు భగవంతుడు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి, జ్ఞాననిష్ఠ మెండుగా కలుగచేయాలని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము. **– రాఘవ రావు రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | సంస్తుతి | 05 |
| | స్వామీజీ గురించి నా స్పందన | 07 |
| | ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు | 10 |
| 01. | పురుషార్థములు | 13 |
| 02. | శాస్త్రం | 19 |
| 03. | వర్ణవ్యవస్థ | 25 |
| 04. | ఆశ్రమవ్యవస్థ | 30 |
| 05. | కర్మయోగం | 35 |
| 06. | ఉపాసనాయోగం | 44 |
| 07. | జ్ఞానయోగం | 50 |
| 08. | భక్తియోగం | 56 |
| 09. | సాధనచతుష్టయం | 63 |
| 10. | శరీరత్రయం | 71 |
| 11. | అవస్థాత్రయం – కోశపంచకం | 82 |
| 12. | ఆత్మ | 92 |
| 13. | సృష్టి | 101 |
| 14. | కర్మసిద్ధాంతం | 109 |
| 15. | జీవేశ్వర ఐక్యం | 117 |

# సంస్తుతి

స్వామి పరమార్థానన్దగారు ఆంగ్లములో ఇచ్చిన ధార్మిక ప్రసంగాలను మద్దూరి రాజ్యశ్రీ గారు "అద్వైత వేదాంత పరిచయం" అని తెలుగు గ్రంథ రూపములో అనువదించారు. వేదాంతములో ప్రవేశించడానికి ఈ గ్రంథము కరదీపికలాంటిది. స్వామివారు శ్రేష్ఠమైన వేదాంత పరిజ్ఞానము కలవారు అయినను చిన్నపిల్లలకు అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా సులభముగా మరియు వివరముగా చెప్పినారు. ఈ పుస్తకము చదివేవారి అభిరుచి మరియు జ్ఞానము పెరగడానికి తప్పక దోహదకారి అగును. మచ్చుకకు వారు చెప్పిన కొన్ని వాక్యములను ఇక్కడ ఉటంకించడం చాలా బాగుగా ఉంటుంది.

క్రతువుల పరిజ్ఞానము గురించి చెబుతూ, "పూజలు నేర్చుకొనుటవల్ల క్రమశిక్షణ, ఉత్సాహము మరియు భగవద్భక్తి పెరుగుతుంది". "ధర్మానికి కట్టుబడనిచో శారీరక మరియు మానసిక భావపరంపర జీవితము దెబ్బతింటుంది," "ఐహిక సుఖములే ముఖ్యమనుకునే కుటుంబాలలో బంధము నిలువదు." "సన్యాసమంటే అజ్ఞానాన్ని, అహంకారాన్ని వదులుకొని, అన్నిటినీ త్యజించడమే." "నిత్యపారాయణము బ్రహ్మయజ్ఞములోనికి వస్తుంది."

స్వామీజీవారు చేసిన ప్రసంగాలు మంచి బోధనలై, విషయవివరణ చాలా సులభంగా మరియు శ్రేష్ఠంగా ఉంటుంది. చెప్పిన అంశాలకి శాస్త్ర ప్రమాణం, తర్కము మరియు అనుభవము ఉన్నట్లు స్పష్టమవుతుంది. యవ్వనవంతులలో శాస్త్రపరిజ్ఞానము కలిగించిన శ్రీమత్ స్వామి చిన్మయానంద మరియు శ్రీమత్ స్వామి దయానందగార్లలాగా ఈ స్వామీజీ కూడా, అసలైన సన్యాసిలాగా బోధనలను జనజనాలకి అందించారు. "సన్యస్య శ్రవణం కుర్యాత్" అన్నది శాస్త్రం. అటువంటి శ్రవణ, మనన, నిదిధ్యాసలు చేసిన స్వామివారు ప్రజలకు ప్రవృత్తి మార్గాన్ని చెప్పకుండా, నివృత్తి మార్గాన్ని బోధించడం ముదావహం మరియు గొప్ప విశేషం.

కర్మఫలాన్ని చెబుతూ, స్వామివారు ఇలా అన్నారు: "మనం ఏ పని చేసినా, అది జగత్తులో ఒక భాగం అవుతుంది, మన చేయి దాటిపోతుంది. తరువాత కర్మ జగత్తులో ఒక భాగమవుతుంది. అప్పుడు కర్మలమీద జగత్తు సూత్రాలు పనిచేస్తాయి. జగత్తు మొత్తం ఆ సూత్రాలమీదనే నడుస్తుంది. ఈ ప్రక్రియవల్ల వచ్చే కర్మని కర్మఫలమంటారు". కర్మ ఈశ్వరార్పణభావంతో చేసి, కర్మఫలాన్ని ఈశ్వరప్రసాదభావంతో స్వీకరించడమే యోగం. 'యద్భావం తద్భవతి'. మీ ఆలోచనే మీ భవిష్యత్తును నిర్ణయించే సూక్ష్మమైన బీజం. మీరు ఎలా ఆలోచిస్తే అలా అవుతారు. ఆత్మజ్ఞానమంటే ఆత్మయొక్క అజ్ఞానం తొలగిపోవడమే.

ఈశ్వరార్పణభావన లేకుండా కర్మ లేదు కనుక, కర్మలో భక్తి ఉంది. చిత్తశుద్ధికై చేసే ఉపాసనలలో భక్తి లేకపోతే ఏకాగ్రత ఎలా కుదురుతుంది? జ్ఞానమార్గమైనా, శాస్త్రార్థం చేసేటప్పుడు, ప్రార్థనతో మొదలుపెట్టి, ప్రార్థనతోనే ముగిస్తాము కాబట్టి, అక్కడ కూడా భక్తి ఉన్నట్లే కదా! అందుకే యుగపురుషులైన శ్రీరామకృష్ణ పరమహంసవారు భక్తి ఈ యుగానికి ఆయువుపట్టని చెబుతూ, జ్ఞానము, వివేకము మరియు వైరాగ్యము కూడా ఉండాలన్నారు. ఈ జగత్తు సృష్టించడానికి అభిన్న, నిమిత్త, ఉపాదానకారణము పరమాత్మయే. అంటే, ముడిసరుకునుండే మొత్తం విశ్వం రూపొందింది. కాబట్టి, దేముడే విశ్వము. అంటే విశ్వము దేముడు తప్ప మరొకటి కాదు. మనుష్యుల సమస్యలకు పరిష్కారం అనిత్యవస్తువులలో లేదు. అనిత్యవస్తువుని నిత్యమని భ్రమపడడంలో వుంది. తప్పుగా ఆశించడంవల్ల సమస్య ఉత్పన్నమవుతుంది. ఇలా తప్పుగా ఆచరించడంవల్ల ఏర్పడిన దుఃఖాన్ని సంసారమంటారు.

"అరువు తెచ్చుకొన్న చైతన్యంవలన, స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు నెమలిలా, గర్వంగా నాట్యం చేస్తున్నాయి. లేకపోతే, శిల్పానికి మన శరీరానికి తేడా లేదు. శరీరత్రయం చైతన్యాన్ని అరువు తెచ్చుకొందంటే, అప్పిచ్చేవాడు ఒకడు ఉండాలి కదా! అంటే మనలో ఒక చైతన్యం ఉండాలి. చైతన్యాన్ని అప్పు ఇవ్వడానికి ఆ అప్పిచ్చే చైతన్యం మానవశరీరంలో నాలుగవ అంశము. మొదటి మూడు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు." ఇలాంటి ఆణిముత్యాలు స్వామివారి ప్రతిప్రసంగంలో కోకొల్లలు. వాటిని, ఈ పుస్తకం చదువరులు, వారి అనుభవంతో తెలుసుకుంటే చాలా మేలు చేకూరుతుంది. ఈ పుస్తకంలో చెప్పిన విషయాలను ఆచరణలోకి తెచ్చుకొంటే ముక్తి కరతలామలకమవుతుంది.

స్వామివారి ఆరోగ్యానికి, దీర్ఘాయువుకి, ఈ పుస్తకప్రచారానికి దైవ కృప తప్పక ఉండి తీరుతుంది. అనువాదం చేసిన మద్దూరి రాజ్యశ్రీగారికి ఆయురారోగ్యములనిచ్చి దేముడు కాపాడుగాక! పుస్తకప్రచురణకు సహకరించిన దాతలకు ఈశ్వరకృప ఉండుగాక అని ఆశీర్వదిస్తూ,

భవదీయుడు
స్వామిమేధానన్దపురి
కైలాస ఆశ్రమం
ఋషికేశము

# స్వామీజీ గురించి నా స్పందన

**గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవేనమః**

కొన్నేళ్ళ క్రితం మావారు ఎప్పుడు చూసినా ఒక స్వామీజీ ప్రసంగాలు వింటూ ఉండేవారు. కొన్ని గుళ్ళలో వేదఘోష ప్రతిధ్వనిస్తున్నట్లుగా, మా ఇంట్లో ఇటుక, ఇటుకకూ ఆ స్వామీజీ గొంతు సుపరిచితమే. ఏం వింటున్నారు అంటే అద్వైతవేదాంతం అనేవారు. కొంత కాలం ఏమోలే, నాకేం అర్థమవుతుందని పట్టించుకోలేదు. కాని, ఒక శుభముహూర్తాన (నిజంగా అది శుభముహూర్తమే) ఎందుకో నాకూ అదేమిటో వినాలన్న కుతూహలం కలిగింది. ఆ మాట చెప్పిందే తడవుగా, నా సెల్‌ఫోన్లో ఆయన ప్రసంగం ఒకటి ఎక్కించి ఇచ్చారు.

అన్నట్లు అది ప్రసంగం కాదు, బోధట. గురుశాస్త్ర ఉపదేశంట. నేను ఇంగ్లీషు లెక్చరర్‌గా మా పిల్లలకి క్లాసులో రోజుకో గంట ఎలా బోధిస్తానో, అలా రోజుకో గంట శ్రద్ధగా ఆయన ఉపన్యాసం వినమన్నారు. దానిపేరు ముండకోపనిషత్తు. అది వినేనాటికి నాకు అసలు అద్వైతం అంటే ఏమిటో తెలియదు. ఉపనిషత్తు, ఆత్మ, అనాత్మ, శరీరత్రయం, పంచకోశాలు, కర్మసిద్ధాంతం ఇలాంటి పదాలతో బొత్తిగా పరిచయం లేదు.

అలాటి అజ్ఞానంతో ఉన్న నేను ముండకోపనిషత్తు వినటం మొదలుపెట్టాను. ఆ స్వామీజీ పేరు పరమార్థానందస్వామి. పూజ్యస్వామీజీ దయానందసరస్వతిగారి శిష్యులాయన. ఎంత బాగా చెప్పారనుకున్నారు! ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే! అసలేమీ తెలియని ప్రపంచంలోకి, స్వయంగా మన చేయి పట్టుకుని, ఒక్కొక్కమెట్టూ పైకి ఎక్కించి, ఎక్కడ జారిపోతామో అని మధ్య మధ్యలో జాగ్రత్తగా చూసుకుంటూ, పైకి తీసుకువెళ్ళి ఒక అద్భుతప్రపంచం చూపించారు.

అసలే కొత్త విషయం, తలపైనుంచి వెళ్ళిపోయే వివరాలు. అయినా అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు, ఊహూ! నోట్లో పెట్టి, అది మింగేదాకా ఆగినట్టు ఆగేవారు. ఒక్కో విషయం ఒకటికి రెండుసార్లు చెప్పటం, చెప్పబోయే విషయానికి కొంత ఉపోద్ఘాతం ఇచ్చి, మళ్ళీ ఒక్కొక్క మంత్రంలోని ఒక్కొక్క పదానికి అర్థం, గూడార్థం చెప్పి, మళ్ళీ దానికి ముక్తాయింపు పలకటం, మర్నాడు పది నిముషాలు పాతపాఠాన్ని గుర్తుచేయటం – టూకీగా ఇదీ ఆయన పద్ధతి. ఇదంతా ఇంగ్లీషులో. ఇంగ్లీషు రానివారికి కూడా అర్థమయ్యేటంత తేలిక పరిభాషలో. సరిగ్గా మనకు ఒక విషయం అర్థం కాక, అమ్మో అనుకునే సమయానికి తల తిరుగుతోందా అని అరవంలో అడుగుతారు. మళ్ళీ దాన్ని తేలిక భాషలో ఇంకో విధంగా చెబుతారు.

మన చిన్నప్పుడు ఎవరినైనా మెచ్చుకోవాలంటే, ఆ మాష్టారు పాఠం చెపితే, అది విని పరీక్ష రాయవచ్చు అనేవారు. అది ఈ పరమార్థానంద స్వామివారికి అక్షరాలా సరిపోతుంది. గ్రాహ అంటే అర్థం అయ్యేలాగా చెప్పటం అనీ, గురువు తలమీదున్న మీట నొక్కితే శాస్త్రం వస్తుందనీ, ఒక మంచి గురువు బోధచేస్తే మనం వద్దనుకున్నా అర్థమయిపోతుందనీ స్వామీజీ అక్కడక్కడా చెప్పారు. అవన్నీ ఆయనకి అక్షరసత్యాలు. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనం చేస్తే నిశ్చయజ్ఞానం కలుగుతుందని స్వామీజీ ఎప్పుడూ చెబుతారు. స్వామీజీ బోధ వింటేనే, నిశ్చయజ్ఞానం కలుగుతుందని నేను ఘంటా బజాయించి మరీ చెప్పగలను.

గురువు, దేవుడూ ఒక్కసారి ప్రత్యక్షమయితే ఎవరికి ముందు నమస్కారం పెట్టాలంటే గురువుకే ముందు పెట్టాలని ఎవరో పెద్దలు అన్నారు. ఎంత నిజం! ఈ స్వామీజీలాంటి గురువులు సాక్షాత్తూ పరబ్రహ్మతో తాము రమించి, నువ్వే ఆ పరబ్రహ్మవి అని మనకు 'ఆత్మసాక్షాత్కారం' చేయిస్తారు.

ఆత్మసాక్షాత్కారం చేయించటంలో, మనలో పాతుకుపోయిన అనేక అపోహలని కూకటి వేళ్ళతో పెకళించి వేస్తారు. అంటే ఆత్మసాక్షాత్కారం ఒక అనుభవం కాదని, దాన్ని ధ్యానంవల్లనో, కుండలినీ ధ్యానంలోనో, యోగాసనంలోనో పొందలేమని, ఆత్మ అజ్ఞానం కేవలం ఆత్మజ్ఞానంవల్లనే తొలగుతుందనీ, దానిని శ్రోత్రియబ్రహ్మనిష్ఠ అయిన గురువునుంచే పొందాలనీ పదే పదే చెబుతారు.

అలాగే మన మతంలో అనేక దార్శనికులు ఆత్మ గురించి అనేక దర్శనాలిచ్చారు. అవి – ఆత్మ శరీరం అనీ, ఆత్మ కర్తా, భోక్తా అనీ, ఆత్మ మనసు అనీ, ఆత్మలు అనేకం అనీ. అవన్నీ తప్పని సహేతుకంగా నిరూపిస్తారు స్వామీజీ, శంకరభాష్యంలోంచి ఉదాహరణలు తీసుకుని. మావారు రాఘవరావుగారూ, నేనూ స్వామీజీ చెప్పిన పది ఉపనిషత్తులూ, బ్రహ్మసూత్రాలూ, ఆత్మబోధ అన్నీ విన్నాము, వింటున్నాము. ఆయన చెప్పిన శంకరభాష్యంతో కూడిన భగవద్గీత విన్నాము. ఆయన్ని స్వయంగా వెళ్ళి కలిసాము. ఆయన బోధ చెన్నైలో ప్రత్యక్షంగా కొన్ని చోట్ల విన్నాము. కాని ఆశ్చర్యకరంగా, ముఖాముఖీ విన్నదానికీ, క్యాసెట్లో విన్నదానికీ అణువంతైనా తేడా కనబడలేదు. అంత స్పష్టంగా ఉంది ఆడియో కూడా.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్।**
**అచక్షుః శ్రోత్రం తదపాణిపాదమ్।**
**నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం।**
**తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః॥**

ఆత్మ ఇంద్రియ అగోచరం, నిర్గుణం, నిత్యం, సత్యం. అలాంటి ఆత్మని ధీరుడు మాత్రమే చూడగలడు. పరమార్థానందస్వామి మన గురువైతే మనం ధీరులు అవటానికి ఎంతో సేపు పట్టదు అని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

**ప్రస్థానత్రయం –**

స్వామీజీ చెప్పినది ఏది విన్నా దానికి అక్షరరూపం ఇవ్వాలని ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. స్వామీజీని కలిసిన కొత్తల్లో, 'స్వామీజీ,ఈ చిన్ని మెదడులో ఎన్నో పెద్ద ప్రణాళికలు ఉన్నాయి, భగవద్గీత వింటే అది రాయాలనిపిస్తుంది; బ్రహ్మసూత్రాలు వింటే అవి రాయాలనిపిస్తుంది; మీరు విడమర్చి చెప్పే ఉపనిషత్తులు వింటే అవి రాయాలనిపిస్తుంది,' అంటే రెండుచేతులూ పైకెత్తి మనసారా దీవించారు. 'అన్నీ రాస్తావు, అన్నీ అక్షరరూపం దాలుస్తాయి,' అన్నారు.

సత్యవ్రతానంద సరస్వతి స్వామినితో స్వామీజీ మమల్ని ఇలా దీవించారంటే, 'స్వామీజీ దీవించారంటే అక్షరాలా జరిగితీరుతుంది,' అన్నారు. స్వామీజీ ఆశీస్సులు ఫలించాయి. **ప్రస్థానత్రయ గ్రంథరాజాలు తెటతెనుగులో ప్రచురించగలిగాము.**

**శాస్త్రమే ఆయన ఊపిరి–**

**జీవితపరమార్థం పరమార్థానందస్వామి శాస్త్రంలోంచి రంగరించి పోశారు.** అదీ ఆయన గొప్పతనం. ఆయనే ఒకసారి చెప్పారు గురువు తలమీద మీట నొక్కితే శాస్త్రం వస్తుందని. అది పరమార్థానంద స్వామి విషయంలో అక్షరసత్యం. ఆయన ప్రమేయం లేకుండానే శాస్త్రం దూసుకు వచ్చేస్తుంది. అందువల్లనే మేము మాకేదైనా సందేశమివ్వండి అంటే **"ఫాలో ది శాస్త్ర"** అన్నారు.

**అహో శాస్త్రమహో శాస్త్రమహో గురురహో గురుః**

**అహో జ్ఞానమహో జ్ఞానమహో సుఖమహో సుఖమ్–పంచదశీ 7–297**

**మద్దూరి రాజ్యశ్రీ**

# ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు

శ్రవణాయాఽపి బహుభిర్యో న లభ్యః।
శృణ్వన్తోఽపి బహవో యం న విద్యుః।
ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా।
ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః॥ – కఠ 1.2.7

ఆత్మవిద్య బోధించే గురువు అరుదు. విద్య అర్థం చేసుకోవటం కష్టం. అటువంటి కష్టమైన విద్యని అత్యంత సులువుగా, అత్యంత ఆసక్తికరంగా మలచి బోధించే పరమార్థానంద గురువుగారు దొరకటం మా పూర్వజన్మ సుకృతం. ఆయన బోధనలు విని, నేనూ, మావారు రాఘవరావుగారూ, దయాసత్సంగంలో బోధించే సాహసం చేస్తున్నామంటే చాలా సంతోషించి, ఎంతో మనస్ఫూర్తిగా మమ్మల్ని ప్రోత్సహించినందుకు ఆయనకి అనేకానేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అక్కడితో ఆగకుండా ఆయన ఆంగ్ల బోధనకి తెలుగుసేత నిచ్చి అద్వైతవేదాంత పరిచయం పేరుతో రాశామని అంటే ఎంతో అభినందించి, ఆయన ఆశీస్సులు ఎప్పుడూ మమ్మల్ని వెన్నంటి ఉంటాయని చాలా ఆదరంతో చెప్పినందుకు ఆయనకి వేనవేల కృతజ్ఞతలు.

ముందుమాట రాసిపెట్టమని అడిగిందే తడవుగా మా కోరిక తీర్చిన స్వామీ మేధానందపురిగారికి అనేక ధన్యవాదాలు. ఆయన ఉండేది హృషీకేష్‌లో అయినా దేశదేశాలు తిరుగుతూ ఉంటారు. క్షణం తీరిక ఉండదు. అయినా తీరిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

మావారు గత ఇరవయ్యేళ్లుగా తెలుగుభక్తి పేజెస్ అనే వెబ్‌సైట్‌ని నడుపుతున్నారు. మా సత్సంగంలో మూడు, నాలుగుసార్లు ఈ వేదాంత పరిచయాన్ని తను బోధించి, నాచేత కొన్ని చెప్పించారు. అద్వైతవేదాంతంలో ఈ పుస్తకం ఓనమాలు దిద్దిస్తుంది, వేదాంతపరిభాషని పరిచయం చేస్తుంది, దీన్ని తెలుగులో రాస్తే మరెందరికో మేలు చేసినవారమవుతామని, మన వెబ్‌సైటులో పెడదామనీ నన్ను ప్రేరేపించి, ప్రోత్సహించి నాచేత రాయించారు. నేను రాసిన దానికి మెరుగులు దిద్ది, తత్త్వబోధలోంచి కొన్ని శ్లోకాలని వాటి కనుగుణమైన చోట కలిపారు. మా సత్సంగంలో వారందరికీ దీన్ని పాఠ్యపుస్తకంలా చేసారు. అటువంటి మా వారికి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా చాలదు.

మా కుటుంబ స్నేహితుడు, శ్రేయోభిలాషి శ్రీవిష్ణుప్రసాద్‌గారు. ఇటువంటి ప్రాథమిక గ్రంథాన్ని పుస్తకంలా అచ్చు వేయిద్దామన్న ఆలోచనకి శ్రీకారం చుట్టింది ఆయనే. సలహా

ఇచ్చి ఊరుకోకుండా, రెండురోజులకొకసారి, ఆ విషయం గుర్తు చేస్తూ వచ్చారు. తన వంతు సాయంగా ఈ గ్రంథాన్ని తీసుకువెళ్లి మూడు, నాలుగుసార్లు దుర్భిణీతో వేసి వెతికినట్టు అందులోని ముద్రారాక్షసాలని, పొరపాటున దొర్లిన పదజాలాన్ని వెతికిపట్టుకుని, దగ్గరుండి దిద్దించారు. ఇవాళ ఈ గ్రంథం ఇలా పుస్తకరూపంలో ముస్తాబు చేసుకుని మీ ముందుకి వచ్చిందంటే దానికి విష్ణుప్రసాద్‌గారే కారణం. ఆయనకి అనేకానేక కృతజ్ఞతలు.

మా కుటుంబ స్నేహితురాలు, మా అభివృద్ధి కోరే అరుణ యశోదగారి గురించి చెప్పకపోతే ఈ కృతజ్ఞతలకి విలువ లేదు. మేం ఏం చేసినా మనస్ఫూర్తిగా అభినందించి, తన వంతు సాయం చేస్తూనే ఉంటారు. ప్రూఫ్‌రీడింగ్‌కి పెట్టింది పేరు ఆవిడ. విష్ణుప్రసాద్‌గారితో పోటీపడి తప్పులు పట్టుకునేవారు తెలుగు భక్తి పేజీలలో పెట్టిన వాటికి. దీనికి కూడా అలాగే తప్పులు పట్టుకున్నారు. ఆవిడకి ఆప్యాయంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

శ్రీ వై యస్ రావుగారు మా దంపతులిద్దరినీ, మేము చేసే రచనా వ్యాసంగాలలో ప్రోత్సహిస్తూ, వాటిలో దొర్లే తప్పొప్పులని పట్టుకుని, ఈ పుస్తకంతో సహా, మాకు తన సహాయసహకారాలందించారు. వారికి నా కృతజ్ఞతలు.

మావారూ నేనూ బోధిస్తున్న ఉపనిషత్తులని మా దయా సత్సంగం సభ్యులు చాలా శ్రద్ధగా వింటారు. ఈ అద్వైత వేదాంత పరిచయాన్ని పాఠ్యగ్రంథంగా చూస్తారు. ఇది పుస్తకరూపంలో వస్తోందంటే, చాలా సంతోషించి, వారి ఆధరాభిమానాలను మామీద కురిపించారు. ఈ సందర్భంలో వారందరికీ, పేరుపేరునా, నా కృతజ్ఞతలు.

పూజ్యులు శ్రీ దోర్బల ప్రభాకరశర్మగారు, గౌరవనీయులు శ్రీ దేసు కృష్ణచైతన్యగారు ఈ పుస్తకంలోని సంస్కృతభాగాన్ని ఎంతో సహృదయంతో దిద్ది పెట్టారు. వారికి మా కృతజ్ఞతాభివందనాలు.

ఈ **అద్వైతవేదాన్త పరిచయము** బాగా జనాదరణ పొందింది. అప్పుడే ఇది నాలుగవ ముద్రణకు నోచుకుంది. దీన్ని ఆదరించిన అందరికీ నమస్సులు.

**ఇలా ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు**

**మద్దూరి రాజ్యశ్రీ**

ప్రార్థన:-

ఓం వాసుదేవేన్ద్ర యోగీన్ద్రం
నత్వా జ్ఞానప్రదం గురుమ్।
ముముక్షూణాం హితార్థాయ
తత్త్వబోధోఽభిధీయతే॥

తాత్పర్యం :-

జ్ఞానబోధచేసే గురువు, యోగీన్ద్రుడైన శ్రీకృష్ణ పరమాత్మకి నమస్కరించి ముముక్షువుల హితం కోరి తత్వబోధ చెప్పబడుతున్నది.

సదాశివసమారమ్భామ్।
శఙ్కరాచార్యమధ్యమామ్।
అస్మదాచార్యపర్యన్తామ్।
వన్దే గురుపరమ్పరామ్॥

# 01. పురుషార్థములు

తత్త్వబోధ ఒక వేదాంత ప్రకరణ గ్రంథం. అది సంస్కృతంలో శంకరాచార్యులవారిచేత లిఖించబడిన ముఖ్యమైన, ప్రాథమిక వచనకావ్యం. ఇందులో సాధారణంగా మన శాస్త్రాల్లో వాడే ముఖ్యమైన పదాలన్నీ వస్తాయి. మన శాస్త్రాలని – అది భగవద్గీత కానీ, ఉపనిషత్తులు కానీ, పురాణాలు కానీ, రామాయణం కానీ చదవాలంటే ఈ పదాల అర్థం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా వేదాంతశాస్త్రాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలంటే మనం ఈ పదాలని క్షుణ్ణంగా అర్థంచేసుకోవాలి.

ఈ తత్త్వబోధలో ఉన్న అంశాలన్నింటి గురించి కొన్ని ప్రసంగాల పరంపరగా చూద్దాం. ఇందులోని అంశాలన్నింటినీ వివరించటమే కాక, కొన్ని కొత్త అంశాలను కూడా చూద్దాం. అద్వైతవేదాంతం బాగా అర్థం చేసుకోటానికి ముందుగా పురుషార్థాలంటే ఏమిటో చూద్దాం.

**మానవలక్ష్యాలు:** పురుషార్థాలన్న పదాన్ని మనం మన శాస్త్రాల్లో తరచు చూస్తాం. అందుకని దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. పురుషార్థాలంటే మనుష్యలక్ష్యాలు. పురుషః అంటే మనుష్యుడు – స్త్రీ గాని, పురుషుడు గాని. అందుకని దీన్ని మనుష్యార్థాలుగా అనువదించవచ్చు. అర్థః అంటే సంస్కృతంలో అనేక అర్థాలున్నాయి. అర్థఃకి ఒక అర్థం, అర్థమే, అర్థః అంటే ఐశ్వర్యం కూడా. ఈ సందర్భంలో అర్థః అంటే ఒక లక్ష్యం, ఒక గమ్యం. **అర్థ్యతే సర్వైః మనుష్యైః ప్రార్థ్యతే ఇతి అర్థః॥**

దేన్నైతే ప్రతిమానవుడు కోరుతాడో అది అర్థం. ప్రతిమనిషి దేన్ని కోరుతాడు? రకరకాల లక్ష్యాలుంటాయి ఒకొక్కరికీ. కాబట్టి ఏ మానవలక్ష్యాన్నైనా అర్థం అంటారు. ఈ రెండు పదాలనీ కలిపితే మానవలక్ష్యాలు అని అర్థం.

శాస్త్రంలో పురుషార్థంకి ఇంకో అర్థం కూడా ఉంది. ఒక సందర్భంలో పురుషార్థం అంటే ఇచ్ఛ. ఇంకో సందర్భంలో పురుషార్థం అంటే ఎన్నుకోవటం. ఇంకో సందర్భంలో ప్రయత్నం అని కూడా వస్తుంది. అంటే ఇచ్ఛ, ఎన్నుకోవటం, ప్రయత్నం – పురుషార్థంకి ద్వితీయ అర్థం.

**ప్రాథమిక అర్థం** – మానవలక్ష్యాలు లేదా మానవగమ్యాలు. ఈ లక్ష్యాలు మానవులు సాధించాల్సినవే. జంతువులకో, వృక్షాలకో ఇది సాధ్యం కాదు. ఈ పురుషార్థాలు అందుబాటులో ఉండటంవల్ల మనిషి జంతువులు లేదా చెట్లనుంచి విభిన్నంగా ఉన్నాడు. వీటివల్లే తక్కిన అన్ని జీవరాసులకన్నా ఉన్నతంగా ఉన్నాడు.

**మనుష్యుల ప్రత్యేకత**

మనుష్యులకి మాత్రమే ఎందుకు ఉన్నాయి ఈ పురుషార్థాలు? మనిషిలోని ఏ శక్తి ఈ ప్రత్యేక అవకాశాన్ని యిచ్చింది, పురుషార్థాలు కోరుకోవటానికి? మనుష్యులు ఎన్నో అంశాలలో జంతువులని, చెట్లని పోలి ఉన్నారని శాస్త్రాలు పలుకుతున్నాయి. తక్కిన జీవరాశులకీ మనుష్యులకీ మధ్య సాధర్మ్యం ఉంది. కాని మనిషి మాత్రమే వాడగల ఒక ప్రత్యేక లక్షణం ఉంది.

**పురుషార్థాలు** – ఆ ప్రత్యేక విషయం ఒక అందమైన శ్లోకంలో చెప్పబడింది.

**ఆహారనిద్రాభయ మైథునఇచ్ఛ।**
**సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్।**
**బుద్ధిర్హి తేషామ్ అధికో విశేషః।**
**బుద్ధ్యా విహీనః పశుభిః సమానః॥**

మనుష్యులకూ, తక్కిన జీవరాశులకూ కొన్ని అంశాలలో పోలికలున్నాయి. అందరూ ఆహారం కోరతారు. పుట్టినప్పటినుంచి ఆహారంకోసం వెతుకులాట మొదలౌతుంది. అలాగే నిద్ర,భయం,వంశాభివృద్ధి కూడా అందరికీ ఉంటుంది. కాని ఆలోచనాశక్తి, విచక్షణాశక్తి, అర్థం చేసుకునే శక్తి, భవిష్యత్తును ఊహించే శక్తి, ముందుచూపులాంటివి ఉండటంవల్ల మనిషి తక్కిన జీవరాశులకన్నా ఉన్నతుడయ్యాడు. భవిష్యత్తుకోసం ప్రణాళికలు వేయటం, భవిష్యత్తు బాగుండాలని కష్టపడటం అంతా విచక్షణాశక్తి కింద వస్తుంది. దాన్నే మనం బుద్ధి అంటాం.

**బుద్ధిర్హి తేషామ్ అధికో విశేషః** – ఇదీ మనకున్న అధికశక్తి. కేవలం బుద్ధివల్లే మనిషి తక్కిన జీవరాశికన్నా ఉన్నతుడయ్యాడు. బుద్ధ్యా విహీనః – బుద్ధి లేకపోతే లేదా దాన్ని వాడకపోతే, పశువుతో సమానం.అందువల్ల విచక్షణాశక్తి మనుష్యులకి విశేషంగా ఉంది. ఈ ప్రత్యేకమైన శక్తివల్లే మనం స్వయం ప్రతిభ,స్వయం నిర్ణయం చేసుకోగలుగుతున్నాం. తక్కిన వారితో మనని పోల్చుకోగలుగుతున్నాం. ఇవి పశుపక్ష్యాదులు చేయలేవు.

ఒక డాగ్‌షోలో ఏ కుక్కకి బాగా తర్ఫీదు నిచ్చారో పరిశీలిస్తారు. కుక్కలచేత అనేక గారడీలు చేయించి వాటికి బంగారు, వెండి, రజత పతకాలిస్తారు. ఒలింపిక్స్‌లోలాగా వాటిని ప్రత్యేక స్థానంలో, ప్రత్యేక మెట్లమీద నిలబెట్టవచ్చు కూడా. ఆ కుక్కల భావాలెలా

ఉంటాయి? వాటికి బంగారు పతకం వచ్చినా అవి పొంగిపోవు. రాకపోయినా కృంగిపోవు. అవి నాలుక బయటకి చాచి, అభావంగా యిటూ, అటూ చూస్తాయి అంతే. నిజానికి ఏం జరుగుతుందో వాటికేం అర్థంకాదు. కాని, ఆ కుక్కల యజమానికి మాత్రం కాంప్లెక్స్ ఉంటుంది. అందువల్ల మనకు బుద్ధి ఈ విశేష లక్షణమైన కాంప్లెక్సును పెంచి స్వయం నిర్ణయం, తోటివారితో పోల్చుకోవటం కలుగచేస్తుంది.

**భవిష్యత్‌కోసం ప్రణాళిక వేయటం** – ఇది బుద్ధిశక్తియొక్క ఇంకో సహజలక్షణం. స్వయం ప్రతిభనుంచి భవిష్యత్తులో ఇంకా మెరుగ్గా ఉండాలని కోరుకుంటాము. భవిష్యత్తు మెరుగ్గా ఉండటంకోసం, మనం ప్రణాళికలు వేయటం మొదలు పెడతాం. ప్రణాళికలను అనేక రకాలుగా విభజించవచ్చు – దీర్ఘకాలిక ప్రణాళికలు, ప్రస్తుత ప్రణాళికలు, ప్రాథమిక ప్రణాళికలు, ద్వితీయ ప్రణాళికలు. కేవలం మనుష్యులే విశ్రాంతికోసం ప్రణాళికలు వేయగలరు. తక్కిన జీవరాశుల జీవితం అంతర్బుద్ధి ద్వారా నడుస్తుంది. మనుష్యులకు కూడా అంతర్బుద్ధి ఉంటుంది గాని, దానికన్నా ఎక్కువగా వారికి ఎన్నుకునే శక్తి ఉంటుంది. అందువల్ల, మనుష్యులు అనేక లక్ష్యాలను ఎన్నుకుంటారు. ఈ లక్ష్యాలన్నింటినీ పురుషార్థాలంటారు.

**చతుర్విధ పురుషార్థాలు**

అలాంటి లక్ష్యాలు ఎన్ని సాధ్యం అన్న ప్రశ్న ఉదయిస్తుంది వెంటనే. వాటిని చెప్పుతూపోతే, అనంతంగా సాగిపోతుంది పట్టిక. శాస్త్రం వాటినన్నింటినీ నాలుగు లక్ష్యాలుగా క్రోడీకరిస్తాము. వాటిని మనం చతుర్విధ పురుషార్థాలంటాం. ఏ లక్ష్యం తీసుకున్నా ఈ నాలుగింటిలో ఒక దానిలోకి వస్తుంది. **ఏమిటా నాలుగు లక్ష్యాలు? అర్థం, ధర్మం, కామం, మోక్షం.**

**1.1 అర్థం** – మొదటి లక్ష్యం అర్థం. అది జీవితంలో చాలా త్వరగా మొదలవుతుంది. అర్థం అంటే భద్రతా భావం. మన భద్రతకోసం మనం సేకరించేదంతా అర్థలక్ష్యం కిందికి వస్తుంది. అంటే కేవలం భౌతికమైన ఉనికికోసం పుట్టినప్పటినుంచీ, ప్రతిజీవరాశికీ, మనుష్యులతో సహా, ఏదోవిధంగా జీవనం కొనసాగించాలన్న కోరిక ఉంటుంది. భౌతికమైన ఉనికికోసం చేసేదేమైనా అర్థం కిందికి వస్తుంది. ఇది మన అభద్రతా భావాన్ని తొలగిస్తుంది. ఏమిటవి?

ఆహారం, బట్ట, గూడు, ఆరోగ్యం. పుట్టినప్పటినుంచీ ఆహారంకోసం వెంపర్లాట మొదలౌతుంది. తర్వాత పరిసరాలనుంచి శరీరాన్ని సంరక్షించుకోవాల్సి ఉంటుంది. మన శరీరాన్ని కాపాడుకోవటానికి అనేక రకాల దుస్తులు ఉన్నాయి. ఈ రకరకాల దుస్తులను అభివర్ణించటానికి అనేక ప్రత్యేకమైన పత్రికలున్నాయి.

మనం ధరించే హెల్మెట్ కూడా భద్రతకోసమే. కారులో ఉండే సీటుబెల్ట్ భద్రతకోసమే. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ముక్కుకు పెట్టుకునే తొడుగు మన భద్రతకోసమే, బయటి కాలుష్యం మనకు చేరకూడదనే. కారులో ఎయిర్ కండిషనర్ పెట్టుకుంటాము. అనేక రకాల రోగాలబారిన పడకుండా జాగ్రత్త పడతాము. ముందుగా తక్షణ భద్రతకోసం పాటుపడి, తర్వాత భవిష్యత్ భద్రతకోసం పాటుపడతాము. అంటే వృద్ధాప్యంకోసం జాగ్రత్తపడతాము. పూర్వకాలంలో వృద్ధాప్యంలో అండ పిల్లలు. చిన్న వయసులో తిండి, బట్ట, ముఖ్యమైనవి. తర్వాత గూడు, ఆరోగ్యం ముఖ్యమవుతాయి. దానికి తగ్గట్టుగా మనము వాటిని ఏర్పరచుకుంటాము. అనుకోకుండా జరిగే ప్రమాదాల గురించి భయపడతాము. అందుకే అనేక జీవితభీమాలు తీసుకుంటాము. సంపాదించిన వస్తువులను భద్రపరచుకోవాలి. మన బట్టలను జాగ్రత్తగా ఉంచుకోవటంకోసం, మనం వాషింగ్ మిషన్ కొనుక్కోవాలి. మళ్ళీ విద్యుచ్ఛక్తి సరఫరా హెచ్చుతగ్గులతో వాషింగ్ మిషన్ పాడవకుండా ఉండటంకోసం, ఒక స్టెబిలైజర్ కొనుక్కోవాలి. అంటే మన బట్టలు ఉతకటం అంటే వాటి భద్రతకోసం వాషింగ్ మిషన్ కొన్నాము. దాని తర్వాత వాషింగ్ మిషన్ భద్రతకోసం స్టెబిలైజర్ కొన్నాము. అంటే భద్రత, భద్రతకోసం భద్రత, భద్రతకోసం భద్రతకోసం భద్రత. మనకు యిల్లు భద్రతనిస్తుంది. కాని యింటి భద్రత గురించిన భయం కొద్దీ మనం భద్రతా సిబ్బందిని పెట్టుకుంటాము. యిలా ఈ కథ అనంతంగా సాగిపోతుంది. ఇదే జీవితం. అంటే, దీన్ని మనం ఏమాత్రం ఆలోచన లేకుండా గడిపేస్తున్నాం.

మన జీవితంలో ముప్పాతిక వంతు భద్రతని చేకూర్చటంలో గడిపేస్తున్నాము. ఇదంతా **అర్థపురుషార్థః అభయ ప్రాప్యర్థమ్** అంటే భయంనుంచి విముక్తికోసం. జంతువులకు భద్రతకావాలి. కాని వాటి అంతర్బుద్ధి చెబుతుంది ఆ జాగ్రత్త. దేవుడు వాటికి ప్రత్యేక చర్మాన్నిచ్చాడు. అవి డిజైనర్ దుస్తులు ధరించనక్కరలేదు.

**1.2 కామం** – తర్వాత లక్ష్యం, కామపురుషార్థం. ఒకసారి భద్రత ఏర్పరచుకున్నాక, మనం కామపురుషార్థం గురించి ఆలోచిస్తాం. కామం అంటే అన్ని రకాల సౌఖ్యాలు. ఇది భద్రత కాదు, సరదాకి చెందినది. ఈ సౌఖ్యాలు ఉంటే జీవితం అద్భుతంగా ఉంటుంది. కేవలం మనుగడ సాగడానికి సౌఖ్యాలు కాని, సరదాలు కాని అవసరం లేదు. అందుకని అవి అర్థ పురుషార్థాలు కావు, కామ పురుషార్థాలవుతాయి. మనకు హాయిగా, ఆనందంగా ఉండాలని ఉంటుంది. పాటలు, టీవీ కార్యక్రమాలు, నాటకాలు, సినిమాలలాంటివి ఈ కోవకు చెందినవి. ఒకసారి మన చుట్టుపక్కలవన్నీ ఆనందించేసాక, మనకు విసుగుపుట్టి, విదేశాలకి వెళ్ళాలనుకుంటాము. ఈ పురుషార్థానికి అంతూపొంతూ ఉండదు.

పశువులకి కూడా సౌఖ్యం కావాలి, కాని ఆ సౌఖ్యం అంతర్బుద్ధితో ముడిపడింది. ఎండగాఉంటే, జంతువులు సహజంగా, అంతర్బుద్ధి ప్రేరేపణతో నీడలోకి వెళతాయి. కాని మనిషి తన ఆనందాన్ని తన బుద్ధితో ప్రణాళిక చేసుకుంటాడు. అంటే ఏం చేస్తే ఆనందం కలుగుతుందో అది చేస్తాడు. కాని వచ్చిన చిక్కేమిటంటే, చాలామందికి ధనాగమతృష్ణ అంతులేకుండా ఉండటంతో వారికి ఉన్న సమయమంతా ధనం వెంట పరిగెత్తడమే సరిపోతుంది. అంటే అర్థపురుషార్థంతోనే సరిపోతుంది, కామపురుషార్థం గురించి ఆలోచించే తీరికే ఉండదు.

**1.3 ధర్మం** – దీన్ని కనబడని ఐశ్వర్యంగా వర్ణించవచ్చు. దీన్నే అదృష్టం అని కూడా అంటారు.

ఇది కంటికి కనబడకుండా మన జీవితాన్ని నిర్దేశిస్తుంది. ఈ అదృష్టాన్ని మనం సన్మార్గంలో నడవటం ద్వారా పొందవచ్చు. దీన్నే పుణ్యం అంటారు.

మనం పూర్వజన్మలో నడిచిన ధర్మమార్గాన్ని అనుసరించే ఈ జన్మ ఏర్పడుతుంది. అంటే మన పుట్టుక, మన తల్లిదండ్రులు, మనం పెరిగేచోటు ఇవేవీ మన చేతిలో లేవు.మన పూర్వజన్మ అదృష్టాన్నిబట్టి మనం ఐశ్వర్యంలో మునిగి తేలుతాం, లేదా బీదరికంలో కష్టాలు పడతాం.

కాని మన భవిష్యత్తు మన చేతుల్లో ఉంది. మనం బాల్యంలో నడిచిన తీరు, అంటే మనం ధర్మమార్గంలో అర్థకామాలను పొందటానికి ప్రయత్నిస్తే, మన భవిష్యత్తు నిశ్చింతగా ఉంటుంది. అందుకని ధర్మాన్ని కూడా ఒక పురుషార్థంగా నిర్ణయించారు.

అందుకే అర్థకామ ధర్మాలని, ధర్మార్థకామాలంటారు. అంటే ఈ మూడింటిలో ధర్మం సూక్ష్మమైనదీ, చాలా శక్తివంతమైనదీ కూడా. ఈ మూడు పురుషార్థాలనీ కలిపి ప్రేయస్ అంటారు. భోగం అని కూడా అంటారు. కావాలని, ప్రయత్నం చేసి, ప్రణాళికలు వేసి సాధించే పురుషార్థాలని ప్రేయస్ అనీ, ఆ మార్గాన్ని ప్రేయోమార్గమనీ అంటారు. ప్రేయస్ అంటే ప్రీతిని కలుగజేసేదని అర్థం.

**1.4 ప్రేయోమార్గంలో దోషాలు** – ప్రేయోమార్గమే బావుంది కదా అని మనకు అనిపించవచ్చు. కాని ప్రేయోమార్గంలో మనని మూడు దోషాలు బాధిస్తూంటాయి.

**1.4.1. బన్ధకత్వం** – వస్తువులు, మనుష్యులు, విషయాలు, ప్రదేశాలు మనని బంధిస్తాయి. వాటిపై రాగం ఏర్పడితే అవి మనకు దూరమైతే బాధ, ద్వేషం ఏర్పడితే అవి మనసుంచి దూరం కావాలనే ఆందోళన వేధిస్తూ వుంటాయి.

**1.4.2. అతృప్తికరత్వం** – ఏది సాధించినా తృప్తి లేదు. ఇంకా ఇంకా అనే పంకా తిరుగుతూనే వుంటుంది.

**1.4.3. దుఃఖ మిశ్రితత్వం** – సుఖంగా వుంది అనుకునే లోపే ఏదో లోటు, అశాంతి లేదా దుఃఖం వెన్నంటివుంటుంది. ప్రేయోమార్గంలో పారమార్థిక ఆనందము లేదు. అది కేవలం శ్రేయోమార్గము లేదా మోక్షంవల్లే లభ్యం అవుతుంది. ధర్మం ప్రేయోమార్గానికీ, శ్రేయోమార్గానికీ మధ్యసేతువువంటిది.

**1.5 మోక్షం** – ఇది నాలుగో పురుషార్థం. దీన్ని ముక్తి అని శ్రేయస్సు అని కూడా అంటారు.

ఈ ముక్తి అనేది అంతర్గత స్వేచ్ఛ. బంధకత్వంనుంచి విముక్తి. ప్రేయస్సు లేదా ధర్మార్థకామాలనుంచి ముక్తి. మనిషి ప్రేయస్సుకి కాని, దేనికన్నా గాని ఎలా బందీ అవుతాడు? ఒక వస్తువు గాని, వ్యక్తి గాని మనని రెండు రకాలుగా బందీని చేయవచ్చు. మనం అమితంగా కోరే వస్తువు గాని, అమితంగా ప్రేమించే వ్యక్తి గాని దూరమైతే, ఆ ఎడబాటుని తట్టుకోలేక బాధపడతాము. ఒకవిధమైన శూన్యతాభావం కలుగుతుంది. ఒంటరితనం ముప్పిరిగొంటుంది.

అలా అని, ఉంటే తృప్తిగా ఉంటామా? అదీ లేదు. కోరిన వ్యక్తి దగ్గర ఉన్నా కూడా అభద్రతాభావం. పోగొట్టుకుంటామేమోనన్న చింత, చెప్పినట్టు చేయకపోతే దిగులు.

ఉన్నా లేకపోయినా బాధించేది ఏమిటి? పై మూడు పురుషార్థాలూ. డబ్బు లేకపోతే సంపాదించాలన్న తపన, ఉంటే అభద్రతాభావన. వీటి రక్షణ గురించి తపనే మనని వీటికి బానిసని చేస్తుంది.

మోక్షపురుషార్థం లేదా శ్రేయోమార్గం మనని బానిసనుంచి తప్పించి స్వామిని చేస్తుంది. అంటే సమత్వభావన కలుగచేస్తుంది. సమత్వం అంటే వస్తువులు లేకపోయినా కృంగిపోనీయదు, ఉన్నా భయపడనీయదు. అర్థకామాలు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. శ్రేయోమార్గం అంతర్గతంగా శక్తిని, పరిపక్వతని ఇస్తుంది. మొదటి మూడు పురుషార్థాలూ– ధర్మం, అర్థం, కామం ప్రేయస్సులోకి వస్తాయి. అవి మనిషిని సంసారంలో పడేసి బంధిస్తాయి. మోక్షపురుషార్థం శ్రేయస్సులోకి వస్తుంది. అది సంసారబంధం నుంచి విముక్తినిస్తుంది. ఈ నాలుగింటినీ కలిపి చతుర్విధ పురుషార్థాలు అంటారు.

# 02. శాస్త్రం

సంస్కృతంలో మనకు ఉన్న పురాతన గ్రంథాల వివరాలని ఒక విహంగ వీక్షణం చేద్దాము. మొత్తం ఆధ్యాత్మిక గ్రంథాలన్నింటినీ కలిపి శాస్త్రం అంటారు. శాస్త్రం పదం 'శాస్' అన్న ధాతువునుంచి వచ్చింది. దానికి రెండు అర్థాలు ఉన్నాయి. శాసించటం, బోధించటం. అందువల్ల శాస్త్రం అంటే మొదట్లో మానవజాతిని శాసించి, ఆ తర్వాత బోధిస్తుంది అని అర్థం. ఇలా శాసించి, బోధించటంవల్ల మానవాళిని అనేక సమస్యలనుంచి కాపాడుతుంది. 'త్ర' అంటే కాపాడుతుంది. **'శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్'** మానవాళిని సమస్యలనుంచి మొదట శాసనం ద్వారా, తర్వాత బోధన ద్వారా కాపాడేది శాస్త్రం.

శంకరాచార్యులవారు శాస్త్రాన్ని తల్లితో పోలుస్తారు. పిల్లవాడికి విషయం అర్థం చేసుకునే పరిపక్వత లేని స్థితిలో అతన్ని శాసిస్తుంది తల్లి. అవసరమైతే బెదిరిస్తుంది కూడా. కాలక్రమేపీ బోధన చేయటం, నచ్చచెప్పటం, జ్ఞానోదయం కలగజేయటం, ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళటం చేస్తుంది. ఇవన్నీ మన శాస్త్రం చేస్తుంది. శాస్త్రాన్ని ఆరుస్థాయిలుగా విభజించవచ్చు.

### 2.1 వేదాలు

మొట్టమొదటి శాస్త్రాన్ని వేదాలు అంటారు. వేదాలే చాలా పెద్ద గ్రంథాలు. ఇరవయి వేల పైచిలుకు మంత్రాలున్నాయి వేదాల్లో. మనకు నాలుగు వేదాలున్నాయి. 1. ఋగ్వేదం, 2. యజుర్వేదం, 3. సామవేదం, 4. అథర్వణవేదం.

ఋగ్వేదంలో ఋగ్ మంత్రాలున్నాయి. అవి పద్యరూపంలో ఉన్నాయి. యజుర్వేదంలో యజుర్ మంత్రాలు గద్యరూపంలో ఉన్నాయి. సామవేదంలో సామమంత్రాలు గీతరూపంలో ఉన్నాయి. భారతీయ సంగీతం సామవేదంనుంచి పుట్టింది. సామవేదపఠనాన్ని సామగానం అంటారు. అథర్వణవేదాన్ని అథర్వఋషి, అంగీరసఋషి దర్శించారు. అందుకని దీన్ని అథర్వాంగిరసవేదం అని కూడా అంటారు.

వేదాలకి మాత్రమే మంత్రం అన్న పదం వాడతాము. **మననాత్ త్రాయతే ఇతి మన్త్రః.** మననం అంటే విశ్లేషణ. త్రాయతే అంటే విశ్లేషిస్తే అది రక్షిస్తుంది. మన సాంప్రదాయంలో కేవలం మంత్రాలని పఠించినా కూడా అది మనని రక్షిస్తుంది. వేదాలంటే జ్ఞానానికి మూలం. **'విద్'** అనే ధాతువునుంచి వచ్చింది వేదం. వేదం అంటే విజ్ఞానఖని.

**వేదన సాధనత్వాత్ వేదః**
**ప్రమాణత్వాత్ వేదః**

వేదాల రచయిత ఎవరు? వేదాలు అపౌరుషేయం. అంటే పురుషుడు (మనిషి) ఎవరూ రాయలేదు. అవి దేవుడే యిచ్చాడు. అంటే మనం రచయితతో మాట్లాడాలంటే దేవుడితో మాట్లాడాలి. దేవుడు మనిషికి ప్రత్యక్షంగా ఇవ్వలేదు. ఒక మాధ్యమం ద్వారా యిచ్చాడు. అది ఋషయః (ఋషులు). దేవుణ్ణి వార్తాప్రసారకేంద్రంగా తీసుకుంటే ఋషులని అది అందుకునే దూరదర్శన్‌గా తీసుకోవచ్చు. ఋషి పదం ఋష్ – తెలుసుకోవటంనుంచి వచ్చింది. **ఋషతి జానాతి ఇతి ఋషిః,** సాధారణమైన మనస్సు ఆ తరంగాలని అందుకోలేదు. దూరదర్శన్‌ని ఏ ఛానెల్‌కి ట్యూన్ చేస్తే ఆఛానెల్ వస్తుంది. అలాగే దేవుడు వేదబోధని సృష్టితోపాటు యిచ్చాడు. కాని ఋషులు మాత్రమే అది అందుకునే ప్రత్యేకస్థాయిలో ఉన్నారు. వారికున్న పరమసత్వగుణం, విశేష ఉపాధులే దానికి కారణం. అలా ఎందరో ఋషులు మంత్రాలని అందుకున్నారు. మనం వేదమంత్రాన్ని పఠించేటప్పుడు, ఆ ఋషిని కృతజ్ఞతాపూర్వకంగా తలుస్తాము. రోజూ చేసే సన్ధ్యావన్దనంలో కూడా మూడు తలుస్తాము.

**సావిత్రః ఋషిః విశ్వామిత్రః (తలని ముట్టుకుంటాం ఋషిని తలుచుకుంటూ)**

**గాయత్రీ ఛందః (ముఖమును ముట్టుకుంటాం ఛందస్సుని తలుచుకుంటూ)**

**సవితా దేవతా (మంత్రంలో వచ్చిన దేవిని తలుచుకుంటూ)** అంటే ఋషి, ఛందః, దేవతాస్మరణం – మూడు తప్పనిసరిగా చేయాలి.

ఏదైనా వేదమంత్రం పఠించేముందు ఈ ఋషి ఈ మంత్రాన్ని అందుకున్నాడని వస్తుంది. అందుకే ఋషులని మంత్ర ద్రష్టః అంటారు. ఋషులు మంత్రాన్ని అందుకున్నవారు, వారు ఈ మంత్రాలను రచించలేదు లేదా సృష్టించలేదు. వాటిని సృష్టించింది సృష్టికర్త పరమాత్మే.

**'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం**
**యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై.'**

ఈ వేదాలు శబ్దరూపంలోనే అందుకోబడ్డాయి. అవి లిఖిత పూర్వకంగా లేవు. అందుకే శిష్యులు విని నేర్చుకోవాలే తప్ప, రాసేది లేదు. అవి కర్ణపరంపరగా వచ్చాయి కాబట్టి వాటిని శ్రుతి అని కూడా అంటారు.

**గురుణా సాక్షాత్ శ్రూయతే ఇతి శ్రుతిః।**
**గురూపదేశేన శ్రూయతే ఇతి శ్రుతిః।**

వినటం ద్వారా అందుకున్నది. దీన్ని వేదం అని, మంత్రం అనీ, శ్రుతి అనీ అంటారు. అపౌరుషేయ ప్రమాణం అని కూడా అంటారు. అపౌరుషేయ అంటే మనిషి రచించని ప్రమాణం అంటే జ్ఞానం పొందే మార్గం. మన తక్కిన గ్రంథాలన్నీ వేదప్రమాణంమీదే

ఆధారపడి ఉన్నాయి కాబట్టి మన సాంప్రదాయాన్ని వైదిక సాంప్రదాయం అనీ, మనని వైదికులనీ అంటారు. హిందువులం అన్న మాట తర్వాతెప్పుడో వచ్చింది.

### 2.1.1 వేదంలో భాగాలు

**వేద పూర్వభాగం** – ఇది మొదటి మూడు పురుషార్థాలు పొందటానికి తోడ్పడుతుంది. మనకు ఆధారపడే జీవితంమీద మోజెక్కువ. మనం మన శాంతికోసం, భద్రతకోసం, మన ఆనందంకోసం మనుష్యులు, వస్తువులు, డబ్బు, అలా ఎన్నిటిమీదో ఆధారపడతాం. వేదపూర్వభాగం డబ్బు సంపాదించేమార్గాలు, కుటుంబజీవనం, ప్రాపంచిక విద్య, ఇలా అనేక విషయాలు బోధిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది ప్రేయస్ గురించి చెబుతుంది. ఇది కర్మప్రధానంగా, ఉపాసనప్రధానంగా ఉంటుంది.

**వేద అంతభాగం** – మనిషి ఆధారపడటం మానేసి, స్వేచ్ఛ కోరితే, వేద అంతభాగం దానికి మార్గం చూపుతుంది. ఇది శ్రేయస్ గురించి చెబుతుంది. వేదం ఇదే పాటించమని చెప్పదు. మననే ఏ మార్గం కావాలో ఎన్నుకోమంటుంది. నాలుగో పురుషార్థమైన మోక్షం పొందటానికి ఇది తోడ్పడుతుంది. ఇది జ్ఞానప్రధానంగా ఉంటుంది. నాలుగు వేదాలకు అంతంలో ఉంటాయి కాబట్టి వేదాంతం అంటారు. ఉపనిషత్తులని కూడా అంటారు. ఇవి చాలా ఉన్నాయి. అందులో పది ఉపనిషత్తులు ప్రధానమైనవి. వాటికి శంకరాచార్యులవారు భాష్యం రాసారు.

### 2.2. ద్వితీయ గ్రంథాలు – సూత్రాలు

ప్రాథమిక గ్రంథాలు నాలుగు వేదాలు. అవి అపౌరుషేయం. ఈ నాలుగు వేదాలని వివరించి, విడమర్చి చెప్పటానికి, మనకు ఎన్నో ద్వితీయ గ్రంథాలున్నాయి. వాటిని గొప్ప ఆచార్యులు రచించారు. అందుకని వాటిని పౌరుషేయశాస్త్రం అంటారు.

ద్వితీయగ్రంథాలు ఎందుకు? వేదం చాలదా? వేదాల్లో భావాలు స్పష్టంగా ఉండవు. వాటిని స్పష్టంగా చెప్పటానికి వేరే గ్రంథాలు కావాలి. ఒక పిల్లవాడికి 'ఒకటి,' అని చెప్తే తెలియదు. ఒక అరటిపండో, ఒక మామిడిపండో చూపించాలి. అలాగే వేదం చెప్పిన విషయాలని కథల రూపంలో బోధించాలి. ఇంకో కారణం – వేదాల్లో బోధించినవి ఒక క్రమపద్ధతిలో లేవు. అవి ఒక అడవిలా ఉన్నాయి. అందులో కూరలు, పూలు, పండ్లు ఉన్నాయి. కాని ఒక చోట లేవు. నాలుగు ఆశ్రమాల్లో మనిషి ఆచరించాల్సిన ధర్మాలు ఉన్నాయి. కాని ఒక చోట ఒక పద్ధతిగా లేవు. ద్వితీయ గ్రంథాలు ఆ పని చేస్తాయి. వాటిని సూత్రాలు అంటారు.

**సూత్రాలు**

సూత్రాలు అంటే ఒక్కొక్క సూత్రంలో ఒక చిన్న పదమో, ఒక వాక్యమో ఉంటుంది.

**అల్పాక్షరమ్ అసన్దిగ్ధం సారవత్ విశ్వతో ముఖమ్**

సూత్రాల్లో వేదవిషయం ఉంటుంది కాని టూకీగా ఉంటుంది. వేదాల్లో చెల్లాచెదురుగా ఉన్న అనేక సూత్రాలని ఇది అనేక అంశాల కింద ఏర్చి, ఒకచోట కూర్చుతుంది.

**ధర్మసూత్రాణి** – వ్యక్తి పాటించాల్సిన విలువలు, ధర్మాలు, బాధ్యతలు.

**గృహ్యసూత్రాణి –** వ్యక్తినుంచి కుటుంబస్థాయి విలువలు, ధర్మాలు, బాధ్యతలు.

**శ్రౌత సూత్రాణి –** కుటుంబంనుంచి సమాజస్థాయి విలువలు, ధర్మాలు, బాధ్యతలు.

సమాజ శ్రేయస్సుకోసం చేసే సామూహిక పూజలు, క్రతువులు, ధర్మాలు. మనిషి వీటిలో దేన్నుంచీ విడిపోలేడు. అతను ఒక వ్యక్తి, ఒక కుటుంబసభ్యుడు, ఒక సంఘజీవి కూడా.

మనకు ఎన్నో సూత్రాలు ఉన్నాయి. ఎందరో ఋషులు వీటిని యిచ్చారు. ఉదాహరణకు గౌతమసూత్రాణి, ఆపస్తంభసూత్రాణి, పరాశర సూత్రాణి, బ్రహ్మసూత్రాణి. వేదాలను దేవుడే ఇస్తే, సూత్రాలని ఋషులు క్రోడీకరించారు. అంటే పదాలు రచయితలవి, పదార్థం వేదంలోది.

సూత్రం చేసే యింకోపని స్పష్టత చేకూర్చటం. వేదాల్లో ఏవైనా స్పష్టంగా లేకపోయినా, పరస్పర విరుద్ధంగా కనిపించినా, వాటికి స్పష్టత చేకూరుస్తుంది. సూత్రం అంటే దారం అని ఒక అర్థం ఉంది. ఈ శాస్త్రం వేదాల్లో ఉన్న అనేక అంశాలని ఒక్కొక్క దారంలో గుచ్చుతుంది.

**వేదవాక్యకుసుమ గ్రథనార్థత్వాత్ సూత్రాణామ్.** ఈ కుసుమాలని ఏరి (క్రోఢీకరించి) ఒక దండలాగా గుచ్చుతుంది. వీటిలో వ్యాసాచార్యులు వ్రాసిన బ్రహ్మసూత్రాలు పేరు పొందాయి.

## 2.3 స్మృతి

ఇది సాధారణంగా పద్యరూపంలో ఉంటుంది. స్మృతి అంటే గుర్తుంచుకున్న జ్ఞానం. అంటే ఋషులు వేదాల్లోనూ, సూత్రాల్లోనూ నేర్చుకున్న జ్ఞానాన్ని మళ్ళీ వివరంగా రచిస్తారు. సూత్రాలంటే చాలా చిన్న వాక్యాలు. కాని స్మృతి కొంచెం వివరంగా ఉంటుంది. స్మృతి కూడా క్రోడీకరించటం, స్పష్టత చేకూర్చటం చేస్తుంది. ఉదా: మనుస్మృతి, పరాశర స్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి. అందులో కూడా అనేక అంశాలు అందంగా వివరిస్తారు.

సృష్టి, విద్యార్థి, గృహస్థు, సంఘజీవి, స్త్రీ, పురుషుడు. ఇలా అన్నిటి గురించీ ఉంటుంది. సూత్రాల్లో కూడా ఇవన్నీ ఉంటాయి.

కాని అవి టూకీగా ఉండటంవల్ల ఒక్కోసారి అర్థం స్పష్టంగా తెలియకపోవచ్చు. అక్కడ అర్థంకానివి స్మృతి బాగా విడమర్చి చెబుతుంది. గూఢార్థాన్ని వెలికి తీస్తుంది.

సాధారణంగా మన శాస్త్రాలు మూడు రకాలుగా ఉంటాయి:

**గద్యం –** వచనరూపంలో ఉంటుంది. దీనికి స్వరం ఉంటుంది పఠించటానికి వీలుగా.

**సూత్రాణి –** చిన్న వాక్యాలుగా ఉంటుంది కంఠోపాఠం చేయడానికి వీలుగా.

**పద్యం –** పద్యరూపంలో ఉంటుంది. గతంలో ఉన్న సిద్ధాంతాన్నంతా పద్యరూపంలో పఠించవచ్చు.

### 2.4 పురాణాలు

నాలుగో స్థాయి పురాణాలు. అవి స్మృతికన్నా మరింత వివరంగా ఉంటాయి. పురాణం అంటే అది ప్రాచీనగ్రంథం అయినా, ఇప్పటికీ వర్తిస్తుంది. **పురా అపి నవః** ప్రాచీనమే కాని ఆధునికంలో కూడా తాజాగా ఉంటుంది. ఇవి కూడా పద్యరూపంలో ఉంటాయి. ఇవి కూడా వేదాల్లోని అంశాలని క్రోఢీకరించి, స్పష్టత చేకూర్చి, ఉన్నతంగా చూపిస్తాయి.

ఇంకో ప్రత్యేకత – అంతకు ముందు గ్రంథాల్లో చెప్పిన ధర్మాలకు కథలు ఉంటాయి. ఈ ధర్మాలను పాటించటం ఎంత కష్టమో చూపిస్తూ, అయినా వీటికి కట్టుబడి ఉన్నవారి కథలు వివరిస్తాయి. స్మృతిలో కొన్ని వేల శ్లోకాలుంటే, ఒక్కొక్క పురాణంలో 15000 నుంచి 80,000 శ్లోకాలుంటాయి. కేవలం ఒక్క వేదమంత్రం సత్యం వద (సత్యమే పలుకు)కి పురాణంలో మొత్తం హరిశ్చంద్రుని కథ ఉంది.అలాగే పితృదేవోభవకి రాముడు లేదా శ్రవణకుమారుని కథలున్నాయి. కామ, క్రోధ, అహంకారంలాంటి భావాలకి రూపునిచ్చాయి రాక్షసుల రూపంలో.

18 పురాణాలు, 18 ఉపపురాణాలూ ఉన్నాయి. వ్యాసాచార్యులవారు రచించినవే అవి. అన్నిటిలోకి ప్రముఖమైనది భాగవత పురాణం లేదా భాగవతం. ఈ రోజుకి కూడా ఈ పురాణాలు ఆబాలగోపాలాన్నీ ఆకర్షిస్తాయి. పిల్లలకి కావల్సిన మాయలు ఉంటాయి, మనిషిని రాయిగా లేదా జంతువుగా మార్చటం. పెద్దలకి కావల్సిన సిద్ధాంతాలతో బాటు నైతికవిలువలు, సాంఘికనియమాలు, మానసిక విశ్లేషణలాంటివెన్నో ఉంటాయి.

### 2.5 ఇతిహాసాలు

ఇవి చరిత్రని ఆధారంగా చేసుకుని రచింపబడిన గ్రంథాలు. నిజంగా జరిగిన విషయం ఉంటుంది. ఇతి అంటే ఇలా, ఈ విధంగా, హ – ఖచ్చితంగా, ఆస – ఇది జరిగింది,

అంటే ఈ విధంగా, ఖచ్చితంగా ఇది జరిగింది. పురాణాల్లో కూడా నిజంగా జరిగిన అంశాలుంటాయి. రెండు ముఖ్యమైన ఇతిహాసాలు – రామాయణం (24000 శ్లోకాలు), మహాభారతం (లక్ష శ్లోకాలు). రామాయణాన్ని వాల్మీకిమహర్షి, మహాభారతాన్ని వ్యాసాచార్యులవారు రచించారు.

రామాయణం రాముని జీవనవిధానాన్ని వర్ణిస్తుంది. రామస్య అయనం – మార్గం, జీవనరీతి. మహాభారతం భరతవంశ రాజుల చరిత్ర. మహా అంటే పెద్ద. ఇది చాలా పెద్దది. ఆదర్శప్రాయులని అనుసరించాలని చూస్తారు ప్రజలు. అందుకని వారి కథలు.

చరిత్ర గురించి చెబుతుంది కాని, చారిత్రాత్మక విశేషాలకి పెద్దపీట వేయదు. ఇక్కడ చరిత్రని ఆధారంగా తీసుకుని, వేదంలో ఉన్న జ్ఞానాన్ని బోధిస్తాయి. అందుకని వీటిలో కొంత నిజం, కొంత కల్పనా ఉంటుంది. ఉదాహరణకి రావణునికి నిజంగా పది తలలు ఉన్నాయా? అవి మనిషిలో ఉండే రాక్షసగుణాలకి ప్రతీకలు. అందువల్ల కొంత అభూతకల్పన ఉంటుంది. కొన్ని లక్షణాలకి ఒక రూపం యివ్వటం జరుగుతుంది.

**2.6 భాష్యం**

పైన ఉదహరించిన అన్ని గ్రంథాలకీ ఇచ్చిన వ్యాఖ్యానాలని భాష్యం అంటారు. వేదాలు, సూత్రాలు, ఇతిహాసాలకి ఇచ్చిన వాఖ్యానాలకి భాష్యాలు,ఆ భాష్యాలకి భాష్యాలు కూడా ఉన్నాయి.ఆది శంకరుల భాష్యాలు వేదాంతవాఙ్మయములో చాలా ముఖ్యమైనవి.

మనం శాస్త్రాన్ని ఒక పద్ధతిలో నేర్చుకోవాలి. శాస్త్రం బోధించింది సరిగ్గా అర్థం కాకపోతే, శాస్త్రంమీద ప్రతికూలభావన పెంచుకోవటమో, దాన్ని ద్వేషించటమో చేసే ప్రమాదం ఉంది. అందుకని శాస్త్రాన్ని నేర్చుకోవటానికి ఒక తాళం చెవి ఉంది. దాన్ని సాంప్రదాయం అంటారు.

అందుకే సాధారణంగా అనువాదాల జోలికి పోవద్దంటారు. ఒక పదానికి రెండు, మూడు అర్థాలుంటాయి. సందర్భాన్నిబట్టి అది మారుతుంది. అందుకే గురుముఖతః నేర్చుకోవాలి. అంటే సాంప్రదాయం పాటించాలి. ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ, మన ఆచార్యులు భాష్యగ్రంథాలు, వ్యాఖ్యానగ్రంథాలు రచించారు. ఇవి పద్యరూపంలోగానీ, గద్యరూపంలో గానీ ఉంటాయి. ఇవన్నీ కలిపి శాస్త్రం అంటాము. శాస్త్రం మనం పురుషార్థాలని సాధించటానికి తోడ్పడుతుంది.

# 03. వర్ణవ్యవస్థ

మనిషికున్న లక్ష్యాలని ప్రేయస్‌గా, శ్రేయస్‌గా వేదం విభజించింది. ఆ లక్ష్యాలని సాధించటానికి, వేదాలు వర్ణాశ్రమవ్యవస్థని సూచించాయి. అంటే వర్ణవ్యవస్థ, ఆశ్రమవ్యవస్థ.

వర్ణవ్యవస్థ సాంఘిక వ్యవస్థని సూచిస్తుంది. మనిషి సంఘజీవి, సంఘం మన జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. మనకొక వ్యవస్థ ఉండాలి, జీవితం ప్రశాంతంగా సాగటానికి.

అలాగే మనం వ్యక్తిగా మనకున్న సరదాలని పరిరక్షించుకోవాలి. మనం పూర్తిగా సంఘానికి అంకితమవలేము. మనం వ్యక్తిగా ఎదగాలి. దీన్ని ఆశ్రమవ్యవస్థ అంటారు. ఈ రెండింటినీ మనం సమతుల్యం చేయగలిగితేనే మన జీవితం సాఫీగా సాగుతుంది. వేదం ఈ రెండింటినీ చక్కగా పాటించగలిగేందుకు అనువుగా వర్ణాశ్రమవ్యవస్థని ఏర్పరచింది.

**3.1 వర్ణవ్యవస్థ** – వర్ణం అంటే సంఘంలో ఒక ప్రత్యేక సముదాయం లేదా తెగ. మనకు నాలుగు వర్ణాలున్నాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర. ఈ విభజన మూడు కోణాలనుంచి చేయబడింది. జాతి, గుణం, కర్మ.

**3.1.1 జాతివ్యవస్థ** – ఏ కులంలో పుడితే ఆ కులానికి చెందటాన్ని జాతి వ్యవస్థ అంటారు. జాతి అంటే జన్మ. దీన్నిబట్టి జాతి – బ్రాహ్మణుడు, జాతి – క్షత్రియుడు, జాతి – వైశ్యుడు, జాతి – శూద్రుడు ఉన్నారు.

**3.1.2 గుణవ్యవస్థ** – స్వభావం లేదా గుణాన్నిబట్టి, విభజనలు చేయవచ్చు. దీన్ని గుణవ్యవస్థ అంటారు. ఇందులో కూడా నాలుగు గుణాలని పేర్కొనవచ్చు. ఆధ్యాత్మిక చింతన ఉంటే, వారు జాతి బ్రాహ్మణులు కాకపోయినా, వారిని గుణబ్రాహ్మణులు అనవచ్చు. వేదాంతపరిభాషలో వారికి సత్వగుణం ఎక్కువగా, రజోగుణం కొంచెం తక్కువగా, తమోగుణం యింకా తక్కువగా ఉంటుంది (సరత).

కొంతమంది పూజలు, పునస్కారాలు చేయకపోవచ్చు కాని నిస్వార్థంగా సంఘసేవ చేస్తారు. కుటుంబాన్ని పట్టించుకోవటానికి క్షణం తీరికలేనంత హడావిడిగా ఉంటారు. దీన్ని క్షత్రియగుణం అంటారు. ఈ గుణం ఉన్నవారని గుణక్షత్రియులంటారు. పుట్టుక ఏదైనా వీరికి రజోగుణం ఎక్కువగానూ, సత్వగుణం, తమోగుణం తక్కువగానూ ఉంటాయి (రసత).

వీరు కూడా కుటుంబాన్ని పట్టించుకునే తీరిక లేనంత హడావిడిగానే ఉంటారు కానీ, వీరి పనులన్నీ స్వార్థపూరితంగా ఉంటాయి. పేరు, ప్రతిష్టలకోసం పాటుపడ్డా, ముఖ్యంగా తమకీ, తమ కుటుంబానికీ డబ్బు సంపాదించుకోవటమే ధ్యేయంగా ఉంటారు. ఈ గుణాన్ని

వైశ్యగుణం అనీ యిది ఉన్నవారిని గుణవైశ్యులనీ అంటారు. పుట్టుక ఏదైనా, వీరికి రజోగుణం ఎక్కువగానూ, తమోగుణం, సత్వగుణం తక్కువగానూ ఉంటాయి (రతస).

నాలుగోరకం వారు మందకొడిగా ఉంటారు. తినటం, పడుకోవటం తప్ప ఏమీ చేయరు. వారికి అనుభవించటానికి ఆస్తి ఉండవచ్చు. అందుకని కూడా వారిలో తపన ఉండదు. ఏదో యాంత్రికంగా చేసుకుపోయే పనులు చేయగలరు. అంతే. అలాంటి గుణాన్ని శూద్రగుణమనీ, అలాంటి వ్యక్తులని గుణశూద్రులనీ అంటారు. పుట్టుక ఏదైనా, వీరికి తమోగుణం ఎక్కువగానూ, రజోగుణం, సత్వగుణం తక్కువగానూ ఉంటాయి (తరస).

**3.1.3 కర్మవ్యవస్థ** – మనకు వర్ణవిబేధాలు కర్మనిబట్టి కూడా ఉంటాయి. ఇక్కడ ఒక వ్యక్తి పుట్టుకతో గాని, అతని గుణంతో కాని మనకు సంబంధం లేదు. అతను చేసే కర్మనిబట్టి సమాజాన్ని నాలుగు తెగలుగా విభజించారు. మొదటి రకం కర్మ మతః సంబంధమైన కర్మ. అంటే శాస్త్రపఠనం, శాస్త్రబోధ. సమాజాన్ని మతఃపరంగా నడిపించటం. దీన్ని పురోహితవృత్తి అనవచ్చు. ఈ వృత్తిని బ్రాహ్మణకర్మ అనీ, ఈ వృత్తిని పాటించేవానిని కర్మబ్రాహ్మణుడు అనీ అంటారు.

రెండో వృత్తి రాజకీయం. ఈ వృత్తిలో సంఘసేవకి లేదా దేశసేవకీ అంకితమవుతారు. ఈ సేవకి రాజకీయంలోనో, ప్రభుత్వంలోనో, యంత్రాంగంలోనో, సైనికదళంలోనో ఉంటారు. దేశరక్షణకి సంబంధించిన ఏ వృత్తినన్నా తీసుకోవచ్చు నిజానికి. ఈ వృత్తిని క్షత్రియకర్మ అనీ, అది చేసే వ్యక్తిని కర్మక్షత్రియుడు అనీ అంటారు.

మూడో వృత్తి వ్యాపారం. ఇందులోకి వ్యవసాయం, ఉత్పత్తి, అనేక వస్తువుల పంపిణీ కూడా వస్తుంది. ఈ వృత్తిని వైశ్యకర్మ అనీ అది చేసే వ్యక్తిని కర్మవైశ్యుడు అనీ అంటారు.

నాలుగో వృత్తి సేవ చేయటం. ఏదో ఒక ప్రత్యేక వృత్తి అంటూ ఉండదు. కాని అతను కర్మబ్రాహ్మణ, కర్మక్షత్రియ, కర్మవైశ్యులకు సేవ చేస్తాడు. ఇతను నాయకుడు కాదు. తక్కిన ముగ్గురు నాయకులకు ఉద్యోగి. సేవ చేస్తాడు. ఈ వృత్తిని శూద్రకర్మ అనీ, అది చేసే వ్యక్తిని కర్మశూద్రుడు అనీ అంటారు.

ఇప్పుడు ఒక వ్యక్తి జాతి, గుణ, కర్మలని తీసుకుంటే మూడూ ఒకటే ఉండాలని లేదు. ఒకే వ్యక్తి, మూడు కోణాల్లో, మూడు విభిన్న తెగలకి చెందినవాడై ఉండవచ్చు. జాతిబ్రాహ్మణుడు అయిన వ్యక్తి గుణబ్రాహ్మణుడు లేదా కర్మబ్రాహ్మణుడు అయి ఉండాలన్న నియమం లేదు. అతను బ్రాహ్మణ పుట్టుక పుడితే జాతిబ్రాహ్మణుడు అవుతాడు. ఏ మంత్రి పదవో చేబడితే కర్మక్షత్రియుడవుతాడు. స్వార్థపరుడైతే గుణవైశ్యుడవుతాడు. అలా రకరకాలుగా చూడవచ్చు. జాతిబ్రాహ్మణుడు, గుణబ్రాహ్మణుడు, కర్మబ్రాహ్మణుడు మూడు కలిసిన వాడు

చాలా అరుదుగా ఉంటాడు. మూడూ విడిగా ఉండాలన్న నియమం లేదు కాని అలా విడిగా ఉంటాయి.

### 3.2 వర్ణాల్లోని హెచ్చుతగ్గులు

ఈ వర్ణాల్లో హెచ్చుతగ్గులున్నాయా? ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనగలమా? జాతిపరంగా ఏర్పడిన వర్ణాల్లో హెచ్చుతగ్గులు లేవు. పుట్టుకవల్ల మనకు గొప్పదనం రాదు. అందువల్ల జాతిబ్రాహ్మణుడు, జాతిక్షత్రియుడు, జాతివైశ్యుడు, జాతిశూద్రుడు అందరూ ఒకటే.

గుణం ఆధారంగా ఏర్పడిన వర్ణాల్లో హెచ్చుతగ్గులున్నాయి. ఉన్నత గుణం ఉన్న వ్యక్తిని ఖచ్చితంగా గౌరవిస్తుంది సమాజం. బ్రాహ్మణగుణం అన్నిటికన్నా ఉత్తమమైనది. అందుకని ఏ సంఘమన్నా గుణబ్రాహ్మణునికి నీరాజనాలిస్తుంది. గాంధీజీని దేశమంతా గౌరవించిందంటే ఆయనలోని గుణబ్రాహ్మణత్వమే కారణం. మహాత్ముని నిస్వార్థసేవ, అహింసాతత్త్వం అందుకు ఉదాహరణలు. మనకు 63 నాయనార్లు ఉన్నారు. అందులో చాలామంది జాతిబ్రాహ్మణులు కాదు. కాని ఈ రోజుకి కూడా బ్రాహ్మణులతో సహా వారిని కీర్తిస్తారు. దానికి కారణం వారు గుణబ్రాహ్మణులు అవటమే.

కర్మ ఆధారంగా ఏర్పడిన వర్ణాల్లో కూడా హెచ్చుతగ్గులు లేవు. అన్ని వృత్తులూ సమానంగా అవసరమే. రాజకీయంగా దురభిప్రాయం ఏర్పడింది కాని వారి సమాజసేవ కూడా బ్రాహ్మణుడు చేసే సేవతో సమానం. కొంతమంది దేశానికి సేవచేస్తే, కొందరు శాస్త్రాధ్యయనం చేయిస్తారు. విభిన్నవృత్తులని శరీరంలో విభిన్నభాగాలు చేసే విభిన్న పనులతో పోల్చవచ్చు. శరీరంలో ఏపని ముఖ్యం అంటే ఏం చెప్పగలం? మలమూత్ర విసర్జన పని వృథా అని చెప్పగలమా? లేకపోతే అది అసహ్యం అనగలమా? మూత్రపిండాలు పనిచేయటం ఆగిపోతే తెలుస్తుంది వాటి ప్రాముఖ్యత ఏమిటో. అలాగే అన్ని కర్మలూ ముఖ్యమే. అందువల్ల జాతిపరంగా, కర్మపరంగా భేదాలు లేవు కాని, గుణపరంగా ఉన్నాయి.

### 3.3 వర్ణ ఎంపిక

మన వర్ణాన్ని మనం ఎన్నుకునే అధికారం ఉందా? దానికి జవాబు ముందు ఏ వర్ణం అని ప్రశ్న.

**3.3.1 జాతివర్ణం** – జాతిపరంగా చూస్తే మనకు పుట్టుక విషయంలో మన ప్రమేయం లేదు. తల్లిదండ్రులను మార్చుకోలేము. దాని గురించి బెంగపడటం కూడా అనవసరం. ఎందుకంటే జాతిపరంగా అందరూ సమానమే.

**3.3.2 గుణవర్ణం** – గుణపరంగా చూస్తే మనకు అధమ స్థాయినుంచి ఉత్తమస్థాయికి ఎదిగే అవకాశముందని చెబుతుంది శాస్త్రం. ఒక వ్యక్తి గుణశూద్రునిగా ఉన్నాడనుకుందాం. అంటే పుట్టుకతోనే బద్ధకంగా, యాంత్రిక జీవనం గడుపుతున్నాడనుకుందాం. శాస్త్రం అటువంటి వ్యక్తి స్వార్థపరమైన కర్మలు చేయాలని సూచిస్తుంది. ఈ స్థాయిలో నిస్వార్థసేవ గురించి ఆలోచించనక్కరలేదు. అతను డబ్బు, పేరు, కుటుంబంకోసం పనిచేస్తాడు. చాలామంది గుడికి వెళ్ళేది స్వార్థచింతనతోనే కదా. తమ లాభంలో పదిశాతం దేవునికి యిస్తామని కూడా అంటారు. కొంతమంది అలాగుణశూద్రుడు స్థాయినుంచి గుణవైశ్యుడు అవుతారు.

శాస్త్రం యింకొంచెం పనిచేయి, నిస్వార్థంగా చేయి అంటుంది. అలా చేస్తే అతను గుణక్షత్రియుడవుతాడు. చివరగా అతను గుణబ్రాహ్మణుడు అవుతాడు. నిజానికి వేదం బోధించే సాధన లక్ష్యం ఈ గుణశూద్రుని స్థాయినుంచి గుణబ్రాహ్మణుని స్థాయికి ఎదగటానికే. గుణబ్రాహ్మణుడు మోక్షానికి సంసిద్ధుడవుతాడు. అందుకని ఆ స్థాయికి ఎదిగే విషయంలో మన ప్రమేయం ఉంది.

**3.3.3 కర్మవర్ణం** – కర్మ పరంగా చూస్తే మనకు ఎన్నుకునే అవకాశం ఉంది. మనం జాతిపరంగా ఉన్న వృత్తిలో కొనసాగవచ్చు లేదా మన అభిరుచినిబట్టి ఎన్నుకోవచ్చు. జాతిపరంగా అయితే కొంత లాభం ఉంది. చిన్నవయస్సునుంచే ఆ వృత్తి చేపట్టవచ్చు. దానికి సంబంధించిన అవగాహన బాగా ఉంటుంది. పెద్దవారి నిరంతర తోడు గురుకులవాసంలాగా ఉంటుంది. అలాగే కొనసాగింది చాలా కాలంవరకూ.

రెండో పద్ధతి, మన యిష్టాన్నిబట్టి ఎన్నుకోవడం. అలా విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు అయ్యాడు. కాని మన యిష్టం ఏదో తెలుసుకోవటం ఎలా? ఇవాళ బ్రాహ్మణగుణం ఉండవచ్చు. రేపు వైశ్యగుణం ఉండవచ్చు. ఇది తేల్చుకోలేకపోతే వంశపారంపర్యంగా వస్తున్నది ఉంటూనే ఉంది. అలా రాజకీయనాయకుల పిల్లలు రాజకీయాల్లోకి, వ్యాపారవేత్తల పిల్లలు వ్యాపారాల్లోకి వచ్చారు.

ఏదైనా వృత్తి ఎన్నుకునేటప్పుడు మనం మనని కించపరచుకోనక్కర్లేదు. ఎందుకంటే అన్నీమంచివే. కాని, శాస్త్రం ఒకటే చెబుతుంది. ఏ వృత్తిని ఎన్నుకున్నా దాన్ని డబ్బుపరంగా ఎన్నుకోవద్దని. డబ్బుపరంగా ఎన్నుకుంటే పోటీ తత్త్వం పెరుగుతుంది. కొన్ని వృత్తుల జోలికి ఎవరూ పోరు.

ఇప్పుడు, ఆధునిక యుగంలో శాస్త్ర అధ్యయనం చేసి, దాన్ని నలుగురికీ చాటి చెప్పాలనే తత్త్వమే అంతరించి పోతోంది. శాస్త్రాలు కేవలం గ్రంథాలయాలకే పరిమితమైపోతున్నాయి. ఆఖరికి పురోహితుడు కూడా తన కొడుకును వేదపాఠశాలకు

పంపటానికి ఇష్టపడటం లేదు. ముందు ముందు వేదాధ్యయనం చేసిన వ్యక్తి దొరకటం దుర్లభమవుతుందేమో.

**జాతిబ్రాహ్మణులు** – బ్రాహ్మణులకు పుట్టినవారు.

**గుణబ్రాహ్మణులు** – సత్వగుణప్రధానమైనవారు. వీరే జాతికి చెందినా సత్వగుణప్రధానులైతే గుణబ్రాహ్మణులే.

**కర్మబ్రాహ్మణులు** – ఆధ్యాత్మిక చింతన కలిగి అధ్యయనం, అధ్యాపనం ఇంకా పూజాదిక కార్యములు చేయువారు.

**జాతి క్షత్రియులు** – క్షత్రియులకు పుట్టినవారు.

**గుణ క్షత్రియులు** – రాజసగుణప్రధానులు. వీరే జాతికి చెందినా రాజసగుణప్రధానులైతే గుణక్షత్రియులే.

**కర్మ క్షత్రియులు** – పరిపాలన, ప్రజారక్షణ, సంఘసేవవంటి కార్యములు చేయువారు.

**జాతి వైశ్యులు** – వైశ్యులకు పుట్టినవారు.

**గుణ వైశ్యులు** – రాజస + తామస గుణప్రధానులు. వీరే జాతికి చెందినా రాజస + తామస ప్రధానులైతే గుణవైశ్యులే.

**కర్మ వైశ్యులు** – వ్యాపారము, వ్యవసాయము, గోరక్షణ, గోపోషణ చేయువారు.

**జాతి శూద్రులు** – శూద్రులకు పుట్టినవారు.

**గుణ శూద్రులు** – తామసగుణ ప్రధానులు. వీరే జాతికి చెందినా తామసగుణ ప్రధానులైతే గుణశూద్రులే.

**కర్మ శూద్రులు** – పై మూడు వర్గాలకు సేవలు అందించే వారు.

దీనికంతటికీ కారణం వృత్తిని డబ్బే ప్రధానంగా చేసి ఎన్నుకోవటమే. అందుకని అలా కాకుండా ఏ వృత్తిని ఎన్నుకున్నా, మన లక్ష్యం, మన గుణం మార్చుకుంటూ వచ్చి, గుణశూద్రుని స్థాయినుంచి గుణబ్రాహ్మణుని స్థాయికి ఎదగాలి. దీన్ని వర్ణవ్యవస్థ అంటారు.

# 04. ఆశ్రమవ్యవస్థ

మానవ లక్ష్యాలైన పురుషార్థాలను సాధించటానికి శాస్త్రం వర్ణాశ్రమధర్మాలను నియమించింది. వర్ణాశ్రమధర్మాలంటే వర్ణవ్యవస్థ, ఆశ్రమవ్యవస్థ. నాలుగు వర్ణాల గురించి ఇంతకు ముందు వివరంగా చూసాము. ఇప్పుడు ఒక ఆధ్యాత్మిక సాధకుడు పాటించాల్సిన నాలుగు ఆశ్రమధర్మాల గురించి చూద్దాము.

ఆశ్రమ అన్న పదాన్ని సాధారణంగా జీవితంలో ఒక దశ కింద చెబుతారు. ఒక వైదిక జీవితంలో నాలుగు దశలు ఉంటాయి. వాటిని నాలుగు ఆశ్రమాలు అంటారు. అవి – 1. బ్రహ్మచారి ఆశ్రమం, 2. గృహస్థ ఆశ్రమం, 3. వానప్రస్థ ఆశ్రమం, 4. సన్యాస ఆశ్రమం.

ఆశ్రమం అంటే ఏమిటి? శ్రమః అంటే కావాలని, మనస్ఫూర్తిగా, ఒక నిర్దిష్ట దిశ వైపుపెట్టే శ్రమ. ఇక్కడ శ్రమ ఆధ్యాత్మిక సాధన. అందువల్ల శ్రమః అంటే ఆధ్యాత్మిక సాధన లేదా సాధన అనుష్ఠానం. ఆశ్రమం అంటే ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలకోసం శ్రమించే దశ.

జీవితం మొత్తం నాలుగు ఆశ్రమాలుగా విభజించబడిందీ అంటే, శాస్త్రం ప్రకారం జీవితం మొత్తం ఆధ్యాత్మిక సాధనే. ఆశ్రమ అంటే ఎప్పుడో జీవిత చరమాంకంలో, ఉద్యోగ విరమణ చేసాక చేసేది కాదు. జీవితమంతా సాగుతూనే ఉంటుంది. కాకపోతే, ఒక్కో దశలో సాధనదిశ మారుతూ ఉంటుంది. అందువల్లే శాస్త్రం ప్రకారం మన ప్రాథమిక లక్ష్యం, అంతిమ లక్ష్యం రెండూ ఒకటే. అది ఆధ్యాత్మిక సాధన.

ధర్మార్థ కామాలను మానవ లక్ష్యాలుగా ప్రారంభంలో అంగీకరించినా, శాస్త్రం వాటిని అంతిమ లక్ష్యాలుగా అంగీకరించదు. శాస్త్రం వాటి గురించి మాట్లాడుతుంది కాని, అది పరిపక్వత లేని వారికి మాత్రమే. ఈ సాధన అంతిమ లక్ష్యం మోక్షం. మనలో పరిపక్వత వచ్చేదాకా, శాస్త్రం యిది ఆధ్యాత్మిక సాధన అన్న విషయం బట్టబయలు చేయకుండానే, ప్రయత్నం చేయిస్తుంది. చిన్నపిల్లలు మందు వేసుకోవటానికి వారికి పంచదార పూతపూసిన మందు యిచ్చినట్టుగా, శాస్త్రం కూడా పైకి ధర్మ–అర్థ–కామ పురుషార్థాలకి శ్రమించేటట్టు చేసినా, రహస్యంగా మన మోక్షంకోసం పాటుపడుతుంది. ఆధ్యాత్మిక లక్ష్యానికి నాలుగు దశల్లోనూ ఆధ్యాత్మిక సాధనని చొప్పించింది. ఆధ్యాత్మిక సాధన అంటే అంతర్గత స్వేచ్ఛకోసం పాటుపడటం. దీన్నే మోక్షంకోసం సాధన అంటారు.

ఒక సీతాకోక చిలుక నాలుగు దశలని పోలి ఉంటాయి మన జీవితంలో దశలు కూడా. గుడ్డు, గొంగళిపురుగు, ప్యూపా దశలనుంచి సీతాకోక చిలుక చివరికి బయటకు వస్తుంది, చాలా అందంగా, ఆకర్షణీయంగా.

### 4.1 బ్రహ్మచర్య ఆశ్రమం

మొదటిదశ బ్రహ్మచర్య దశ.ఇందులో విద్య నేర్చుకుంటాము.విద్య ఏమిటి? ఎందుకు?

ఇప్పటి నిర్వచనం మారిపోయింది. సంపాదనకోసం. అర్థ, కామాలకోసమే విద్య అయిపోయింది. శాస్త్రం కూడా విద్య నేర్చుకోమనే చెబుతుంది. మనం కర్మబ్రాహ్మణ, కర్మక్షత్రియ, కర్మవైశ్య, కర్మశూద్రులలో దేనికి విలువనిచ్చినా, తదనుగుణమైన విద్యను నేర్చుకోవాలి. ఇది శాస్త్రం ప్రకారం రెండో ఉద్దేశం. కాని దురదృష్టవశాత్తూ అదే ప్రాథమిక అవసరం అయి కూర్చుంది.శాస్త్రం ప్రకారం విద్య అంటే ఒక వ్యక్తిని తీర్చిదిద్దేది, మంచి నడవడికని పెంపొందించేది,తను నేర్చుకుని తనను తానూ, సంఘాన్నీ ఉద్ధరించేటట్టు చేసేది. ఒక లంచగొండి, మోసగాడు సంఘంలో అడుగుపెడితే సమాజం భ్రష్టుపడుతుంది. స్వామి చిన్మయానంద అందంగా ఈ నిర్వచనాన్ని యిచ్చారు. పశుప్రవృత్తి ఉన్న మనిషి, సంస్కారం ద్వారా మనిషిప్రవృత్తిని పెంపొందించుకోవాలి. అప్పుడు మనిషిప్రవృత్తినుంచి దైవప్రవృత్తి పెంపొందించుకోగలుగుతాడు.

గనులలో దొరికే ఖనిజాలు విలువైనవే కానీ వాటిని యథాతథంగా వాడలేము. వాటిని సానపట్టి, పనికివచ్చే లోహంగా తయారుచేయాలి. అలాగే మనం కూడా తల్లిగర్భంనుంచి పుట్టగానే సానబట్టని, నిక్షిప్తమైన శక్తి ఉన్నవారమన్నమాట. మనని గురుకులవాసంకి పంపి సానబట్టాలి. ఈ పని విద్య చేస్తుంది.

**మాతుః అగ్రే అధి జననం ద్వితీయం మౌఞ్జి బన్ధనాత్।**
**తత్ర అస్య మాతా గాయత్రీ పితా తు ఆచార్యః ఉచ్యతే॥**

మొదటి తల్లిదండ్రులు జన్మనిచ్చినవారు. గాయత్రీ మంత్రజపం బోధిస్తాడు గురువు. గాయత్రీ మంత్రం విద్యకి ప్రామాణికం. అందువల్ల గురువు తండ్రి, విద్య తల్లి. ఈ రెండో తల్లిదండ్రులు మనని సంస్కరిస్తారు.

విద్యార్థి దశని బ్రహ్మచర్య ఆశ్రమం అంటారు. ఇక్కడ బ్రహ్మ అంటే శాస్త్రం లేదా వేదాలు. బ్రహ్మచారి అంటే దాని గురించి ఆలోచించేవాడు. **బ్రహ్మణి వేదే చరతి.** చరతి అంటే నడిచేవాడు. వేదశాస్త్రంలో మానసికంగా పయనించే వాడు. ఈ దశని బ్రహ్మచర్య ఆశ్రమం అంటారు.

సంస్కరించబడటానికి అవసరమైన విద్య ఏది? శాస్త్రం ఏం చెబుతుంది? శాస్త్రం మూడు విషయాలు చెబుతుంది.

**4.1.1 లక్ష్యనిర్దేశం** – మన అంతిమ లక్ష్యం ఏమిటో మనకు బాగా తెలియాలి. జీవితం ఒక ఫుట్‌బాల్ ఆట. బంతిని ఎదుటి టీమ్‌కి అందకుండా మనం పట్టుకుని కూర్చుంటే

చాలదు. దాన్ని గోల్‌లోకి వేయాలి. లేకపోతే మన దగ్గర బంతి గంటసేపు ఉన్నా వ్యర్థమే. అలాంటి బంతుల్ని – డబ్బు, కుటుంబం, ఆఫీస్ – మనం ఎన్నో పట్టుకు కూర్చుంటున్నాం. మనం స్పష్టంగా నేర్చుకోవాల్సిన అంశం మనం పశుప్రవృత్తినుంచి మనిషి ప్రవృత్తికి ఎదిగి, మనిషి ప్రవృత్తినుంచి దైవప్రవృత్తికి ఎదగాలి. మన అంతిమలక్ష్యం మోక్షాన్నిచ్చే ఆధ్యాత్మిక సాధన అని తెలుసు కోవాలి.

**4.1.2 క్రతువుల పరిజ్ఞానం** – ఏదో ఒక రకమైన పూజ చేయటం నేర్చుకోవాలి. దీన్నే క్రతువు అంటారు. చాలామందికి పూజ ఎందుకు చేస్తారో, దాని ప్రాముఖ్యత ఏమిటో తెలియదు. ఇక్కడ పూజ అంటే శారీరకంగాచేసే పూజ, దీనివల్ల మూడు లాభాలున్నాయి.

మొదటి లాభం, పూజ చేయటంవల్ల క్రమశిక్షణ పెరుగుతుంది. క్రమశిక్షణ ఉంటే పూజ చేస్తారు. ఉదాహరణకి సైనికులకున్నన్ని కర్మలు ఎవరికీ లేవు. అందువల్ల క్రమశిక్షణ ఉన్నచోట క్రతువు ఉంటుంది. క్రతువు ఉన్నచోట క్రమశిక్షణ ఉంటుంది.

రెండో లాభం, జీవితంలో ఉషారు పుట్టుకొస్తుంది. బద్ధకించటం శరీరతత్త్వం. తమోగుణనివృత్తికోసం పూజ చేయాలి.

మూడోలాభం, దేవునిమీద భక్తి పెరుగుతుంది. తక్కిన భావాలలాగా, భక్తి కూడా మనస్సులో పుట్టే ఒక భావనే. భావన కనబడదు, కాని దాన్ని చేతల ద్వారానో, మాటల ద్వారానో వెలిబుచ్చుతాము. దాన్ని వెలిబుచ్చటం ద్వారా, ఇంకొంచెం పోషిస్తాం కూడా. అందువల్ల మనం పూజ చేస్తున్నామంటే, మన భక్తిని వెలిబుచ్చటమే కాక, దాన్ని పోషిస్తున్నాం కూడా. శాస్త్రం మనకు చెప్పేది, అన్ని మానవ సంబంధాలకన్నా దైవంతో సంబంధం శాశ్వతమైనదని. మానవసంబంధాలనెంత బాగా పెంచి, పోషించినా, అవి ఎప్పటికో అప్పటికి వీగిపోక తప్పదు. శాశ్వతసంబంధం అంటే అది దైవంతోనే. అందుకని చేతితో చేసే పూజా, నోటితో జపించే మంత్రం రెండూ మానకుండా చేయాలి.

**4.1.3 మానవతా విలువలు** – మానవతా విలువలు శాశ్వతమైనవి, ఎన్నటికీ మార్పు చెందనివి. ధర్మానికి మార్పులేదు. అది శాశ్వతం. ధర్మం లేదా సనాతన ధర్మానికి కట్టుబడి ఉండకపోతే మన శారీరక, భావపరజీవితం దెబ్బతింటుందని గ్రహించుకోవాలి.

అలా ఈ మూడు దశలని నేర్చుకుంటేనే, మనం సంఘానికి చీడపురుగుగా మారకుండా, సంస్కరించబడిన వ్యక్తి అవుతాము.

## 4.2 గార్హస్థ లేదా గృహస్థ ఆశ్రమం

ఇది రెండో దశ, చాలా ముఖ్యమైన దశ. శాస్త్రప్రకారం గృహస్థ ఆశ్రమం ఒక మతఃపరమైన సంస్థ. పెళ్ళి అనే తతంగం ద్వారా మతఃపరమైన జీవితం గడపటానికి అర్హతనిస్తుంది.

మతఃపరమైన జీవనమే ముఖ్యం, ప్రాపంచిక సుఖాలు అనుకోకుండా దొరుకుతాయి. కాని కుటుంబజీవనాన్ని ప్రాపంచిక సుఖాలకోసమే అనుకుంటే, సంస్థలాంటి కుటుంబం బీటలు పడుతుంది. అసలు ఎందుకు కలిసి జీవించాలి అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఒకప్పుడు స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ లేదు. కాని ఇప్పుడు ఆ సమస్యే లేదు. ప్రేమకోసమా అంటే ప్రేమ అశాశ్వతమైపోతోంది. అందువల్ల కుటుంబజీవనం పది కాలాల పాటు నిలవటం లేదు. కలిసి ప్రార్థించే కుటుంబం, కలిసి జీవిస్తుంది. ఐహిక సుఖాలే ముఖ్యమనుకుంటే, ఆ కుటుంబంలో బంధం నిలవదు. అందుకని మతానికి ప్రాథమిక ప్రాముఖ్యత ఉంది, గృహస్థ ఆశ్రమంలో. గృహస్థః అన్న పదం గృహే తిష్ఠతి – ఇంటిలో ఉండేవాడు అన్నపదంనుంచి గ్రహించబడింది. ఆ భావం ఉన్నచోట, ఆ బంధం దైవనిర్ణయంలా కనిపిస్తుంది. దైవమే ముడిపెట్టాడు తమకి, చివరికి దైవమే విడదీయాలి కాని, తామే విడిపోకూడదు అన్న అవగాహన ఉన్నచోటే కుటుంబం పటిష్ఠంగా నిలుస్తుంది. పటిష్ఠంగా ఉన్న కుటుంబంలోనే, సర్దుకుపోవటం, క్షమించటం, భరించటం, నమ్మకం, ఓర్పు అనే మంచి లక్షణాలు అలవడుతాయి.

కుటుంబం పటిష్ఠంగా ఉంటేనే మానసికంగా దృఢమైన పిల్లలు పుడతారు. భార్యాభర్తల మధ్య గొడవలు ఉంటే, దాని ప్రభావం పిల్లలమీద పడుతుంది. అందుకని గృహస్థ ఆశ్రమం మనకీ, మన తరువాత తరానికీ కూడా ముఖ్యమే.

### 4.3 వానప్రస్థ ఆశ్రమం

వానప్రస్థ ఆశ్రమంలో నెమ్మదిగా వైరాగ్యం పెంచుకోవటానికి శిక్షణ పొందుతాము. మన స్థూలశరీరం చేయగలిగినన్నాళ్ళు పనిచేసింది. మనకు వృద్ధాప్యం పైబడేసరికి, అంతకుముందు చేసినంత చురుకుగా బాహ్యమైన పనులను చేయలేదు. అందుకని దానితోపాటు మనస్సును కూడా నెమ్మదిగా వెనక్కి తీసుకోవటం నేర్చుకోవాలి. మనస్సు ఇంకా హుషారుగా ఉండి, దానికి శరీరం సహకరించకపోతే, మనకు ఒత్తిడి పెరుగుతుంది. అందుకని నెమ్మదిగా మనస్సుదృష్టిని బాహ్యప్రపంచంనుంచి మరల్చి, నెమ్మదిగా అంతర్ముఖం చేయాలి. ఇన్నాళ్ళూ బాహ్యప్రపంచం గురించి నేర్చుకున్నాము. ఇప్పుడు ఆత్మజ్ఞానం పొందటానికి సుముఖం అవాలి.

అందుకని ఉద్యోగవిరమణ చేసేటప్పుడు జీవనసూత్రాన్ని అర్థం చేసుకుని, దానికి సంసిద్ధులం అవాలే కాని, ఆత్మన్యూనతా భావం పెంపొందించుకోకూడదు. తర్వాత దశ అయిన సన్యాస ఆశ్రమానికి మనని మనం సంసిద్ధులని చేసుకోవాలి. బ్రహ్మచర్య ఆశ్రమంలో విలువలకి సంబంధించిన విద్యనభ్యసిస్తే, సన్యాసాశ్రమంలో ఆధ్యాత్మిక జ్ఞానం

పొందుతాము. వానప్రస్థ ఆశ్రమం అంటే కుటుంబం మధ్యలో జీవిస్తూనే, ఒంటరిగా జీవించటం.

**వనానాం సమూహః వానమ్।**
**వానే ప్రకర్షేణ తిష్ఠతి ఇతి వానప్రస్థః॥**

### 4.4 సన్యాస ఆశ్రమం

సన్యాసం అంటే అసలు అర్థం అన్నీ పరిత్యజించటం. ప్రాథమికంగా మన అజ్ఞానాన్ని, మన అహంకారాన్ని వదులుకుని, జీవితంలో అన్నీ వదులుకోవటానికి సిద్ధపడటం. యమధర్మరాజు మననుంచి అన్నీ తీసుకోవటానికి వస్తాడు, ఆ రోజు ఆయనకి అన్నీ సంతోషంగా వడ్డించటానికి మానసికంగా సిద్ధపడాలి. సన్యాసాశ్రమం వేరు, ఆశ్రమ సన్యాసం వేరు. రెండో దానిలో శారీరకంగా అన్నీ అందరినీ పరిత్యజించి ఆశ్రమంలో ఒంటరిగా జీవితం గడపటం. శారీరకంగా అన్నీ పరిత్యజించినా, పరిత్యజించకపోయినా మానసికంగా అన్నీ పరిత్యజించి, ఆత్మజ్ఞానం పొందటానికి సిద్ధపడాలి.

# 05. కర్మయోగం

మనిషికి నాలుగు పురుషార్థాలు లక్ష్యాలుగా ఉన్నాయి. ధర్మ, అర్థ, కామ అనే మూడు పురుషార్థాలు ఐహిక లక్ష్యాలను సాధిస్తే, మోక్షపురుషార్థం ఆధ్యాత్మిక లక్ష్యసాధన చేస్తుంది. మోక్షసాధన చేయని మానవజన్మ వృథా. ప్రాపంచిక లక్ష్యాలని సాధించినా అంతిమలక్ష్యం మోక్షమే అవాలి.

ఈ మోక్షాన్ని దృష్టిలో పెట్టుకుని శాస్త్రం ఒక మార్గాన్ని సూచించింది.

1. మార్గం – సాధన 2. లక్ష్యం – సాధ్యం

3. చేసేవాడు – సాధకుడు 4. లక్ష్యం సాధిస్తే – సిద్ధుడు

సాధకుడు అనే మనం సాధ్యం అనే లక్ష్యం పొందాలంటే ఒక సాధన అనే మార్గంలో వెళ్ళాలి. అప్పుడు సాధ్యం పొంది సిద్ధులము అవుతాము. అంటే సాధక స్థాయినుంచి సిద్ధుడు స్థాయికి చేరుకోవటమే జీవనప్రయాణం.

సిద్ధుడు అంటే కొన్ని సిద్ధులు పొందటం కాదు, సిద్ధుడు అంటే తనని తాను తెలుసుకున్నవాడు. ఈ మార్గాలు మూడు ఉన్నాయి. ప్రతిమార్గాన్నీ యోగం అంటారు. యోగం అంటే సాధకుణ్ణి సాధ్యంతో కలిపేది – ప్రయత్నం చేసే వ్యక్తి కోరే గమ్యం. యోగం **యుజ్** అనే ధాతువునుంచి వచ్చింది. **యుజ్** అంటే కలపటం. ఇక్కడ సాధక, సాధ్యాలని కలపటం. **యుజ్యతే సాధ్యేన సహ సాధకః యేన సహ సాధన –**
మూడు యోగాలు యివి –

1. కర్మయోగం, 2. ఉపాసనయోగం, 3. జ్ఞానయోగం

మొత్తం మార్గాన్ని మూడు మెట్లున్న మేడమెట్లుగా భావించవచ్చు. ఇవి ఒకదాని బదులు ఒకటి కాదు. మూడూ ముఖ్యమే, మూడూ అవసరమే అందరికీ. మొదటి అంతస్తులోకి క్షేమంగా చేరాలంటే ఒక్కొక్క మెట్టూ ఎలా ఎక్కాలో, మోక్షమనే అంతిమలక్ష్యం పొందటానికి ఇవి కూడా అలాగే ఎక్కాలి. అందుకని మూడు యోగాలూ ముఖ్యమే.

### 5.1 కర్మయోగం

కర్మయోగం అంటే ఏమిటి? కర్మయోగంలో రెండు పదాలున్నాయి. కర్మ, యోగం. ఇక్కడకర్మ అంటే సరియైన పనిచేయటం. యోగం అంటే సరియైన దృక్పథం. సంస్కృతంలో భావన అంటారు. తేలిగ్గా చెప్పాలంటే, కర్మయోగం అంటే సరియైన పనిని, సరియైన దృక్పథంతో చేయటం.

సరియైన పని అంటే ఏమిటి? మనిషి చేసే పనులని మూడు రకాలుగా శాస్త్రం వర్ణించింది. అవి

1. ఉత్తమ కర్మ – అత్యుత్తమ సానుకూల ఆధ్యాత్మిక ప్రభావం చూపేది.

2. మధ్యమ కర్మ – మధ్యరకం కర్మ. ఇందులో ఆధ్యాత్మిక ప్రభావం చాలా తక్కువ ఉంటుంది. లేదా అసలు ఉండకపోవచ్చు కూడా. చాలా ప్రాపంచిక లాభాలు ఉంటాయి.

3. అధమ కర్మ – వీటికి ప్రతికూల ఆధ్యాత్మిక ప్రభావం ఉంటుంది. అంటే ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండదు, లేదా తగ్గుతుంది. వాటిని వివరంగా చూద్దాము.

**5.1.1 ఉత్తమకర్మాణి** – దీన్నే సాత్విక కర్మాణి అని కూడా అంటారు. భగవద్గీత 17, 18 అధ్యాయాల్లో శ్రీకృష్ణభగవానుడు ఈ అంశాలన్నీ వివరంగా చర్చిస్తాడు. ఉత్తమ కర్మాణి లేదా సాత్విక కర్మాణిని పర ఉపకార కర్మాణి అని కూడా అంటారు. ఎదుటివారి బాగుకోసం చేసే మంచి కర్మలు.

**శ్రూయతాం ధర్మసర్వస్వం**
**శ్రుత్వా చైవ అవధార్యతామ్।**
**పరోపకారః పుణ్యాయ**
**పాపాయ పరపీడనమ్॥**

పుణ్యకర్మలన్నీ పర ఉపకార కర్మలే. ఎదుటివారికి తోడ్పడేవే.

**పరోపకారాయ వహన్తి నద్యః।**
**పరోపకారాయ దుహన్తి గావః।**
**పరోపకారాయ ఫలన్తి వృక్షాః।**
**పరోపకారార్థమ్ ఇదం శరీరమ్॥**

ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఉత్తమకర్మల్లో మనం ఇచ్చేది ఎక్కువ, తీసుకునేది తక్కువ ఉంటుంది. ఇస్తూ ఉంటే, ఎదుగుతూ ఉంటాం. అందుకే మన సాంప్రదాయం దానం, త్యాగం పదాలని నేర్పించింది.

పర ఉపకారకర్మలని నిష్కామకర్మాణి అని కూడా అంటారు. అంటే ఉత్తమకర్మాణి, సాత్త్విక కర్మాణి, పర ఉపకారకర్మాణి, నిష్కామకర్మాణి – ఏదన్నా ఒకటే. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకి అధికంగా తోడ్పడుతుంది.

పర ఉపకారకర్మలు ఏవి? శాస్త్రం వాటిని పంచమహాయజ్ఞాలు అంది. అవి **దేవయజ్ఞం, పితృయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం.**

**5.1.1.1 దేవయజ్ఞం** – ఇది మొట్టమొదటి పర ఉపకారకర్మ, దేవయజ్ఞం అంటే దేవుణ్ణి కొలవటం. దేవుని ముందు నిలిచి, మనసారా ప్రార్థించటం. శాస్త్రంలో ప్రార్థనకి అత్యున్నత స్థానం ఉంది.

**స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తాం**
**న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః।**
**గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం**
**లోకాః సమస్తాః సుఖినో భవన్తు॥**

మనస్ఫూర్తిగా చేసిన ప్రార్థన కేవలం మానవజాతికే కాదు, పశుపక్ష్యాదులకే కాదు, వృక్షాలకే కాదు, వాటిని దాటి పద్నాలుగు లోకాలకు కూడా మంచి చేస్తుంది.

**సర్వే భవన్తు సుఖినః।**
**సర్వే సన్తు నిరామయాః।**
**సర్వే భద్రాణి పశ్యన్తు।**
**మా కశ్చిద్ దుఃఖభాగ్ భవేత్॥**

అందరూ బాగుండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలి, ఎవరికీ కష్టం కలగకూడదు అని మనసారా చేసే ప్రార్థన, ఏ భాషలోనైనా సరే, మనస్ఫూర్తిగా ఒక్క క్షణం చేస్తే చాలు, అసలు పైసా ఖర్చు లేకుండా విశ్వమంతటికీ మేలు కలుగుతుంది. ఈ ప్రార్థనతో పాటు ఏదైనా నైవేద్యం దేవునికి సమర్పిస్తే, అది సృష్టిమొత్తానికి అందుతుంది. దేవుడు కేవలం మనమిచ్చే దానిమీదే ఆధారపడడు. దేవుడికొక ట్రస్ట్ ఉంటుంది, దానికి ఆయనే ట్రస్టీ మెంబర్. ఏది ఏ పూజలో సమర్పించినా దాన్ని దేవుడు తీసుకుని తన ట్రస్ట్ ద్వారా అందరికీ, చెట్టుకీ, పుట్టకీ కూడా పంచుతాడు. అంటే దేవునికి చేసిన యజ్ఞం, మళ్ళీ మనిషికే జేరుతుంది.

ఇప్పుడు కొంతమంది మానవసేవయే మాధవ సేవ అంటున్నారు. ఆ సిద్ధాంతం గొప్పదే. ఎంతోమంది సంఘసేవకులు మానవసేవ చేస్తున్నారు. పైగా 'నీకన్నా నేను ఉత్తమం' అన్న సిద్ధాంతం చెపుతూ, పూజలు చేసే వారిని కించపరుస్తున్నారు కొందరు. ఇది ఎందుకిలా జరుగుతోందంటే, వారు ఈక్వేషన్‌కి ఒకవైపే చూస్తున్నారు. మానవసేవ మాధవసేవ అయినప్పుడు, మాధవసేవ మానవసేవ అవుతుందన్న విషయం వారికి అర్థం కావటం లేదు. ఆ మాటకొస్తే అది ఇంకా ఎక్కువగా అవుతుంది. ప్రార్థన ద్వారా ఎక్కువమందిని చేరుతున్నాం కదా! అందుకని ఈ యజ్ఞం మొదటిదీ, అత్యుత్తమమైనదీ. దీన్ని రోజూ చేయాలి.

**5.1.1.2 పితృయజ్ఞం** – ఇది రెండోది. ప్రతి దాంట్లోనూ కృతజ్ఞతా భావన ఉంది. కృతజ్ఞత+ఉపకారం=యజ్ఞం. దైవయజ్ఞంలో దేవుడు మనకిచ్చిన దానికి కృతజ్ఞత చెబుతాం. పితృయజ్ఞంలో మన పితృదేవతలకి కృతజ్ఞత చెబుతాం. మన తల్లిదండ్రులు మనకు జన్మనిచ్చి, మనం వారికి తిరిగి సేవ చేస్తామో లేదో తెలియకుండానే మనకు సేవ చేస్తున్నారు. వారు అలా చేయగలుగుతున్నారంటే, వారి తల్లిదండ్రులు వారికి చేయబట్టి. అందుకని మన తాతముత్తాతలకి ఋణం తీర్చుకుంటాము.

అది పరోపకారమెలా అవుతుంది? పితృకర్మల్లో, ఒక ప్రత్యేక స్థానం ఉంది. కొంతమంది పూర్వీకులకి శ్రాద్ధకర్మలు జరుగవు. వారికి పిల్లలు లేకపోవటం, లేదా పిల్లలు శ్రాద్ధకర్మలని నమ్మకపోవటం కారణమవవచ్చు. అలాంటి పూర్వీకుల దయనీయ స్థితిని ఒకసారి ఆలోచించండి. కలియుగంలో ఇలాంటి వారి సంఖ్య పెరుగుతుందని శాస్త్రం ముందే ఊహించినట్టుంది. అందుకే ఈ ప్రార్థన

**యేషాం న మాతా న పితా।**
**న మిత్రజ్ఞాతి బాన్ధవాః।**
**తే సర్వే తృప్తి మాయాన్తు।**
**మయా ఉత్సృష్టై కుశోదకైః॥**

నా అన్నవారు లేని, పిల్లలు లేని పూర్వీకులకి తర్పణాలొదులుతున్నాను అని అర్థం. అధికసంఖ్యలో ఉన్న పితృదేవతలకి తర్పణాలొదలటం, శ్రాద్ధకర్మలు పెట్టటం కూడా పర ఉపకారకర్మే.

**5.1.1.3 బ్రహ్మయజ్ఞం** – మూడో యజ్ఞం బ్రహ్మయజ్ఞం. వేదాలు, తక్కిన ఆధ్యాత్మిక గ్రంథాలు యిచ్చిన ఋషులందరకీ మన కృతజ్ఞత వెలిబుచ్చటం. బ్రహ్మ అంటే ఇక్కడ వేదాలు. బ్రహ్మయజ్ఞం అంటే వేద యజ్ఞం. ఇందులో వేదాలని పూజిస్తాం. శ్రుతి, స్మృతి, పురాణాలని పొందుపరిచిన ఋషులనీ పూజిస్తాం. ఋషులవల్లే నేడు మనం ఈ సాంప్రదాయాన్ని అనుభవిస్తున్నాము.

ఋషులకి ఎలా సహాయం చేయాలి? వారికి ఏమీ మననుంచి సహాయం అక్కరలేదు. వారు ముక్తిని పొందారు ఇప్పటికే. వారి ఉద్దేశ్యం మనం గ్రంథాలను నాలుగు కాలాలు నిలిపి, ప్రపంచం నలుమూలలా చాటాలని. అందుకని ఆ గ్రంథాలను నాలుగు కాలాలు నిలపటానికి కాని, చాటటానికి కాని చేసే ఏ పని చేసినా గొప్ప సేవ చేసినట్టే. ఎందుకంటే శాస్త్రం మానవాళికి సేవ చేస్తుంది. శాస్త్రం అధ్యయనం చేస్తేనే శాంతి నెలకొంటుంది. అందుకే పారాయణాన్ని గొప్ప సాధనగా పరిగణిస్తాము. శాస్త్రాన్ని గట్టిగా అధ్యయనం

చేస్తేనే, ఆ శబ్దమే, ఆ వేదఘోషే, సృష్టిని పునీతం చేస్తుంది. అందుకే పారాయణం బ్రహ్మయజ్ఞంలోకి వస్తుంది.

శాస్త్రాన్ని నేర్చుకున్నా, నేర్పించినా, రెండూ మంచిపనులే. శాస్త్రబోధని అధ్యాపనం అంటారు. అధ్యాపనం చేయటం బ్రహ్మయజ్ఞంలో గొప్ప పద్ధతి.

**అధ్యాపనం బ్రహ్మయజ్ఞః।**
**పితృయజ్ఞస్తు తర్పణమ్।**
**హోమో దైవో బలిర్భూతః।**
**నృయజ్ఞోతిథిపూజనం॥**

బోధనకీ, ప్రసంగానికీ చాలా పెద్ద తేడా ఉంది. ప్రసంగం యివ్వటం అంటే చెదురుమదురుగా అక్కడక్కడా సంబంధం లేని కొన్ని విషయాలమీద ఊకదంపుడు ఉపన్యాసాలు యిచ్చుకుంటూ పోవటం. అది ఒక విధమైన సత్సంగం. ఎక్కడో ఒక చోట కూర్చుని కాసేపు నాలుగు మంచి మాటలు మాట్లాడుకోవటంలాంటిదది. ఇది కూడా ఖచ్చితంగా లాభదాయకమే కాని ఇలాంటి ప్రసంగాలకీ, ఒక క్రమపద్ధతిలో, క్లాసులు తీసుకున్నట్టు బోధన చేయటానికీ చాలా తేడా ఉంది.

బోధనలో ఒక విషయం గురించి వివరణ ఉంటుంది. ఒక అంశానికీ, ఇంకో అంశానికీ మధ్య సంబంధం ఉంటుంది. చెప్పిన అంశాలన్నిటికి శాస్త్రప్రమాణం, తర్కం, అనుభవం ఉంటాయి. అంటే శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల సహాయంతో బోధని క్రమపద్ధతిలో చేస్తే, దానికీ ప్రసంగానికీ ఏనుగుకి దోమకి వున్నంత తేడా ఉంటుంది. ప్రసంగం ఉత్సాహపరుస్తుంది. కాని బ్రహ్మయజ్ఞం అంటే బోధన. ఇది వివేకాన్నిస్తుంది.

ఉదాహరణకి ఒక ఖాళీ ప్రదేశంలో కొన్ని ఇటుకలు పడేస్తే, ఏం లాభం ఉంటుంది? వాటిని ఒక క్రమపద్ధతిలో పేర్చాలి. అలా క్రమపద్ధతిలో పేర్చి, ఇల్లు కడితే అందులో ఉండవచ్చు. చెదురుమదురు అంశాలమీద ప్రసంగాలివ్వటం, ఇటుకలని ఒకచోట పడేయటంలాంటిది. వాటిని కూర్చాలి. దానికొక మేస్త్రీ కావాలి. ఇక్కడొక గురువు కావాలి.

బోధన అంటే కేవలం అంశాలని చెప్పటం కాదు. వాటిని ఒక క్రమపద్ధతిలో అల్లి, ఆత్మజ్ఞానం కలగజేసి, భద్రత, శాంతి, ఆనందం చేకూర్చటం జరుగుతుంది.

పూర్వం గురుకులంలో ఈ బోధన జరిగేది. ఇప్పుడా గురుకుల సాంప్రదాయం అంతరించిపోతోంది. ఇప్పుడది కొంతవరకన్నా నిలిచి ఉందంటే, దానికి చిన్మయానంద స్వామీజీని, దయానంద సరస్వతి స్వామీజీని మెచ్చుకోవాలి. వారు శాస్త్రాన్ని బోధనరూపంలో మలిచారు. అంతకు ముందు ప్రసంగాలు ఎక్కువా, బోధన తక్కువా ఉండేవి. కాని

ఈ స్వామీజీలు దీన్ని విశ్వవిద్యాలయ బోధనలాగా చేశారు. భారీఎత్తున క్లాసులు పెట్టీ, బోధన చేసీ, వారిని నోట్సులు రాసుకోమనీ, వారి నోట్సులని బేరీజు వేసుకోమనీ, ప్రశ్నలడిగీ, సందేహాలు తీర్చే పద్ధతిలో బోధిస్తున్నారు. ఇవి గుడ్డిగా పాటించే కొన్ని నమ్మకాలు కాదు. ఇది ఒక శాస్త్రం. నిస్సంశయజ్ఞానం పెంపొందించాలి దీనిమీద. అందువల్ల బ్రహ్మయజ్ఞం కూడా పర ఉపకారం కిందకు వస్తుంది.

**విద్యాధనం సర్వధనప్రధానమ్॥**

రకరకాల దానాలు చేయవచ్చు గానీ, అన్నింటిలోకీ విద్యాదానం గొప్పది. అందుకే భగవద్గీత చివరిలో కృష్ణుడు చెబుతాడు, ఎవరు భగవద్గీతని బోధిస్తారో, వారిని నేను ఎక్కువ ప్రేమిస్తాను.

**5.1.1.4 మనుష్యయజ్ఞం** – నాలుగో యజ్ఞం మనుష్యయజ్ఞం. అన్ని రకాల సంఘసేవలు దీంట్లోకి వస్తాయి. అనాధశరణాలయాలకి, వృద్ధాశ్రమాలకి, స్కూళ్ళకి, ఆసుపత్రులకి సహాయం చేయటం వంటివి. కాని ఆ సహాయం ఎలా చేయాలో కూడా శాస్త్రం ఉపదేశిస్తుంది.

**శ్రద్ధయా దేయమ్**

**అశ్రద్ధయా అదేయమ్**

**శ్రియా దేయమ్**

**హ్రియా దేయమ్**

**భియా దేయమ్**

**సంవిదా దేయమ్ – తైత్తిరీయం 1.11.6**

వచ్చిన చిక్కేమిటంటే, ఇప్పుడు తక్కిన నాలుగు యజ్ఞాలు పక్కన పెట్టేసి, ఇదొక్కటీ చేస్తే చాలనుకుంటున్నారు. ఇది సరియైన అవగాహన లేక వచ్చిన సమస్య. మనుష్యులకి కేవలం కార్బోహైడ్రేట్సే చాలు అన్నట్టుంది. అందుకని మనుష్యయజ్ఞంతో పాటు, తక్కిన యజ్ఞాలు కూడా చేయాలి.

**5.1.1.5 భూతయజ్ఞం** – ఐదో యజ్ఞం, భూతయజ్ఞం.మనిషితో కూడా ఉన్న తక్కిన జీవరాశులన్నిటికీ చేసే సేవ. మన జీవితం సుగమంగా సాగటానికి తక్కిన జీవరాశులు కూడా తోడ్పడుతాయన్న విషయాన్ని మరవకూడదన్నడూ. చెట్లూ, జంతువులూ, నదులూ మనకు తోడ్పడుతున్నాయి.

**అశ్వత్థో వటవృక్షచన్దన తరుర్మన్దారకల్పద్రుమౌ।**
**జమ్బూ నిమ్బకదమ్బచూతసరలా వృక్షాశ్చ యక్షీరిణః।**
**సర్వే తే ఫలసంయుతాః ప్రతిదినం రాజన్తి యత్రానిశమ్।**
**రమ్యం చైత్రరథం చ నన్దనవనం కుర్వన్తు నో మఙ్గలమ్॥**

అశ్వత్థ, కదంబ, మందార, సరుగుడు చెట్లనీ, పండ్లిచ్చే జామ, మామిడిలాంటి చెట్లనీ, చైత్రవనాన్నీ, తోటనీ అవి చేసే సహాయాన్నీ నేను గుర్తుంచుకుని అవి మానవాళికి మంగళం చేకూర్చేలాగా పెంచి పోషించాలి.

**గఙ్గా సిన్ధు సరస్వతీ చ యమునా గోదావరీ నర్మదా।**
**కావేరీ సరయూ మహేన్ద్రతనయా చర్మణ్వతీ వేదికా।**
**క్షిప్రా వేత్రవతీ మహాసురనదీ ఖ్యాతా చ యా గణ్డకీ।**
**పూర్ణా పూర్ణజలైః సముద్రసహితాః కుర్వన్తు నో మఙ్గలమ్॥**

ఇదే విధంగా గంగ, యమున, గోదావరి, నర్మదవంటి ప్రవహించే నదులు చేసే సహాయాన్ని గుర్తుంచుకుంటాను. వాటికి నేను తిరిగి సహాయం చేయలేకపోయినా కనీసం వాటిని కలుషితం చేయను, నాశనం చేయను. భారీ ఎత్తున చేయలేకపోయినా, ఇంట్లో తులసిచెట్టు పెట్టుకోవాలి మనం. దానికి భక్తిగా నీళ్ళు పోయాలి. అలాగే జంతువులన్నింటికీ మేలు చేయలేకపోవచ్చు, కాని తినేముందు కొంచెం అన్నం ముద్ద బయటపెడితే కాకులో, ఆవులో తింటాయి దాన్ని.

ఇది సంపూర్ణమైన అవగాహన. వైదికుడు అంటే విశ్వానికి చెందిన పౌరుడు. ఎందుకంటే అతను ప్రపంచం గురించి, నక్షత్రాల గురించి తెలిసినవాడు. సన్ధ్యావన్దనం చేసేటప్పుడు అన్ని గ్రహాలకు ఆవాహన చెబుతాడు.

**ఆదిత్యం తర్పయామి॥**
**సోమం తర్పయామి॥**
**అఙ్గారకం తర్పయామి॥**

మొత్తం సౌరమండలాన్ని గుర్తుకు తెచ్చుకుంటాడు.

ఈ పంచమహాయజ్ఞం చేయటాన్నే నిష్కామకర్మాణి, సాత్విక కర్మాణి, ఉత్తమకర్మాణి, పర ఉపకారకర్మాణి అంటారని చూసాం. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకి ప్రాథమికంగా తోడ్పడుతుంది.

**5.1.2 మధ్యమకర్మాణి** – ఈ రకం కర్మలు సకామకర్మలు (కోరికతో చేసేవి). వీటిని రాజసకర్మాణి, పర ఉదాసీనకర్మాణి అని కూడా అంటారు. పర ఉదాసీనకర్మాణి అంటే

ఎవరెలా పోతే నాకేం అని యితరులని పట్టించుకోకపోవటం. వారి సమస్యలని, వారి ఉనికినే ఖాతరు చేయము. మన కోరిక తీరితే చాలు, అంతే. ఇలాంటి కర్మలు ప్రాపంచిక సౌఖ్యం తెచ్చిపెడతాయి కాని ఆధ్యాత్మిక ఎదుగుదలకి ఏమాత్రం తోడ్పడవు.

**5.1.3 అధమకర్మాణి** – వీటిని తామసకర్మాణి, నిషిద్ధకర్మాణి, పర అపకారకర్మాణి అని కూడా అంటారు. వీటి కింద చేయకూడని కర్మలు లేదా వినాశనకారి కర్మలు వస్తాయి. మనకు లాభం కలుగుతుంది కాని ఎదుటి వారికి హానికరమైన ఈ కర్మలు మనకు ఆధ్యాత్మికంగా ఎదుగుదల చేకూర్చకపోగా, ఇంకా కిందకి దిగజారుస్తాయి.

ఆ విధంగా మొదటిది ఆధ్యాత్మిక పురోగతి కలగజేస్తే, రెండోది ఆధ్యాత్మిక స్థబ్దత కలగజేస్తే, మూడోది ఆధ్యాత్మిక తిరోగతిని కలుగజేస్తుంది. కర్మయోగి తను చేసే కర్మలలో ఉత్తమకర్మలు ఎక్కువగానూ, మధ్యమకర్మలు తక్కువగానూ, అధమకర్మలు శూన్యంగానూ ఉండేటట్టు మలచుకోవాలి. అధమకర్మలు తప్పనిసరి పరిస్థితుల్లో చేసినా అంటే పర అపకారకర్మలు చేసినా, వాటిని ఉత్తమకర్మలతో తుడిచివేయాలి. ఆ విధంగా ఉత్తమకర్మలు రెండు విధాలుగా పనిచేస్తాయి. ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడుతాయి, తప్పనిసరి కర్మలనుంచి పుట్టిన పాపాన్ని తుడిచివేస్తాయి.

### 5.2 సరియైన దృక్పథం

ఏ దృక్పథమైనా సరియైన అవగాహనవల్ల ఏర్పడుతుంది. జీవన సూత్రాలని అర్థం చేసుకోందే ఆరోగ్యకరమైన చిరకాల దృక్పథం ఏర్పడదు.

మనం ఏ పనిచేసినా, అది జగత్‌లో ఒక భాగమవుతుంది. అంటే మన చేయి దాటిపోతుంది. ఎప్పుడైతే కర్మ జగత్‌లో ఒక భాగమవుతుందో, అప్పుడు మన కర్మలమీద జగత్‌సూత్రాలు పనిచేస్తాయి. ఎందుకంటే జగత్ మొత్తం ఆ సూత్రాలమీద నడుస్తుంది.

అలా ప్రక్రియవల్ల వచ్చే కర్మని ఫలం అంటారు. అలా ప్రతి కర్మా ప్రాసెస్ అయి, ఫలంగా మనకు తిరిగి వస్తుంది. జగత్‌సూత్రాలు పరమాత్మ చేతిలో పరికరాలు. అందువల్ల కర్మ, సూత్రాలవల్ల ప్రాసెస్ అయిందీ అంటే అర్థం, పరమాత్మ ఆ ప్రాసెసింగ్ చేస్తున్నాడని. అందువల్ల కర్మ దేవుని దగ్గరకి వెళ్ళి, ఫలం రూపంలో తిరిగి వస్తోంది.

ఎప్పుడైతే ఈ నిజం తెలుసుకుని, దాన్ని గుర్తుంచుకుంటామో, అప్పుడే ప్రతికర్మనీ ఈశ్వర అర్పణగా చేస్తాము. జ్ఞానోదయం పొందిన కర్మయోగికి ప్రతి కర్మా ఈశ్వరార్పణే. ఈ ఎఱుకని **ఈశ్వరార్పణభావన** అంటారు. ఈశ్వరార్పణ భావనతో చేస్తే, పరమాత్మనుంచి వచ్చిన ఫలాన్ని కర్మఫలం అనకుండా **ఈశ్వరప్రసాదం** అంటాం. ఎందుకంటే దేవుణ్ణుంచి వచ్చేది ఏదైనా ప్రసాదమే. అందుకని దాన్ని విమర్శించలేము, వ్యతిరేకించలేము.

కర్మ చేసేటప్పుడు ఈశ్వరార్పణభావంతో చేసి, కర్మఫలాన్ని ఈశ్వరప్రసాదభావనతో స్వీకరించటమే యోగం. ఈ రెండు భావనలూ ఉంటే మనసు ప్రశాంతంగా ఉంటుంది. **సమత్వం యోగ ఉచ్యతే.** అన్ని పనులూ ఉత్సాహంగా చేస్తాము. విసుగు గాని, చిరాకు గాని పుట్టదు. ఈశ్వరార్పణభావన, ప్రసాదభావనలనుంచి పుట్టిందే సమత్వభావన. మొదటి రెండు భావనలూ కలిసి ఆధ్యాత్మిక ఎదుగుదల వేగంగా చేస్తాయి. దీన్ని చిత్తశుద్ధి అంటారు.

చిత్తశుద్ధిని తేలిగ్గా వివరించాలంటే – జీవితంలో మనకున్న సమస్యలు ప్రపంచంవల్ల ఏర్పడినవి కావు, మన అజ్ఞానంతో, మనం ప్రపంచాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటంవల్ల ఏర్పడినవి అని అర్థం చేసుకోవటం. అజ్ఞానిగా నేను ప్రపంచంలో సరిగ్గా వ్యవహరించక అవస్థ పడుతున్నాను. నేను జ్ఞాని అయితే నందనవనం అయిన ప్రపంచంతో ఎలా వ్యవహరించాలో నాకు తెలుస్తుంది. సంపూర్ణం జగదేకనందనవనం. అంటే అజ్ఞాని–నేను సమస్య. జ్ఞాని–నేను పరిష్కారం. కర్మయోగంవల్ల అర్థమౌతుంది ఇది. దీన్నే చిత్తశుద్ధి పొందటం అంటారు.

# 06. ఉపాసనాయోగం

వైదికులు పొందాల్సిన నాలుగు లక్ష్యాలనూ, అందులో అంతిమ లక్ష్యమైన మోక్షం గురించీ చూశాము. అవి పొందటానికి వారు పాటించాల్సిన మార్గాలను మూడు విధాలుగా విభజించవచ్చు. అవి – 1. కర్మయోగం 2. ఉపాసనాయోగం 3. జ్ఞానయోగం

ఇంతకుముందు కర్మయోగం గురించి చూసాము. కర్మయోగం అంటే అంతర్గత ఎదుగుదలకి తోడ్పడేటట్లు పనులు చేయటం. ప్రాపంచిక సుఖాలకోసం పాటుపడకుండా ఆధ్యాత్మిక ఎదుగుదలకి పాటుపడాలి. దృక్పథంలో మార్పు వస్తే, అకర్తా, అభోక్తాగా పనులు చేయవచ్చు. దీన్ని భగవద్గీతలో మూడవ అధ్యాయంలో వివరంగా చూడవచ్చు.

ఇక ఉపాసనాయోగం విషయానికి వస్తే శంకరాచార్యులవారు దీన్ని సమాధియోగం అని కూడా అంటారు. మోక్షపురుషార్థం సాధించటానికి మన వ్యక్తిత్వాన్ని సంసిద్ధం చేయటమే ఉపాసనాయోగం ఉద్దేశ్యం అంటే పురుషార్థయోగ్యతా సంపాదనార్థం. మన జీవిత అంతిమలక్ష్యం మానవ లక్ష్యాలను సాధించే నిరంతరప్రయాణం కాబట్టి, ఉపాసనని, యోగ్యత సంపాదించే కార్యక్రమంగా అభివర్ణించవచ్చు.

కఠోపనిషత్తులో, మన లక్ష్యసాధన విషయంలో మనను ఒక రథంతో పోల్చారు. ఎలాగైతే ప్రయాణంచేసి, గమ్యం చేరటానికి వాహనం మంచి స్థితిలో ఉండాలో, అలా మన శరీరం కూడా మంచి స్థితిలో ఉండాలి. అందుకని, శాస్త్రం మన శరీరాన్ని కొన్ని భాగాలుగా విభజించింది. శరీరనిర్మాణం క్లిష్టంగా ఉండి, ఒక్కసారిగా మనకు అర్థంకాదు కాబట్టి దాన్ని అర్థం చేసుకునేందుకు వీలుగా వివిధ విభాగాలుగా విభజించింది. ఒక కోణంలోంచి కోశపంచకం అంది. ఇంకో కోణంలోంచి శరీరత్రయం అంది. మన అధ్యయనంకోసం మన శరీరాన్ని మూడు భాగాలుగా విభజించింది. ఇది శాస్త్రప్రకారం జరిగింది కాబట్టి, చాలా యోగ్యమైన విభజనగా పరిగణించాలి.

1. కాయిక అంశ – భౌతిక శరీరం
2. వాచిక అంశ – వాక్కు
3. మానసిక అంశ – మనసు

శరీరం ద్వారా లక్ష్యాన్ని పొందుతాము. వాక్కు మన వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. మనస్సు అంతకన్నా క్లిష్టమైనది, కాని అత్యంత ముఖ్యమైనది కావటంతో దాన్ని నిర్లక్ష్యం చేయలేము. శాస్త్రం ఈ మూడు భాగాలను నియంత్రించేందుకు కార్యక్రమాలను నిర్దేశించింది.

### 6.1 కాయిక అంశ

మొదటి భాగం భౌతిక శరీరం లేదా స్థూలశరీరం. స్థూలశరీరంవల్లనే మన లక్ష్యాలని– ప్రాపంచిక లక్ష్యాలని లేదా ఆధ్యాత్మిక లక్ష్యాలని – సాధించగలమని మనకు తెలుసు కాబట్టి యిది చాలా ముఖ్యమైనది. అందుకే శాస్త్రం శరీరాన్ని గానీ, శరీర ఆరోగ్యాన్ని కాని నిర్లక్ష్యం చేయవద్దని చెబుతుంది.

ఉదా: మందులు వేసుకునే ముందు ఈ మంత్రం చెపుతాం.

**శరీరే జర్జరీ భూతే వ్యాధిగ్రస్తే కళేవరే।**
**ఔషధం జాహ్నవీ తోయం వైద్యో నారాయణో హరిః॥**

శరీరం అవస్థపడుతున్నప్పుడు, శరీరానికి వ్యాధి సోకినప్పుడు తీసుకునే మందు పవిత్రమైన గంగాజలం, వైద్యుడు సాక్షాత్తు నారాయణుడు.

శరీరం గురించిన ప్రార్థన కేవలం ప్రాపంచిక లక్ష్యాలను బోధించే వేదపూర్వభాగంలోనే కాదు, ఆధ్యాత్మిక చింతన పెంచే వేదాంత భాగంలో కూడా శాంతిపాఠాల రూపంలో ఉంది. శారీరక ఆరోగ్యం యివ్వమనీ, ఏకాగ్రత కుదర్చమనీ కోరుతాయి అవి. కాని దురదృష్టవశాత్తు, మనం ఏదో ఒక రోగం బారిన పడేవరకూ, ఆరోగ్యాన్ని లెక్క చేయము. అనారోగ్యం వచ్చాక నయం చేయించుకునే దానికన్నా, ఆరోగ్యం గురించి ముందు జాగ్రత్త తీసుకోవటం చాలా తేలిక. ముందు జాగ్రత్త తీసుకోవటానికి అట్టే సమయం కానీ, డబ్బు గానీ వ్యయం చేయనక్కరలేదు. కాని ఒకసారి ఆరోగ్యం కోల్పోయామో దాన్ని తిరిగి తెచ్చుకోవటానికి బోలెడు డబ్బూ, సమయమూ వెచ్చించాల్సి ఉంటుంది. ఆరోగ్యం కాపాడుకోవటానికి సమయం లేదంటే, అనారోగ్యాన్ని పారద్రోలటానికి బలవంతంగా సమయం వెచ్చించాల్సి ఉంటుంది. శరీరసంరక్షణని శరీరపోషణగా పొరపాటుపడకూడదు. శరీరసంరక్షణే లక్ష్యంగా ఉన్నప్పుడు, లేదా అనవసరమైన లక్ష్యాలకు శరీరాన్ని వినియోగించినప్పుడు, అది శరీరపోషణ అవుతుంది. అందువల్ల మామూలు సంరక్షణని సాధనలు అంటారు.

### 6.2. వాచిక అంశ

వ్యక్తిత్వంలోని రెండో అంశ వాచిక అంశ. ఇది కూడా చాలా ముఖ్యమైన అంశం. వివేకచూడామణిలో శంకరాచార్యులు చెప్పారు:

**యోగస్య ప్రథమం ద్వారం వాక్ నిరోధో పరిగ్రహః నిరాశా చ నిరీహా చ।**

కృష్ణుడు భగవద్గీత, పదిహేడవ అధ్యాయంలో వాచిక తపస్సుకి నాలుగు అంశాలను సూచించాడు.

**6.2.1 అనుద్వేగకరం –** బాధించనిది – మన మాటలు ఎవరినీ బాధించకుండా ఉండేటట్టు చూసుకోవాలి. మాటల స్థాయిలో అహింసని పాటించటం మొదటిమెట్టు. తిట్టటం, విమర్శించటం, నిందించటం, కించపరచటం, వాదించటంలాంటివన్నీ హింసకింద వస్తాయి.

ఏది బాధిస్తుందో ఎలా తెలుసుకోవాలి? దానికి ఒకటే మార్గం ఉంది. మనని ఎవరైనా ఏది అంటే మనని బాధిస్తుందో, అది ఎదుటివారిని కూడా బాధిస్తుంది. ఏది బాధిస్తుందో అది అనకుండా ఉండటానికి ప్రయత్నించాలి. అలా కుదరని పక్షంలో కనీసం బాధించే అంశాన్ని తగ్గించాలి, శరీరాన్ని కోసేముందు బాధ తెలియకుండా ఉండటానికి డాక్టరు మత్తుమందు యిచ్చినట్టుగా.

**6.2.2 సత్యం –** నిజం – సత్యం అంటే నిజం చెప్పటం. బ్రహ్మ లేదా దేవుని చేరుకోవటానికి అత్యంత ముఖ్యమైన నియమం ఇది. సత్యం చెప్పటం ద్వారా మనం అంతిమ సత్యమైన బ్రహ్మను చేరుకోవచ్చు.

ప్రాపంచిక స్థాయిలో సత్యం చెబితే, ఆధ్యాత్మిక స్థాయిలో సత్యానికి చేరువవచ్చు. ప్రాపంచిక సత్యం వాచిక తపస్సు, ఆధ్యాత్మిక సత్యం భగవానుడు, అందువల్ల మనమాడే ప్రతి అబద్ధమూ మనను దేవునికి దూరం చేస్తోంది.

అసతోమా సద్గమయ – ఓ దేవా! నన్ను అసత్‌కి దూరం చేయి. ఎటువంటి అసత్యమాడినా ప్రతి అసత్యమూ మనను భగవంతునికి దూరం చేస్తుంది. మన మనస్సును ఎంతగా సున్నితపరచుకోవాలంటే, మనం చెప్పే ప్రతి ఒక్క అబద్ధమూ మనను బాధించి, ఆ బాధ చిరకాలం ఉండేలా చేయాలి. అబద్ధం ఆడటంవల్ల కలిగే బాధ ముందు, అది ఆడితే కలిగే లాభం వీగిపోవాలి. అప్పుడు మన ప్రమేయం లేకుండానే మనం అసత్యమాడటం మానేస్తాము. తప్పనిసరి పరిస్థితిలో ఆడాల్సిన అబద్ధాలవల్ల కలిగే పాపాన్ని కొంతమేరకు ప్రాయశ్చిత్తంవల్ల తగ్గించుకోవచ్చు.

**6.2.3 ప్రియం –** మృదువుగా – వాక్ తపస్సులో మూడో అంశం యిది. దీనర్థం మన వాక్కు ప్రియంగా ఉండాలి. అంటే సున్నితంగా, మృదువుగా, మర్యాదగా, వినయంగా ఉండాలి. అంటే మంగళశబ్దాలు ఉండాలి. అమంగళశబ్దాలు విడిచిపెట్టాలి.

**6.2.4 హితం –** ఇష్టం – మనం మాట్లాడేది వినే వ్యక్తికి హితంగా ఉండాలి. అంటే అతనికి యిష్టంగా ఉండాలి. అత్యంత దారుణమైన హింసల్లో ఒకటి, మనం చెప్పేదానిమీద శ్రద్ధలేనివానితో మాట్లాడాల్సి రావటం. భరించలేని నిజం, సాధారణంగా, ఎవరికీ ఎదుటివారు చెప్పేది వినే ఓపిక ఉండదు.

**6.3 మానస అంశ**

మూడవ స్థాయి మానస అంశ అంటే మనస్సును నియంత్రించుకునే కార్యక్రమం.అన్నిరకాల ధ్యానాలూ మానస తపస్సు క్రిందకి వస్తాయి. కాని ధ్యానం ఒక్కటే మానస తపస్సుకి చాలదు. ప్రాథమికంగా ఉపాసన అంటే మానస తపస్సుకు చేసే ధ్యానం. కాని శరీరాన్ని, వాక్కును నియంత్రించందే మనసును నియంత్రించలేము కాబట్టి, కాయిక, వాచిక తపస్సులను మానసిక తపస్సుకు తొలిమెట్టుగా భావిస్తాము. ఎందుకంటే మనస్సు సూక్ష్మమైనది. తేలికగా అదుపులో పెట్టలేనిది. అందువల్ల ముందు శరీరాన్ని, వాక్కును అదుపులో పెట్టుకోవాలి. ఇవి తరువాత మనస్సును నియంత్రించటానికి పరోక్షంగా పనికొస్తాయి.

అందుకే ఏ ధ్యానయోగ కార్యక్రమమున్నా దాంట్లో కాయిక, వాచిక తపస్సులు కూడా ఉంటాయి. అష్టాంగయోగంలో కూడా పతంజలి ముఖ్య ఉద్దేశం మానసతపస్సే అయినా కాయిక, వాచిక తపస్సులను కూడా ప్రస్తావిస్తాడు. భగవద్గీతలో ఆరవ అధ్యాయం పేరు ఆత్మసంయమయోగం అయినా కృష్ణభగవానుడు ఆహారనియమాలని గురించి కూడా మాట్లాడుతాడు. మనస్సు,వాక్కులకు సంబంధమున్నట్టుగా, మనస్సుకు, శరీరానికి కూడా సంబంధముంది. అందుకే విపరీతమైన కోపం వచ్చినప్పుడు నిదానంగా, మర్యాదగా ఉండటం కష్టం. అందుకని ఉపాసన అంటే ప్రాథమికంగా మానస తపస్సు. పరోక్షంగా కాయిక, వాచిక తపస్సు.

మన వీలుకోసం, అన్ని రకాల ధ్యానాలనీ నాలుగు రకాలుగా విభజించవచ్చు మన మనసులో మనం పెంపొందించుకోవాలనుకుంటున్న అంశాన్నిబట్టి.

**6.3.1 విశ్రాన్తిధ్యానం** – ఈ ధ్యానంలో ముఖ్యంగా మనసుని విశ్రాంతిపరచటం ఉన్నా, మన శరీరభాగాలని కూడా విశ్రాంతి పరుస్తాము. ఇందులో శారీరక విశ్రాంతి, వాచిక విశ్రాంతి, ఇంద్రియ విశ్రాంతి యిస్తాము. అప్పుడు చివరికి మనసుకి విశ్రాంతి లభిస్తుంది. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి తగ్గించుకోవటానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. అందుకని విశ్రాంతి ధ్యానాన్ని ఒత్తిడి నిర్మూలించే ధ్యానం అని కూడా అనవచ్చు. ప్రతిరోజూ కాసేపు విశ్రాంతిగా కూర్చోవటం సాధన చేయండి. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా అవసరం. దీనికి ఏ పద్ధతి అన్నా వాడవచ్చు. ఉదాహరణకి ఒక మంత్రాన్ని జపించటమో, మీ శ్వాసమీద ధ్యాస పెట్టటమో, లేదా కేవలం శాంతిః అనటమో చేయవచ్చు.

**6.3.2 ఏకాగ్రతాధ్యానం** – ఈ ఏకాగ్రత ధ్యానంలో మనస్సును ఒక దానిమీద కేంద్రీకరించటం. కేంద్రీకరించే సమయాన్ని పెంచటం సాధన చేస్తాము. ప్రాపంచిక

విషయంమీద కానీ, ఆధ్యాత్మిక విషయంమీద కాని కొంత నియమిత కాలపరిమితి వరకూ ఏకాగ్రత కలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

దీనికి మన శాస్త్రంలో మూడు పద్ధతులు సూచించబడ్డాయి.

మానసపూజ – షోడశోపచార పూజ చేయటం

మానసపారాయణం – ఏ ప్రార్థన అన్నా చేయటం

మానసజపం – ఏదో ఒక నామం తీసుకుని జపం చేయటం.

**6.3.3 విశాలదృక్పథ ధ్యానం** – ఇందులో సృష్టిమొత్తాన్ని ఊహించుకుంటాము. అప్పుడే అనంత విశ్వంలో మనం చాలా, చాలా చిన్నవారమని – దాదాపు సున్నాతో సమానమని అర్థమవుతుంది. మనకేదో మన జీవితం గురించి, పరిస్థితుల గురించి తలకి మించిన భావాలున్నాయి. మన సమస్యలే అంతర్జాతీయ సమస్యలంత పెద్దవనీ, మనం లేకపోతే ప్రపంచం తల్లకిందులై పోతుందనీ తెగ ఊహించేసుకుంటాం. అలాంటి తప్పుడు ఆలోచన, దేని స్థానంలో అది ఉండాలనే తప్పుడు ప్రతిస్పందనలకి దారి తీస్తుంది. మన స్థానం విశ్వంలో ఎక్కడుందో మనకొక అవగాహన ఉండాలి. సృష్టినంతా ఊహించుకోవాలి. ఆకాశం, నక్షత్రకూటమి, సౌరకుటుంబం, గ్రహాలు, ఖండాలు, నదులు, కొండలు, పక్షులు, జంతువులు, మనష్యులు. దీన్ని విశ్వరూపధ్యానం అంటారు. ఇందులో సృష్టి ప్రకరణం ఉంటుంది.

**6.3.4 విలువల ధ్యానం** – దీన్ని మార్పు ధ్యానం అని కూడా అంటారు. ఇక్కడ మన ఆలోచనా తీరుని మార్చటంవల్ల, మనం సంపూర్ణంగా అంతర్గతంగా మారుతాము. మనం సాధారణంగా మన ఆలోచనా తీరుని పట్టించుకోము. ఎందుకంటే, అది చాలా సూక్ష్మంగా ఉంటుంది, క్షణంలో మాయమవుతుంది. తక్కిన వారు చూడలేరు. కాని మన ఆలోచనా తీరు మన జీవితాన్ని, మన గమనాన్ని, మన లక్ష్యాన్ని నిర్ణయిస్తుందన్న విషయం మర్చిపోకూడదు.

**మీ ఆలోచనలను గమనించండి, అవి మీ మాటలవుతాయి**

**మీ మాటలను గమనించండి, అవి మీ కార్యాలవుతాయి**

**మీ కార్యాలను గమనించండి, అవి మీ అలవాట్లవుతాయి**

**మీ అలవాట్లను గమనించండి, అవి మీ నడవడిక అవుతుంది**

**మీ నడవడికను గమనించండి, అది మీ గమ్యం అవుతుంది**

అందుకని మీ ఆలోచన, మీ భవిష్యత్తుని నిర్ణయించే సూక్ష్మమైన బీజం. **యద్భావం తద్భవతి** – మీరెలా ఆలోచిస్తే, అది అవుతారు.

### 6.3.4.1 దైవీసమ్పత్తి, ఆసురీసమ్పత్తి

ఆలోచనాతీరు మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కాబట్టి, దానిని మార్చుకోవటం చాలా అవసరం. భగవద్గీత 16వ అధ్యాయంలో ఆధ్యాత్మిక లక్ష్యం వైపు తీసుకెళ్ళే దైవీసమ్పత్తి గురించి వుంది. లక్ష్యాన్నుంచి దూరం చేసేది ఆసురీసమ్పత్తి.ఆసురీసమ్పత్తిలో ఈర్ష్య, ద్వేషం, అసహనం, చిరాకులాంటి లక్షణాలు ఉంటాయి.

ఇవన్నీ కూడా మళ్ళీ ఆలోచనలే. ఆలోచనలు ఇటుకలలాంటివి. ఒక భవంతి ఆకారం, ఆ ఇటుకలను పేర్చిన పద్ధతివల్ల ఏర్పడుతుంది. భవంతి రూపు మార్చాలంటే, ఇటుకల అమరిక మార్చాలి. అంతే. అలాగే మన ఆలోచనా తీరుని మార్చుకుని, 'నాకు ఓపిక ఉంది. నేను నా జీవితాన్ని ఎదుర్కోగలనన్న నమ్మకం ఉంది,' అనుకోవాలి. దాని బదులు, 'నాకేం తెలియదు, నేను అసమర్థుణ్ణి,' అనుకుంటాం. మామూలుగా, ఈరోజుల్లో రోగాలు కూడా కేవలం ఆరోగ్యం కోరుకోవటంవల్ల నయమవుతున్నాయి. మనస్సు శక్తివంతమైన పరికరం. దానికి అఖండమైన సంకల్పబలం, దృఢనిశ్చయశక్తి ఉన్నాయి. ఈ విలువల ధ్యానంలో ఈ సంకల్పబలాన్ని పెంచుకుంటాం. ఇది నాలుగో విధమైన ధ్యానం.

ఈ నాలుగు రకాల ధ్యానాలూ మన మనస్సును నియంత్రించి, దాన్ని ఆరోగ్యవంతం చేసి, పురుషార్థప్రాప్తికి అర్హులని చేస్తాయి.

## 6.4 శరీరం, వాక్కు, మనస్సుల సమిష్టి కృషి

శరీరం, వాక్కు, మనస్సులు ఆరోగ్యంగా ఉండాలి నిజమే, కాని అవి విడివిడిగా ఆరోగ్యంగా ఉంటే చాలదు. అవి సమష్టిగా పనిచేయాలి. అందువల్ల వాటిని నియంత్రించటమే కాదు, వాటి మధ్య సమభావం పెంపొందించాలి. ఒకటొక దారీ, యింకోటి యింకోదారీ పోకూడదు. నిజానికి మనం ఒక అబద్ధం చెప్పినప్పుడల్లా, వాక్కుకు, మనస్సుకు మధ్య విబేధం సృష్టించి, వాటి మధ్య సమభావం లేకుండా చేస్తున్నాము. మూడింటినీ ఒక త్రాటిమీద నడిపించటాన్ని ఆర్జవం అంటారు. శరీరం, వాక్కు, మనస్సులను విడివిడిగా అదుపులో పెట్టటానికీ, వాటి మధ్య సమభావం పెంపొందించటానికీ శాస్త్రం సూచించిన మార్గం ఉపాసనాయోగం. దీన్నే సమాధియోగం అనీ, అష్టాంగయోగం అని కూడా అంటారు.

కర్మయోగం, ఉపాసనాయోగాల్లో ఏది ముందు, ఏది వెనుక అనటానికి లేదు. ఒక్కో సందర్భంలో ఒక్కోదానిమీద ఎక్కువ ధ్యాసపెట్టవచ్చు. అన్నీ సమానంగా ముఖ్యమే. కర్మయోగం, ఉపాసనాయోగంలో నిష్ణాతులయ్యాక, మనం మూడోదీ, అత్యంత ముఖ్యమైనదీ అయిన జ్ఞానయోగంలోకి అడుగుపెడదాము.

# 07. జ్ఞానయోగం

శాస్త్రం మనిషి కోరే నాలుగు పురుషార్థాలను వివరించి, వాటిని సాధించటానికి మూడు పద్ధతులను సూచించింది. అవి కర్మయోగం, ఉపాసనాయోగం, జ్ఞానయోగం. ఇప్పుడు జ్ఞానయోగం గురించి చూద్దాం.

**7.1 జ్ఞానయోగం - జ్ఞానప్రాప్త్యర్థం యోగః** - జ్ఞానయోగం అంటే జ్ఞానసముపార్జనకు వాడే పద్ధతి. సహజంగా ఒక ప్రశ్న ఉదయిస్తుంది. దేని గురించిన జ్ఞానం? ఎందుకంటే జ్ఞానం ఒక వస్తువుకి సంబంధించినది ఎప్పుడూ. జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానం, మనని గురించి మనం తెలుసుకోవటం.

మనని గురించి మనం తెలుసుకోవటం అంటే మనకు ఇప్పటికే మన గురించి కొంత తెలుసు - మన ఎత్తు, మన బరువు, మన తల్లిదండ్రులు, మన పుట్టుమచ్చలు మొదలైనవి. అంటే మన గురించి పైపైన తెలుసు. కాని జ్ఞానయోగం అంటే మన గురించిన ముఖ్యమైన విషయం లేదా అసలు విషయం తెలుసుకోవటం. దాన్ని అసలు నేను, ఉన్నతమైన నేను అనవచ్చు. దాన్ని పరాప్రకృతి అంటారు. శాస్త్రంలో అసలు నేనుని ఆత్మ అంటారు. కాబట్టి జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానయోగం.

**7.2 ప్రయోజనం - మోక్షపురుషార్థం**

జ్ఞానయోగం అత్యుత్తమ పురుషార్థమైన మోక్షాన్ని పొందటానికి ఉపయోగపడుతుంది. జ్ఞానయోగం - మోక్షపురుషార్థం.

**7.3 మోక్షం**

దీని గురించి పురుషార్థముల గురించి తెలుసుకున్నప్పుడు చూశాం. దానికి అనేక నిర్వచనాలున్నాయి. కాని మనం పురుషార్థాలలో చూసిన అర్థాన్ని మరి ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాం. మోక్షం అంటే బంధకత్వం లేదా ఆధారపడటంనుంచి స్వేచ్ఛ పొందటం. దేనితో బంధం? తక్కినమూడు పురుషార్థాలూ అయిన ధర్మ, అర్థ, కామాలతో బంధం.

**7.3.1 రెండురకాల బంధం** - ఒక వస్తువు గాని, వ్యక్తి గాని ఎదురుగుండా ఉంటే భారం అవుతుంది. ముఖ్యంగా తోటి మనుష్యులతో ఏర్పడే సంబంధ బాంధవ్యాలలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

అలాగని ఎవరూ లేకపోతే ఒంటరితనం వేధిస్తుంది. జీవితం శూన్యంగా అనిపిస్తుంది. ఉంటే ఒక బాధ లేకపోతే మరొక బాధ. మనకు మనుష్యులు కావాలా వద్దా అన్నది తేల్చుకోలేకపోతున్నాం. ఒక్కోసారి ఏదైనా ఆశ్రమానికి పారిపోదామా అనిపిస్తుంది. పిల్లలు

ఎదురుగా ఉంటే తలనొప్పి, దూరంగా ఉంటే గుండెనొప్పి అని సామెత. ఇలాంటి పాశాన్ని **ఉభయతః పాశా రజ్జుః** అంటారు.

మోక్షం అంటే ఈ రెండు బంధాలూ ఉండవు. మనిషి ఎదురుగా ఉంటే ఒత్తిడికి లోనవటమూ ఉండదు. దూరమయితే శూన్యతా భావమూ ఉండదు. 'నాకొక తోడు కావాలి' అన్న తపన ఉండదు. ధర్మార్థకామాలు ఉన్నా, లేకపోయినా తేడా ఉండదు. దీన్ని స్వేచ్ఛ అంటారు.

### 7.4 అంతర్గత స్వేచ్ఛలో మూడు సద్గుణాలు

ప్రశాంతత పెంపొందించుకోవటానికి ఆంగ్లంలో ఒక ప్రార్థన ఉంది. దాని సారాంశం ఇది –

**ఓ దేవా! జీవితంలో మార్చలేనివాటిని అంగీకరించగలిగేటందుకు, నాకు సమత్వం ప్రసాదించు. జీవితంలో మార్చగలిగినవాటిని మార్చేటందుకు, నాకు ధైర్యం ప్రసాదించు. జీవితంలో ఏవి మార్చగలనో, ఏవి మార్చలేనో తెలుసుకునేటందుకు, నాకు వివేకం ప్రసాదించు.**

అంటే మూడు సద్గుణాలు కోరుతున్నాము – సమత్వం, ధైర్యం, వివేకం. ఇక్కడ మార్చలేనిది అంగీకరించటం అంటే నోరు మూసుకుని భరించడం కాదు అర్థం. మార్చలేని దాన్ని భరించాలన్న ఆంగ్ల సామెత ఉంది కాని ఇక్కడ మనం కోరే సమత్వం చిరునవ్వుతో అంగీకరించే సానుకూలత. ద్వేషం పెంపొందించనిది, అన్యాయం జరిగిందనిపించనిది కోరుతున్నాము. ఒప్పుకోవాల్సిన చోట ఆరోగ్యకరంగా ఒప్పుకోవటం, మార్చగలిగినచోట ధైర్యంగా మార్చగలగడం, వివేకంతో ఏది ఏదో తేల్చుకోవటం.

### 7.5 జ్ఞానసముపార్జన విధానం

ఏ జ్ఞానం సంపాదించాలన్నా కూడా దానికి ఒకటే పద్ధతి ఉంది. జ్ఞానసముపార్జనకు ఒకపరికరం కావాలి. దాన్ని సంస్కృతంలో ప్రమాణం అంటారు.

| | | |
|---|---|---|
| నేర్చుకునే వ్యక్తి | – | ప్రమాత |
| వాడే పరికరం | – | ప్రమాణము |
| నేర్పబడే అంశం | – | ప్రమేయము |
| పొందే జ్ఞానం | – | ప్రమా |

అంటే ఒక ప్రమాత, ఒక ప్రమాణం ద్వారా, ఒక ప్రమేయం గురించిన ప్రమా పొందుతాడు. ఉదాహరణకు ఒక వ్యక్తి రంగు గురించి తెలుసుకోవాలంటే కన్ను, శబ్దం గురించి తెలుసుకోవాలంటే చెవి ఉపయోగిస్తాడు.

**7.5.1 ఐదు ప్రమాణాలు** – శాస్త్రం ప్రమాణం గురించి విపులంగా చర్చించి, ఐదు ప్రమాణాలు మనకందుబాటులో ఉన్నాయి అంది. ఐదు ప్రమాణాలు మనుష్యులకు అందుబాటులో ఉండటంవల్ల వాటిని పంచపౌరుషేయప్రమాణాలని అంది.

ఆ ఐదు ప్రమాణాల పేర్లు తెలుసుకుంటే చాలు, వివరాలు సందర్భం వచ్చినప్పుడు నేర్చుకోవచ్చు.

1. ప్రత్యక్షప్రమాణము, 2. అనుమానప్రమాణము, 3. అర్థాపత్తిః, 4. ఉపమానము, 5. అనుపలబ్ధిః.

ఈ ఐదు ప్రమాణాలను ఆచరణకు వీలుగా రెండుగా తగ్గించారు.

1. ప్రత్యక్షప్రమాణము, 2. అనుమానప్రమాణము విజ్ఞానశాస్త్రాలన్నీ వీటిమీదే ఆధారపడి ఉన్నాయి.

### 7.6 ఏ ప్రమాణం వాడాలి?

మరి మనం ఏ ప్రమాణం వాడాలి? శాస్త్రం మనకు యిష్టం వచ్చిన లేదా మనకు సరదాగా అనిపించిన ప్రమాణం వాడటానికి వీలులేదంటుంది. ఆ ప్రమాణం మనం తెలుసుకోవాలనుకుంటున్న వస్తువుమీద ఆధారపడి ఉంటుంది. మనం రంగు గురించి తెలుసుకోవాలను కుంటే, కన్ను అనే ప్రమాణం వాడాలి. నేను స్వేచ్ఛాజీవిని, నా యిష్టం వచ్చినట్టు చేస్తాను, ఎవరిమాటో ఎందుకు వినాలి? నేను చెవులు వాడతాననలేము. బుద్ధిగా కళ్ళు మాత్రమే వాడాలి. అందువల్ల జ్ఞానం సరియైన ప్రమాణం వాడితేనే కలుగుతుంది.

### 7.7 ఆత్మజ్ఞానానికి ఏ ప్రమాణం?

మనకు అందుబాటులో ఉన్న ఐదు ప్రమాణాలూ, బాహ్యప్రపంచాన్ని చూస్తాయి. ఇందులో ఏవీ వాటి వెనుక ఉన్న కర్తను చూడవు. అందువల్ల ఇది ప్రత్యక్షప్రమాణం, అనుమానప్రమాణాల లోటుపాటు. ఇది పంచప్రమాణాలవల్ల వచ్చే లోటుపాటు. ఇది సైన్సుయొక్క లోటుపాటు. ఇంతకు ముందు ఈ లోటుపాటును సైన్సు ఒప్పుకోలేదు. కాని ఇప్పుడు ఒప్పుకుంటోంది. కన్ను, కన్నును వాడే విద్యార్థిని చూడలేదు.

అక్షరాలా మన కళ్ళలాగా. మన కళ్ళు బాహ్యప్రపంచాన్ని చూడగలవు గాని మనని చూడలేవు. (ఐ–ఇవైఇ కెనాట్ స్టడీ–ఐ) కర్తను కర్మలాగా చూడలేము. కర్త కర్మలాగా అందుబాటులో లేదు. ఇలా అయితే ఆత్మజ్ఞానం అందుబాటులో ఉండదు, వైజ్ఞానిక శాస్త్రానికి అంతుబట్టదు. మరేదైనా మార్గం ఉందా?

### 7.8 ఆరవ ప్రమాణం

కళ్ళని చూడటానికి ఇంకో బాహ్యవస్తువు కావాలి. మనం మన కళ్ళను చూసుకోవటానికి అద్దం కావాలి. మన కళ్ళు మనని చూడలేవన్న విషయం మనం ఒప్పుకోవాలి. అప్పుడు బాహ్యవస్తువైన అద్దాన్ని వాడతాము. అలాగే ఆత్మజ్ఞానం విషయంలో కూడా ఈ పంచప్రమాణాలు పౌరుషేయప్రమాణాలు, అవి సరిపోవు. దీనికి ఆరవ ప్రమాణం కావాలి. బయటనుంచి అద్దం తెచ్చినట్టు తేవాలి. దాన్ని శాస్త్రప్రమాణం లేదా శబ్దప్రమాణం అంటారు. ఇది అపౌరుషేయప్రమాణం.

అద్దం లేకపోతే? మన అందాన్ని కొలిచే మార్గమే లేదు. భగవంతుడు శారీరక అందాన్ని కొలవటానికి అద్దాన్ని యిస్తే, అంతర్గత అందాన్ని కొలవటానికి శాస్త్రప్రమాణం లేదా శబ్దప్రమాణం లేదా అపౌరుషేయప్రమాణాన్ని యిచ్చాడు. అది ఆరవ ప్రమాణం.

### 7.9 ఎలా వాడాలి?

అద్దం ఉండగానే సరిపోదు. మన అందమైన మొహాన్ని అది చూపిస్తుంది. కాని మనకు అద్దాన్ని ఎలా వాడాలో తెలియాలి. ఏది ముందువైపో, ఏది వెనుకవైపో తెలియాలి. అలాగే శాస్త్రాన్ని సరిగా అధ్యయనం చేయాలి. సరిగా చదివితే ఆత్మజ్ఞానం కలుగుతుంది. కాని శాస్త్రాన్ని మనమే చదివితే, ప్రమాదంలో పడే అవకాశం ఉంది. జ్ఞానం ప్రత్యేకం కాబట్టి, ప్రత్యేక పద్ధతి కావాలి. ఇక్కడ ఆత్మజ్ఞానవిషయం ప్రత్యేకం కాబట్టి, శాస్త్రం వాడే పద్ధతి కూడా ప్రత్యేకంగానే ఉంటుంది. ఏమిటది? మామూలు పుస్తకం చదివితే, మనం నేర్చుకునే పద్ధతి ఏమిటి? మామూలుగా పుస్తకాలు అనేక వస్తువుల గురించి వివరిస్తాయి. అందులో రెండు దశలు ఉంటాయి.

ఎ) ముందు ఒక వస్తువు గురించిన సమాచారం వినటం.

బి) తర్వాత అక్కడికి వెళ్ళి ప్రత్యక్ష అనుభవం పొందటం.

ఉదాహరణకు నయాగరా జలపాతం గురించిన సమాచారం అంతా చదివాము. మొదటిదశ అయింది. తర్వాత అక్కడికి వెళ్ళినప్పుడు దాన్ని ప్రత్యక్షంగా చూసి అనుభవిస్తాము. దీన్ని డైకాటమీ పద్ధతి అంటారు.

కాని ఆత్మజ్ఞానం విషయం దగ్గరకి వచ్చేసరికి అలా జరుగదు. మొదటి దశలో ఆత్మ గురించి నేర్చుకుంటాము. రెండో దశలో వెళ్ళి ఆత్మను కలవాలంటే కుదరదు. ఎందుకని?

మనమే ఆ ఆత్మ కాబట్టి. కాబట్టి ఈ డైకాటమీ పద్ధతి ఇక్కడ సాగదు. కాని మనం ఈ పద్ధతికి అలవాటు పడటంతో, శాస్త్రాన్ని కూడా ఇలాగే అధ్యయనం చేద్దామనుకుంటాము.

ఆత్మజ్ఞానంలో ఈ రెండు దశలూ లేవు.

ఆత్మజ్ఞానం ఒక సమాచారమా? కాదు.

ఆత్మజ్ఞానం ఒక ప్రత్యక్ష అనుభవమా? కాదు.

అయితే మరి ఆత్మజ్ఞానం అంటే ఏమిటి? ఆత్మజ్ఞానమే! ఇంకో పద్ధతిలో చెప్పాలంటే ఆత్మజ్ఞానం అంటే ఆత్మ అజ్ఞానం తొలగిపోవటమే.

### 7.10 జ్ఞానయోగ సాధనలు

జ్ఞానయోగానికి మూడుదశల సాధన ఉంది – శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

**7.10.1 శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాల పాటు సమర్థవంతుడైన గురువు దగ్గర శాస్త్రాన్ని అధ్యయనం చేయటం. ఇందులో ప్రతిపదమూ ముఖ్యమే. గురువు లేకుండా మనమే చదివితే ఈ డైకాటమీలో పడిపోయి, సమాచారం నేర్చుకోవటంలోనో, ప్రత్యక్ష అనుభవం పొందటంకోసం చూడటమో జరుగుతుంది.

ఉదాహరణకు కుంతి కర్ణుల మధ్య జరిగిన సంభాషణ గురించి చూద్దాం. కుంతి కర్ణుడితో చెబుతుంది, 'కర్ణా, నాకు ఆరుగురు పుత్రులు ఉన్నారు.' అతనికి ఐదుగురి గురించే తెలుసు, నిద్రలో కూడా వారిని మర్చిపోడు. అందుకని అడుగుతాడు, 'ఓ కుంతీ! ఆ ఆరవ పుత్రుణ్ణి చూడాలని ఉంది.' కుంతి, 'తత్త్వమసి,' అంటుంది. అంటే అది నువ్వే. అప్పుడు కర్ణుడు యిలా అన్నాడనుకోండి, 'ఓ కుంతీ, నాకు ఆరవ పుత్రుడి గురించి సమాచారం తెలిసింది. ఇప్పుడు అతన్ని ఎక్కడ కలుసుకోను?' అలా అంటే ఎలా ఉంటుంది? ఆ ప్రశ్న యిక్కడ కుదరదు. అజ్ఞానం తొలగిపోవటమే జ్ఞానం. డైకాటమీ లేదు.

అందువల్ల శ్రవణం అంటే క్రమపద్ధతిలో శాస్త్రం నేర్చుకోవటం. సమర్థవంతమైన గురువు దగ్గర, కొన్ని సంవత్సరాల పాటు. ఎందుకంటే మనకు అలవాటైన పద్ధతిని పోగొట్టుకోవటానికి సమయం పడుతుంది.

శ్రవణం జరుగుతున్న దశలో ప్రశ్నలు అడగకూడదు. గురువు అనేక కోణాల్లోంచి, అనేక అంశాల గురించి సంపూర్ణంగా వివరిస్తాడు. మనకు సందేహాలు కలిగినా, కొంత భాగం ఒప్పుకోవటానికి సిద్ధంగా లేకపోయినా, వాటిని పక్కన పెట్టుకుని, చెప్పిన విషయాన్ని అంగీకరించే తత్త్వం పెంచుకోవాలి. మనం గురువు మాటతో విభేదించవచ్చు. కాని గురువు నా మాట వినకపోతే శపిస్తాను అనడు. కాని శ్రవణం పూర్తి అయ్యేదాకా మనం ఆగాలి. మనం ఒక ముగింపుకు రావటం, మనకు తోచిన విశ్లేషణ చేసుకోవటం, విమర్శించటం చేయకూడదు. శ్రవణం దశలో చాలా ఓపిక కావాలి. శ్రవణం అజ్ఞానాన్ని తొలగిస్తుంది.

**7.10.2 మననం** – సంపూర్ణంగా విన్నాక, కొన్నేళ్ళపాటు శ్రవణం చేసాక, మన సందేహాలను వెలిబుచ్చవచ్చు. ఈ అధ్యయనంలో ఒక గొప్పదనం ఉంది. నిజానికి అన్నేళ్ళపాటు శ్రవణం చేసాక, మనలో కలిగే సందేహాలన్నీ అవే మటుమాయమవుతాయి. ఎందుకంటే శాస్త్రం గురుశిష్య సంవాదంలా వుంటుంది. మనకు కలిగే సందేహాలను శాస్త్రంలో శిష్యుడు వేస్తాడు. అయినా మనకు ఏదైనా కొత్త సందేహం కలిగితే, మన తార్కిక మెదడుకి తోచినది, తప్పకుండా అడగవచ్చు, గురువు దాన్ని తీరుస్తాడు. అప్పుడు సందేహాలని దాచుకుంటే, అవి జ్ఞానానికి అడ్డంకులవుతాయి. అందువల్ల మననం సందేహాలను తొలగించి, మనకు నిస్సంశయజ్ఞానం కలిగిస్తుంది.

**7.10.3 నిదిధ్యాసనం** – మనని మనం అంతర్గతంగా చూసుకోవటం. మనకు ఏళ్ళ తరబడి, అలవాటైన పద్ధతిని, తదనుగుణమైన ప్రవర్తనని మార్చుకోవాలి. అది పోతేనే ఈ జ్ఞానం కలుగుతుంది. అందుకని నిదిధ్యాసనం మనకలవాటైన పాత పద్ధతిని మార్చుకుని, ఈ జ్ఞానాన్ని అలవర్చుకునేలా చేస్తుంది. మార్చుకోకపోతే గురువు మన గురించి ఎంత చెప్పినా మన పద్ధతి మారదు.

దీనికొక ఉదాహరణ. ఒకసారి కొంతమంది మంగలివారు కలసి వారి సంఘం తరుపున రామాయణం నాటకం వేద్దామనుకున్నారు. పాపం చాలా కష్టపడి రిహార్సలు చేశారు. అనుకున్నరోజు రానే వచ్చింది. దశరథ మహారాజు కొలువులోకి, విశ్వామిత్రుడు వస్తారు. రండి రండి, మీకేం చేయగలను అని అడగాలి దశరథుడు. కాని విశ్వామిత్రుణ్ణి ఒత్తైన జుట్టుతోను, పొడుగుగడ్డంతోనూ చూసేసరికి పైన దశరథుడిగా నగలు వేసుకున్నా, అతనిలోని మంగలివాడు పైకొచ్చాడు. అందుకే, 'రండి, రండి, మీకేం చేయగలను?' అని అక్కడితో ఆగకుండా, 'షేవింగా? కటింగా?' అడిగాడు. గొల్లున నవ్వారు అందరూ.

మనలో అలాంటి మనస్తత్వమే ఉంటుంది. మన ప్రవర్తన మన గురించి మనం ఏర్పరచుకున్న భావాన్నిబట్టి ఉంటుంది. ఆ పాత భావాన్ని తొలగించటానికి మనం గట్టి ప్రయత్నం చేయాలి. కొత్త జీవితాన్ని తీర్చి దిద్దుకోవాలి. దీనికోసం శాస్త్రం వినటం అయిపోయినా, శాస్త్ర అధ్యయనం చేస్తూనే ఉండాలి లేదా జ్ఞానితో కలిసి ఉండాలి.

మనం ఎంత తిన్నా, మనకు అరిగిందే లెక్క. స్వామి చిన్మయానంద అడుగుతారు, 'నువ్వు పది ఉపనిషత్తులు చదివావు సరే, ఎన్ని నీ లోపలికి ఎక్కాయి?' అని. అందుకని నేర్చుకున్నది వంట పట్టించుకోవటం నిదిధ్యాసనం.

**సంక్షిప్తంగా –** శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేస్తే అవి ఆత్మజ్ఞానాన్ని యిస్తాయి. ఆత్మజ్ఞానం కలిగితే మోక్షం కలుగుతుంది. మోక్షం బంధాన్ని తొలగిస్తుంది. అంటే మనకిష్టమైన వ్యక్తి దగ్గర ఉంటే కలిగే భారం కాని, దగ్గర లేకపోతే కలిగే ఏకాంతం కాని కష్టం అనిపించదు.

# 08. భక్తియోగం

ఇవాళ భక్తికి శాస్త్రంలో చాలా ప్రాముఖ్యత ఉంది. వివిధ సందర్భాలలో దీని అర్థంలో చిన్న తేడాలుంటాయి. అందుకని యిది మనని కొంతమేరకు అయోమయంలో పడవేస్తుంది కూడాను. అందుకని మనం భక్తి అంటే ఏమిటో స్పష్టంగా అర్థం చేసుకోవాలి. 'భక్తి' అన్న పదాన్ని శాస్త్రం రెండు అర్థాలలో వాడుతుంది.

### 8.1 భక్తి మొదటి అర్థం – దేవునిమీద భక్తి – భావనా దృష్ట్యా భక్తిత్రయం

భక్తి అంటే దేవునిమీద ఆరాధన. గౌరవంతో కూడిన ప్రేమని ఆరాధనగా అభివర్ణించ వచ్చు. అది ఉన్నతమైన వ్యక్తులమీద ఏర్పడుతుంది. దానిని మాతృభక్తి, పితృభక్తి అంటాం, వారిని పూజనీయ వ్యక్తులుగా పరిగణిస్తాము కాబట్టి. అలాగే గురుభక్తి, దేశభక్తి, ఈశ్వరభక్తి. అంటే, భక్తి అంటే ఉన్నతమైన వ్యక్తిమీద ప్రేమ, ముఖ్యంగా దేవునిమీద ప్రేమ.

### 8.2 ప్రేమకి మూడు దిశలు

ప్రేమని మన శాస్త్రం చక్కగా విశ్లేషించింది. మామూలు వ్యక్తులమీద ప్రేమ అవనీ, అలాగే దేవునిమీద ఉన్న ప్రత్యేకమైన ప్రేమ అవనీ, మనిషి ఎవరిమీద ఏ విధమైన ప్రేమ చూపించినా, అది కేవలం మూడు దశల్లో ఉన్నాయని శాస్త్రం చెబుతున్నది

**8.2.1 గమ్యం ప్రేమ** – మొదటిది లక్ష్యంమీద ప్రేమ. మనం జీవితంలో సాధించాలనుకున్న అంతిమ లక్ష్యాన్ని ప్రేమిస్తాము. వాటిని ప్రేమిస్తున్నాము కాబట్టే, వాటిని సాధిద్దాము అనుకుంటున్నాము. అందుకని దీనిని గమ్యం ప్రేమ అనవచ్చు.

**8.2.2 మార్గం ప్రేమ** – తర్వాత ఈ గమ్యం చేరుకోవటానికి మనం అనేక మార్గాలని ఉపయోగించాలి. ఏదో ఒకమార్గం ద్వారా వెళితే గాని గమ్యం చేరుకోలేము. మార్గంవల్లే మన గమ్యం చేరుకోగలము కాబట్టి మార్గాన్ని కూడా ప్రేమిస్తాము. అందువల్ల దీన్ని మార్గం ప్రేమ అనచ్చు.

**8.2.3 స్వయం ప్రేమ** – మూడోది మనమీద మనకు ఉన్న ప్రేమ. అందుకని దాన్ని స్వయం ప్రేమ అందాము.

అందువల్ల ప్రేమలన్నింటినీ మూడు తెగలుగా వర్ణించవచ్చు; గమ్యం ప్రేమ, మార్గం ప్రేమ, స్వయం ప్రేమ. ఇది ఎటువంటి ప్రేమకైనా వర్తిస్తుంది.

### 8.3 ప్రేమలో స్థాయీ భేదాలు

మూడు తెగల ప్రేమ ఉన్నప్పుడు వాటిమీద ఉన్న తీవ్రతలో స్థాయీ భేదం ఉంటుందని శాస్త్రం చెబుతోంది. మార్గంమీద ప్రేమ స్థాయి చాలా తక్కువ, గమ్యంమీద మధ్యస్థం, స్వయం ప్రేమ హెచ్చుస్థాయి ఉంటుంది. ఎందుకు? కారణం చాలా తేలిక. మార్గాన్ని

మార్గంకోసం ప్రేమించటం లేదు. దాని ద్వారా గమ్యం చేరుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. గమ్యం చేరుకున్నాక మార్గాన్ని మర్చిపోతాము. ధనవంతుల చుట్టూ భజన చేస్తూ మనుష్యులు ఎందుకు తిరుగుతారు? వారు ఐశ్వర్యమనే గమ్యం చేరుకోవటానికి మార్గం అంతే. వారి దగ్గర డబ్బు ఉన్నంత కాలమే వారి దగ్గర జేరతారు. ఎప్పుడైతే వారి ఐశ్వర్యం మటుమాయమవుతుందో, అప్పుడే భజనగాళ్ళూ కనుమరుగవుతారు. ఇంట్లో వృద్ధులని ఆపేక్షగా చూస్తారు, ఎందుకు? ఆస్తి రాసిస్తారన్న ఆశతో. పొరపాటున ఆ వృద్ధుడు తన ఆస్తిని ముందే రాసిచ్చాడా, అతని పాట్లు పగవాడికి కూడా వద్దనిపిస్తుంది. అతను తన తోటివారికి సలహాలిస్తాడు, తనలాగా ముందే ఆస్తిని యివ్వద్దని.

**యావత్ విత్తోపార్జనసక్తః**
**తావన్నిజపరివారో రక్తః**
**పశ్చాత్ జీవతి జర్జరదేహే**
**వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే॥**

అధికశాతం తోటివారిమీద ప్రేమ, గమ్యమనే డబ్బుని చేరుకోవటానికి మార్గం. అందుకని గమ్యంమీద ప్రేమ ఎక్కువ, మార్గంకన్నా. మార్గం యిష్టమైతే, గమ్యం యిష్టతరం. మరి ఇప్పుడు, గమ్యంమీద ప్రేమ ఎక్కువా, స్వయంమీద ప్రేమ ఎక్కువా? తార్కికంగా ఆలోచిస్తే మనం అనేక గమ్యాలను ఎన్నుకోవటానికి కారణం, అవి మనకు భద్రతనో, సుఖాన్నో, ఆనందాన్నో యిస్తాయి కాబట్టి. ఎప్పుడైతే ఒక గమ్యం మనకు సుఖాన్నివ్వదు అని మనకు అనిపిస్తుందో అప్పుడు మనం దాన్ని వదులుకుంటాం, దాన్ని సాధించినా కూడా. అందుకే నేడు వివాహాలు విచ్ఛిన్నమవుతున్నాయి. అతను నన్ను ప్రేమించాడని ప్రేమవివాహాలు చేసుకుంటారు. ప్రేమించలేదని అర్థమైందని విడిపోతున్నారు. అంటే వారిమీదే వారికి ప్రేమ. భర్తమీద కాదు.

**న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి।**
**ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి॥** – బృహదారణ్యకోపనిషత్తు

అందువల్ల గమ్యాన్ని గమ్యంకోసం ప్రేమించము. అంతా మన చుట్టూనే తిరుగుతుంది. అందువల్ల ప్రేమలో స్థాయీబేధం చూడాలంటే – మార్గం ప్రేమ– మంద ప్రేమ; గమ్యం ప్రేమ– మధ్యమ ప్రేమ, స్వయం ప్రేమ– ఉత్తమ ప్రేమ. ఇది మానవ ప్రేమ గురించి సాధారణ సూత్రం.

### 8.4 మూడు స్థాయిల భక్తి

ఇప్పుడు దీన్ని భగవంతుడిమీద భక్తికి అన్వయించి చూద్దాము. ఎవరైనా దేవుణ్ణి ప్రేమిస్తే, ఆ ప్రేమ స్థాయి ఎంతలో ఉంది? ఆ స్థాయి వారు దేవుణ్ణి చూసే పద్ధతినిబట్టి ఉంటుందని

శాస్త్రం చెబుతుంది. ఎందుకంటే రకరకాల మనుష్యులు రకరకాల పద్ధతుల్లో చూస్తారు దేవుణ్ణి. దాన్నిబట్టే స్థాయీ భేదం కూడా ఉంటుంది.

**8.4.1 మన్దభక్తి** – చాలామంది దేవుణ్ణి వారి ప్రాపంచిక గమ్యాలు చేరుకునేందుకు ఒక మార్గంగా కొలుస్తారు. 'నేను ఈ ఆలయానికి వెళితే, నాకు ఈ కోరిక తీరుతుంది అనుకుంటారు. ఇలా దేవుణ్ణి కొలిస్తే, దాన్ని మంద భక్తి (తక్కువస్థాయి భక్తి) అంటారు. అలాంటివారు దేవునిమీద అలుగుతారు కూడా. 'నాకు దేవునిమీద పిచ్చికోపం వచ్చింది. మా అమ్మాయి పెళ్ళి కుదర్చమని కోరాను. ఉలుకూ, పలుకూ లేదు ఆయనలో. దాంతో దేవుణ్ణి కొలవటం మానేసి, నా ప్రార్థనా పుస్తకాలన్నీ తీసుకువెళ్ళి చెత్తబుట్టలో పారేశాను' అంటారు. ఎందుకు? వారిది షరతులతో కూడుకున్న ప్రేమ. నువ్వు ఇది చేస్తేనే నేను నిన్ను ప్రేమిస్తాను అంటారు. దయానంద సరస్వతీస్వామి దీన్ని చక్కగా వర్ణిస్తారు. ముందు 'ఐ లవ్ యు,' అంటారుట. తర్వాత 'ఐ ఎలౌ యు టు గో,' అంటారట. దేవుని దగ్గరైనా అదే పద్ధతి. దీన్ని మందభక్తి అంటారు, ఎక్కువమంది భక్తి ఈ స్థాయిలో ఉంటుంది.

**8.4.2 మధ్యమభక్తి** – రెండో స్థాయి వారు కొంచెం అరుదుగా ఉంటారు. వారు దేవుణ్ణి గమ్యం చేర్చే మార్గంగా కొలవరు.వారి అవగాహనలో పరిపక్వత ఉంది, స్పష్టత ఉంది. అందుకని దేవుణ్ణి వారి గమ్యంగా కొలుస్తారు. జీవితలక్ష్యం గమ్యాన్ని చేరటం. దేవుడు భద్రతకి చిహ్నం. దేవుడు శాంతికి చిహ్నం. దేవుడు ఆనందానికి నెలవు. వారికి కావాల్సినవి ఈ శాంతిభద్రతలే. అందుకని దేవుణ్ణి గమ్యం ప్రేమ పద్ధతిలో ప్రేమిస్తారు. అది ముందు పద్ధతికన్నా హెచ్చుస్థాయి. అందుకని దీన్ని మధ్యమభక్తి అంటారు.

**8.4.3 ఉత్తమభక్తి** – మరయితే ఉత్తమభక్తి ఏది? అత్యంత అరుదుగా చూసే ఈ భక్తి ఏమిటి? ఇందులో దేవుణ్ణి మార్గంగానూ చూడరు, గమ్యంగానూ చూడరు. జీవాత్మ పరమాత్మ ఐక్యత చూస్తారు కాబట్టి పరమాత్మమీద భక్తి, స్వయంప్రేమతో సమానం. స్వయంప్రేమ ఎలా ఉత్తమమైనదో, పరమాత్మమీద అలాంటి ప్రేమ కూడా ఉత్తమమైనదే. మందభక్తుడికి దేవుడు ప్రియం, మధ్యమభక్తుడికి ప్రియతరం, ఉత్తమభక్తుడికి ప్రియతమం. కృష్ణపరమాత్మ దీనిని విపులంగా భగవద్గీతలో ఏడవ అధ్యాయంలోనూ, పన్నెండవ అధ్యాయంలోనూ వర్ణిస్తాడు.

భక్తి అంటే ఏమిటి? దైవంమీద మంద, మధ్యమ, ఉత్తమ రూపంలో ఉన్న ప్రేమ. ఇది భక్తియొక్క మొదటి నిర్వచనం.

**8.5 భక్తి రెండవ నిర్వచనం – ఆచరించే విధానం – సాధనా దృష్ట్యా భక్తిత్రయం**

ఇప్పుడు భక్తి రెండవ నిర్వచనం చూద్దాం. పురుషార్థములలో ఉన్నతమైన పురుషార్థం మోక్షాన్ని సాధించటానికి ఉపయోగపడే సాధన పద్ధతి. దీన్ని ఆచరించాల్సిన పద్ధతిగా

వర్ణించటానికి, యోగం అన్న పదం కలిపారు. అంటే భక్తిని ఆచరించాల్సిన పద్ధతిగా వాడితే భక్తియోగం అంటారు.

**8.5.1 మూడు పద్ధతుల ఆధ్యాత్మిక మార్గం** – తర్వాత ప్రశ్న భక్తియోగం అంటే ఏమిటి? ఏ పద్ధతిని సూచిస్తోంది అది? పురుషార్థాలని సాధించటానికి మూడు పద్ధతులని చర్చించాం ముందు అంశాలలో. అవి కర్మయోగం, ఉపాసనాయోగం, జ్ఞానయోగం. అప్పుడు భక్తియోగం మాటే తలపెట్టలేదు. మరి భక్తియోగం అంటే ఏమిటి? అది నాలుగవ పద్ధతా అన్న ప్రశ్న వస్తుంది.

మన జవాబు భక్తియోగం అనేది వేరే ప్రత్యేకమైన పద్ధతి కానే కాదు. ఈ మూడు పద్ధతులను కలిపి వాడే పద్ధతి భక్తియోగం. అంతేకాని నాలుగవ పద్ధతి కాదు. కావాలంటే ఇలా చెప్పవచ్చు.

| | |
|---|---|
| కర్మయోగం | మొదటి మెట్టు |
| ఉపాసనాయోగం | రెండవ మెట్టు |
| జ్ఞానయోగం | మూడవ మెట్టు |

**కర్మయోగం + ఉపాసనాయోగం + జ్ఞానయోగం = భక్తియోగం.**

ఎందుకు ఈ మూడింటినీ కలిపి భక్తియోగం అంటున్నాం? ఎందుకు విడిగా చూడలేము? ఎందుకంటే, ఈ మూడు యోగాల్లోనూ సమానంగా ఉన్న అంశం భక్తి. కర్మయోగంలో భక్తి కలగలపాలి. ఉపాసనాయోగంలో భక్తిలో మునగాలి, జ్ఞానయోగంలో భక్తిరసంలో తేలాలి, రసగుల్లా చక్కెర పాకంలో తేలినట్టుగా.

**8.5.1.1 కర్మయోగం** – కర్మయోగంలో ఏం చేసినా ప్రతిచర్యనీ దైవానికి అంకితం చేసి, ఏమాత్రం వ్యతిరిక్తత చూపించకుండా, మన చర్యల – మంచి కాని, చెడు కాని – ఫలితాలను ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాం. ఈశ్వరార్పణభావన లేదా ప్రసాదభావన లేకుండా కర్మయోగం ఉంటుందా? అంటే కర్మయోగికి భక్తి ఉండి తీరాలి.

**8.5.1.2 ఉపాసనాయోగం** – ఉపాసనాయోగం లో దైవం గురించి ధ్యానం చేయాలి, చిత్తశుద్ధికోసం, చిత్త ఏకాగ్రతకోసం. భక్తి లేకపోతే ధ్యానం ఎలా చేస్తాము? మానసపూజ, మానసపారాయణం, మానసజపం అన్నీ ఉపాసనలో భాగాలు. ఉపాసన కూడా భక్తితత్వంతో జరగాలి.

**8.5.1.3 జ్ఞానయోగం** – ఇందులో కూడా భక్తి ఉంది. శాస్త్రం అధ్యయనం చేసేటప్పుడు, ప్రార్థనతోమొదలెట్టి, ప్రార్థనతో ముగిస్తాము. అంతేకాదు జ్ఞానయోగంలో మనం ఆత్మవిచారణ చేస్తున్నాం. చివరికి జీవేశ్వర ఐక్యం తెలుసుకుంటాం. ఆత్మజ్ఞానం పొందితే,

బ్రహ్మజ్ఞానం పొందినట్టే. అది విడిగా లేదు. అందువల్ల జ్ఞానయోగంలో కూడా భక్తి ఉంది. అందువల్ల, భక్తి అంటే ఆధ్యాత్మిక సాధనలో ఆచరించే మొత్తం పద్ధతి.

**సారాంశం**

భక్తి రెండు నిర్వచనాలు.

1. దేవునిమీద ప్రేమ – మంద, మధ్యమ, ఉత్తమప్రేమ రూపాల్లో
2. ఆధ్యాత్మిక సాధకుని పద్ధతి – కర్మ, ఉపాసన, జ్ఞానయోగాలన్నింటిలో

## 8.6 దైవం – అవగాహనా స్థాయి – దేవతా దృష్ట్యా భక్తిత్రయం

ఈ సందర్భంలో యింకో అంశాన్ని కూడా స్పష్టంగా తెలుసుకోవాలి. భక్తి అంటే దేవుని మీద ఆరాధన అన్నాం. కాని దేవుడు ఎవరో తెలియకపోతే, అతనిమీద భక్తి ఎలా ఏర్పడుతుంది? ముక్కూ మొహం తెలియని వ్యక్తిమీద ప్రేమ ఎలా పుడుతుంది? అందుకే ఇప్పుడు పెళ్ళికి ముందే కలిసి తిరగాలనుకుంటున్నారు. 'నాకర్థమయ్యాడు. అందుకే ప్రేమిస్తున్నాను,' అంటారు. పెళ్ళి చేసుకుంటారు. ఆ తర్వాత ఇంకా ఎక్కువ అర్థం చేసుకుని, 'నాకర్థమయ్యాడు, అందుకే ప్రేమించ లేకపోతున్నాను,' అంటారు. దేవుని విషయంలో కూడా దేవుని స్వభావం తెలియనిదే ఎలా ప్రేమిస్తాము?

అందుకని మనం దేవుని స్వభావం గురించి టూకీగా చూద్దాం. శాస్త్రం దేవుని గురించి మూడు నిర్వచనాలు యిస్తుంది, సాధకుని పరిపక్వతనిబట్టి, మేధాశక్తినిబట్టి. ఆ మూడు స్థాయిలు ఏమిటో చూద్దాం.

**8.6.1 మొదటి నిర్వచనం** – దేవుడు సృష్టికర్త. సంస్కృతంలో జగత్కర్తా ఈశ్వరః అంటారు. నిమిత్తకారణం అని కూడా అంటారు. దీన్ని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఏమిటది? ఏ అందమైన వస్తువుని చూసినా, దాని వెనుక దాన్ని సృష్టించిన మేధావి ఉంటాడు. ఆ వస్తువు ఎంత బ్రహ్మాండంగా ఉంటే, అతని తెలివితేటల్ని అంతగా కీర్తిస్తాము. అంటే ఒక మామూలు వస్తువుని తయారుచేయటానికి ఒక మానవమేధస్సు కావాలంటే, ఇంత క్రమబద్ధంగా ఉన్న, ఇంత లాభదాయకంగా ఉన్న ఈ అద్భుతమైన జగత్తు వెనుక ఎవరు ఉన్నట్టు? ఎవరో కలుపుమొక్కని ఇలా నిర్వచించారు – 'కలుపు మొక్కయొక్క లాభం యింకా కనుగొనలేదు.' అది అనవసరం కాదు, కాని మనకే యింకా దాని ప్రయోజనం తెలియలేదు అంతే. అంటే సృష్టిలో అనవసరమైన వస్తువంటూ ఏదీ లేదు. సృష్టి ఇంత లాభదాయకంగా, ఇంత అద్భుతంగా ఉందంటే, దాని వెనుక ఎవరో తెలివైన సృష్టికర్త ఉన్నారన్నమాట.

ఆ తెలివైన జగత్కర్త ఈశ్వరుడు. ఈశ్వరుణ్ణి జగత్కర్తగా భావిస్తే, ఆ ఈశ్వరుణ్ణి ఒక వ్యక్తిగా భావిస్తాము. ఎందుకంటే మనకు తెలిసిన తెలివైన వ్యక్తి మనిషి. అందుకని చాలా తెలివైన వ్యక్తిగా దేవుణ్ణి ఊహించుకుంటాం. అతనిని సర్వజ్ఞునిగా, సర్వశక్తిమంతుడిగా

ఊహించుకుంటాం. మనచుట్టూ కనబడడు కాబట్టి అతన్ని మేఘాలపైన వున్నట్టు ఊహించుకుంటాం. ఈ దేవుడు మనకు వ్యక్తిగత దేవుడు. మనకు తోచిన నామ, రూపాలు ఇచ్చుకుంటాం. ఉదాహరణకు రాముడు, కృష్ణుడు, విష్ణుమూర్తి, శివుడు. ఈ దేవుణ్ణి మనం **ఏకరూప ఈశ్వరుడు** అందాం. ఒక రూపం దాల్చిన దేవుడు. ఆరంభ దశలో ఉన్న భక్తుడికి ఈ దేవుడు.

**8.6.2 రెండవ నిర్వచనం** – మనలో కొంత పరిపక్వత వచ్చి, ఇంకొంచెం ముందుకి ఆలోచించగలిగినప్పుడు, శాస్త్రం ఈశ్వరుని స్థాయి యింకొంచెం పెంచుతోంది. దేవుడు సృష్టికారణం – జగత్కారణం అంటోంది. అంతకుముందు జగత్కర్త ఈశ్వరుడు అంది, ఇప్పుడు జగత్కారణం ఈశ్వరుడు అంటోంది. అది ఎలా సూచిస్తాం? మనం దేవుణ్ణి సృష్టికర్తగా అర్థం చేసుకుంటే, మరి ఈ ప్రపంచాన్ని దేన్నుంచి సృష్టించాడన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఏ సృష్టికర్తకన్నా ముడిసరుకు కావాలి. వడ్రంగికి చెక్క కావాలి. తాపీమేస్త్రికి ఇనుము, ఇటుకలు కావాలి. మరి దేవుడు సృష్టికర్త అయితే, ముడిపదార్థం ఏది? విశ్వం సృష్టించకముందు దేవుడొక్కడే ఉన్నాడు. ఇంకేమీ లేదు. శాస్త్రజ్ఞులు బిగ్‌బ్యాంగ్ ముందు టైము, స్పేస్ లేవంటారు. అందుకని కాలం, ప్రాంతం, వస్తువులు ఏర్పడకముందు, దేవుడొక్కడే ఉన్నప్పుడు, ముడిసరుకు ఏది? అందుకే ఆ ముడిసరుకు కూడా దైవంనుంచే వచ్చిందని శాస్త్రం బోధిస్తుంది. అంటే దేవుడు కారణం అవుతాడు.

దీనికి శాస్త్రం ఒక ఉదాహరణ కూడా యిస్తుంది. అది సాలెపురుగు. సంస్కృతంలో ఊర్ణనాభి అని అంటారు. మనం సాలెపురుగుని ద్వేషిస్తున్నాము కాని వేదాంతంలో అదొక అందమైన ఉదాహరణ. సాలెపురుగు తన గూడు కట్టటానికి ముడిసరుకు తనలోంచే తీసుకుంటుంది. అలాగే దేవుడు ఉపాదానకారణం కూడా అంటే దేవుణ్ణుంచి ముడిసరుకు వచ్చింది. ముడిసరుకునుంచే మొత్తం విశ్వం వచ్చింది కాబట్టి దేవుడే విశ్వం. అంటే విశ్వం దేవుడు తప్ప మరోటి కాదు. అయితే దేవుడెక్కడ ఉన్నాడు? అంతటా, అన్ని రూపాల్లో సర్వవ్యాపియై ఉన్నాడు. అంటే ఇప్పుడు దేవుడు వ్యక్తిగత దేవుడు కాదు. ఏకరూప ఈశ్వరుడు కాదు. అతను **అనేకరూప ఈశ్వరుడు** లేదా **విశ్వరూప ఈశ్వరుడు** దైవదర్శనంకోసం మనం ఎక్కడికో వెళ్ళనక్కరలేదు. రుద్రంలో ఈశ్వరుణ్ణి జగత్తులోని సమస్త వస్తుజాలంలోను దర్శిస్తారు.

**8.6.3 మూడవ నిర్వచనం** – ముందు జగత్కర్త ఈశ్వరుడు అన్నాం. తర్వాత జగత్కారణం ఈశ్వరుడు అన్నాం. ఇప్పుడు జగదధిష్ఠానం ఈశ్వరుడు అంటున్నాం. ఇది అత్యుత్తమ, అతిక్లిష్టమైన, అంతిమనిర్వచనం. దేవుడు అన్ని రూపాలు దాల్చాడు అనగానే మనకు ఒక సందేహం వస్తుంది. అంటే చెడ్డవారు, రోగులు, నేరస్తులు ఉ న్నారు కదా సృష్టిలో. వారు

కూడా దేవుడేనా? అవును అనుకుంటే దైవభక్తి ఎలా కలుగుతుంది? అలాంటి సందేహం వచ్చినప్పుడు, మనం మూడో నిర్వచనం అంగీకరించటానికి సిద్ధపడ్డట్టు లెక్క. దేవుడు ప్రపంచంగా మారడు. దేవుడు అనేక నామరూపాలున్న ప్రపంచంగా అనిపిస్తాడు.

ఆయన అన్ని వస్తువుల సద్రూపం. తను అన్ని నామరూపాలకి అధిష్ఠానం. నామం, రూపం దేవునికి చెందినది కాదు. అంటే అధిష్ఠాన ఈశ్వరః **అరూప ఈశ్వరుడు** అవుతాడు. రూపం లేని దేవుడు.

**సారాంశం –**

**8.7.1 మూడు స్థాయిల దైవం –**

జగత్కర్త – సృష్టిస్తాడు – ఏకరూప ఈశ్వరుడు – మందభక్తి.

జగత్కారణం – ముడిసరుకు కూడా – అనేకరూప ఈశ్వరుడు – మధ్యమభక్తి.

జగదధిష్ఠానం – నామరూపాలకి అధిష్ఠానం – అధిష్ఠాన ఈశ్వరుడు – ఉత్తమభక్తి.

**8.7 నవవిధ భక్తి**

**8.7.1 దేవునిమీద భక్తి – భావనా దృష్ట్యా భక్తిత్రయం**

మందభక్తి
మధ్యమభక్తి
ఉత్తమభక్తి

**8.7.2 ఆచరించే విధానం – సాధనా దృష్ట్యా భక్తిత్రయం**

కర్మరూపభక్తి
ఉపాసనారూపభక్తి
జ్ఞానరూపభక్తి

**8.7.3 అవగాహనా స్థాయి – దేవతా దృష్ట్యా భక్తిత్రయం**

ఏకరూపభక్తి
అనేకరూపభక్తి
అరూపభక్తి

# 09. సాధనచతుష్టయం

తత్త్వబోధ గ్రంథం ప్రాథమికంగా జ్ఞానయోగాన్ని లేదా ఆత్మవిచారాన్ని ఒక పద్ధతి ప్రకారం, పరిపూర్ణంగా బోధిస్తుంది. ఇది ఆత్మ గురించిన జ్ఞానం యివ్వటమే కాక, ఆత్మ విచారానికి ఉపయోగించే సాంకేతిక పదజాలాన్నంతా మనకు పరిచయం చేస్తుంది. అంటే వేదాంత పరిచయం చేస్తుంది.

ఏ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలన్నా దానికి సంబంధించిన సాంకేతికపదాలు ఉంటాయి. దాన్ని పరిభాషా శబ్దం అంటారు. కొన్ని సాంకేతిక పదాలని అనువదించలేము. తత్త్వబోధలో వీటన్నింటినీ పరిచయం చేయటమే కాక, చక్కగా వివరించారు కూడా. ఆవిధంగా తత్త్వబోధవల్ల రెండు ఉపయోగాలున్నాయి – ఆత్మజ్ఞానాన్ని పొందే మార్గం – సాంకేతిక పదజాల పరిచయం.

### 9.1. ఆత్మ విచారణకి అధికారి

ఏ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలన్నా కూడా, మనకు కొంత అర్హత ఉండాలి. ఆ సూత్రం వేదాంతశాస్త్రం లేదా ఆత్మవిచారణకి కూడా వర్తిస్తుంది. ఈ అర్హతని సాధన చతుష్టయ సంపత్తి అంటారు. సాధన అంటే అర్హత. చతుష్టయం అంటే నాలుగు. సాధన చతుష్టయం అంటే, అర్హత లేదా అధికారత్వం పొందటానికి నాలుగు రకాలుగా సిద్ధమవ్వటం. నాలుగు సాధనలు 1.వివేకం 2.వైరాగ్యం 3.ముముక్షుత్వం 4.శమాది షట్కసమ్పత్తి.

**9.1.1 వివేకం** – భేదం గుర్తించడం. ఇక్కడ భేదం అంటే ప్రతికూల అర్థం తీసుకోకూడదు. వర్ణభేదం, లింగభేదం లాగా కాదు. ప్రతికూల అర్థం తీస్తే ఒకదానిమీద పక్షపాతం చూపినట్టవుతుంది. కాని శాస్త్రంలో భేదం అంటే నిర్ణయం, సరియైన నిర్ణయం, సరియైన అవగాహన.

దేనికీ, దేనికీ మధ్య భేదం? భేదం అనగానే అందులో రెండు భిన్నవస్తువులు ఉండాలి. తత్త్వబోధ దీన్ని నిత్య, అనిత్యవస్తువివేకం అని నిర్వచించింది. ఏది అనిత్యం లేదా అశాశ్వతం, ఏది నిత్యం లేదా శాశ్వతం అన్నది తెలుసుకోవాలి. ఆ తెలుసుకోవటమే వివేకం.

ఇది ఎలా తెలుస్తుంది? మనం ఒకసారి విశ్వం కేసి చూస్తే, అందులో ప్రతిదీ కాలం, ప్రదేశం కొలతల చట్రం మధ్యలో ఇరుక్కుని ఉంది. సృష్టిలో కాలానికీ, ప్రదేశానికీ అతీతంగా ఏదీ లేదు. ప్రతిదీ కాలం కబంధ హస్తాల్లో చిక్కాల్సిందే.

**కాలః క్రీడతి గచ్ఛతి ఆయుః॥**

ప్రతిదీ కాలం చేతిలో ఓడిపోవాల్సిందే అంటే అర్థం ప్రతి దానికి పుట్టుక, ఆ తర్వాత మరణం తప్పనిసరి. పుట్టుట, గిట్టుట కొరకే అంటారు పెద్దలు. కాలానికి అతీతంగా ఏదీ లేదు కాబట్టి, ప్రకృతిలో ప్రతిదీ అశాశ్వతమే అని చెప్పవచ్చు. ఆ విధంగా సృష్టిలో– వస్తువులూ, మనుష్యులూ, పరిస్థితులూ, బంధుత్వాలూ – ప్రతిదీ నశించటమన్నది దాని స్వతఃసిద్ధలక్షణం.

ప్రపంచంలో ఏదీ శాశ్వతం కానప్పుడు, ఏదీ శాశ్వతమైన రక్షణ కాని భద్రత కానీ యివ్వలేదు. అందువల్ల ప్రపంచంనుంచి మనం శాశ్వత రక్షణ కోరుకుంటే, మన ఆశ అడియాసే అవుతుంది. నిరాశే మిగులుతుంది చివరికి. అయితే సరియైన నిర్ణయం ఏమిటి? ఎన్నడూ ప్రపంచంమీద ఆధారపడకూడదు, ఎన్నడూ ప్రపంచాన్నుంచి శాశ్వత భద్రత కోరకూడదు. ప్రపంచంలో భద్రత లేదు. ప్రపంచం నిత్యవస్తువును యివ్వలేదు.

ప్రపంచం శాశ్వత భద్రతనివ్వలేదు అంటే ప్రపంచం ఎందుకూ పనికిరానిది అని కానీ, దాన్ని పూర్తిగా కాలదన్నండి అని కాదు అర్థం యిక్కడ. ప్రపంచం మనకెన్నో వస్తువులనిస్తుంది, ఖచ్చితంగా ప్రపంచాన్ని ఎన్నో వస్తువులకోసం వినియోగించుకోవచ్చు కూడా. కాని శాశ్వతమైన భద్రత కావాలంటే మాత్రం దానిమీద ఆధారపడటం ప్రమాదకరం కూడా. కార్డ్‌బోర్డు కుర్చీ ప్రపంచం. దానిమీద ఆనుకోగలరే కాని దానిమీద బలంగా కూర్చోలేరు. ఈ వివేకం అనిత్యవస్తువుల గురించి ఏర్పడాలి.

మరి దేనిమీద ఆధారపడాలి? మనకు శాశ్వతమైన భద్రత కావాలంటే, దేనిమీదైనా ఆధారపడితీరాలంటే, నిత్యవస్తువువైపు తిరగాలి. నిత్యవస్తువు మాత్రమే మనకు రక్షణనివ్వగలదు. నిత్యవస్తువు అంటే శాశ్వతమైనది. తత్త్వబోధ పరిభాషలో దాన్ని బ్రహ్మ అంటారు. పురాణాల్లో భగవంతుడంటారు.

మన మొదటి పాఠం ఏమిటి? భగవంతుడు మాత్రమే శాశ్వత భద్రత నివ్వగలడు. ప్రపంచం సరదాలని, విద్యని, అవకాశాలని యివ్వగలదు. ఈ భేదభావన అర్థం చేసుకోవటమే నిత్యానిత్యవస్తువివేకం.

**9.1.2 వైరాగ్యం** – రెండో అర్హత వైరాగ్యం. వైరాగ్యం అంటే కోరిక లేకపోవటం. కోరిక అంటే భద్రతకోసం, రక్షణకోసం ప్రపంచాన్ని పట్టుకుప్రాకులాడటం. సైకలాజికల్‌గా ప్రపంచంమీద ఆధారపడటం కూడా కోరికే. ప్రపంచాన్ని సరదాల కోసం వాడటం కోరిక కాదు. విద్యకోసం వాడటం కోరిక కాదు. కాని భద్రతకోసం, రక్షణకోసం ఆధారపడటం, అది కూడా సైకలాజికల్‌గా, కోరిక అవుతుంది.

భద్రత, రక్షణలకోసం ప్రపంచంమీద ఆధారపడలేమని అర్థం చేసుకున్నాక, నెమ్మదిగా దాన్నుంచి బంధాలు తెంచుకోవటమే వైరాగ్యం. దీని అర్థం ప్రపంచంనుంచి పారిపొమ్మని

కాదు, దాన్ని తిప్పికొట్టమని కాదు, కాని మనకు భద్రత కావాల్సినప్పుడు, ఛానెల్ మార్చుకోవాలని అర్థం.

మన దగ్గర రెండు ఛానెల్స్ ఉన్నాయి. ప్రపంచం ఛానెల్, భగవంతుని ఛానెల్. మనకు సరదాలూ, విద్య కావాలంటే ప్రపంచం ఛానెల్ కావాలి, భద్రతా, రక్షణా కావాలంటే భగవంతుని ఛానెల్ కావాలి.

**9.1.3 ముముక్షత్వం** – మూడో అర్హత ముముక్షుత్వం. అనిత్యవస్తువు లేదా ప్రపంచంమీద ఆధారపడటంవల్ల కలిగిన సమస్యలనుంచి స్వేచ్ఛ కోరటమే ముముక్షుత్వం. ప్రపంచంమీద ఆధారపడితే సైకలాజికల్‌గా అనేక సమస్యలు. అందులో మొట్టమొదటిది, అభద్రతా భావం. ఎందుకంటే మనం దేనిమీద ఆధారపడి ఉన్నామో, దాన్ని కోల్పోతామేమో అన్న భయం. ముఖ్యంగా మనుష్యుల విషయంలోకొస్తే ఆ అభద్రతా భావం యింకా ఎక్కువవుతుంది. మనకు నచ్చినవారు మనని యిష్టపడతారా, ఇష్టపడితే ఎప్పటికీ యిలాగే యిష్టపడతారా అని భయం. భయం, భయం, బ్రతుకు భయం. ఆధారపడకూడని దానిమీద ఆధారపడటంవల్ల భయంతో పాటు అభద్రత, బెంగ, నిస్పృహ, నిరాశ, కోపం, ద్వేషం, ఒకటేమిటి ఎన్నో మానసిక రుగ్మతలు తలెత్తుతాయి.

ఇక్కడ సమస్య అనిత్యవస్తువులో లేదు. అనిత్యవస్తువుని నిత్యవస్తువని భ్రమపడటంలో ఉంది. అంటే తప్పుగా ఆశించటంవల్ల సమస్య ఉత్పన్నమవుతుంది. ఇలా తప్పుగా ఆశించటంవల్ల ఏర్పడిన దుఃఖాన్ని సంసారం అంటారు. ముముక్షుత్వం అంటే ఈ సంసారంనుంచి బయటపడాలనే తపన. ఈ తపన లేకపోతే మనిషి ఒక అశాశ్వతవస్తువునుంచి ఇంకో అశాశ్వత వస్తువుమీద దృష్టి నిలిపి, మళ్ళీ మళ్ళీ మోసపోయి, మళ్ళీ మళ్ళీ నిరాశానిస్పృహలకు లోనవుతాడు.

**9.1.4 శమాది షట్కసమ్పత్తి** – నాలుగో అర్హత శమాది షట్కసంపత్తి. షట్క అంటే ఆరువిధాలు. షట్కసంపత్తి అంటే ఆరువిధాల అంతర్గత నియంత్రణ. కుటుంబాన్ని, సంస్థని లేదా దేశాన్ని మార్చేముందు, తనని తాను మార్చుకోవటం.

**9.1.4.1 శమం** – శమం అంటే శాంతి. తేలిగ్గా చెప్పాలంటే మనస్సును నియంత్రణ చేసుకోవటం.

**9.1.4.2 దమం** – దమం అంటే ఇంద్రియ నిగ్రహం.

**9.1.4.3 ఉపరమం** – ఉపరమం అంటే బాహ్యంగా చేసే పనులను తగ్గించుకోవటం. ఆత్మవిచారణ చేసుకోవటానికి సమయం ఏర్పరచుకోవటం. విశ్రాంతిగా, ఒత్తిడి లేకుండా సాధన చేయటం.

**9.1.4.4. తితిక్ష –** తితిక్ష అంటే జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే మానసిక ధైర్యం. జీవితంలోని అన్నిరకాల అనుభవాలని నిర్వికారంగా భరించటం. దీన్నే స్థితప్రజ్ఞత అని కూడా అంటారు.

**9.1.4.5 శ్రద్ధ –** శ్రద్ధ అంటే శాస్త్రంమీద, శాస్త్రాన్ని అధ్యయనం చేయటానికి తోడ్పడే గురువుమీద నమ్మకం కలిగి ఉండటం. నమ్మకం అంటే గుడ్డినమ్మకం కాదు, కాని మనకు విషయం సరిగ్గా అర్థమయ్యేదాకా శాస్త్రం చెప్పింది అంగీకరించటానికి సిద్ధపడే మనస్సు. చెప్పింది చెప్పినట్టుగా స్వీకరించటం, ముందే శంకలు పెట్టుకోకుండా. ఇటువంటి అణకువ ఉంటే, నాకే అన్నీ తెలుసనే గర్వం ఉండదు. శాస్త్ర అధ్యయనానికి జ్ఞానమదం పెద్ద అడ్డంకి.

**9.1.4.6 సమాధానం –** సమాధానం అంటే ఏకాగ్రత. మనం నిర్ణయించుకున్న లక్ష్యంమీద ఏకాగ్రత చూపటం. దానికి ఒక గంటసేపు ప్రసంగం వినాలంటే, మనస్సు ఆ గంటా చలించకుండా ఉంచటం.

ఈ ఆరు గుణాలు కలిపితే నాలుగవ అర్హత అవుతుంది. నాలుగు అర్హతలూ కలిపితే సాధన చతుష్టయం అవుతుంది. ఆత్మవిచారణకి సాధనచతుష్టయసంపత్తి తప్పనిసరి అర్హత.

ఈ నాలుగూ, కనీసం 10%–15% ఉన్నా కూడా, అతన్ని అధికారి అంటారు. అప్పుడే అతను ఆత్మవిచారణవల్ల లాభం పొందగలడు. తక్కిన వారికి ఇది అమూల్యమైన సమయాన్ని వృథా పరుస్తున్నట్టు, లేదా కేవలం ఒక విద్య నేర్చుకుంటున్నట్టు ఉంటుంది.

**9.2. అధికారి అవటం –** సాధనచతుష్టయసంపత్తిని పొందటమెలా? ఆత్మవిచారణ చేయాలంటే సాధనచతుష్టయం పొందాలి. కాని సాధనచతుష్టయం పొందటానికి ఏం చేయాలి? దాని గురించి విని, మనని మనం తరచి చూసుకుంటే, మనం అనధికారులం అవుతాము. కాని దానికి ఏం చేయాలో శాస్త్రం స్పష్టంగా చెప్పలేదు. మనమే వెతుక్కోవాలి.

అవి యిలా ఉన్నాయి మొదటి మూడు అర్హతలు – వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం– కర్మయోగం పాటిస్తే అలవడుతాయి.

నాలుగోది శమాదిషట్కసంపత్తి – ఉపాసనాయోగం పాటిస్తే అలవడుతుంది. అంటే కర్మయోగం, ఉపాసనాయోగం కలిపి సాధనచతుష్టయసంపత్తినిస్తాయి. అప్పుడు జ్ఞానయోగానికి అర్హత పొందుతాము. అంటే కర్మయోగం, ఉపాసనాయోగం మనని జ్ఞానయోగానికి సిద్ధం చేస్తాయి. అందువల్ల కర్మయోగం, ఉపాసనాయోగం మనకు జ్ఞానయోగ్యతని యిస్తాయి.

జ్ఞానయోగం జ్ఞానాన్నిస్తుంది. జ్ఞానం మోక్షాన్ని ప్రసాదిస్తుంది. అందువల్ల మన మొత్తం ఆధ్యాత్మిక సాధనని రెండు మెట్లుగా విభజించవచ్చు.

1. జ్ఞానయోగ్యతా ప్రాప్తిః – కర్మ, ఉపాసనాయోగాల ద్వారా జ్ఞానయోగ్యత పొందటం.

2. జ్ఞానప్రాప్తిః – జ్ఞానయోగం ద్వారా జ్ఞానం పొందటం.

శాస్త్రంలో జ్ఞానయోగ్యతా ప్రాప్తి వేదపూర్వభాగంలో చర్చించబడింది. దీన్ని కర్మకాండ అనికూడా అంటారు. ఇందులో కర్మకాండ, ఉపాసనాకాండ ద్వారా జ్ఞానయోగ్యతా ప్రాప్తిపొందే మార్గం ఉంటుంది.

వేద అంతభాగం జ్ఞానప్రాప్తి గురించి వివరిస్తుంది. జ్ఞానయోగం ద్వారా జ్ఞానాన్నెలా పొందవచ్చో సూచిస్తుంది. వేదాంతాన్ని ఉపనిషత్తులని కూడా అంటారు. తప్పుడు ఆశలవల్ల కలిగిన సమస్యలన్నింటినీ అంతం చేస్తుంది వేదాంతం. ఉపనిషత్తు అంటే ఆధారపడటంవల్ల ఏర్పడిన సమస్యలను నాశనం చేసేది.

**9.3. యమ - నియమాలు**

మనకు కర్మయోగం మొదటి మూడు అర్హతలను (వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం) యిస్తే, ఉపాసనాయోగం నాలుగో అర్హతను (షట్కసంపత్తి) ఇస్తుందని చూసాం. సాధనచతుష్టయం పొందటానికి, ఈ రెండూ చాలవు. దానికి ఇంకోటి కూడా కావాలి. అది నైతిక విలువలని పాటించే జీవనశైలి.

నైతిక విలువలు ఏమిటి? శాస్త్రాల్లో, అనేకచోట్ల ఎన్నో నైతిక విలువలని సూచించటం జరిగింది. అందులో, పది విలువలు చాలా ముఖ్యం. అవి లేనిదే సాధనచతుష్టయం అసాధ్యం. సాధనచతుష్టయం లేనిదే జ్ఞానయోగం అసాధ్యం. జ్ఞానయోగం లేనిదే జ్ఞానం అసాధ్యం. జ్ఞానంలేనిదే మోక్షం అసాధ్యం. మోక్షం లేనిదే స్వేచ్ఛ అసాధ్యం. స్వేచ్ఛ లేకపోతే మనం బెంగలు, ఒత్తిడులకి బానిసలయి, దుఃఖభూయిష్టమైన సంసారంలో పడి కొట్టుకుపోతాం. పది విలువలను లేదా 'టెన్ కమాండ్‌మెంట్స్'ను రెండు తెగలుగా విభజించవచ్చు. 1. యమ, 2. నియమ.

**9.3.1 ఐదు నిషిద్ధకార్యాలు – యమ** – మొదటి తెగలో చేయకూడని పనులు వస్తాయి.

**9.3.1.1. హింసా వర్జనం** – వర్జనం అంటే వదలటం. హింస అంటే బాధించటం. మనోవాక్కాయ కర్మలద్వారా ఏవిధంగానూ ఎవరినీ బాధించ కూడదు. ఒక్కముక్కలో చెప్పాలంటే అహింస పాటించాలి. కొన్ని హింసలు చేయకుండా తప్పించుకోగలము, కొన్ని హింసలను తప్పించుకోలేము.

తప్పించుకోగలిగిన హింసలను తప్పించుకోవాలి, తప్పించుకోలేని హింసలకు, ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. పంచమహాయజ్ఞాలు చేయటం ద్వారా ప్రాయశ్చిత్తం చేయవచ్చు.

పంచమహాయజ్ఞాలు 1. భూతయజ్ఞం, 2. దైవయజ్ఞం, 3. మనుష్యయజ్ఞం, 4. పితృయజ్ఞం, 5. ఋషియజ్ఞం.

**9.3.1.2 అసత్యవర్జనం** – అసత్యం చెప్పకుండా ఉండటం. దీనినే అనృత వర్జనం అని కూడా అంటారు. ఇక్కడ కూడా పై సూత్రం వర్తిస్తుంది. తప్పించుకోగలిగిన అసత్యాలను తప్పించుకోవటం, చెప్పక తప్పని అసత్యాలకి, పంచమహాయజ్ఞాల ద్వారా ప్రాయశ్చిత్తం చేసుకోవటం.

**పంచసూనా గృహస్థస్య పంచయజ్ఞేన నశ్యతి**

సూన అంటే తప్పించుకోలేని చెడు. గృహస్థుకి అలాంటి తప్పించుకోలేని చెడులు ఎన్నో ఉంటాయి. దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

**9.3.1.3 స్తేయవర్జనం** – దొంగతనం చేయకుండా ఉండటం. అక్రమసంపాదన కూడా దొంగతనం కిందకే వస్తుంది. ఎదుటి వ్యక్తికి సక్రమంగా ఇవ్వాల్సిన ధనం ఇవ్వకపోవటం కూడా దొంగతనం కిందికే వస్తుంది.

**9.3.1.4 మైథునవర్జనం** – పరాయి స్త్రీతో అక్రమసంబంధం పెట్టుకోకుండా ఉండటం. త్రికరణశుద్ధిగా అక్రమసంబంధాన్ని వర్జించాలి.

**9.3.1.5 పరిగ్రహవర్జనం** – అధిక సంపదని ప్రోగేయకుండా ఉండటం. సానుకూల పద్ధతిలో చెప్పాలంటే, వీలున్నంత సామాన్యంగా జీవించటం. అవసరానికి మించి ఉన్నదాన్ని, తక్కినవారితో పంచుకోవటం. ఈ ఐదింటినీ కలిపి యమ అంటారు.

**9.3.2 పాటించాల్సినవి – నియమాలు** – ఐదు సానుకూల విషయాలను పాటించాలి.

**9.3.2.1 శౌచం** – పరిశుద్ధత లేదా స్వచ్ఛత. బాహ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉండాలి. ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి.

**9.3.2.2 సంతోషం** – చట్టపరంగా సంపాదించిన సొమ్ముతో తృప్తి చెందటం.

**యల్లభసే నిజకర్మోపాత్తం। విత్తం తేన వినోదయ చిత్తం॥**

**9.3.2.3 తప**స్సు – మన మనస్సును అదుపులో పెట్టుకోవటానికి పాటించే నియమం ఏదైనా. ఉదా: ఉపవాసం, మౌనవ్రతం.

**9.3.2.4 స్వాధ్యాయం** – శాస్త్రాన్ని అధ్యయనం చేయటం.

**9.3.2.5 ప్రణిధానం** – సర్వస్య శరణాగతి చూపటం. ఏ అనుభవం కలిగినా దాన్ని దైవం ప్రసాదించిన కర్మఫలంగా స్వీకరించటం. మంచి జరిగినా, చెడు జరిగినా, ప్రతికూల ఆలోచనలు చేయకుండా, వాటిని మహాప్రసాదంగా స్వీకరించటం. ఈ ఐదు చేయాల్సిన పనులని నియమ అంటారు. యమ, నియమాలు కలిస్తే నైతిక విలువలు పెంపొందుతాయి.

కర్మయోగం + ఉపాసనాయోగం + నైతిక విలువలు = సాధన చతుష్టయం. జ్ఞానప్రాప్తికి సాధనచతుష్టయం యోగ్యతను ఇస్తాయి.

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూలం : ప్రశ్న – సాధనచతుష్టయం కిమ్ ?

తాత్పర్యం: సాధనచతుష్టము అంటే ఏమిటి ?

మూ : ఉత్తరము – నిత్యానిత్యవివేకః, ఇహాముత్రఫలభోగవిరాగః, శమాదిషట్కసంపత్తిః, ముముక్షుత్వం చేతి ।

తా : 1) నిత్యానిత్యవస్తువివేకము, 2. ఇహాముత్రఫలభోగవిరాగము, 3. శమాది షట్కసంపత్తి, 4. ముముక్షుత్వము – ఈ నాల్గింటికి సాధనచతుష్టయమని పేరు.

మూ : ప్రశ్న – నిత్యానిత్యవస్తువివేకః కః ?

తా : నిత్యానిత్యవస్తువివేకము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – నిత్యవస్త్వేకం బ్రహ్మ। తద్వ్యతిరిక్తం సర్వమనిత్యమ్। అయమేవ నిత్యానిత్యవస్తువివేకః ॥

తా : బ్రహ్మ ఒక్కటే నిత్యమైన వస్తువు. బ్రహ్మకన్నా ఇతరమైనదంతా అనిత్యము. దీనికే నిత్యానిత్యవస్తువివేకమని పేరు.

మూ : ప్రశ్న – విరాగః కః ?

తా : విరాగము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – ఇహస్వర్గభోగేషు ఇచ్ఛారాహిత్యమ్ ॥

తా : ఈ లోకములో గాని, స్వర్గాదిలోకములలో గాని భోగములు పొందాలనే కోరిక లేకపోవటము విరాగము.

మూ : ప్రశ్న – శమాదిసాధనసంపత్తిః కా ?

తా : శమాదిసాధనసంపత్తి అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – శమో దమ ఉపరమస్తితిక్షా శ్రద్ధా సమాధానం చ ఇతి। 1) శమము, 2) దమము, 3) ఉపరమము, 4) తితిక్ష, 5) శ్రద్ధ, 6) సమాధానము – ఈ ఆరింటికి శమాదిసాధనసంపత్తి అని పేరు.

మూ : ప్రశ్న – శమః కః ?

తా : శమము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము : మనోనిగ్రహః ॥

తా : మనోనిగ్రహము శమము.

మూ : ప్రశ్న – దమః కః ?

తా : దమము అంటే ఏమిటి ?

మూ : ఉత్తరము – చక్షురాదిబాహ్యేంద్రియనిగ్రహః ॥

తా : కన్ను మొదలగు బాహ్యేంద్రియముల నిగ్రహము దమము.

మూ : ప్రశ్న – ఉపరమః కః ?

తా : ఉపరమము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – స్వధర్మానుష్ఠానమేవ ॥

తా : స్వధర్మాచరణము ఉపరమము.

మూ : ప్రశ్న – తితిక్షా కా ?

తా : తితిక్ష అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – శీతోష్ణసుఖదుఃఖాదిసహిష్ణుత్వమ్ ॥

తా : చలి – వేడి, సుఖము – దుఃఖము మొదలగు ద్వంద్వములను సహించుటయే తితిక్ష

మూ :ప్రశ్న – శ్రద్ధా కీదృశీ ?

తా : శ్రద్ధ అంటే ఏమిటి?

మూ :ఉత్తరము – గురువేదాంతవాక్యాదిషు విశ్వాసః శ్రద్ధా ॥

తా : గురువాక్యములందు, వేదాంతవాక్యములందు అత్యంత నమ్మకము కలిగియుండుట శ్రద్ధ.

మూ : ప్రశ్న – సమాధానం కిమ్ ?

తా : సమాధానము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – చిత్తైకాగ్రతా.

తా : చిత్తముయొక్క ఏకాగ్రతయే సమాధానము.

మూ : ప్రశ్న – ముముక్షుత్వం కిమ్ ?

తా : ముముక్షుత్వము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – మోక్షో మే భూయాద్ ఇతి ఇచ్ఛా ॥

తా : నాకు మోక్షము కలుగాలి అనే కోరికే ముముక్షుత్వము.

మూ :ఉత్తరము – ఏతత్ సాధనచతుష్టయమ్ ॥

తా : ఇదియే సాధనచతుష్టయము.

మూ : ఉత్తరము – తతస్తత్త్వవివేకస్యాధికారిణో భవన్తి ॥

తా : సాధనచతుష్టయసంపన్నులు తత్త్వవివేకమునకు అధికారులవుతున్నారు.

# 10. శరీరత్రయం

శాస్త్రంలో ఉపయోగించే సాంకేతిక పదజాలాన్ని మనం తత్త్వబోధనుంచి నేర్చుకుంటున్నాం. ఇది వేదాంతబోధ సారాంశాన్నివ్వటమే కాక, సాంకేతిక పదాలను ఒక క్రమపద్ధతిలో యిస్తుంది. సంస్కృతంలో ఈ పదాన్ని **పరిభాషాశబ్దః** అంటారు.

ఇంతకుముందు సాధనచతుష్టయం అనే పరిభాషాశబ్దాన్ని చూశాము. సాధన అంటే అర్హత. చతుష్టయం అంటే నాలుగు విధాలు. ఇంతకు ముందు, ఆ నాలుగు సాధనలూ ఏమిటో, అవి ఎలా సాధించాలో వివరంగా చూశాం. ఈ అర్హతలు ఆత్మజ్ఞానం పొందటానికి కావాలి. ఆత్మజ్ఞానం ద్వారా మోక్షం కలుగుతుంది.

ఇప్పుడు శరీరత్రయం అంటే ఏమిటో చూద్దాం. శరీరం అంటే దేహం, త్రయం అంటే మూడు విధాలు. శరీరత్రయం అంటే ఒక వ్యక్తికి ఉన్న మూడు విధాలైన దేహం – దీన్ని దేహత్రయం అని కూడా అనవచ్చు. **మూడు శరీరాలు –**

1. స్థూలశరీరం
2. సూక్ష్మశరీరం
3. కారణశరీరం

ఈ పై మూడు శరీరాలను విశ్లేషించటానికి వాటికి సంబంధించిన నాలుగు అంశాలను తీసుకుందాము. అవి –

- అవి తయారుచేయబడిన ముడి పదార్థం
- వాటిలోని వివిధ భాగాలు
- కర్మ లేక పనులు
- స్వభావం

## 10.1 స్థూలశరీరం

ఇప్పుడు స్థూలశరీరాన్ని తీసుకుని, ఈ నాలుగు అంశాలనూ క్రమపద్ధతిలో విశ్లేషించుకొద్దాము.

**10.1.1. ముడి పదార్థం** – స్థూలశరీరం ఏ ముడి సరుకుతో తయారుచేయబడింది? శాస్త్రం చెబుతుంది. మనకు కూడా తెలుసు – ఈ స్థూలశరీరం పాంచభౌతికం అనీ, పంచభూతాలనుంచీ తయారుచేయబడిందనీను. ప్రాథమికంగా స్థూలపదార్థం ఐదుగా విభజించబడింది.

1. ఆకాశం, 2. వాయువు, 3. అగ్ని, 4. జలం, 5. పృథ్వీ

అందువల్ల స్థూలశరీరం పంచభూతాలనుంచి ఏర్పడింది. వీటిని సంస్కృతంలో స్థూలపంచభూతాని అంటారు. ఇది మన అనుభవం ద్వారా కూడా నిరూపించవచ్చు, శరీరంలో యివి ఉన్న తీరు –

| | | |
|---|---|---|
| పృథ్వీ | – | శరీర భాగాల రూపంలో |
| నీరు | – | మన శరీరానికి ఆకారాన్నిచ్చే ద్రవరూపంలో |
| అగ్ని | – | శరీర ఉష్ణోగ్రత $98.4^{0}$ ఫారిన్ హీట్ రూపంలో |
| వాయువు | – | ప్రాణవాయువు రూపంలో |
| ఆకాశం | – | శరీరం ఆక్రమించే స్థానం రూపంలో |

ఈ స్థూలశరీరం స్థూలభూతాలవల్ల ఏర్పడటంవల్ల దీన్ని భౌతిక శరీరం అని కూడా అంటారు. భౌతికం అంటే భూతాలనుంచి పుట్టినది. భూతాని అంటే స్థూలపదార్థాలు.

**10.1.2 వివిధ భాగాలు** – శరీరంలో లెక్కలేనన్ని భాగాలున్నాయి. వాటి వివరాల్లోకి వెళితే, అది అనాటమీ అయిపోతుంది. మనం తేలిగ్గా తెలుసుకోవటంకోసం శాస్త్రం మన శరీరాన్ని నాలుగు అంశాలుగా విభజించింది.

| | | |
|---|---|---|
| శరీర మధ్యభాగం | – | ఆత్మ |
| తల | – | శిరస్సు |
| చేతులు | – | పక్షం |
| కాళ్ళు | – | పుచ్ఛం |

శిరపక్షపుచ్ఛ ఆత్మవర్ణన తైత్తరీయ ఉపనిషత్తులో ఉంది.

**10.1.3 కర్మ లేక పనులు** – శరీరాన్ని కేవలం ఒక తాత్కాలిక నివాసంగా అభివర్ణిస్తుంది శాస్త్రం. స్థూలశరీరం అద్దెయిల్లు. మరి దాని అద్దె ఏమిటి? దానికిచ్చే అద్దె కర్మరూపంలో– పుణ్యపాపకర్మల రూపంలో – ఉంటుంది. దాని మూల్యం చెల్లిస్తున్నన్నాళ్ళూ అద్దెయిల్లు ఉంటూనే ఉంటుంది. దాని తర్వాత ఇల్లు ఖాళీ చేయమని తాఖీదు వస్తుంది.

అందువల్ల శరీరం ఒక తాత్కాలిక నివాసం. సంస్కృతంలో దీన్ని ఆయతనం అంటారు. ఈ శరీరంలో ఉంటూనే మనం ప్రపంచంలోని వ్యవహారాలు నడుపుతాం. నిజానికి వ్యవహారం నడిపేముందే, ఒక గూడు ఇవ్వబడుతుంది. ఇంక అక్కడే నివసిస్తూ, మన పని కొనసాగిస్తాం.

**10.1.4 స్వభావం** – ముందుగా శరీరానికి మార్పు చెందే లక్షణం ఉంది. సంస్కృతంలో దీన్ని సవికారం అంటారు. వికారః అంటే మార్పు, సవికారః అంటే మార్పుతో కూడినది. ముందుగా, స్థూలశరీరంలోని మార్పులను (ఆరు) షడ్వికారాలుగా విభజిస్తారు.

**10.1.4.1 మార్పు – షడ్వికారాలు**

| | | |
|---|---|---|
| **అస్తి** | – | తల్లి కడుపులో పిండరూపంలో ఉండటం |
| **జాయతే** | – | పుట్టుక |
| **వర్ధతే** | – | శరీరం పుట్టాక, పెరుగుతూ ఉంటుంది. |
| **విపరిణమతే** | – | రూపపరిణామం. అంటే ఎదుగుదల ఆగిపోతుంది. కాని మార్పు కొనసాగుతుంది. శరీరం యుక్తవయస్సుకి వచ్చాక, అనేక మార్పులకు లోనవుతుంది. దీన్ని ఒక గ్రాఫ్‌మీద చూపిస్తే, గ్రాఫ్ ముందుగా పైకి వస్తూ ఉంటుంది. ఇంక అక్కడ ఆగిపోతుంది. |
| **అపక్షీయతే** | – | క్షీణించటం, వృద్ధాప్యం రావటం |
| **వినశ్యతి** | – | శరీరంయొక్క చావు. దీని తర్వాత శరీరం మనతో ఉండదు. వీటన్నిటినీ కలిపి షడ్వికారాలతో కూడిన శరీరం అంటారు. |

**10.1.4.2 కంటికి కనబడటం** – ఇది శరీరంయొక్క రెండవ లక్షణం. అది మనకీ కనబడుతుంది. ఎదుటివారికీ కనబడుతుంది. మన స్థూలశరీరాన్ని మనం అనుభవించవచ్చు, చూడవచ్చు, ముట్టుకోవచ్చు. ఎదుటివారు కూడా చూడవచ్చు, ముట్టుకోవచ్చు. అందరికీ వస్తువుగా కనబడుతుంది. కాబట్టే దీన్ని స్థూలశరీరం అని అంటారు.

**10.1.4.3 ఆయుః పరిమాణం** – ఇది శరీరంయొక్క మూడవ లక్షణం. దానికొక కాలపరిమితి ఉంటుంది. నిజానికి శరీరం అంటేనే శీర్యమాన స్వభావం అంటే నిరంతరం మార్పు చెంది, క్షీణించేది అని. దేహ అన్న పదం కూడా దిహ్ అన్న ధాతువునుంచి గ్రహించబడింది. ఉపచయ, అపచయ దిహ్ ధాతుః పెరిగీ, తరిగే వస్తువు అని అర్థం. శతమానం భవతి అంటారు కదా. ఆయుఃపరిమాణం వంద సంవత్సరాలు.

**10.2 సూక్ష్మశరీరం**

రెండో శరీరాన్ని సూక్ష్మశరీరం అంటారు. దీని నాలుగు లక్షణాలూ చూద్దాము.

**10.2.1 ముడి పదార్థం** – సూక్ష్మశరీరం, సూక్ష్మపదార్థంతో తయారు చేయబడింది. ఎలాగైతే ఐదు స్థూలభూతాలు ఉన్నాయో అలాగే ఐదు సూక్ష్మభూతాలు కూడా ఉన్నాయి.

1. సూక్ష్మ ఆకాశం, 2. సూక్ష్మవాయువు, 3. సూక్ష్మ అగ్ని, 4. సూక్ష్మజలం, 5. సూక్ష్మపృథ్వీ. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది సూక్ష్మపదార్థంతో చేయబడింది. సూక్ష్మశరీరాన్ని కూడా భౌతిక శరీరం అంటారు.

**10.2.2 వివిధ భాగాలు** – సూక్ష్మశరీరంలో పందొమ్మిది భాగాలున్నాయి. ఒక్కొక్క పనికి పరికరంలా పనిచేస్తుంది. స్థూలశరీరం కేవలం కార్యాలయం అయితే, వ్యవహారాలు నడపటానికి పరికరాలు కావాలి. అందుకని పందొమ్మిది పరికరాలు ఉన్నాయి.

**10.2.2.1 పఞ్చజ్ఞానేన్ద్రియాలు** – ఇవి జ్ఞానానికి సంబంధించిన ఐదు ఇంద్రియాలు – అన్ని లావాదేవీలకి జ్ఞానం మూలకారణం.

కళ్ళు – రంగులు, రూపాలకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రోగేస్తాయి – రూపగ్రాహక చక్షుర్ ఇంద్రియం.

చెవి – శబ్దానికి సంబంధించిన జ్ఞానాన్ని ప్రోగేస్తుంది – శబ్ద గ్రాహక శ్రోత్ర ఇంద్రియం.

ముక్కు – వాసనలకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రోగేస్తుంది – గంధ గ్రాహక ఘ్రాణ ఇంద్రియం.

నాలుక – అన్ని రకాల రుచులకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రోగేస్తుంది – రస గ్రాహక రసన ఇంద్రియం.

చర్మం – స్పర్శకి సంబంధించిన జ్ఞానాన్ని ప్రోగేస్తుంది – స్పర్శ గ్రాహక త్వక్ ఇంద్రియం.

ఇవి ఐదు జ్ఞానేంద్రియాలు. జ్ఞానేంద్రియాలు అంటే స్థూలశరీరానికి చెందిన స్థూలభాగం గురించి కాదని గుర్తుంచుకోవాలి. మనం వాటి సూక్ష్మ లక్షణం గురించి మాట్లాడుతున్నాము. అంటే కన్ను స్థూలశరీరానికి సంబంధించినది. కాని కంటిచూపు సూక్ష్మశరీరానికి సంబంధించినది. అలాగే చెవి స్థూలశరీరానికి సంబంధించినది. శ్రవణశక్తి సూక్ష్మశరీరానికి సంబంధించినది. స్థూలశరీరం భోగ ఆయతనం అంటే భోగాలకు యిల్లు.

**10.2.2.2 పఞ్చకర్మేన్ద్రియాలు** – ఇవి కర్మకు సంబంధించిన ఐదు ఇంద్రియాలు. జ్ఞానేంద్రియాలు బయటినుంచి గ్రహిస్తే, కర్మేంద్రియాలు మన స్పందనను చూపిస్తాయి.

వాగింద్రియం – మాటతో స్పందన

పాణీంద్రియం – చేతులతో చేసే అనేక కర్మలు

పాదేంద్రియం – కాళ్ళతో అనేక చోట్లకి వెళ్ళటం

జ్ఞానేంద్రియాలకీ, కర్మేంద్రియాలకీ మధ్య చక్కని అనుసంధానం ఉంది. చెవులు ప్రసంగం వినాలని కోరితే, కాళ్ళు ప్రసంగం జరిగే చోటుకి తీసుకు వెళతాయి.

పాయురింద్రియం – మలవిసర్జన చేసే ఇంద్రియం

ఉపస్థేంద్రియం – పునరుత్పత్తి. దీనివల్లే ఆ జాతి కొనసాగుతుంది. మూత్రవిసర్జన చేసే ఇంద్రియం

**10.2.2.3 పంచప్రాణాలు**

ఐదు అంశాల ప్రాణం. శక్తిని ఉత్పత్తి చేసేది. మనం కర్మ చేయాలంటే, మనకు నిరంతరం శక్తి కావాలి. కర్మేంద్రియాల వెనుక ప్రాణశక్తి ఉంది. అవి ఐదు ప్రాణశక్తులు.

ప్రాణం – శ్వాస ప్రక్రియ. ఊపిరి పీల్చి, వదలటంవల్ల ప్రాణశక్తి వస్తుంది. ఊపిరి లోపలికి పీల్చటంవల్ల ఆక్సిజన్ లోపలికి ఊపిరి తిత్తులలోకి వెళుతుంది. ఊపిరి బయటకి వదలటంవల్ల కార్బన్ డయాక్సైడ్ బయటకు వెళుతుంది.

అపానం – విసర్జన ప్రక్రియ. శరీరంలోని చెడుని బయటకి వదిలే ప్రక్రియని అపానం అంటారు.

వ్యానం – రక్తప్రసరణ ప్రక్రియ. శరీరం అంతటా ఆక్సిజన్ ప్రసరింపచేయాలి. ప్రేగులు ఆహారాన్ని జీర్ణం చేసాక, ఉత్పత్తి అయిన పోషక వస్తువులని అంతటా ప్రసరింపజేయాలి.

సమానం – జీర్ణప్రక్రియ. మనం తిన్న ఆహారాన్ని అనేక పోషక వస్తువులుగా మారుస్తుంది. కార్బోహైడ్రేట్లు, ప్రోటీనులు, లవణాలు, మినరల్సు.

ఉదానం – తిప్పివేయు ప్రక్రియ. సాధారణంగా మరణసమయంలో పనిచేస్తుంది. ఈ తిప్పివేయు ప్రక్రియ ఒక్కోసారి అత్యవసర పరిస్థితుల్లో కూడా కనిపిస్తుంది. శరీరంలో ఏవైనా టాక్సిన్స్ ఉంటే లోపలికి పోవాల్సిన ఆహారం వెలుపలికి వచ్చేలా చేస్తుంది.

ప్రాణవాయువు ప్రాణశక్తిని యిస్తుంది, దానివల్ల కర్మేంద్రియాలకి శక్తి సమకూరుతుంది. అందుకే ఉపవాసం ఉన్న రోజు కర్మేంద్రియాలకి శక్తి సరిపోదు. ఉదాహరణకు సరిగా మాట్లాడలేము, ఎక్కువ నడవలేము.

మహానైవేద్యం పెట్టే సందర్భంలో ఈ క్రింది మంత్రం జపిస్తాము

**ఓం ప్రాణాయ స్వాహా।**
**ఓం అపానాయ స్వాహా।**
**ఓం వ్యానాయ స్వాహా।**
**ఓం ఉదానాయ స్వాహా।**
**ఓం సమానాయ స్వాహా॥**

**10.2.2.4 చత్వారి అన్తఃకరణాని** – ఇవి నాలుగు అంతఃకరణ భాగాలు.

మనః లేదా మనస్సు – అన్ని రకాల భావోద్రేకాలకి ప్రతీక. ఉద్రేకపరమైన ఆలోచనలు, శంకలు ఉన్నది అని చెప్పవచ్చు. శంక అంటే ఇది చేయాలా వద్దా? ఇలా ఉండాలా లేదా? ఇటువంటి మీమాంసలు. ఆలోచనలను, శంకలను కలిపి సంకల్పం వికల్పం అంటారు.

బుద్ధి లేదా తెలివి – తార్కికశక్తి లేదా నిర్ణయాత్మకశక్తి లేదా విచక్షణాశక్తి లేదా గ్రహించే శక్తి లేదా అర్థం చేసుకునే శక్తి లేదా విశ్లేషించే శక్తి.

చిత్తం లేదా జ్ఞాపకశక్తి – మన మనస్సులో మన అనుభవాలని నిక్షిప్తం చేస్తుంది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలవల్ల కలిగిన అనుభవాల్ని నిక్షిప్తం చేస్తుంది. శాస్త్రం ప్రకారం మనకు ఈ జన్మలోని గతమే కాదు, పూర్వజన్మల్లోని గతం కూడా గుర్తుంటుంది. ఒక్కోసారి మనమేం ప్రయత్నించకుండానే, మనకది ముందే తెలుసనిపిస్తుంది. పాట అద్భుతంగా పాడే వ్యక్తికి అతనికి సంగీతం ముందే వచ్చనిపిస్తుంది.

అహంకారం – మన గురించి చెప్పుకునేది. ఇది మనుష్యుల్లో ఉన్నంతగా జంతువులకి ఉండదు. జంతువులకి వాటి జాతితో గాని, హోదాతో గాని ప్రమేయం లేదు. మన గురించి చెప్పేది అహంకారం.

ఈ నాలుగు కలిపితే చత్వారి అంతఃకరణాని – నాలుగు అంతఃకరణలు.

ఇవన్నీ కలిపి సూక్ష్మశరీరంలోని భాగాలు. సూక్ష్మశరీరం భోగసాధనం.

**గమనిక:** ఇంద్రియాలు సూక్ష్మశరీరంలో అగోచరంగా వుంటాయి. ప్రతి ఇంద్రియానికి తత్సంబంధిత అధిష్ఠానదేవత ఉంటుంది. ఆ దేవత అనుగ్రహంవల్ల ఆ ఇంద్రియం పనిచేస్తుంది. ఉదాహరణకు కన్నులకు సూర్యుడు, చెవులకు దిక్కు, వాక్కుకు అగ్ని అధిష్ఠానదేవతలు. స్థూలశరీరానికి బాహ్యాముఖంగా కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మము, కాళ్ళు, చేతులు మొదలైనవి వుంటాయి. వీటిని గోళకాలు అంటారు.

**10.2.3. కర్మ లేదా పనులు** :– కర్మ అంటే అది చేసే పనులు. అన్ని రకాల పనులు ఈ 19 పరికరాల సహాయంతో సూక్ష్మశరీరం జరుపుతుంది. కొన్ని బాహ్యాప్రపంచంనుంచి గ్రహించటానికయితే, కొన్ని బాహ్యాప్రపంచానికి యివ్వటానికి, మరికొన్ని రెండింటికీ. ఉదా: నోరు.

**10.2.4 స్వభావం** – సూక్ష్మశరీరలక్షణాల కింద ముందుగా మార్పు వస్తుంది.

**10.2.4.1 మార్పు** – ఇది కూడా మార్పులకు లోనవుతుంది. ఈ భాగాలు కూడా క్షీణిస్తాయి. చూపు సరిగా ఆనదు. జ్ఞాపకశక్తి లోపిస్తుంది. బుద్ధిహీనత కలుగుతుంది.

**10.2.4.2 కంటికి కనబడటం** – ఎవరికి వారే సూక్ష్మశరీరం ఉన్నట్టు గ్రహించి, దాన్ని గుర్తించగలరు. అది ఎదుటి వారికి కనబడదు. మన మనస్సేమిటో, మన భావాలేమిటో, మనకే తెలుస్తాయి. కాని ఎదుటివారు మన మనస్సులో ఏముందో దూరి చూడలేరు. అది కేవలం మనకే తెలుస్తుంది కాబట్టే దాన్ని సూక్ష్మశరీరం అన్నారు.

**10.2.4.3 ఆయుః పరిమాణం** – స్థూలశరీరంతో పోలిస్తే సూక్ష్మశరీరానికి యింకా దీర్ఘాయుష్షు ఉంది. స్థూలశరీరం మహా అయితే వందేళ్ళు బ్రతుకుతుంది. కాని సూక్ష్మశరీరం ప్రతిజన్మలోనూ కొనసాగుతుంది. స్థూలశరీరం మారుతుంది కాని మనస్సు కొనసాగుతుంది. అందుకే పూర్వజన్మ సుకృతంవల్ల కొంత లాభం పొందుతున్నాం. అలా సూక్ష్మశరీరం ప్రళయంవరకు కొనసాగి, ప్రళయంలో అవ్యక్తమవుతుంది.

**10.3. కారణశరీరం**

దీనికి కూడా అంశాలను పరిశీలిద్దాము –

**10.3.1 ముడిపదార్థం** – దీన్ని తయారుచేసిన ముడిపదార్థాన్ని కారణపదార్థం అని అంటారు. అది సూక్ష్మాతి సూక్ష్మమైన పదార్థం. దీన్ని వేదాంతపరిభాషలో అవిద్య అంటారు. సాధారణంగా అవిద్య అంటే అజ్ఞానం, కాని ఈ సందర్భంలో దాని అర్థం వేరు. ఒక్కోసారి దీన్నే ప్రకృతి లేదా మాయ అని కూడా అంటారు.

**10.3.2. వివిధ భాగాలు** – కారణశరీరంలోని వివిధ భాగాలు స్థూలశరీరం, సూక్ష్మశరీరాలే. అంటే వాటిని సృష్టించకముందు పిండరూపంలో ఉన్నాయి. అందువల్ల ప్రపంచం సృష్టించబడక ముందు లేదా ప్రళయకాలంలో కారణశరీరంలో సూక్ష్మ, స్థూలశరీరాలు పిండరూపంలో ఉన్నాయి.

ఉదాహరణకు ఇప్పుడు ఉన్న పెద్దచెట్టు కొన్నేళ్ళ క్రితం లేదు. 20 ఏళ్ళ క్రితం ఉంది కాని కనబడకుండా, విత్తనం రూపంలో ఉంది. విత్తనం లేనిదే చెట్టు లేదు. ఇది పదార్థానికి సంబంధించిన సూత్రం. పదార్థాన్ని తయారుచేయలేము, నాశనం చేయలేము. పదార్థం ఎప్పుడూ ఉంటుంది. అలాంటప్పుడు సృష్టి ముందు స్థూల, సూక్ష్మశరీరాలుకూడా పిండరూపంలో ఉన్నాయి. ఈ రెండు శరీరాల పిండరూపాన్ని కలిపి కారణ శరీరం అంటారు. ఒక విత్తనంనుంచి చెట్టు వచ్చినట్టుగా, కారణశరీరంనుంచి స్థూల, సూక్ష్మ శరీరాలు పుడతాయి.

**10.3.3. కర్మ లేదా పనులు** – ఈ రెండూ శరీరాలుగా ఏర్పడటానికి ఇది ఆధారమవుతుంది. అవ్యక్తస్థితినుంచి వ్యక్తస్థితికి వస్తాయి. అలా వ్యక్తమైన వస్తువులు, అవి స్థూలంగా నాశనమైనప్పుడు, మాయమవవు. ఎందుకంటే పదార్థానికి ఎన్నడూ నాశనం లేదు. అందువల్ల అవి నాశనమయినప్పుడు మళ్ళీ అవ్యక్తస్థాయిలోకి వెళ్ళిపోతాయి.

విజ్ఞానశాస్త్రం ప్రకారం నాశనమైన పదార్థం శక్తిగా మారుతుంది. శక్తి అంటే అవ్యక్తపదార్థం. విశ్వంలో, నక్షత్రాలు నిరంతరం ఏర్పడుతూ ఉంటాయి. నాశనమవుతూ ఉంటాయి. అంటే నక్షత్రాలు శక్తిగా మారుతూ ఉంటాయి. ఆ శక్తి మళ్ళీ పదార్థంగా మారుతుంది. శక్తినీ, పదార్థాలనీ ఒకదానిగా ఒకటి మార్చే సూత్రంవల్ల, దీన్ని శాస్త్రంలో వ్యక్త, అవ్యక్త పదార్థాల పరస్పర మార్పు అంటారు.

కారణశరీరంనుంచి, స్థూల, సూక్ష్మ శరీరాలు ఏర్పడుతాయి. మళ్ళీ స్థూల, సూక్ష్మశరీరాలు కారణశరీరంలోకి వెళ్ళిపోతాయి. అందువల్ల కారణశరీరం పని వీటిని ప్రళయకాలంలో అవ్యక్తం చేసి, సృష్టికాలంలో ప్రకటం చేయడం.

**10.3.4 స్వభావం –**

**10.3.4.1. మార్పు –** కారణశరీరంలో మార్పులు రావు.

**10.3.4.2. కంటికి కనబడటం –** స్థూలశరీరాన్ని అందరూ చూడవచ్చు. సూక్ష్మశరీరాన్ని ఎవరికి వారే గ్రహించగలరు. కారణశరీరం ఎవరికీ తెలియదు. అది అగోచరం. అదృశ్యం. అందుకే దాన్ని నిర్వికల్పస్వరూపం అంటారు.

**10.3.4.3. ఆయుః పరిమాణం –** సూక్ష్మశరీరంకన్నా అత్యంత సుదీర్ఘజీవితం ఉంది కారణశరీరానికి. సూక్ష్మశరీరం ప్రళయకాలంలోనన్నా అవ్యక్తమవుతుంది. కాని కారణశరీరం ప్రళయంలో కూడా నాశనమవదు. ప్రళయం అంటే మొత్తం విశ్వం నాశనమవడం. కారణశరీరం మోక్షం పొందినప్పుడు మాత్రమే వెళ్ళిపోతుంది.

ప్రతివ్యక్తి లోనూ ఈ మూడు శరీరాలూ – స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు – ఉంటాయి.

**శరీరత్రయం టూకీగా –**

**స్థూలశరీరం :**

1. ముడిసరుకు – స్థూలపంచభూతాలు
2. కారణం – కర్మలవల్ల ఏర్పడుతుంది
3. వివిధ భాగాలు – తల, మొండెము, చేతులు మరియు కాళ్ళు
4. విధులు – భోగాలు అనుభవించటానికి ఏర్పడిన నిలయం
5. స్వభావం – నాకూ కన్పిస్తుంది, అందరికీ కూడా కన్పిస్తుంది. ఆరు మార్పులకు లోనవుతుంది. (అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి)
6. కాలపరిమితి – వంద ఏళ్ళు (శతమానం భవతి)

**సూక్ష్మశరీరం** :

1. ముడిసరుకు – సూక్ష్మపంచభూతాలు
2. కారణం – కర్మలవల్ల ఏర్పడుతుంది
3. వివిధ భాగాలు – పంచజ్ఞానేంద్రియాలు + పంచకర్మేంద్రియాలు + పంచప్రాణాలు+ నాలుగు అంతఃకరణలు
4. విధులు – భోగాలు అనుభవించటానికి ఏర్పడిన సాధనం
5. స్వభావం – నాకు మాత్రమే తెలుస్తుంది.అన్యులకు తెలియదు. అనేక మార్పులకు లోనవుతుంది
6. కాలపరిమితి – చాలా కాలం – ప్రళయంవరకు

**కారణశరీరం** :

1. ముడిసరుకు – సూక్ష్మకారణపదార్థం లేదా అవిద్య
2. కారణం – అనాదినుంచి వస్తోంది
3. వివిధ భాగాలు – నిర్వికల్పస్వరూపం / బీజరూపం
4. విధులు – స్థూల, సూక్ష్మ శరీరాలకు కారణం
5. స్వభావం – నాకు కన్పించదు. అన్యులకు కూడా కన్పించదు
6. కాలపరిమితి – చాలా చాలా కాలం (మోక్షం వరకు)

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూ : ప్రశ్న – స్థూలశరీరం కిమ్ ?

తా : స్థూలశరీరం అంటే ఏమిటి? ?

మూ : ఉత్తరము – పఞ్చీకృతపఞ్చమహాభూతైః కృతమ్। సత్కర్మజన్యం సుఖదుఃఖభోగాయతనం శరీరమ్ । అస్తి జాయతే వర్ధతే విపరిణమతే అపక్షీయతే వినశ్యతీతి షడ్వికారవద్ ఏతత్ స్థూలశరీరమ్ ॥

తా: పంచీకృతములగు పంచమహాభూతములతో చేయబడినది, సత్కర్మములవల్ల పుట్టినది, సుఖము, దుఃఖము మొదలగు భోగములకు స్థానమైన శరీరము ఉన్నది, పుట్టుచున్నది, పెరుగుచున్నది, మార్పునొందుచున్నది, క్షీణించుచున్నది, నశించుచున్నది అను ఆరువికారములు కల్గినది స్థూలశరీరము.

మూ : ప్రశ్న – సూక్ష్మశరీరం కిమ్ ?

తా : సూక్ష్మశరీరం అంటే ఏమిటి?

ఉత్తరము – అపఞ్చీకృతపఞ్చమహాభూతైః కృతం సత్కర్మజన్యం సుఖదుఃఖాదిభోగసాధనం, పఞ్చజ్ఞానేన్ద్రియాణి, పఞ్చకర్మేన్ద్రియాణి పఞ్చప్రాణాదయః మనశ్చైకం బుద్ధిశ్చైకా ఏవం సప్తదశకలాభిః సహ యత్తిష్ఠతి తత్ సూక్ష్మశరీరమ్॥

తా : పంచీకృతములు కాని పంచసూక్ష్మభూతములచే ఏర్పడునది, పూర్వజన్మ పుణ్యమున కల్గునది, సుఖము దుఃఖము మొదలగు భోగములకు సాధనమైనది, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, ఐదు ప్రాణాదులు, మనస్సు బుద్ధి అనే పదిహేడు కళలతో ఉన్నది సూక్ష్మశరీరము.

**గమనిక:** చత్వారీ అంతఃకరణలు ఇక్కడ రెండుగా చెప్పబడింది. అవి మనస్సు + బుద్ధి

మూ : శ్రోత్రం త్వక్ చక్షుః రసనా ఘ్రాణమితి పఞ్చజ్ఞానేన్ద్రియాణి ।

తా : 1) చెవులు 2) చర్మము 3) కన్నులు 4) నాలుక 5) ముక్కు అనే ఐదు జ్ఞానేంద్రియములు.

మూ : శ్రోత్రస్య దిగ్దేవతా । త్వచో వాయుః। చక్షుషః సూర్యః। రసనాయా వరుణః। ఘ్రాణస్య అశ్వినౌ। ఇతి జ్ఞానేన్ద్రియదేవతాః॥

తా : చెవులకు దిక్కు, చర్మమునకు వాయువు, కన్నులకు సూర్యుడు, నాలుకకు వరుణుడు, ముక్కుకు అశ్వినీ దేవతలు అధిష్ఠానదేవతలు.

మూ : శ్రోత్రస్య విషయః శబ్దగ్రహణమ్। త్వచో విషయః స్పర్శగ్రహణమ్। చక్షుషో విషయః రూపగ్రహణమ్। రసనాయా విషయః రసగ్రహణమ్। ఘ్రాణస్య విషయో గన్ధగ్రహణమితి॥

తా : చెవులకు శబ్దమును వినుట, చర్మమునకు స్పర్శను గ్రహించుట, కన్నులకు రూపమును చూచుట, నాలుకకు రుచిని గ్రహించుట, ముక్కుకు (గంధము) వాసనను పీల్చుట కార్యములు.

మూ : వాక్పాణిపాదపాయూపస్థానీతి పఞ్చకర్మేన్ద్రియాణి ॥

తా : వాక్కు(మాట్లాడే ఇంద్రియము), పాణి(చేతులు), పాదములు (కాళ్ళు), పాయువు (గుదము), ఉపస్థము (జననేంద్రియము) అనే ఐదు కర్మేంద్రియములు.

మూ : వాచో దేవతా వహ్నిః । హస్తయోరిన్ద్రః। పాదయోర్విష్ణుః। పాయోర్మృత్యుః। ఉపస్థస్య ప్రజాపతిః । ఇతి కర్మేన్ద్రియ దేవతాః॥

తా : వాక్కుకు అగ్ని, చేతులకు ఇంద్రుడు, పాదములకు విష్ణువు, గుదముకు మృత్యువు, జననేంద్రియముకు బ్రహ్మ అధిష్ఠానదేవతలు.

మూ : వాచో విషయః భాషణమ్। పాణ్యోర్విషయః వస్తుగ్రహణమ్। పాదయోర్విషయః గమనమ్। పాయోర్విషయః మలత్యాగః। ఉపస్థస్య విషయః ఆనన్ద ఇతి॥

తా : వాక్కుకు మాట్లాడుట, చేతులకు వస్తువులను గ్రహించుట, పాదములకు నడచుట, పాయువుకు మలమును విసర్జించుట, ఉపస్థముకు సంభోగానందమును అనుభవించుట కార్యములు.

మూ : ప్రశ్న : కారణశరీరం కిమ్ ?

తా : కారణశరీరం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – అనిర్వాచ్యానాద్యవిద్యారూపం శరీరద్వయస్య కారణమాత్రం సత్ స్వరూపాఽజ్ఞానం నిర్వికల్పకరూపం యదస్తి తత్ కారణశరీరమ్ ॥

తా : నిర్వచించుటకు వీలుకానిది; అనాదియైన అవిద్యకు (అజ్ఞానమునకు) కారణమైనది; స్థూల, సూక్ష్మశరీరములకు కారణమైనది; స్వరూపజ్ఞానము లేనిది; నిర్వికల్పక రూపమైనది కారణశరీరము.

# 11. అవస్థాత్రయం – కోశపంచకం

అవస్థాత్రయం మూడు దశల అనుభవాన్ని సూచిస్తుంది. కోశపంచకం మన శరీరంలోని ఐదు విభాగాలను సూచిస్తుంది.

**11.1 అవస్థాత్రయం – మూడు దశల అనుభవం** – ఒక్కొక్క అవస్థకూ మూడు అంశాలను పరిశీలిద్దాం. దాని ద్వారా ఈ మూడు అవస్థలనూ అర్థం చేసుకోవచ్చు.

ముందుగా మనస్సు పరిస్థితిని చూద్దాం. ఎందుకంటే ప్రతి అవస్థలోనూ మనస్సు ప్రముఖపాత్రని పోషిస్తుంది. తర్వాత అనుభవం స్వభావం చూద్దాం. ఆ తర్వాత మాధ్యమం గురించి విశ్లేషించవచ్చు.

**11.1.1 జాగ్రదావస్థ** – అవస్థ అంటే ఒక అనుభవం లేదా దశ. జాగ్రదావస్థ అంటే మెలకువగా ఉన్న దశ.

**11.1.1.1 మనస్సు** – జాగ్రదావస్థలో మనస్సు లేదా అంతఃకరణం పూర్తిగా వికసించి పనిచేస్తుంది. అంటే అన్ని పరికరాలూ – భావపరమైన, తార్కిక ఆలోచనాశక్తి, అహం, జ్ఞాపకశక్తి అన్నీ పూర్తిగా పనిచేస్తాయి. దీన్ని పూర్ణవికాసం అని కూడా అంటారు. అంతఃకరణం పూర్తిగా విచ్చుకుందన్నమాట. నాలుగు పరికరాలూ పనిచేస్తున్నాయి కాబట్టి, నాలుగు అనుభవాలూ ఉంటాయి. భావాలు, ఆలోచనలు, విచక్షణాశక్తి, కొత్త జ్ఞానసముపార్జన, కొత్త అనుభవసముపార్జన.

**11.1.1.2 స్వభావం** – జాగ్రదావస్థలో బాహ్యప్రపంచాన్ని అంటే మన శరీరం, మనస్సులకు విభిన్నంగా ఉన్నదానిని అనుభవిస్తాము.

అది బాహ్యప్రపంచం అవటంతో అది స్పష్టంగా కంటికి కనబడే అనుభవం. అది కంటికి కనబడే వస్తువులతో కూడినది కాబట్టి ఆ అనుభవం కూడా కంటికి కనబడే అనుభవం. అందువల్ల అది బాహ్యమైనది, కంటికి కనబడేది, అందరికీ అందుబాటులో ఉండేది.

ఇది అందరికీ కనబడే ప్రపంచం కాబట్టి ఈ అనుభవం వ్యక్తిగతం కాదు. ఈ విశేషణాలు స్వప్నావస్థతో పోలిస్తే అర్థమవుతాయి. వ్యక్తిగతం కాదు అంటే, అందరికీ అందుబాటులో ఉండేది. ఈ అనుభవం ఇంద్రియజన్యం అంటే ఇంద్రియాలవల్ల కలిగింది. జాగ్రదావస్థలో ప్రపంచాన్ని ఇంద్రియాల ద్వారా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల ద్వారా, వాటివల్ల కలిగిన సుఖదుఃఖాల ద్వారా కలిగిన స్పందనల ద్వారా అనుభవిస్తాము.

అందువల్ల మన అనుభవం బాహ్యమైనది, కంటికి కనబడేది, వ్యక్తిగతం కానిది, ఇంద్రియ జన్యమైనది.

ఈ అనుభవంలో రెండు రకాలు ఉంటాయి. ప్రపంచంనుంచి అనుభవాన్ని పొందుతాం. అనుభవం భోగప్రధానం. ప్రపంచానికి తిరిగి యిస్తాం. అంటే మనం కర్తా, భోక్తా – చేసేవారం, అనుభవించేవారం. శాస్త్రంలో ప్రపంచాన్ని భోగభూమి అనీ కర్మభూమి అనీ అంటారు.

**11.1.1.3 మాధ్యమం** – జాగ్రదావస్థలో మనం ఇంద్రియాల ద్వారా ప్రపంచాన్ని చూస్తున్నాం. ఇంద్రియాలని వాడాలంటే భౌతికశరీరం కావాలి. ఎందుకంటే ప్రతి ఇంద్రియానికి భౌతికస్థానం కావాలి.

శాస్త్రంలో భౌతిక స్థానాన్ని గోళకం అంటారు. ప్రతి ఇంద్రియానికీ ఒక గోళకం కావాలి. చక్షురింద్రియానికి కళ్ళు గోళకాలు. శ్రవణ ఇంద్రియానికి చెవులు గోళకాలు. ఇంద్రియాలు సూక్ష్మశరీరానికి చెందినవయితే, గోళకాలు స్థూలశరీరానికి చెందినవి. అందువల్ల ఇంద్రియాలకి గోళకాలు కావాలి. గోళకాలకి భౌతిక శరీరం కావాలి. అంటే ఇంద్రియాలు పనిచేయటానికి స్థూలశరీరం కావాలి. జాగ్రదావస్థ ఇంద్రియ జన్యం కాబట్టి **జాగ్రదావస్థను స్థూలశరీర ప్రధాన అవస్థ** అంటాం. స్థూలశరీరం లేకపోతే, బాహ్యప్రపంచాన్ని అనుభవించలేము.

**11.1.2 స్వప్నావస్థ** – స్వప్నావస్థ అంటే కలలో జరిగే అనుభవం. ఇందులోని మూడు అంశాలూ చూద్దాం.

**11.1.2.1 మనస్సు** – స్వప్నావస్థలో మన జ్ఞాపకశక్తి మాత్రమే పనిచేస్తుంది. జాగ్రదావస్థలో మనం ప్రోగేసిన అనుభవాలన్నీ మనస్సులో నిక్షిప్తమై ఉంటాయి. జాగ్రదావస్థలో మనస్సు శబ్ద, స్పర్శ, రూప, రస గంధ అనుభవాలని టేప్ రికార్డర్‌లాగా రికార్డు చేస్తుంది. అది కేవలం బాహ్యప్రపంచాన్నే కాదు, సుఖదుఃఖాలనే భావాలని కూడా రికార్డు చేస్తుంది. దాన్ని చిత్తం అంటారు. లోపల రికార్డయి ఉన్న వాటిని, బయటకి పంపిస్తుంది వీడియో కాసెట్ ప్లేయర్‌లాగా. అందువల్ల మనం కలలో అనుభవించే భావాలు, కొత్తగా అందుకున్న భావాలు కాదు, ముందే మనస్సులో నిక్షిప్తమై ఉన్నవి. కలలో జరిగేదంతా జ్ఞాపకంలోంచి వెలికితీసినవి. తక్కిన ప్రమాణాలు పనిచేయవు. మనస్సు, తార్కిక ప్రవృత్తి, అహం – యివేవీ పనిచేయవు. కలలో కనబడే అహం కూడా జ్ఞాపకశక్తినుంచి వచ్చిన అహమే కాని కొత్తగా పుట్టిన అహం కాదు. అందువల్ల స్వప్నావస్థలో మనస్సు పాక్షికంగా పనిచేస్తోంది. నాలుగు అంతఃకరణలలో ఒకటే పనిచేస్తోంది. దాన్ని చిత్తం అంటారు అందుకని స్వప్నావస్థని అర్థవికాసం అని కూడా అంటారు.

**11.1.2.2. స్వభావం** – స్వప్నావస్థలో కనబడే ప్రపంచం అంతర్గత ప్రపంచం. ఇది మన వ్యక్తిగత, స్వంత జ్ఞాపకశక్తినుంచి పుట్టింది కాబట్టి ఇది బాహ్యప్రపంచం కాదు. అసలు

స్వప్నప్రపంచానికీ, బాహ్యప్రపంచానికీ సంబంధం లేదు. మనం ఒకచోట పడుకుని, ఇంకోచోటు గురించి కలలు కనవచ్చు. అందువల్ల అది అంతర్గతప్రపంచం.

రెండోది, అది అంతర్గతప్రపంచం కాబట్టి, మన జ్ఞాపకాల్లోంచి పుట్టింది కాబట్టి, దాన్ని వాసనామయప్రపంచం అంటారు. మన ఆలోచనల నుంచి పుట్టింది కాబట్టి అది కంటికి కనబడేది కాదు. బాహ్యప్రపంచం భౌతికప్రపంచం కాబట్టి కంటికి కనబడుతుంది. స్వాప్నిక ప్రపంచం వాసనామయ ప్రపంచం కాబట్టి కంటికి కనబడదు.

కలలో మనకు కనబడే ప్రపంచం ఎదుటివారికి కనబడదు. అందువల్ల ఇది వ్యక్తిగతప్రపంచం.

ఇంద్రియ గోచరం కాదిది. ఇంద్రియజన్యప్రపంచం కాదు. ఇది వాసనాజన్యప్రపంచం. మనం కలలో చూసేది, ఇలలో అనుభవించింది. విసిపి ద్వారా చూడగలిగేది విసిఆర్‌లో రికార్డయినది మాత్రమే. ఏమీ చూడందే, ఏమీ గుర్తు తెచ్చుకోలేం. అందుకని ప్రతి స్వప్నావస్థా జాగ్రదావస్థమీద ఆధారపడి ఉంది.

ఒక్కోసారి మీకు అనిపించవచ్చు – నేను జాగ్రదవస్థలో కనీవినీ ఎరుగని అంశాలు నాకు కలలో కనిపిస్తున్నాయి అని. దానికి కారణాలు వీటిలో ఏవైనా అయి ఉండవచ్చు–

జాగ్రదావస్థలో ప్రోగేసిన అనేక వస్తువుల సముదాయంనుంచి మనం స్వప్నావస్థలో వస్తువులని సృష్టిస్తాము. ఇవి ఆలోచనల ప్రధానం కాబట్టి, ఆలోచనలు సృష్టిలో ఉండవు కాబట్టి మనకు అంతా కలగాపులగంగా ఉంటుంది. అది అవ్యక్తపదార్థం అవుతుంది.

ఒక్కోసారి మనం జాగ్రదావస్థలో ఊహించినవి, మనస్సులో నిక్షిప్తమై అడుగుకి వెళ్ళిపోతాయి. మనం మళ్ళీ ఏదైనా విన్నా, చూసినా, చదివినా అవి ఆలోచనల రూపంలో స్వప్నావస్థలో బయటకి వస్తాయి.

ఒక్కోసారి కొన్నిటిని ఈ జన్మలో అనుభవించకపోయినా, అవి పూర్వజన్మస్మృతులు అయిఉండవచ్చు. పూర్వజన్మకీ, ఈ జన్మకీ మధ్య స్థూలశరీరమే మారుతుంది. కాని సూక్ష్మశరీరం కొనసాగుతుంది. అందుకే పిల్లలు ఒక్కోసారి అకారణంగా నవ్వటమో, ఏడవటమో చేస్తారు. దీన్ని పూర్వజన్మతో ముడిపెడతారు. ఇంకా ప్రస్తుతజన్మ జ్ఞాపకాలు గట్టిగా ఏర్పడలేదు కాబట్టి, ఇవి పూర్వజన్మస్మరణలు కావచ్చు అంటారు. దీనికి సాక్ష్యం లేదు.

కొంతమంది తమకి వచ్చే కలలు భవిష్యత్తుకి సంబంధించినవి అంటారు.వారికి భవిష్యత్ దర్శనం కలుగుతుంది. ఇది గతానికి సంబంధించినది కాదు కాబట్టి, గత అనుభవంలోంచి వచ్చిందనీ, వాసనాజన్యం అనీ అనలేము. జ్ఞాపకాలనుంచి పుట్టిందీ అనీ అనలేం. స్వప్నావస్థ నిర్వచనం ప్రకారం అది జ్ఞాపకాలనుంచి పుడుతుంది కాబట్టి ఈ అనుభవాలను

స్వప్నావస్థతో తీసుకోలేం. అలా భవిష్యత్తు గురించి కలలు వస్తే, అది మనసుకున్న ప్రత్యేక లక్షణంగా చెప్పవచ్చు.

ఏ సంఘటన అన్నా విత్తు రూపంలో ఉంటుంది. అప్పుడు చాలా సూక్ష్మంగా ఉంటుంది కాబట్టి మనకు అర్థం కాదు. కాని మనస్సుని సున్నితంగా మలిస్తే, పురాణాల్లో చూపిన త్రికాలజ్ఞానులలాగా మారవచ్చు. అది యోగులకి అనుభవం అవుతుంది కాని, మనకు ఏదో అనుకోకుండా జరుగుతుంది ఎప్పుడైనా.

**11.1.2.3 మాధ్యమం** – స్వప్నావస్థ జ్ఞాపకాలమీద ఆధారపడింది. జ్ఞాపకాలు చిత్తానికి సంబంధించినవి. చిత్తం సూక్ష్మశరీరానికి చెందినది. అందువల్ల స్వప్నం కూడా సూక్ష్మశరీరానికి చెందింది. అందువల్ల **స్వప్నావస్థని సూక్ష్మశరీర ప్రధాన అవస్థ** అంటారు.

**11.1.3. సుషుప్తి అవస్థ** – గాఢనిద్రను సుషుప్తి అంటారు. ఇది కలలు రాని నిద్రావస్థ.

**11.1.3.1 మనస్సు** – జాగ్రదావస్థలో మనస్సు పూర్ణవికాసం గాను, స్వప్నావస్థలో అర్థవికాసం గానూ ఉంటుందికాని, సుషుప్తి అవస్థలో మనస్సు పని దాదాపు శూన్యమనే చెప్పవచ్చు.భావపర మనస్సు పనిచేయదు కాబట్టి, భావాలు లేవు, తార్కికప్రమాణం లేదు కాబట్టి జ్ఞానం లేదు. జ్ఞాపకశక్తి పనిచేయదు కాబట్టి జ్ఞాపకాలు లేవు. అహం ప్రమాణం పనిచేయదు కాబట్టి నేను పడుకుంటున్నాను అనే భావన కూడా లేదు.

**11.1.3.2. స్వభావం** – ఇంద్రియాలు పనిచేయవు కాబట్టి బాహ్యప్రపంచం లేదు. జ్ఞాపకాలు పనిచేయవు కాబట్టి, అంతర్గత ప్రపంచం లేదు. బాహ్యామైన, కంటికి కనబడే, వ్యక్తిగతం కాని ప్రపంచమూ లేదు. అంతర్గత, కంటికి కనబడని, వ్యక్తిగతప్రపంచమూ లేదు. అందువల్ల ఇది అనుభవశూన్యం. దీన్ని అజ్ఞాన అనుభవం అంటారు. అంటే పూర్తి అజ్ఞానం లేదా శూన్యం.

**11.1.3.3. మాధ్యమం** – ఇంద్రియాలు పనిచేయవు కాబట్టి స్థూలశరీరం లేదు. జ్ఞాపకాలు పనిచేయవు కాబట్టి సూక్ష్మశరీరం లేదు.

స్థూల, సూక్ష్మశరీరాలు మాయమయినట్టుగా కనబడినప్పుడు కారణశరీరం ప్రధానమవుతుంది.పనిచేయటం లేదంటే లయమయినట్టే. అందుకని **సుషుప్తి అవస్థను కారణశరీర ప్రధాన అవస్థ** అంటారు. కారణ శరీర ప్రధాన అవస్థలో మన అంతర్గత, బాహ్య అనుభవాలు చలనరహితంగా ఉండి, మళ్ళీ మర్నాడు పొద్దున లేవగానే చలనంలోకి వస్తాయి. **అవస్థాత్రయం టూకీగా –**

| | | | |
|---|---|---|---|
| జాగ్రదావస్థ | – మెలకువ స్థితి | – విశ్వః | – మనస్సు పూర్తిగా పనిచేస్తుంది. |
| స్వప్నావస్థ | – కలలుకనే స్థితి | – తైజసః | – మనస్సు పాక్షికంగా పనిచేస్తుంది. |
| సుషుప్తి అవస్థ | – గాఢనిద్ర స్థితి | – ప్రాజ్ఞ | – మనస్సు అజ్ఞానంలో ఉంటుంది. |

## 11.2 కోశపంచకం

ఇప్పుడు శరీరానికి సంబంధించిన ఐదు కోశాలను చూద్దాం. ఇది శరీరత్రయాన్ని ఇంకో కోణంలోంచి చూపిస్తుంది. అంటే మూడు శరీరాలను ఇప్పుడు ఐదు కోశాలుగా చూస్తాం. శరీరం ఒకటే, దృక్పథం మారుతుంది.

శరీరత్రయం ముడి పదార్థాన్నిబట్టి విభజింపబడింది.

స్థూలశరీరం స్థూలపదార్థంనుంచి వచ్చింది
సూక్ష్మశరీరం సూక్ష్మపదార్థంనుంచి వచ్చింది
కారణశరీరం కారణపదార్థంనుంచి వచ్చింది

ఇదే శరీరాన్ని ఆ భాగాలు చేసే పనులనిబట్టి కోశాలుగా విభజించారు. స్థూల, కారణ శరీరాల్లో ఒక్కొక్క కోశం ఉంటే సూక్ష్మశరీరంలో మూడు కోశాలున్నాయి.

స్థూలశరీరం – అన్నమయకోశం
సూక్ష్మశరీరం – ప్రాణమయకోశం
మనోమయకోశం
విజ్ఞానమయకోశం
కారణశరీరం – ఆనందమయకోశం

**11.2.1 అన్నమయకోశం – ఆహారం (అనాటమీ)** – అన్నమయకోశం లేదా స్థూలశరీరాన్ని అనాటమీగా అభివర్ణించవచ్చు. శరీరాకృతి, స్థూలశరీరంలోని అనేక అంగాలు, అనేక భాగాలను అన్నమయకోశం అంటారు. ఇది అన్నం లేదా ఆహారంనుంచి శక్తి పొందుతుంది కాబట్టి దీన్ని అన్నమయకోశం అంటారు.

**11.2.2 ప్రాణమయకోశం – శక్తి (ఫిజియోలజీ)** – ఇది ఫిజియెలాజికల్ వ్యవస్థకు చెందినది. అనాటమీ శరీరంలోని వివిధభాగాలను సూచిస్తే, ఫిజియోలజీ వాటి ధర్మాలను వివరిస్తుంది. అందుకని ప్రాణమయకోశం ధర్మాలకు చెందింది. అందుకే మరణ సమయంలో, సూక్ష్మశరీరం దేహాన్ని విడిచి వెళ్ళుతుందంటే, దానితోపాటు మూడుకోశాలు కూడా వెళతాయన్నమాట. అవి –

ప్రాణమయకోశం
మనోమయకోశం
విజ్ఞానమయకోశం

మరణంలో ప్రాణమయకోశం శరీరాన్ని వీడుతుంది కాబట్టి, శరీరభాగాలు ఉన్నా కూడా శరీరధర్మాలు ఉండవు. అందుకే మరణం సంభవించినప్పుడు ఏవైనా అంగాల

మార్పిడి సాధ్యమవుతుంది. అనాటమీ స్థూలశరీరానికి చెందింది కాబట్టి అది ఉంటుంది మరణం తర్వాతకూడా. ఫిజియోలజీ సూక్ష్మశరీరానికి చెందింది కాబట్టి, అది ఉండదు.

ప్రాణమయ కోశాన్ని క్రియాశక్తిః అని కూడా అంటారు.

| | | |
|---|---|---|
| పఞ్చప్రాణాః | – | శక్తినిచ్చేవి |
| పఞ్చకర్మేన్ద్రియాణి | – | పరికరాలనిచ్చేవి |
| అందువల్ల శక్తి + పరికరాలు | – | క్రియాశక్తి |

దీంట్లో పది అంగాలు ఉంటాయి.

**11.2.3 మనోమయకోశం – మనస్సు (సైకాలజీ)** – దీన్ని సైకలాజికల్ వ్యవస్థ అనచ్చు. భావాలు, సందేహాలు అన్నీ మనోమయకోశం లేదా ఇచ్ఛాశక్తిలోకి వస్తాయి. క్రియాశక్తికి ముందు ఇచ్ఛాశక్తి ఉంటుంది. ఎందుకంటే కోరిక ఉంటే క్రియ చేయాలనిపిస్తుంది. అందువల్ల మనోమయ కోశం ప్రాణమయకోశాన్ని పనిచేయటానికి ఉసిగొల్పుతుంది. ఈ మనోమయ కోశంలో ఆరు అంగాలున్నాయి. అవి –

– పంచజ్ఞానేంద్రియాలు

– మనస్సు (చిత్తం, అహంకారాలతో కూడినది).

**11.2.4 విజ్ఞానమయకోశం – జ్ఞానం (నేర్చుకునే స్థాయి)** – ఇది నేర్చుకునే స్థాయి. మనోమయకోశం ఇచ్ఛాశక్తికి సంబంధించినదైతే, విజ్ఞానమయకోశం జ్ఞానశక్తికి సంబంధించినది.

ఇంకోవిధంగా చెప్పాలంటే, విజ్ఞానమయకోశం తెలుసుకుంటుంది, మనోమయకోశం కోరుతుంది. ప్రాణమయకోశం పనిచేస్తుంది.

ఉదాహరణకి సంగీతసభలు జరుగుతున్న రోజుల్లో ఏ సభలో ఏ కచేరి అవుతుందో తెలుసుకోవటానికి మనం వార్తాపత్రిక చూస్తాం. అప్పుడు విజ్ఞానమయకోశం పనిచేస్తోందన్న మాట. తర్వాత దేనికి వెళ్ళాలో నిశ్చయించుకోవాలి. ఇది మనోమయకోశం. మనం ఒక సభకి వెళ్ళాలి. అప్పుడు ప్రాణమయకోశం పనిచేస్తుంది.

ఇందులో కూడా ఆరు అంగాలు ఉన్నాయి.

– పంచజ్ఞానేంద్రియాలు

– బుద్ధి (ఇక్కడ కూడా చిత్తం, అహంకారాలతో కూడినది).

నిజానికి భావపరమైనశక్తి, తార్కికశక్తి వివిధ అంగాలకి చెందినవి కావు. ఒక అంగమే కాని అది చేసే పనినిబట్టి పేరు మారుతుంది.

- ఆలోచన పనిచేస్తే, అది బుద్ధి.
- భావపరమైన పని చేస్తే, అది మనసు.
- జ్ఞాపకశక్తి పనిచేస్తే, అది చిత్తం.

అంటే మనోబుద్ధి చిత్త అహంకారాలు వేరే వేరే అంగాలకి చెందినవి కావు, ఒకటే అంగానికున్న నాలుగు పేర్లు.

**11.2.5 ఆనందమయకోశం – ఆనందం (అంతఃచేతనం)** – ఇది కారణశరీరానికి సరిపోలుతుంది. అంతః చేతనంతో పోల్చవచ్చు.

మనలో ఏ భావాలు ప్రస్ఫుటంగా ఉంటాయో, మన ప్రవర్తన, స్వభావం అంతా వాటి ప్రకారం ఉంటాయి. దీన్ని అంతఃచేతనం అంటారు.

ఒక్కోసారి మనకు కలిగే ఉద్రేకమైన అనుభవాన్ని మన అహం అందుకునేందుకు సిద్ధంగా ఉండదు. దానికి భగవంతుడు వేరే ఏర్పాటు చేశాడు. ఒక్కోసారి విపరీతమైన శారీరక నొప్పి కలిగినప్పుడు, ఒక దశ దాటాక, ఆ నొప్పి కూడా తెలీని పరిస్థితికి చేరుకుంటాము. దీన్ని ఫిజియోలాజికల్ ఫ్యూజింగ్ అంటారు. అలాగే ఒక్కోసారి మనస్సుకు తెలియదు నొప్పి. దాన్ని సైకలాజికల్ ఫ్యూజింగ్ అంటారు.

ఏదైనా అనుభవాన్ని భరించలేనప్పుడు దాన్ని బయటకి పంపాలి, ఏడుపు ద్వారానో, అరుపు ద్వారానో, కాని అప్పుడప్పుడు ఏదో కారణాలవల్ల మనకు ఏడుపు రాదు, అరవలేం, మాట్లాడలేం కూడా. అహం దాన్ని భరించలేకపోతుంది. అప్పుడు దాన్ని అంతఃచేతనంలో పడేస్తుంది.

తర్వాతెప్పుడో అదను చూసుకుని బయటకి వస్తుంది. అందుకే ఒక్కోసారి మనకు కారణం లేకుండా ఏడుపొస్తుంది, లేదా కోపం వస్తుంది. లోపల మండుతున్న భావాలన్నీ ఒక్కసారిగా బయటకి వస్తాయన్నమాట. అలాంటి భావాలూ, అలాంటి ప్రవర్తనా అంతఃచేతనానికి సంబంధించినవి.

అంతఃచేతనం పనిచేస్తోందని తేలికగా ఎప్పుడు చెప్పవచ్చంటే బయట పరిస్థితికీ, స్పందనకీ పొత్తు కుదరనప్పుడు. ఉదాహరణకు చిన్న తప్పుకే మండిపడతారు కొంతమంది. చిన్న అనుభవాలే, అంతఃచేతనంలో దాగి ఉన్న అనుభవాలను తట్టి లేపుతాయి. అంతఃచేతనంలో ఉంది కాబట్టి, మనకు తెలియదు కాబట్టి, మనం హాయిగా అజ్ఞానంలో ఉన్నాం. అందుకని ఆనందమయకోశం అంటారు. కారణశరీరంలోని సుషుప్తి అవస్థలో మనకు ఏ బాధా తెలీదు. ఇవీ కోశపంచకంలోని ఐదు విభాగాలు.

**కోశపంచకం టూకీగా –**

| | | | |
|---|---|---|---|
| 1. అన్నమయకోశం | – | స్థూలశరీరంలోని అనేక అంగాలు | |
| 2. ప్రాణమయకోశం | – | పంచప్రాణాలు + పంచకర్మేంద్రియాలు | – క్రియాశక్తి |
| 3. మనోమయకోశం | – | పంచజ్ఞానేంద్రియాలు + మనస్సు | – ఇచ్ఛాశక్తి |
| 4. విజ్ఞానమయకోశం | – | పంచజ్ఞానేద్రియాలు + బుద్ధి | – జ్ఞానశక్తి |
| 5. ఆనందమయకోశం | – | కారణశరీరం | |

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూ : ప్రశ్న – అవస్థాత్రయం కిమ్ ?

తా : అవస్థాత్రయము అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థాః।

తా : జాగ్రదావస్థ (మెలుకువగా ఉండుట), స్వప్నావస్థ (కలలు కనుట), సుషుప్త్యవస్థ (నిద్రించుట) అను మూడవస్థలకు అవస్థాత్రయమని పేరు.

మూ : ప్రశ్న – జాగ్రదవస్థా కా ?

తా : జాగ్రదావస్థ అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – శ్రోత్రాదిజ్ఞానేన్ద్రియైః శబ్దాదివిషయైశ్చ జ్ఞాయతే ఇతి సా జాగ్రదవస్థా।।

తా : చెవులు – చర్మము – కన్నులు – నాలుక – ముక్కు అను ఐదు జ్ఞానేంద్రియములచేత, శబ్దము – స్పర్శము – రూపము – రసము – గంధము అను ఐదు విషయములను తెలియజేయునది జాగ్రదావస్థ.

మూ : స్థూలశరీరాభిమానీ ఆత్మా విశ్వ ఇత్యుచ్యతే ।।

తా : స్థూలశరీరాభిమాని అగు ఆత్మ విశ్వుదని చెప్పబదును.

మూ : ప్రశ్న – స్వప్నావస్థా కేతి చేత్ ?

తా : స్వప్నావస్థ అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – జాగ్రదవస్థాయాం యద్దృష్టం యచ్ఛ్రుతం తజ్జనితవాసనయా నిద్రాసమయే యః ప్రపఞ్చః ప్రతీయతే సా స్వప్నావస్థా।।

తా : జాగ్రదావస్థలో చూడబడినది, వినబడినది ఏదిగలదో దానివల్ల పుట్టిన సంస్కారమువల్ల నిద్రాసమయములో ఏ ప్రపంచము కనబడుతున్నదో దానికి స్వప్నావస్థ అని పేరు.

మూ : సూక్ష్మశరీరాభిమానీ ఆత్మా తైజస ఇత్యుచ్యతే ।

తా : సూక్ష్మశరీరాభిమాని అగు ఆత్మ తైజసుదని చెప్పబదును.

మూ : ప్రశ్న – అతః సుషుప్త్యవస్థా కా ?

తా : తరువాత సుషుప్త్యవస్థ అంటే ఏమిటి?

మూ :ఉత్తరము – అహం కిమపి న జానామి సుఖేన మయా నిద్రాఽనుభూయత ఇతి సుషుప్త్యవస్థా ॥

తా : నాకేమీ తెలియదు. నేను సుఖముగా నిద్రించుచున్నాను అనేది సుషుప్త్యవస్థ (నిద్రావస్థ).

మూ : కారణశరీరాభిమానీ ఆత్మా ప్రాజ్ఞ ఇత్యుచ్యతే ॥

తా : కారణశరీరాభిమాని అగు ఆత్మ ప్రాజ్ఞుడని చెప్పబడును.

మూ : ప్రశ్న : పంచకోశాః కే ?

తా : పంచకోశములు అంటే ఏమిటి?

మూ : ఉత్తరము: అన్నమయః ప్రాణమయః మనోమయః విజ్ఞానమయః ఆనన్దమయశ్చేతి॥

1) అన్నమయము, 2) ప్రాణమయము, 3) మనోమయము, 4) విజ్ఞానమయము, 5) ఆనందమయము అనేవి పంచకోశములు.

మూ : ప్రశ్న – అన్నమయః కః ?

తా : అన్నమయకోశం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – అన్నరసేనైవ భూత్వా అన్నరసేనైవ వృద్ధిం ప్రాప్య అన్నరూపపృథివ్యాం యద్విలీయతే తదన్నమయఃకోశః స్థూలశరీరమ్.

తా : అన్నరసముచే పుట్టి, అన్నరసముచే వృద్ధి చెంది, అన్నరూపపృథ్వీలో విలీనమగునది అన్నమయకోశం. ఇది స్థూలశరీరము.

మూ : ప్రశ్న – ప్రాణమయః కః?

తా : ప్రాణమయకోశం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – ప్రాణాద్యాః పఞ్చవాయవః వాగాదీన్ద్రియపఞ్చకం ప్రాణమయః కోశః ।

1) ప్రాణము 2) అపానము 3) వ్యానము 4) ఉదానము 5) సమానము అను పంచవాయువులతో 1) వాక్కు 2) పాణి 3) పాదము 4) పాయువు 5) ఉపస్థము అను పంచకర్మేంద్రియములతో కూడినది ప్రాణమయకోశం.

మూ : ప్రశ్న – మనోమయః క ?

తా : మనోమయకోశం అంటే ఏమిటి?

మూ: ఉత్తరము– మనశ్చ జ్ఞానేన్ద్రియపఞ్చకం మిలిత్వా యో భవతి స మనోమయః కోశః॥
తా : పఞ్చ జ్ఞానేన్ద్రియములతో కూడిన మనస్సు మనోమయకోశం.

మూ : ప్రశ్న – విజ్ఞానమయః కః ?
తా : విజ్ఞానమయకోశం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – బుద్ధిఃజ్ఞానేన్ద్రియపఞ్చకం మిలిత్వా యో భవతి స విజ్ఞానమయః కోశః॥

తా : పఞ్చజ్ఞానేన్ద్రియములతో కూడిన బుద్ధి విజ్ఞానమయకోశం.

మూ : ప్రశ్న – ఆనన్దమయః కః ?
తా: ఆనన్దమయకోశం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – ఏవమేవ కారణశరీరభూతావిద్యాస్థ మలినసత్త్వం ప్రియాదివృత్తిసహితం సత్ ఆనందమయః కోశః॥
తా: ఈ విధముగా అవిద్యతో మలినసత్త్వమై ప్రియాదివృత్తితో కూడి ఆనందముతో నిండిన కారణశరీరము ఆనందమయకోశం.

మూ : ఏతత్ కోశపఞ్చకమ్ ॥
తా : దీనికే కోశపంచకమని పేరు.

# 12. ఆత్మ

శరీరత్రయం అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలని చూశాము. అవి పదార్థంతో చేయబడ్డాయి. పదార్థాన్ని భౌతికం అనవచ్చు. పదార్థం జడంగా ఉంటుంది. దీన్నిబట్టి మనం కొన్ని ముఖ్యమైన ఉపసిద్ధాంతాలను గ్రహించవచ్చు.

మొదటి విషయం ఏ పదార్థమైనా జడంగా ఉంటుంది. వేదాంతశాస్త్రం ప్రకారం జడం అంటే చైతన్యం లేనిది, చైతన్యాన్ని పుట్టించలేనిది. అంటే అది చైతన్యగుణకమూ కాదు. చైతన్యజనకమూ కాదు. శరీరత్రయం జడం కాబట్టి, పదార్థంతో చేయబడింది కాబట్టి, దానికి స్వతహాగా చైతన్యం లేదు, చైతన్యం పుట్టించలేదు. అంటే భౌతికశరీరం జడం. సూక్ష్మశరీరంలో భాగమైనమనసు జడం. కారణశరీరం కూడా జడమే. అందువల్ల

**శరీరత్రయం జడం భౌతికత్వాత్ ఘటవత్।**

ఇది తార్కికంగా మనకు కలిగిన ఉపసిద్ధాంతం.

తార్కికంగా అది జడమేమో గాని, మన అనుభవం వేరే ఉంది! మూడు శరీరాలు జడంగా లేవే! స్థూలశరీరానికి చైతన్యం ఉంది. చుట్టుప్రక్కల ఏమవుతుందో తెలుస్తోంది. అలాగే మనసుకి కూడా అనేక విషయాలు తెలుస్తున్నాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే శరీరత్రయానికి చైతన్యం ఉన్నట్టుగా అనుభవం చెబుతుంది.

తర్కం అది జడం అంటోంది. అనుభవం అది చైతన్యం అంటుంది. ఈ విభిన్న దృక్పథాలను కలిపేదెలా? మనకు ఒక స్త్రీ చాలా బీదదని తెలుసు. కాని ఆమె ఒక విందుకు ఖరీదైన దుస్తులు, బంగారు ఆభరణాలు వేసుకుని వచ్చింది. ఏమిటి దాని అర్థం? ఆమెకి ఖరీదైన దుస్తులు, ఆభరణాలు స్వతహాగా లేకపోయినా ఎవరి దగ్గరో అరువు తీసుకుంది. ఏమీలేని వ్యక్తి అన్నీవున్న దానిలా కనబడింది. ఎలా? బాహ్యాలంకరణ చేసుకోవటంవల్ల. అందువల్ల శరీరత్రయానికి స్వాభావికచైతన్యం, అంటే సహజచైతన్యం లేదు. ఈ శరీరత్రయానికి ఆగంతుక చైతన్యం లేదా అరువు తెచ్చుకున్న చైతన్యం ఉంది. అరువు తెచ్చుకున్న చైతన్యంవల్ల మూడు శరీరాలూ నెమలిలా గర్వంగా నాట్యం చేస్తున్నాయి. లేకపోతే శిల్పానికీ, మన శరీరానికీ తేడా లేదు.

శాస్త్రపరంగా చెప్తే పాంచభౌతిక శరీరం అంటాము. విజ్ఞానశాస్త్రపరంగా అయితే శరీరము రసాయినాల మిశ్రమం అంటాము.

సంక్షిప్తంగా ఒకసారి చూస్తే – శరీరత్రయం భౌతికం. అందువల్ల శరీరత్రయం జడం కాని జడంగా ఉండాల్సిన శరీరంలో చైతన్యం ఉంది. అంటే శరీరత్రయంలో అరువుతెచ్చుకున్న చైతన్యం ఉంది.

శరీరత్రయం అరువు తెచ్చుకుందంటే, అప్పిచ్చేవాడొకడు ఉండాలి కదా. అంటే మనలో ఒక చైతన్యం ఉండాలి, చైతన్యాన్ని శరీరానికి అప్పివ్వటానికి. ఈ అప్పిచ్చే చైతన్యం మనిషి శరీరంలో ఉన్న నాలుగవ అంశం. మొదటి మూడూ.

1. స్థూలశరీరం 2. సూక్ష్మశరీరం 3. కారణశరీరం

ఈ మూడూ కానిది అసలు చైతన్యాన్ని అప్పిచ్చేది ఏమిటి? దీన్నే ఆత్మ అంటారు.

### 12.1 శరీరంలోని నాలుగవ అంశం

శరీరత్రయాన్ని చైతన్యవంతం చేస్తుంది ఆత్మ. దీన్ని 'చిత్' అంటారు సంస్కృతంలో. దీన్ని అర్థం చేసుకోవటానికి ఒక ఉదాహరణ బల్బు. బల్బు తనంతట తాను వెలుగలేదని మనకు తెలుసు. విద్యుచ్ఛక్తి దాన్ని వెలిగింపచేస్తుంది. కాని విద్యుచ్ఛక్తి కంటికి కనబడదు. బల్బే కనపడుతుంది. అలాగే ఆత్మ. అది కంటికి కనబడదు. దాని స్వభావమేమిటి?

### 12.2 పుస్తకం ఉదాహరణ

ఆత్మ స్వభావం అర్థం చేసుకోవాలంటే ఈ ఉదాహరణ చూడండి. మీరు ఒక పుస్తకం చేతిలో పట్టుకుని, నా చేతిలో ఏం ఉంది అని అడుగుతారు. పుస్తకం ఉంది అని జవాబు వస్తుంది. ఇంకేముంది అంటే ఏమీలేదు అనే జవాబు వస్తుంది. నిజానికి పుస్తకంమీద ఇంకొకటుంది. అది చాలా స్పష్టంగా తెలుస్తుంది. కాని దాన్ని పట్టించుకోము. నిజానికి దానివల్లే మనం పుస్తకాన్ని చూడగలుగుతున్నాము. అలా మనని పుస్తకాన్ని చూడనిస్తున్నది కాంతి లేదా వెలుతురు. పుస్తకం ఈ కాంతిలో వెలుగుతోంది, దాని చుట్టూ కాంతి ఉంది. కాంతి – పుస్తకం ద్వారా ఇప్పుడు ఈ కింది విషయాలు గమనిద్దాం:

- కాంతి, పుస్తకంలో ఒక భాగం గాని, లక్షణం గాని, పుస్తకంనుంచి ఉత్పత్తి అయిన వస్తువు గాని కాదు.
- కాంతి స్వతంత్ర వస్తువు. అది పుస్తకమంతటా వ్యాపించి, పుస్తకాన్ని ప్రకాశింప చేస్తుంది.
- కాంతి, పుస్తకం సరిహద్దులకే పరిమితమవలేదు.
- కాంతి, పుస్తకం నాశనమయితే నాశనమవదు. పుస్తక పతనానంతరం కూడా కాంతి ఉంటుంది.
- కాంతి, పుస్తకం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. కాంతిని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి కాంతి కనిపించదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

### 12.3 చైతన్యం లక్షణాలు

చైతన్యాన్ని కాంతితో, శరీరాన్ని పుస్తకంతో పోల్చవచ్చు. ఇప్పుడు ఇవే సూత్రాలను చైతన్యానికి అన్వయిస్తూ తిరిగి చెప్పవచ్చు.

- చైతన్యం, శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు గాని కాదు.
- చైతన్యం, స్వతంత్ర వస్తువు. అది శరీరమంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపచేస్తుంది.
- చైతన్యం, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
- చైతన్యం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

## 12.4 ఆత్మ లక్షణాల విశ్లేషణ

ఆత్మ లక్షణాలలో కొన్నింటి విశ్లేషణ చూద్దాము.

**12.4.1 ఆత్మా చైతన్యస్వరూపః** – ఆత్మ చైతన్యస్వరూపం. ఇది వస్తుస్వరూపం కాదు. ఎందుకంటే ఆత్మ కూడా, శరీరత్రయంలాగా ఇంకో వస్తువు అయితే, ఆత్మకూడా జడం అవుతుంది. అప్పుడు ఆత్మకూడా ఇంకోచోటునుంచి చైతన్యాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. అది మళ్ళీ మరోచోటునుంచి చైతన్యాన్ని తీసుకోవాలి. అలా అంతులేకుండా సాగుతుంది. కాని బింబచైతన్యం, ప్రతిబింబచైతన్యం కాదు. ప్రతిబింబచైతన్యం బింబచైతన్యం కాలేదు.

**12.4.2 ఆత్మా స్వతన్త్రః** – ఆత్మ స్వతంత్రం. ఎందుకంటే అది తన ప్రకాశానికి వస్తువుమీద ఆధారపడలేదు. అది ఉనికికి కాని, ఉత్పత్తికి కాని దేనిమీద ఆధారపడలేదు.

అంతకుముందు వస్తువుకి చైతన్యం లేదన్నాం. వస్తువుకి చైతన్యం ఉంటే, అప్పుడు చైతన్యం వస్తువుమీద ఆధారపడాలి. అలాగే వస్తువు చైతన్యాన్ని ఉత్పత్తి చేసినా, చైతన్యం వస్తువుమీద ఆధారపడాలి. చైతన్యం వస్తువు కాదు కాబట్టి, వస్తువుచేత ఉత్పత్తి చేయబడలేదు కాబట్టి, ఆత్మ స్వతంత్రమైనది.

**12.4.3 ఆత్మా నిర్గుణః** – ఆత్మ పదార్థం కాదు కాబట్టి దానికి పదార్థంలా గుణాలు ఉండవు. మనకు తెలిసిన గుణాలన్నీ మనం ప్రత్యక్షంగా కంటితో గాని, తక్కిన ప్రమాణాలతో కాని చూస్తాం. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ గుణాలు పదార్థానికి చెందినవి. అందువల్ల ఆత్మ నిర్గుణమైనది.

**12.4.4 ఆత్మా నిత్యః** :– ఆత్మ– పదార్థంమీద కాని, శరీరత్రయంమీద కాని ఆధారపడదు కాబట్టి, పదార్థం నాశనమైనా, ఆత్మకి నాశనం లేదు. బల్బు మాడిపోయినా, విద్యుత్తు

ఉన్నట్టే. దీపంలో వ్యక్తం అవనంత మాత్రాన విద్యుత్ లేనట్టు కాదు. శరీరం నాశనమైనా ఆత్మ ఉంటుంది. ఆత్మకి మరణం లేదు కాబట్టి కాలపరిమితి లేదు. కాలాతీతమైనది.

**12.4.5 ఆత్మా సర్వగతః** – కాలం, ప్రదేశం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ఆత్మ కాలానికి ముడిపడి లేనట్టే, ఒక ప్రదేశానికి పరిమితమై లేదు. ఇది కేవలం శరీరత్రయంలో లేదు, విద్యుత్ కేవలం ఒక్క బల్బులో లేనట్టుగా. అందుకని ఆత్మ సర్వగతం లేదా సర్వవ్యాపి. అన్ని శరీరత్రయాల వెనుక కూడా ఉంది. శరీరాలు ఎన్నో! వాటి స్వరూపభేదాలెన్నో! (బల్బుల భేదాలలాగే). ఆత్మ అతి చిన్నప్రాణియైన చీమలో ఉంది, అతి పెద్ద ప్రాణియైన ఏనుగులోనూ ఉంది. అందుకని ఆత్మ సర్వగతం.

**12.4.6 ఆత్మా ఏకః** – అన్ని శరీరాల వెనక, ఒకే చైతన్యము ఉన్నప్పుడు, శరీరాలు అనేకమైనా ఆత్మ ఒక్కటే అవాలి. ఆత్మ ఏకమైనది, ఆత్మ అద్వైతమైనది, రెండో వస్తువు లేనిది.

**12.4.7 ఆత్మా సచ్చిదానన్దస్వరూపః**

ఆత్మకి మరణం లేదు కాబట్టి – వర్తమాన, భూత, భవిష్యత్తులకి అతీతంగా ఉంది కాబట్టి – దీన్ని సత్ అంటారు.

ఆత్మకి సరిహద్దులు లేవు. ఒక్క దేశానికి పరిమితమవలేదు. అందుకని – ఆత్మ అనంతమైనది అంటారు.

ఆత్మ చైతన్యస్వరూపము, జడమైన శరీరాలకు అది చైతన్యాన్ని యిస్తుంది కాబట్టి దీన్ని చిత్ అంటారు.

పరిపూర్ణత్వభావనని ఆనందం అంటారు. అనుకున్నపని ఏదైనా పూర్తి అయితే కలిగే భావన ఆనందం. పూర్ణత్వం లేనిది దుఃఖాన్ని కలగజేస్తుంది. ఆనందం కలిగితే పరిపూర్ణత్వం ఉంటుంది. అందుకని సత్, చిత్ అనంతః ఎప్పుడూ సత్ చిత్ ఆనందం కూడా. అందువల్ల ఆత్మ సచ్చిదానందస్వరూపం.

**12.5 ఆత్మానాత్మవివేకః**

పదార్థం కాని చైతన్యం ఆత్మ. పదార్థంతో కూడిన శరీరత్రయం అనాత్మ. వేదాంతంలో మొట్టమొదటి అడుగు ఆత్మ – అనాత్మ వివేకం. అనాత్మ స్థాయిలో మూడు శరీరాలున్నాయనీ, ఆత్మ అనే ఒక అంశం ఉందనీ, నేను అనే వ్యక్తిని పదార్థ అనాత్మ, పదార్థం కాని ఆత్మల మిశ్రమమనీ తెలుసుకోవాలి. అందుకని జడ అచేతన అంశగా భావించుకునే బదులు, మన దృష్టిని చేతన అంశ, సచ్చిదానంద ఆత్మవైపుకి మళ్ళించాలి. అనాత్మ అభిమానత్యాగం చేసి ఆత్మ అభిమాననిష్ఠలో ఉండాలి.

ఇలా ఆలోచనలను మార్చటానికి గొప్ప సాధన కావాలి. మనం నేను శరీరాన్ని అన్న భావనలో ఏళ్ళ తరబడి కూరుకుపోయాము.

శంకరాచార్యులవారు అన్నారు."**ఉదరనిమిత్తం బహుకృతవేషః**" విద్యనభ్యసించి, ఉద్యోగం సంపాదించి, సంపాదించిన డబ్బుని శరీరపోషణకీ, శరీరాన్ని తృప్తిపరచటానికీ ఖర్చుపెడతాము. భవిష్యత్తు ప్రణాళికలు కూడా శరీరపరిరక్షణకే వేస్తాము. ఎవరైనా నువ్వెవరు అంటే మన వివరాలు శరీరత్రయానికి సంబంధించినవి యిస్తాము. ప్రాపంచిక జగత్తులో వ్యవహారం నడపటానికి ఈ వివరాలు అవసరమే, కాదనటం లేదు, కాని మన అసలు వివరాలు వేరు.

## 12.6 ఆత్మ లక్షణాలు

నేను జడమైన శరీరాన్ని కాదు, నేను చైతన్యవంతమైన ఆత్మను అని చెబుతుంది శాస్త్రం. అంటే చైతన్యం అంటే ఆత్మ. ఆత్మ అంటే నేను. మూడు పదాలూ ఒకటే. కాబట్టి అంతకు ముందు చూసిన చైతన్యం లక్షణాలనే ఇప్పుడు 'నా' పరంగా చూస్తే యింకా బాగా అర్థమవుతుంది.

అంటే కాంతికి వాడిన పదాలని చైతన్యంకి అన్వయించినట్టే, అవే పదాలని 'చైతన్యం' మాట తీసి 'నేను'కి అన్వయిద్దాం.

- నేను, శరీరంలో ఒక భాగంగాని, లక్షణంగాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువును గాని కాదు.
- నేను స్వతంత్ర వస్తువును. నేను శరీరమంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తాను.
- నేను, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- నేను, శరీరం నాశనమయితే నాశనము అవను. శరీర పతనానంతరం కూడా నేను ఉంటాను.
- నేను, శరీరం లేక పోయినా ఉంటాను కాని తెలియను. నన్ను ప్రతిబింబింప చేసే మాధ్యమం లేదు కాబట్టి నేను తెలియను. అంతమాత్రాన నేను లేనట్టు కాదు.

### 12.6.1 సచ్చిదానన్దమ్ ఆత్మస్వరూపం

చైతన్యం ఆత్మ, ఆత్మస్వరూపం 'నేను' అని తెలుసుకున్నాం కాబట్టి నువ్వెవరు అంటే యిలా వివరించవచ్చు.

నేను సచ్చిదానంద ఆత్మను, చైతన్యస్వరూపుడను, నిర్గుణుడను, నిత్యుడను, సత్యమైనవాణ్ణి, సర్వగతుడను, ఏకమైనవాణ్ణి. ఇది నా జన్మహక్కు. ఇలా చెప్పగలగటానికి సాధన చేయాలి. ఇది సాధన చేస్తే వేదాంతబోధ తలకెక్కుతుంది. ఇది మొదటి పాఠం.

## 12.7 దృగ్ద్ృశ్యవివేకము

ఎలా సాధన చేయాలి? దీనికి శాస్త్రం ఒక పద్ధతిని యిచ్చింది. దాన్ని ఉపాయం అంటారు. ఈ ఉపాయం పేరు దృగ్ద్ృశ్యవివేకము. ఈ పద్ధతిలో వస్తుప్రధాన అనాత్మ నేను కాదని మనస్సుకు శిక్షణ యిస్తాము. వస్తుప్రధాన అనాత్మ ద్వారా చేతన ఆత్మను నేను అని తెలుసుకోవాలి. అంటే నేను స్కూటర్‌ని వాడకూడదనటం లేదు. స్కూటర్‌ని వాడాలి కాని నేనే స్కూటర్ అనకూడదు.

### 12.7.1 ప్రాథమిక సూత్రం 1

నాచే చూడబడే వస్తువు ఏదైనా నాకన్నా భిన్నమైనది. చూడబడే వస్తువు కర్మ. చూసే వ్యక్తి, అంటే నేను, కర్త. నేను చూసేది వేరు. నేను వేరు.

ఇది అర్థం చేసుకోవటానికి ఒక ఉదాహరణ చూద్దాం. కళ్ళు ప్రపంచంలో అన్ని వస్తువులనీ చూడగలవు, తమని తాము తప్ప. అలాగే మన ఫోనునుంచి అందరి ఫోన్లకూ ఫోను చేయగలము, మనకు మనం తప్ప. దీన్నిబట్టి ఒక సూత్రాన్ని అర్థం చేసుకోవచ్చు. కర్మ వేరు, కర్త వేరు. చూడబడే వస్తువు కర్మ. దాన్ని దృశ్యం అంటారు. చూసే వ్యక్తి కర్త. అతన్ని దృక్ అంటారు. అంటే దృక్ వేరు, దృశ్యం వేరు. అన్నిటినీ అనుభవించే నేను, నేను అనుభవించేవాటికి భిన్నంగా ఉన్నాను అని తెలుసుకోవటమే దృక్ - దృశ్యవివేకం.

మన ముందున్న ప్రపంచాన్నంతా ఈ విధంగా నేను కాదు, నేను కాదు అని చెప్పుకుంటూ పోవచ్చు – నేను పుస్తకాన్ని కాను, నేను బల్లను కాను, నేను గాడిదను కాను. మనం అనుభవించే వస్తువు మనం కాదు అని తెలుసుకున్నప్పుడు ఇంకొంచెం ముందుకు వెళతాము.

నేను శరీరాన్ని కాను – దాని అనుభవాలు నాకు తెలుసు.
నేను మనస్సును కాను – దాని ప్రతి ఆలోచనా నాకు తెలుసు.

అంటే శరీరం, మనస్సుకు కూడా బాహ్యప్రపంచంలాగే రాకపోకలు ఉన్నాయి.

జాగ్రదావస్థలోనే శరీరం నాకు అందుబాటులో ఉంది. స్వప్నావస్థలో, సుషుప్తి అవస్థలో లేదు. మనసు జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ అందుబాటులో ఉంటుంది కాని, సుషుప్తి అవస్థలో లేదు. అంటే బాహ్యప్రపంచంలాగే ఇవి రెండూ మన అనుభవానికి వచ్చే వస్తువులు. అందుకని యివన్నీ అనాత్మ, మననుంచి భిన్నంగా ఉన్నవి.

కాకపోతే, మనసు, శరీరం, నాకు, అంటే ఆత్మకు, చాలా దగ్గరగా అంటిపెట్టుకుని ఉన్నాయి కాబట్టి, వాటిని నేనుగా పొరపాటుపడుతున్నాను. 'నేను' అన్న పదానికి వాటిని వాడుతున్నాను. నీ ముందు ఏ వస్తువులు ఉన్నాయి అని ఎవరైనా అడిగితే, ఎన్నో వస్తువుల

పేర్లు చెబుతాము కాని, నా కళ్ళకి ధరించిన కళ్లజోడుని చెప్పము. అది కూడా ఒక వస్తువే. ఆ వస్తువు ద్వారా చూస్తున్నాను కాబట్టి అది ఒక మాధ్యమం. కాని ఈ మాధ్యమాన్ని కర్తతో కలిపేస్తున్నాము. మనస్సు, శరీరం – కళ్ళజోడుకన్నా యింకా దగ్గరగా ఉన్నాయి, అందుకని వీటిని కర్తతో కలిపేసుకున్నాము.

అందుకని ఇవి కర్త కాదు, ఇవి కూడా కర్మలని, కాకపోతే కర్తకి దగ్గరగా ఉన్నాయని గ్రహించాలి. అంటే దృక్ అనే నేను వేరు, శరీరం, మనసు అనే దృశ్యాలు వేరు. వస్తువులను అనుభవించే నేను వేరు, నేను అనుభవించే వస్తువులు వేరు అన్న వివేకాన్ని పెంపొందించుకోవాలి. అప్పుడు నేను ఆత్మని, సాక్షిచైతన్యాన్ని అని తెలుసుకుంటాము.

### 12.7.2 ప్రాథమిక సూత్రం 2

నేను అనే కర్తకు కర్మయొక్క లక్షణాలు ఉండవు. నిజానికి నేను అనుభవించే లక్షణాలన్నీ బాహ్యప్రపంచానికో, శరీరానికో, మనస్సుకో వర్తిస్తాయి. అందుకని ఈ లక్షణాలన్నీ అనాత్మ లక్షణాలు. నేను ఈ లక్షణాలను సాక్షీభూతంగా చూసే ఆత్మను, కాబట్టి నాకు ఈ లక్షణాలు ఉండవు.

**మనోబుద్ధ్యహఙ్కారచిత్తాని నాహం।**
**న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే।**
**న చ వ్యోమ భూమిర్న తేజో న వాయుః।**
**చిదానందరూపః శివోహం శివోహమ్॥**

నేను మనస్సు కాదు, బుద్ధి కాదు, అహంకారం కాదు, చిత్తం కాదు, నేను చెవి కాదు, ముక్కు కాదు, కన్ను కాదు, నేను ఆకాశం కాదు, భూమి కాదు, అగ్ని కాదు, వాయువు కాదు, నేను ఆనందరూపాన్ని, నేను సచ్చిదానందరూపాన్ని.

ఈ రెండు సూత్రాలని ఉపయోగించి, చూడబడే వస్తువుకంటే నేను భిన్నమైనవాడను, నేను అనుభవించే వస్తువులయొక్క లక్షణాలు నాకు అంటవు అని తెలుసుకుంటాం. నేను పూర్ణస్వతంత్రుడను.

సంక్షిప్తంగా 'నేను' ఆత్మస్వరూపం –

- చైతన్యస్వరూపమ్
- స్వతన్త్రమ్
- నిర్గుణమ్
- నిత్యమ్
- సర్వగతమ్
- ఏకమ్
- సచ్చిదానన్దస్వరూపమ్

**అహమ్ ఆత్మా అస్మి – నేను ఆత్మను**

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూ : ప్రశ్న – తత్త్వవివేకః కః ?

తా : తత్త్వవివేకం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – ఆత్మా సత్యం, తదన్యత్ సర్వమిథ్యేతి॥

తా : ఆత్మ ఒక్కటే సత్యమైనది. ఆత్మకన్నా యితరమైనదంతా మిథ్య అను వివేకమే తత్త్వవివేకము.

మూ : ప్రశ్న – ఆత్మా కః ?

తా : ఆత్మ అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – స్థూలసూక్ష్మకారణశరీరాత్ వ్యతిరిక్తః పఞ్చకోశాతీతః సన్ అవస్థాత్రయ సాక్షీ సచ్చిదానన్ద స్వరూపః సన్ యస్తిష్ఠతి స ఆత్మా ॥

తా : స్థూలశరీరము, సూక్ష్మశరీరము, కారణశరీరము అను మూడింటికన్నా భిన్నమైనది, పంచకోశములకు అతీతమైనది, అవస్థాత్రయమునకు సాక్షియైనది, సచ్చిదానందస్వరూపమైనదిగా ఏది ఉన్నదో అదే ఆత్మ.

మూ : మదీయం శరీరం, మదీయాః ప్రాణా మదీయం మనశ్చ మదీయా బుద్ధిర్మదీయం అజ్ఞానమితి స్వేనైవ జ్ఞాయతే । తద్యథా మదీయత్వేన జ్ఞాతం కటక–కుండల–గృహాదికం తథా పఞ్చకోశాదికం స్వస్మాద్భిన్నం మదీయత్వేన జ్ఞాతమాత్మా న భవతి॥

తా : ఈ శరీరము నాది, యీ ప్రాణములు నావి, యీ మనస్సు నాది, యీ బుద్ధి నాది, యీ జ్ఞానము నాది, అనే అనుభవములతో శరీరాదులు ఆత్మకన్నా భిన్నమైనవని ఆత్మచేతనే తెలియబడుచున్నవి. ఎందుకంటే, యీ కంకణములు నావి, యీ కుండలములు నావి, యీ యిల్లునాది అనుచోట కంకణాదులు తనకన్నా ఎలా భిన్నమైనవో అలాగే శరీరాదులు కూడా తనకన్నా భిన్నమైనవి. లోకములో సామాన్య మానవుడు కూడ యీ దేహము నాది అని భావిస్తున్నాడు. కాని నేనే దేహమని భావించటం లేదు. కాబట్టి యీ పంచకోశములు ఆత్మకావు.

ప్రశ్న : ఆత్మా తర్హి కః ?

తా : అలా అయితే ఆత్మ అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – సచ్చిదానన్దస్వరూపః ॥

తా : సచ్చిదానంద స్వరూపమే ఆత్మ.

మూ : ప్రశ్న – సత్ కిమ్ ?

తా : సత్ అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – కాలత్రయే అపి తిష్ఠతీతి సత్ ॥

తా : భూత (జరిగినది) భవిష్యత్ (జరుగబోవునది) వర్తమానములను (జరుగుచున్నది) మూడు కాలములలోనూ ఏది ఉంటుందో అది సత్ అవుతుంది.

మూ : ప్రశ్న : చిత్ కిమ్ ?

తా : చిత్ అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – జ్ఞానస్వరూపః॥

తా : జ్ఞానస్వరూపమైనది చిత్.

మూ: ప్రశ్న – ఆనన్దః కః ?

తా : ఆనందం అంటే ఏమిటి?

మూ : ఉత్తరము – సుఖస్వరూపః॥

తా : సుఖస్వరూపమే ఆనందము.

మూ : ఏవం సచ్చిదానన్దరూపం స్వాత్మానం విజానీయాత్॥

తా : ఇటువంటి సచ్చిదానంద స్వరూపమైన తన ఆత్మను తెలుసుకోవాలి.

# 13. సృష్టి

ఇంతవరకూ చూసిన శరీరత్రయం గానీ, అవస్థాత్రయం గానీ వ్యక్తిపరంగా చూశాం. సంస్కృతంలో దాన్ని వ్యష్టి అంటారు. ఇప్పుడు సమష్టి ప్రపంచం చూద్దాం.

సృష్టి ఎలా జరిగింది? సృష్టి ఎలా జరిగిందో అర్థం చేసుకునే ముందు, అసలు సృష్టి అన్నపదమే సరియైన పదం కాదు. పదార్థం, శక్తులని కొత్తగా సృష్టించలేము, నాశనం చేయలేము అని విజ్ఞానశాస్త్రం చెప్పటానికి ఎన్నో సంవత్సరాల ముందే సాంఖ్య సత్కార్యవాదంలో సాంఖ్యసిద్ధాంతులు ఈ విషయాన్ని వివరించారు.

అందువల్ల సృష్టి అన్న పదం వాడితే, అవ్యక్తంగా ఉన్నది వ్యక్తమవటం అన్న మాట. అయితే, అవ్యక్తంగా ఉన్నది ఏది?

**13.1 వ్యక్తం/అవ్యక్తం** – వ్యక్తం, అవ్యక్తం అంటే ఏమిటి? అవ్యక్తం అంటే ప్రమాణ అగోచరం. అంటే దానికి ఉనికి ఉంది కాని కంటికి కనబడదు. పాలలోని వెన్నలాగా. వెన్న ఉంది కాని కంటికి కనబడదు. వ్యవహారానికి అందదు. అందుకని వెన్నలేదని అనుకుంటాము, ఉందని తెలిసినా కూడా.

ఇది సృష్టిలో ప్రతిదానికీ వర్తిస్తుంది. ఉనికి లేని వస్తువేదీ లేదు. అది బీజరూపంలో ఉంటుంది. తర్వాత దానికి నామరూపాలు వస్తాయి. అంటే వ్యవహారానికి అందుబాటులోకి వస్తుంది.

**బీజస్యాన్తరివాఙ్కురో జగదిదం ప్రాఙ్ నిర్వికల్పం పునః॥**

నిర్వికల్పం అంటే విభజనలేని, వ్యక్తం కాని, వ్యవహారం లేని రూపం. దీన్ని కారణ అవస్థ అంటారు. సృష్టిలోని అన్ని రకాల శక్తులకీ, అన్ని రూపాల వస్తువులకీ, మూలాధారాన్ని కారణ అవస్థ అంటుంది శాస్త్రం. కారణ అవస్థని మాయ అంటారు. శరీరత్రయం కూడా మాయలోకే వస్తుంది. అంటే సృష్టి జరుగకముందు ఒకటి ఉన్నది. అది మాయ.

ఇంతకు ముందు ఆత్మ గురించి నేర్చుకున్నప్పుడు, ఆత్మ చైతన్యస్వరూపమనీ, అది దేశకాలాలకు అతీతమనీ, అందువల్ల అది శాశ్వతమనీ చూశాం. అంటే దీని అర్థం, సృష్టి జరగక ముందు చైతన్యస్వరూపం కూడా ఉంది. ఇప్పుడు మనం సృష్టి జరుగకముందు రెండు వస్తువులు ఉన్నాయని తెలుసుకున్నాం.

**సూత్రం 1** – ఆత్మ పేరుతో  చైతన్యం దేశకాలాలకు అతీతంగా ఉంది.

**సూత్రం 2** – సృష్టి మొత్తం బీజరూపంలో మాయ పేరుతో ఉంది.

అందువల్ల ఆత్మ, మాయ రెండూ ఉన్నాయి. వ్యష్టిపరంగా చైతన్యాన్ని ఆత్మ అంటే, సమష్టిపరంగా అదే చైతన్యాన్ని బ్రహ్మ అంటారు. రెండూ ఒకటే. అంటే ఆత్మ, బ్రహ్మ, చైతన్యం పదాలన్నీ ఒకటే.

అయితే రెండు పేర్లు ఎందుకు? రెండు పేర్లకి ఆధారం, వాటి స్థానం. వ్యష్టిగా ఆత్మ, సమష్టిగా బ్రహ్మ. వాటి అర్థాలు కూడా ఇంచుమించు ఒకటే. ఆత్మ అంటే **ఆప్నోతి సర్వమ్ ఇతి ఆత్మా –** సర్వాత్మకమైన, ఎల్లలు లేని వస్తువు. బ్రహ్మ అంటే అనంతం. బృహ్ ధాతువునుంచి వచ్చింది బ్రహ్మ. బృహ్ అంటే పెద్దది, పూర్తిగా పెద్దది.

అందువల్ల సృష్టి ప్రకరణం గురించి నేర్చుకోవాలంటే ఆది అంతం లేని రెండు సూత్రాల గురించి నేర్చుకోవాలి. బ్రహ్మ + మాయ మరియు చైతన్యం + వస్తువు.

**బ్రహ్మాశ్రయా సత్వరజస్తమో గుణాత్మికా మాయా అస్తి॥** – తత్త్వబోధ

## 13.2 మాయ – బ్రహ్మ

బ్రహ్మకి, మాయకి మధ్య పోలికలేమిటి? రెండింటికీ ఆది లేదు. అంతం లేదు. వాటి మధ్య తేడాలేమిటి?

- బ్రహ్మ నిరాకారచైతన్యం, మాయ వస్తుచైతన్యం.
- బ్రహ్మకు ఆకారం లేకపోవటంతో దానికి భౌతిక, రసాయనిక లక్షణాలు కూడా ఉండవు. అది నిర్గుణమైనది. మాయ వస్తువు కాబట్టి, దానికి లక్షణాలు ఉండటంతో అది సగుణమైనది అవుతుంది.
- చైతన్యస్వరూపమైన బ్రహ్మ కాలానికీ, ప్రదేశానికీ అతీతం కాబట్టే, దానికి మార్పులేదు. కాని మాయ వస్తువు కాబట్టి నిరంతరం మారుతూ ఉంటుంది.
- ఒక ప్రదేశానికి అంకితమవలేదు కాబట్టి చైతన్యం నిర్వికల్పం. దానికి విభజన లేదు. కాని మాయకి విభజన ఉంది. పెరుగుదల ఉంది. మాయ అమీబా లాగా విభజననుంచి పెరుగుతుంది.

బ్రహ్మ, మాయ కలిసి ఏర్పడిందే సృష్టి. మాయ అనే బీజంనుంచి జగత్ వ్యక్తమౌతుంది. సృష్టి అంటే వ్యక్తరూపం చెందటం. సృష్టిని వ్యక్తప్రపంచం అని కూడా అంటారు. కంటికి కనబడని వెన్నని చిలికి బయటికి తీసినట్టుగా, బీజరూపంలో కంటికి కనబడని వస్తువు నామ, రూపాలు చెందటం.

## 13.3 వ్యక్తమయ్యే దశలు

ఈ ప్రపంచం రెండు దశల్లో వ్యక్తమవుతుంది – ఒక విత్తనం మొక్కగా మొలకెత్తి, తర్వాత పెద్ద చెట్టుగా పెరిగినట్టు.

అలాగే మాయ అనేది ఒక విత్తనం. తర్వాత మొక్క స్థాయి సూక్ష్మప్రపంచం. కారణవస్తువు సూక్ష్మవస్తువు లేదా సూక్ష్మప్రపంచంగా మారుతుంది. మళ్ళీ ఈ సూక్ష్మప్రపంచం పెరిగి స్థూలప్రపంచంగా మారుతుంది.అన్ని వ్యవహారాలకూ వీలుగా, అంటే చెట్టుగా పెరిగినట్టన్నమాట.

సూక్ష్మ, స్థూలవస్తువుల మధ్య తేడాని అర్థం చేసుకోవాలంటే మనస్సు, శరీరాల మధ్య తేడాని గమనించాలి. మనస్సు, శరీరం రెండూ వ్యక్తరూపాలే కాని మనస్సు అందరికీ గోచరం కాదు. శరీరం అందరికీ కనబడుతుంది.

అలా కారణప్రపంచంనుంచి సూక్ష్మప్రపంచం వెలువడి, దాన్నుంచి స్థూలపపంచం వస్తుంది. ఇదే సృష్టి. ఈ మూడింటిలో కారణప్రపంచానికి ఆది లేదు. తక్కిన రెండింటికీ ఉన్నాయి. సృష్టి జరిగి, పూర్తిగా ఎదిగి, మళ్ళీ ప్రళయంలో మునిగిపోతుంది. అంటే వ్యక్తప్రపంచం మళ్ళీ అవ్యక్తంగా మారిపోతుంది. తర్వాత మళ్ళీ వ్యక్తమవుతుంది. జగత్తు ఎప్పుడూ వుంటుంది. అంటే సృష్టిలో ఉన్నది – **అవస్థాభేదః న తు వస్తుభేదః** వస్తువు పెరగలేదు, తరగలేదు, అవ్యక్తంనుంచి వ్యక్తం, వ్యక్తంలోంచి అవ్యక్తం అయింది.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా॥**

భగవద్గీతలో కృష్ణుడు చెబుతాడు – మరణం గురించి ఎందుకు చింతిస్తున్నావు? మరణమంటే శరీరం శిథిలమవటం. ఆత్మకు చావు లేదు. అర్జునా, ఎవరికోసం బాధపడ్తున్నావు?

వచ్చిన చిక్కల్లా మనం శరీరంతో అనుబంధం పెట్టుకుని, ఆత్మని మర్చిపోతున్నాం.

ఇప్పుడు రెండవ దశ చూద్దాం. మాయగా పేరుగాంచిన కారణ ప్రపంచంనుంచి, సూక్ష్మప్రపంచం వచ్చింది. దానిలో ఐదు సూక్ష్మవస్తువులు ఉన్నాయి. వీటినే పంచభూతాలంటారు. అవి ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి.

ఇవి సూక్ష్మప్రపంచంలో సూక్ష్మంగా ఉంటాయి. అంటే అన్నీ కంటికి కనబడవు. ఈ పంచభూతాలు మాయనుంచి పుట్టాయి కాబట్టి, మాయలో ఉన్న లక్షణాలు వీటికి కూడా ఉంటాయి. కారణంనుంచి పుట్టిన కార్యానికి కారణలక్షణాలు ఉంటాయన్నది సూత్రం. **కారణగుణాః కార్యే అనువర్తన్తే॥**

తర్వాత ఈ సూక్ష్మప్రపంచం స్థూలప్రపంచంగా మారుతుంది. ఇందులో పంచభూతాలు గోచరంగా ఉంటాయి.

### 13.4 బింబ చైతన్యం, ప్రతిబింబ చైతన్యం

శరీరాన్ని మూడుగా అంటే స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలుగా చూశాం.

శరీరాన్ని అనాత్మ అంటారు. శరీరం జడం అయినా దానికి చైతన్యం ఉంటుంది. ఎందుకంటే అది చైతన్యవంతమైన ఆత్మనుంచి చైతన్యాన్ని పొందుతుంది. చైతన్యం శరీరమంతటా విస్తరించి దానికి చైతన్యాన్ని కలగజేస్తుంది. నిజానికి శరీరం ఒక అద్దంలా పనిచేస్తుంది.

అద్దానికి స్వతహాగా కాంతి ఉండదు. అద్దాన్ని తీసుకెళ్ళి సూర్యకాంతి ముందుపెడితే, అద్దంలో సూర్యకాంతి ప్రతిబింబించి, అద్దం కూడా కాంతివంతమవుతుంది. అద్దానికి కలిగిన ప్రతిబింబ కాంతివల్ల అది తక్కిన వస్తువులని కూడా కాంతిమయం చేయగలదు. అది సహజకాంతివల్ల కాదు, ప్రతిబింబ కాంతివల్ల. ఆ విధంగా కాంతి లేని వస్తువు కాంతిమయంగా అవుతుంది. అలాగే జీవంలేని వస్తువు చైతన్యవంతమవుతుంది, ప్రతిబింబ చైతన్యంవల్ల.

ఆ విధంగా ప్రతిశరీరానికీ ఒక ప్రతిబింబచైతన్యం ఉంటుంది. ఒక శరీరాన్ని మూడు భాగాలుగా చూస్తాము కాబట్టి మూడు ప్రతిబింబాలు ఉంటాయి. సర్వవ్యాపకమైన ఆత్మ బింబచైతన్యం, శరీరం ప్రతిబింబ చైతన్యం అవుతుంది. అలాగే చైతన్యం ప్రపంచాన్ని కూడా చైతన్యవంతం చేస్తుంది. నిజానికి ప్రపంచాన్ని పరమాత్మ శరీరంతో పోలిస్తే, మన శరీరం ఒక క్రమపద్ధతిలో పనిచేసినట్లు, విశ్వం ఒక క్రమపద్ధతిలో పనిచేస్తుంది. అంటే అది జీవంలేని ఒక జడపదార్థం కాదు. చైతన్యంవల్ల తెలివిగా పనిచేస్తోంది. మూడు శరీరాలు ఉన్నట్టే, ప్రపంచాలు మూడు ఉన్నాయి. కారణప్రపంచం, సూక్ష్మప్రపంచం, స్థూలప్రపంచం. మూడింటికీ ఒకే బింబచైతన్యం ఉంటుంది. అది మూడు ప్రతిబింబాలుగా సమష్టి ప్రపంచంలో వ్యక్తమవుతుంది.

#### 13.4.1 ప్రతిబింబ చైతన్యం వ్యష్టి స్థాయిలో

జీవస్థాయిలో లేదా వ్యష్టిస్థాయిలో ఒక బింబచైతన్యం, మూడు ప్రతిబింబచైతన్యాలుగా వ్యక్తమవుతుంది. ప్రతిబింబచైతన్యాలకు వాటి స్థాయీ భేదాలనిబట్టి పేర్లు మారుతుంటాయి.

స్థూలశరీరం – విశ్వ (ప్రతిబింబ చైతన్యం 1)
సూక్ష్మశరీరం – తైజస (ప్రతిబింబ చైతన్యం 2)
కారణశరీరం – ప్రాజ్ఞ (ప్రతిబింబ చైతన్యం 3)

ప్రతివ్యక్తిలోనూ ఈ మూడు ప్రతిబింబాలు ఉంటాయి. మూడింటినీ కలిపి జీవుడు అంటారు.

### 13.4.2 ప్రతిబింబచైతన్యం సమష్టి స్థాయిలో

అలాగే సమష్టి స్థాయిలో కూడా, ప్రతిబింబచైతన్యం మూడుగా వ్యక్తమవుతుంది.

| | | |
|---|---|---|
| స్థూలప్రపంచం | – విరాట్ | (ప్రతిబింబచైతన్యం 4) |
| సూక్ష్మప్రపంచం | – హిరణ్యగర్భ | (ప్రతిబింబచైతన్యం 5) |
| కారణప్రపంచం | – అంతర్యామి | (ప్రతిబింబచైతన్యం 6) |

ప్రపంచంలో ఈ మూడూ కలిసే ఉంటాయి. మూడింటినీ కలిపి ఈశ్వరుడు అంటారు.

టూకీగా చెప్పాలంటే, జీవ, ఈశ్వరులు ఒకటే చైతన్యంయొక్క ప్రతిబింబాలు. ఒకటి వ్యష్టిస్థాయిలో ప్రకటితమయితే, ఇంకోటి సమష్టి స్థాయిలో ప్రకటితమవుతాయి.

### 13.5 విశ్వంలో మూడు లక్షణాలు

విశ్వాన్ని గమనిస్తే అందులో మూడు లక్షణాలు అన్నిటా కనిపిస్తాయి. సాంకేతికపరంగా వాటి పేర్లు ఇవి–

సత్త్వగుణం – జ్ఞానశక్తి

రజోగుణం – క్రియాశక్తి

తమోగుణం – ద్రవ్యశక్తి

మాయలో ఈ మూడు గుణాలూ ఉన్నాయి. అందుకని మాయని త్రిగుణాత్మక మాయ అంటారు. మూడు గుణాలు ఒకసారే ప్రకటితం కావు. ఒక ప్రసంగం వింటే, కేవలం సత్త్వగుణమే వాడబడుతుంది. ఈ జ్ఞానాన్నిబట్టి పనిచేస్తే, రజోగుణం బయటికి వస్తుంది. నిద్రపోతున్నప్పుడు తమోగుణం ఉంటుంది. మాయలో ఉన్న మూడు గుణాలూ పంచభూతాల్లో ఉంటాయి.

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూ : అథ చతుర్వింశతి తత్త్వోత్పత్తి ప్రకారం వక్ష్యామః ॥

తా : ఇక 24 తత్త్వముల పుట్టుకను గురించి చెబుతున్నాము.

మూ : బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమోగుణాత్మికా మాయా అస్తి ॥

తా : సత్త్వము – రజస్సు – తమస్సు అను మూడు గుణములతో బ్రహ్మను ఆశ్రయించిన మాయ ఉంది.

మూ : తత ఆకాశః సమ్భూతః ॥

తా : ఆ మాయనుంచి ఆకాశము పుట్టింది.

మూ : ఆకాశాద్వాయుః ॥

తా : ఆకాశమునుంచి వాయువు (గాలి) పుట్టింది.

మూ : వాయోస్తేజః ।

తా : ఆ వాయువునుంచి తేజస్సు (అగ్ని) పుట్టింది.

మూ : తేజస ఆపః॥

తా : అగ్నినుంచి నీరు పుట్టింది.

మూ : అద్భ్యః పృథివీ ॥

తా : నీటినుంచి భూమి పుట్టింది.

మూ : ఏతేషామ్ పఞ్చతత్త్వానామ్ మధ్యే ఆకాశస్య
సాత్త్వికాంశాత్ శ్రోత్రేన్ద్రియం సమ్భూతమ్ ॥

తా : ఈ పంచభూతాలలో ఆకాశముయొక్క సాత్త్వికాంశమునుంచి శ్రోత్రేంద్రియము (చెవి) పుట్టింది.

మూ : వాయోః సాత్త్వికాంశాత్ త్వగిన్ద్రియం సమ్భూతమ్ ॥

తా : వాయువుయొక్క సాత్త్వికాంశమునుంచి త్వగింద్రియము (చర్మము) పుట్టింది.

మూ : అగ్నేః సాత్త్వికాంశాత్ చక్షురిన్ద్రియం సమ్భూతమ్ ॥

తా : అగ్నియొక్క సాత్త్వికాంశమునుంచి చక్షురింద్రియము (కన్ను) పుట్టింది.

మూ : జలస్య సాత్త్వికాంశాత్ రసనేన్ద్రియం సమ్భూతమ్ ॥

తా : జలముయొక్క సాత్త్వికాంశమునుంచి రసనేంద్రియము (నాలుక) పుట్టింది.

మూ : పృథివ్యాః సాత్త్వికాంశాత్ ఘ్రాణేన్ద్రియం సమ్భూతమ్॥

తా : భూమియొక్క సాత్త్వికాంశమునుంచి ఘ్రాణేన్ద్రియము (ముక్కు) పుట్టింది.

మూ : ఏతేషాం పంచతత్త్వానాం సమష్టి సాత్త్వికాంశాత్ మనోబుద్ధ్యహఙ్కార
చిత్తాన్తఃకరణాని సమ్భూతాని॥

తా : ఈ పంచభూతముల సమష్టి సాత్త్వికాంశములనుంచి 1) మనస్సు, 2) బుద్ధి, 3) అహంకారము, 4) చిత్తములను అంతఃకరణలు ఏర్పడినవి.

మూ : సఙ్కల్పవికల్పాత్మకం మనః ॥

తా : సంకల్పవికల్పములతో కూడినది మనస్సు.

మూ : నిశ్చయాత్మికా బుద్ధిః ॥

తా : నిశ్చయాత్మకమైనది బుద్ధి. సంశయమునకు హేతువు మనస్సనీ, నిశ్చయమునకు హేతువు బుద్ధి అనీ గ్రహించాలి.

మూ : అహంకర్తా అహంకారః ॥
తా : నేనే కర్తను అనే భావన అహంకారము.

మూ : చిన్తనకర్తృ చిత్తమ్ ॥
తా : చింతన చేయునది చిత్తము. ఆలోచనలను, అనుభవాలను, భావాలను, ప్రోగుచేసి దాచేది చిత్తము. ఈ మనోబుద్ధ్యహంకార చిత్తములకు అంతఃకరణ చతుష్టయమని పేరు.

మూ : మనసో దేవతా చన్ద్రమాః బుద్ధేర్బ్రహ్మా అహఙ్కారస్య రుద్రః చిత్తస్య వాసుదేవః॥
తా : మనస్సుకు చంద్రుడు, బుద్ధికి బ్రహ్మ, అహంకారమునకు రుద్రుడు (శివుడు), చిత్తమునకు వాసుదేవుడు (విష్ణువు) అధిదేవతలు.

మూ : ఏతేషాం పఞ్చతత్త్వానాం మధ్యే ఆకాశస్య రాజసాంశాద్ వాగిన్ద్రియం సమ్భూతమ్॥
తా : ఈ పఞ్చభూతములలో ఆకాశముయొక్క రాజసాంశమునుంచి వాగిన్ద్రియము పుట్టింది.

మూ : వాయోః రాజసాంశాత్ పాణీన్ద్రియం సమ్భూతమ్ ॥
తా : వాయువుయొక్క రాజసాంశమునుంచి పాణీంద్రియము (చేయి) పుట్టింది.

మూ : వహ్నే రాజసాంశాత్ పాదేన్ద్రియం సమ్భూతమ్ ।
తా : అగ్నియొక్క రాజసాంశమునుంచి పాదము(కాలు) పుట్టింది.

మూ : జలస్య రాజసాంశాత్ గుదేన్ద్రియం సమ్భూతమ్ ॥
తా : నీటియొక్క రాజసాంశమునుంచి గుదేంద్రియము పుట్టింది.

మూ : పృథివ్యా: రాజసాంశాత్ ఉపస్థేన్ద్రియం సమ్భూతమ్ ॥
తా : భూమియొక్క రాజసాంశమునుంచి ఉపస్థేంద్రియము (జననేంద్రియము) పుట్టింది.

మూ : ఏతేషాం సమష్టిరాజసాంశాత్ పఞ్చప్రాణాః సమ్భూతాః॥
తా : ఈ పంచభూతముల సమష్టి రాజసాంశములనుంచి ప్రాణాపాన వ్యానోదాన సమానములను పంచప్రాణములు పుట్టాయి. నాభినుంచి నాసికవరకు సంచరించు వాయువు ప్రాణము. నాభినుంచి గుదమువరకు సంచరించు వాయువపానము. దేహమునందంతట సంచరించు వాయువు వ్యానము. కంఠమునందలి వాయువు ఉదానము. నాభి మండలమున ఉండు వాయువు సమానము.

మూ : ఏతేషాం పఞ్చతత్త్వానాం తామసాంశాత్ పఞ్చీకృత పఞ్చతత్త్వాని భవన్తి॥
తా : ఈ పంచభూతములయొక్క తామసాంశమునుంచి పంచీకరణము చెందిన పంచమహాభూతములు పుడుతున్నాయి.

మూ : పఞ్చీకరణం కథమితి చేత్ ? ఏతేషామ్ పఞ్చమహాభూతానాం తామసాంశ స్వరూపమేకమేకం భూతం ద్విధావిభజ్య, ఏకమేకమర్థం పృథక్ తూష్ణీం వ్యవస్థాప్య, అపరమపరమర్ధం చతుర్ధా విభజ్య స్వార్ధ మన్యేష్వర్ధేషు స్వభాగ చతుష్టయసంయోజనం కార్యమ్। తథా పఞ్చీకరణమ్ భవతి ॥

తా : పంచీకరణము ఎలా జరుగుతున్నదో తెలియజేస్తున్నాము.

ఈ పంచమహాభూతములయొక్క తామసాంశ స్వరూపములను ఒక్కొక్క పంచమహాభూతమును తీసుకుని, దానిని రెండుగా విభజించి, ఒక్కొక్క మహాభూతములో ఉన్న ఒక సగభాగమును అలాగే ఉంచి, మిగిలిన సగభాగమును నాలుగు భాగాలుగా విభజించి ఆ నాలుగు భాగాలలో ఒక్కొక్క భాగాన్ని తక్కిన నాలుగు మహాభూతముల సగభాగములతో కలపాలి. అంటే ప్రతిమహాభూతములోని సగభాగము, తక్కిన నాలుగు భూతములలోని ఎనిమిదవవంతుతో కలిసి పంచీకృత పంచమహాభూతములు ఏర్పడుతున్నాయి. దీనినే పంచీకరణం అంటారు.

ఉదా: 1 యూనిట్ స్థూలపృథ్వీ = 1/2 యూనిట్ సూక్ష్మపృథ్వీ+ 1/8 యూనిట్ సూక్ష్మ ఆకాశం + 1/8 యూనిట్ సూక్ష్మవాయువు + 1/8 యూనిట్ సూక్ష్మ అగ్ని + 1/8 యూనిట్ సూక్ష్మజలం

మూ : ఏతేభ్యః పఞ్చీకృతపఞ్చమహాభూతేభ్యః స్థూలశరీరం భవతి।

తా : ఈ విధముగా పంచీకరణము చెందిన పంచమహాభూతములవల్ల స్థూలశరీరము పుడుతోంది.

# 14. కర్మసిద్ధాంతం

**వేదాన్త సారం** – జీవాత్మ, పరమాత్మల ఐక్యం. దీని ద్వారా నేను ప్రతిబింబచైతన్యాన్ని కాదనీ, బింబచైతన్యాన్ననీ తెలుసుకున్నాం. ఈ బింబచైతన్యాన్ని ఆత్మ అనీ, నేను అనీ, బ్రహ్మ అనీ అంటున్నాం.

ప్రతిబింబచైతన్యాన్ని వ్యష్టిస్థాయిలో జీవుడు అనీ, సమష్టిస్థాయిలో ఈశ్వరుడు అనీ అంటున్నాము. బింబచైతన్యం నిర్గుణం కాని ప్రతిబింబచైతన్యానికి గుణాలు ఉంటాయి. ఈశ్వరునికి ఉత్తమగుణాలుంటే, జీవునికి అధమగుణాలుంటాయి. కాని ఈ రెండూ ప్రతిబింబ మాధ్యమంవల్ల కలిగాయి కాని బింబచైతన్యానికి ఈ లక్షణాలేమీ అంటవు. వేదాంతం ఈ విధంగా జీవేశ్వర ఐక్యం బోధిస్తుంది.

ఈ జ్ఞానం పొందటంవల్ల కలిగే లాభమేమిటి? నేను సచ్చిదానంద స్వరూప ఆత్మని, నేను సర్వవ్యాపిని, నేను బింబచైతన్యాన్ని అనే జ్ఞానం రెండు ఫలాలని యిస్తుంది.
1. జీవన్ముక్తి 2. విదేహముక్తి.

### 14.1 జీవన్ముక్తి

జీవన్ముక్తి ఎలా కలుగుతుంది? ఇది పూర్తిగా మానసిక స్థాయిలో కలుగుతుంది. ఇది మూడు విధాలుగా కలుగుతుంది.

1. స్వతంత్రభావన 2. పూర్ణత్వభావన 3. సమత్వభావన

### 14.2 విదేహ ముక్తి

రెండో ఫలం విదేహముక్తి. అంటే పునర్జన్మ ఉండదు. ఇది అర్థమవ్వాలంటే ముందు కర్మసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి. పునర్జన్మ పొందటమో, మానటమో కర్మసిద్ధాంతంమీదే ఆధారపడి ఉంది.

### 14.3 కర్మ సిద్ధాంతం

వేదాంతబోధలో కర్మసిద్ధాంతం చాలా ముఖ్యమైనది. చాలా విశేషమైనది కూడా.

**14.3.1 మొదటి సూత్రం – పుణ్యపాపాలు** – మనం చేసే ప్రతికర్మకీ, చిన్నదైనా పెద్దదైనా, ఒక ఫలం ఉంటుంది. ఫలం కలగని కర్మే ఉండదు. కర్మఫలం రెండు రకాలుగా ఉంటుంది.

దృష్టఫలం – కనబడే ఫలితం; అదృష్టఫలం – కనబడని ఫలితం

మంచి కర్మ చేస్తే మంచి దృష్టఫలం, మంచి అదృష్టఫలం ఉంటాయి. ఉదాహరణకు ఏదైనా దానం చేస్తే, కనబడే ఫలం, ఎదుటి వ్యక్తికి కలిగిన లాభం. కనబడని ఫలం, అది మంచి పని కాబట్టి, మంచిదే అవుతుంది. దీన్ని సు – అదృష్టఫలం అంటారు.

దాని బదులు, మనం ఎవరినన్నా మోసం చేసి డబ్బు సంపాదిస్తే, కనబడే దృష్టఫలం బ్యాంకులో మన డబ్బు పెరుగుతుంది. కాని అదృష్ట ఫలం, చెడు ఫలం ఉంటుంది. దీన్ని దుర్ – అదృష్టం అంటారు.

సు – అదృష్టాన్ని పుణ్యమనీ, దుర్ – అదృష్టాన్ని పాపమనీ అంటారు. అందువల్ల మనం చేసే ప్రతిపనికీ కనపడే ఫలం కాకుండా పుణ్య, పాపాలు కూడా కలుగుతాయి. అవి అదృష్టఫలాలు కాబట్టి కనబడవు. అందువల్ల కర్మసిద్ధాంతంలో మొదటి సూత్రం పుణ్యపాపాలు.

**14.3.2 రెండవ సూత్రం – రెండు నియమాలు** – పుణ్యపాపాలు దేనివల్ల కలుగుతాయి? రెండు నియమాలవల్ల కలుగుతాయి. శాస్త్రం విధించిన కర్మలు చేస్తే పుణ్యం కలుగుతుంది. వాటిని **విహితకర్మలు** అంటారు. శాస్త్రం చేయవద్దన్న కర్మలు చేస్తే, పాపం వస్తుంది. వాటిని **నిషిద్ధకర్మలు** అంటారు. కొన్ని కర్మలు దృష్టఫలం దృష్ట్యా మంచివిగా కనబడవచ్చు. కాని, అదృష్ట ఫలం దృష్ట్యా మంచివి కావు. అలాంటి పని పాపాన్ని కలగజేస్తుంది. శాస్త్రం విధించే కర్మలను దృష్టఫలం, అదృష్టఫలం – రెండింటినీ మనస్సులో పెట్టుకుని విధిస్తుంది. అది సుఖం, దుఃఖం, పుణ్యం, పాపం అన్నింటినీ ఆలోచిస్తుంది.

రెండో నియమం – ఒకవేళ అది శాస్త్రంలో చెప్పకపోతే ఏం చేయాలి? ఏ పనన్నా ఎందుకు చేస్తున్నాం, దాని కారణమేమిటి అని ఆలోచించాలి. కారణం ఉన్నతమైనదైతే అది పుణ్యాన్ని కలుగచేస్తుంది. లేకపోతే లేదు. అందువల్ల శాస్త్రం చెప్పినదాన్నిబట్టి, కర్మచేసే ఉద్దేశ్యాన్నిబట్టి పుణ్యపాపాలు కలుగుతాయి.

**14.3.3. మూడవ సూత్రం – దృష్ట సుఖదుఃఖాలు** – కనబడని పుణ్యపాపాలు కాలక్రమేణా దృష్టసుఖంగానూ, దృష్టదుఃఖంగానూ మారతాయి.ఎన్నాళ్ళలో మారుతుంది? ఒకరోజులోనా, ఒక సంవత్సరంలోనా, ఇంకో జన్మలోనా? ఇన్నాళ్ళలో అని చెప్పలేము. ఎందుకంటే, అది అందరికీ సమానంగా ఉండదు. అది కర్మనిబట్టీ, పుణ్యాన్నిబట్టీ, పాపాన్నిబట్టీ మారుతుంటుంది. దీనికి శాస్త్రం అద్భుతమైన ఉదాహరణ యిస్తుంది. మనం బొప్పాయి చెట్టు, మామిడి చెట్టు, కొబ్బరి చెట్టు విత్తనాలను ఒకేరోజు వేశాం. బొప్పాయి అతి త్వరగా పెరిగితే, తక్కిన రెండూ ఎక్కువ కాలం తీసుకుంటాయి. అలాగే తక్కిన జీవరాసులు కూడా. పురుగులు గంటల్లో పెరిగిపోతే, మనిషి తల్లి గర్భంనుంచి రావటానికి తొమ్మిదినెలలు పడుతుంది. అందువల్ల అన్ని కర్మలకీ సమానమైన ఫలాలు ఉండవు.

అందువల్ల ఒక మనిషి చనిపోయినప్పుడు అతని సూక్ష్మశరీరంలో ఫలం పొందని అనేక పుణ్యపాపాలు అవ్యక్తరూపంలో ఉంటాయి. మనిషి మరణించినప్పుడు స్థూలశరీరం నాశనమవుతుంది కాని, సూక్ష్మ, కారణ శరీరాలుంటాయి. ఇందులో పుణ్యపాపాలు నిక్షిప్తమై

ఉంటాయి. ఈ అదృష్ట పుణ్యపాపాలు సుఖదుఃఖాలని కలుగజేయాలంటే, వాటికి ఇంకో స్థూల శరీరం కావాలి. స్థూలశరీరం లేనిదే ప్రపంచంతో వ్యవహారం నడపలేదు. వ్యవహారం నడపందే సుఖదుఃఖాలు లేవు. అందుకని పునర్జన్మ కలుగుతుంది.

కారణ, సూక్ష్మశరీరాలు మన అదృష్ట పుణ్యపాపాలను మోస్తూ, దానికి తగ్గ స్థూలశరీరాన్ని పొందుతాయి. దాని ద్వారా మనకు సుఖదుఃఖాలు కలుగుతాయి. ఈ కొత్త శరీరంతో కొత్త కర్మలు చేసి, మళ్ళీ కొత్తగా పుణ్యపాపాలను ప్రోగేసుకుంటాము. మళ్ళీ అందులో కొన్ని దృష్టఫలాన్ని యివ్వకపోవటంతో మళ్ళీ ఇంకో జన్మనెత్తాల్సి ఉంటుంది. అలా పునరపి జననం, పునరపి మరణం కొనసాగుతాయి.

అందుకని మన పుట్టుకనీ, మన అనుభవాలనీ నిర్ణయించేది దేవుడు కాదు అని అర్థం చేసుకోవాలంటుంది శాస్త్రం. కర్మ సిద్ధాంతం, ఆత్మజ్ఞానం కన్నా మరింత ప్రాథమిక సూత్రం. అది ఎంత బాగా అర్థమయితే, మన జీవితం అంత సాఫీగా సాగుతుంది. నేరస్థుడు చట్టంనుంచి తప్పించుకో గలడేమో కాని, పుణ్యపాపకర్మల సిద్ధాంతంనుంచి తప్పించుకోలేడు. అతని పుణ్యపాపాలననుసరించే అతనికి పునర్జన్మ ఆధారపడి ఉంటుంది.

### 14.4 కర్మసిద్ధాంతంవల్ల లాభాలు

కర్మ సిద్ధాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే, దానివల్ల కొన్ని లాభాలున్నాయి. ముందుగా మన దృక్పథం మారుతుంది.

**14.4.1 వైవిధ్యం** – జీవరాసుల మధ్య యింత వైవిధ్యం ఎందుకు? వృక్షాలు, జంతువులు, మనుష్యులు అనే రకరకాల తెగలు. మళ్ళీ మనుష్యుల్లో ఎంత భిన్నత్వం?ఒకరు పుదుతూనే వైభోగంగా ఉంటే, కొందరు పుట్టు గుడ్డివారు ఉంటారు. ఎందుకు ఈ వైపరీత్యం? దీనికి జవాబు కర్మసిద్ధాంతమే. వారు చేసుకున్న పుణ్యపాపాలే వారిని ఈ స్థాయిల్లో ఉంచాయి. ఇది ఒప్పుకోకపోతే, అనుకోకుండా జరిగిందనుకుంటాము. కాని సృష్టి అంతటిలో ఒక క్రమం ఉంది. ఒక నిబద్ధత ఉంది. అలాంటప్పుడు ఈ వైవిధ్యం ఎందుకు వస్తుంది? కాబట్టి దీనికి పుణ్యపాపాలే కారణం.

**14.4.2 బాధ** – ఏదైనా బాధ కలగగానే 'నాకే ఎందుకు?' అనుకుంటాం వెంటనే. 'తెలిసి తెలిసి నేను ఎవరికీ అపకారం చేయలేదే?' అంటాం. తెలిసి చేసినా, తెలియక చేసినా, యిప్పుడు చేసినా, గతజన్మలో చేసినా, యిప్పుడు అనుభవిస్తున్న కష్టానికి కారణం స్వయంకృతాపరాధం! చేతులారా చేసుకున్నదే! అది తెలిస్తే ఎవర్నీ నిందించం!

**14.4.3 దైవదూషణ** – నా కర్మకు నేను బాధ్యుణ్ణి అని అర్థం చేసుకుంటే, దైవాన్ని నిందించే ప్రసక్తి ఏది? ఇప్పుడు మనం మంచి వారమే అయినా, కష్టపడుతున్నాము అంటే మనకు తెలియని ఏదో పాపంవల్ల అని తెలుసుకుంటాము. అప్పుడు దేవుడు అన్యాయం చేసాడనీ,

పక్షపాతం చూపాడనీ అనే ప్రసక్తి ఉండదు. అది తెలియక, కొంతమంది కొన్ని కష్టాలు రాగానే, దైవచింతన మానేసి, దైవానికి ఎదురు తిరుగుతారు. కర్మసిద్ధాంతంవల్ల దైవభక్తి చెక్కుచెదరదు.

**14.4.4 భవిష్యత్తుపై జాగ్రత్త** – దీనివల్ల మనం భవిష్యత్తు విషయంలో ముందు జాగ్రత్త తీసుకోవచ్చు. మన భవిష్యత్తుని నిర్దేశించుకోవచ్చు. కర్మసిద్ధాంతమేం చెబుతోంది? నీ కర్మకు నీవే బాధ్యుడవు అంటోంది. అంటే మన వర్తమానం, మన గతాన్నిబట్టి ఉంటుంది అని కదా అర్థం. దాన్ని కాస్త పొడిగిస్తే ఏం వస్తుంది? వర్తమానాన్నిబట్టి భవిష్యత్తు ఉంటుంది. మనం వర్తమానంలో, అంటే యిప్పుడు, తెలివిగా నడుచుకుంటే, మన భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవచ్చు. ప్రపంచం నా భవిష్యత్తుని నిర్దేశించలేదు. భగవంతుడు నా భవిష్యత్తుని నిర్దేశించడు. కేవలం నా కర్మలే నా భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

గతంవల్ల యిప్పుడేర్పడిన వర్తమానాన్ని ప్రారబ్ధకర్మ అంటారు. కాని యిప్పటి కర్మలవల్ల కలగబోయే భవిష్యత్తు, నా ఫ్రీవిల్‌వల్ల కలుగుతుంది. ఇప్పుడు భోక్తగా నా యిష్టమేం లేదు, కాని కర్తగా, నాకు నిర్ణయించుకునే హక్కు ఉంది.

కర్మసిద్ధాంతాన్ని నమ్మితే, విధి చేతిలో కీలుబొమ్మలమని నమ్ముతాం అని పొరబడతారు కొందరు. నిజానికి యిది కర్మసిద్ధాంతానికి మందు లాంటిది. మన ప్రస్తుత పరిస్థితి గతంలో మన చర్యలవల్ల ఏర్పడింది కాబట్టి, మన భవిష్యత్తు కూడా మనవల్లే తీర్చి దిద్దబడుతుందని చెబుతుంది. కర్మ సిద్ధాంతాన్ని నమ్మకపోతే మన దుస్థితికి మరెవరినో నిందిస్తాము.

**14.4.5 మంచికి రోజులు లేవా?** ఇది తరచు మనం ఎదుర్కొనే ప్రశ్న. మంచికి రోజులు లేవా? మంచికి మారుపేరైన వ్యక్తి కష్టాల కడలిలో మునిగి తేలుతుంటే, దుర్మార్గం తప్ప మరోటి తెలీని వ్యక్తి ఐశ్వర్యంలో ఓలలాడుతున్నాడు. మళ్ళీ అదే జవాబు – కర్మ సిద్ధాంతం. వీరిద్దరిలో మొదటివారు ఇప్పుడు పుణ్యం, రెండో తెగవారు యిప్పుడు పాపం చేస్తున్నా, గతంలోనో, గతజన్మలోనో మొదటి వారు పాపం, రెండోవారు పుణ్యం చేసి ఉంటారు. కాబట్టి వారి సుఖదుఃఖాలు వారి అదృష్ట పుణ్యపాపాలమీద ఆధారపడి ఉన్నాయి.

ఈ కర్మ సిద్ధాంతమే లేకపోతే, ప్రపంచంలో పాప చింతనే ఉండదు. ధర్మం తుడిచిపెట్టుకుని పోయి, అధర్మం నాలుగుపాదాలమీద నడుస్తుంది. అలాగే కర్మ సిద్ధాంతమే లేకపోతే, దైవాన్ని దూషిస్తాము, మనకు ఏ కాస్త కష్టం కలిగినా. ఇప్పుడైతే కష్టం కలిగితే, మన పాపాలు తొలిగిపోయి, మనం స్వచ్ఛంగా మారుతున్నాం అనుకుంటాం.

అందువల్ల జీవితం అనుకోకుండా జరిగింది కాదు. అసలు ఏదీ అనుకోకుండా జరగదు. ప్రతీదీ ఒక నైతికమైన క్రమపద్ధతిమీద ఆధారపడి ఉంది. కారణం లేనిదే కార్యం లేదు. కారణం కనబడవచ్చు, కనబడకపోవచ్చు. వైద్యులకు కొన్ని రోగాలకి కారణం

అంతుపట్టదు. కారణం తెలియనంత మాత్రాన రోగం లేనట్టు కాదు. అందువల్ల కర్మసిద్ధాంతాన్ని నమ్మి, జీర్ణించుకోవటం ఒక కానుక.

**14.5 అదృష్ట పుణ్యపాపాలు** – అదృష్ట పుణ్యపాపాలు మూడు రకాలు.

**14.5.1 సంచితకర్మలు** – గతజన్మలనుంచీ ప్రోగుచేసుకుని వస్తున్న పుణ్యపాపాలన్నింటినీ సంచితకర్మలు లేదా సంచిత అదృష్టం అంటారు.

**14.5.2 ప్రారబ్ధకర్మలు** – ప్రోగడిన సంచితకర్మల్లోంచి కొంతభాగం అనుభవించబడటానికి సిద్ధంగా ఉంటుంది. దానివల్లే, దానికి తగ్గ జన్మనెత్తటం జరుగుతుంది. అలా దృష్టఫలంగా మారబోతున్న అదృష్ట పుణ్యపాపాలని ప్రారబ్ధకర్మ అంటారు. ఇప్పుడు సంచితం మనకేమీ సుఖదుఃఖాలను కలుగజేయలేదు. ఎందుకంటే అది యింకా రూపు దిద్దుకోలేదు. మన పుట్టుకనీ, తల్లిదండ్రులనీ, జీవితకాలాన్నీ; పుడితే జంతువుగానా, మనిషిగానా; మనిషి అయితే స్త్రీగానా, పురుషునిగానా; పురుషుడైతే ఆరోగ్యకరంగానా, అనారోగ్యంతోనా– ఈ విషయాలన్నిటినీ మన ప్రారబ్ధకర్మే నిశ్చయిస్తుంది.

**14.5.3 ఆగామికర్మలు** – మన ప్రారబ్ధకర్మలను అనుభవించటానికి ఈ భూమ్మీద పుట్టినప్పుడు, వాటికోసం కొన్ని కర్మలు చేస్తాం. ఆ కొత్త కర్మలనుంచి కొత్త ఫలాలు మళ్ళీ పుట్టుకువస్తాయి. అంటే మళ్ళీ దృష్టఫలం, అదృష్టఫలం కలుగుతాయి. వీటిని ఆగామికర్మలు అంటారు.

**ప్రోగుబడిన కర్మలు సంచితకర్మలు**
**అనుభవిస్తున్న కర్మలు ప్రారబ్ధకర్మలు**
**కొత్తగా పుడుతున్న కర్మలు ఆగామి కర్మలు**

**14.6 జనన – మరణవృత్తం**

ఈ జన్మలో మనం ప్రారబ్ధకర్మలను ముగించే ప్రయత్నంలో కొన్ని ఆగామికర్మలను కొత్తగా పుట్టిస్తున్నాం. ఈ జీవితం ముగించేసరికి ప్రారబ్ధకర్మ ముగిసి పోతుంది. నిజానికి ప్రారబ్ధకర్మ ముగిస్తేనే, జీవితం ముగుస్తుంది. కొన్ని ఆగామికర్మల ఫలం ఈ జన్మలోనే అనుభవిస్తాం. ఫలించిన ఆగామి కర్మలు కూడా ముగిసిపోతాయి. కాని మిగిలిపోయిన ఆగామికర్మలు సంచితకర్మని చేరుతాయి. ఈ సంచితకర్మనుంచి మళ్ళీ కొంచెం భాగం ప్రారబ్ధకర్మగా మారుతుంది, యింకో జన్మనివ్వటానికి.

మళ్ళీ ప్రారబ్ధకర్మ తీరటానికి పుట్టిన జన్మలో, మళ్ళీ ఆగామికర్మ కలుస్తుంది. మళ్ళీ యిదే కథ. ప్రారబ్ధకర్మ పూర్తిగా కరిగిపోతుంది, ఆగామికర్మ కొంత కరుగుతుంది. కొంత వెళ్ళి సంచితకర్మతో జేరి మళ్ళీ పునర్జన్మకి దారి తీస్తుంది. పునరపి జననం పునరపి మరణం అలా సంచిత, ప్రారబ్ధ, ఆగామికర్మలు సాగుతూనే ఉంటాయి.

**14.6.1 ప్రాయశ్చిత్తకర్మ** – ప్రాయశ్చిత్తకర్మ చేస్తే, ప్రారబ్ధపాపాన్ని పోగొట్టుకోవటానికి ఆగామిపుణ్యం చేస్తున్నామన్నమాట. ప్రారబ్ధపాపం ఉన్న తీవ్రతనిబట్టి ఆగామి పుణ్యం దాన్ని పూర్తిగా నశింపచేస్తుంది, లేదా అధమపక్షం దాని తీవ్రతని తగ్గిస్తుంది. ప్రాయశ్చిత్తం చేయటంవల్ల ప్రబలమైన (తీవ్రమైన) ప్రారబ్ధపాపాలని తట్టుకునే మనోధైర్యాన్ని ఇస్తుంది. ప్రారబ్ధకర్మ ఎంత తీవ్రంగా ఉందో మనం ముందుగా తెలుసుకోలేం. ఎందుకంటే అది అదృష్టం. అందుకని మనం కోరుకున్న ఫలితం పొందే వరకూ ప్రాయశ్చిత్తకర్మ చేస్తూనే ఉండాలి.

### 14.7 జ్ఞాని పరిస్థితి

జ్ఞాని విషయంలో ఈ మూడు కర్మలూ ఏమవుతాయి? జ్ఞానం ఎంత శక్తివంతమైందంటే అది అన్ని సంచితకర్మలనీ నాశనం చేయగలదు. రేడియేషన్‌వల్ల శరీరంలో ఉన్న కాన్సర్ కణాలను నాశనం చేసినట్టు అది సంచితకర్మలని నాశనం చేస్తుంది.

**సఞ్చిత పాపవినాశన లిఙ్గమ్**

**తత్ ప్రణమామి సదాశివ లిఙ్గమ్**

జ్ఞానికి ఆగామికర్మలు రావు. ఎందుకంటే అతను తాను అకర్తగా కర్మలు నిర్వహిస్తాడు. నేను చేస్తున్నానన్న అహంకారం కాని, అభిమానం కాని లేకపోవటంతో ఆగామికర్మలు లేవు.

జ్ఞానికి సంచితకర్మలు భస్మమయ్యాయి. ఆగామికర్మలు రావు. మిగిలింది ఒక్కటే ప్రారబ్ధకర్మ. అవి జరుగుతున్నవి కాబట్టి జ్ఞానికి కూడా ప్రారబ్ధకర్మ తప్పదు. అయితే జ్ఞాని తాను ప్రతిబింబచైతన్యం కాదు, బింబచైతన్యం అనీ సచ్చిదానంద ఆత్మ అనీ భావిస్తాడు కాబట్టి, చిన్న సమస్యలకు చలించడు, అవి అతన్ని బాధించవు. శరీరంతో సంబంధం పెట్టుకోడు కాబట్టి ప్రారబ్ధకర్మను తన పనిని చేసుకోనిస్తాడు. అతను సాక్షీభూతంగా చూస్తాడు అంతే. కానీ అజ్ఞానికి ప్రారబ్ధకర్మ సుఖదుఃఖాలని కలగజేస్తాయి. అజ్ఞాని అంటే అనాత్మతో లేదా ప్రతిబింబచైతన్యంతో ముడిపడి ఉంటాడు కాబట్టి అతనికి ప్రారబ్ధం ఒక సమస్య.

అందువల్ల జ్ఞాని మరణించే సమయానికి కర్మలేదు. సంచితకర్మ కాలిపోయింది, ప్రారబ్ధకర్మ ముగిసిపోయింది. ఆగామి కర్మ రాలేదు. సంచిత కర్మ, ఆగామికర్మ ఈ రెండూ లేనిచోట కొత్త శరీరం ప్రసక్తే లేదు. అందువల్ల, జ్ఞాని స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడూ, స్థూల, సూక్ష్మ, కారణప్రపంచంలో కలుస్తాయి అదే వరుసలో. వేరే విధంగా చెప్పాలంటే జ్ఞాని పరమాత్మలో ఐక్యమౌతాడు.

జ్ఞానికి విదేహముక్తి కలుగుతుంది. అతను బ్రతికి ఉండగా జీవన్ముక్తిని పొందుతాడు. మరణించాక విదేహముక్తి పొందుతాడు. జ్ఞానసాధన చేసిన వ్యక్తి పొందే ఫలం యిది.

ఒక జ్ఞాని మరణించిన సమయం, ప్రదేశం పుణ్యఘడియలు, పుణ్యస్థలం కాకపోవచ్చు కాని అతను ఈ బంధాలనుంచి విడిపోతాడు.

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూ : కర్మాణి కతి విధాని సన్తీతి చేత్ ఆగామి – సఞ్చిత – ప్రారబ్ధ భేదేన త్రివిధాని సన్తి ।

తా : కర్మ ఎన్ని విధములు అంటే, అవి 1) ఆగామి 2) సంచితము 3) ప్రారబ్ధములని మూడు విధములుగా ఉన్నవి.

మూ: జ్ఞానోత్పత్త్యనన్తరం జ్ఞానిదేహకృతం పుణ్యపాపరూపం కర్మ యదస్తి తదాగామి ఇతి అభిధీయతే ॥

తా : జ్ఞానము కలిగిన తరువాత జ్ఞానియొక్క దేహముతో చేయబడిన పుణ్యపాపరూపమైన కర్మ ఏది ఉందో అది ఆగామి అని చెప్పబడుచున్నది.

మూ : అనన్తకోటి జన్మనాం బీజభూతం సత్ యత్కర్మ జాతం పూర్వార్జితం తిష్ఠతి తత్ సఞ్చితం జ్ఞేయమ్ ॥

తా : అనంతకోట్యుత్తరజన్మములకు బీజభూతమై పూర్వజన్మములలో ఆర్జింపబడిన కర్మ సంచితమని తెలుసుకోవాలి.

మూ : ప్రారబ్ధం కర్మ కిమితి చేత్ ? ఇదం శరీరముత్పాద్యేహలోక ఏవం సుఖదుఃఖాదిప్రదం యత్కర్మ తత్ ప్రారబ్ధం భోగేన నష్టం భవతీతి ॥

తా : ప్రారబ్ధకర్మ అంటే ఏమిటి? ఈ దేహమును పుట్టించి యీ లోకమందే సుఖదుఃఖాదులను కలుగజేయుచు అనుభవించుటవల్ల నశించునది ప్రారబ్ధకర్మ.

మూ : ప్రారబ్ధకర్మణాం భోగాదేవ క్షయ ఇతి ॥

తా : ప్రారబ్ధకర్మలు అనుభవించటంవల్లనే క్షయమవుతాయి.

మూ : సఞ్చితం కర్మ బ్రహ్మైవాహమితి నిశ్చయాత్మకజ్ఞానేన నశ్యతి ॥

తా : సంచిత కర్మ నేనే బ్రహ్మను అనే నిశ్చయాత్మక జ్ఞానముతో నశిస్తుంది.

మూ : ఆగామికర్మాపి జ్ఞానేన నశ్యతి ॥

తా : ఆగామికర్మ కూడ జ్ఞానముతో నశిస్తుంది.

మూ : కిఞ్చ యే జ్ఞానినం స్తువన్తి భజన్తి అర్చయన్తి తాన్ ప్రతి జ్ఞానికృత మాగామి పుణ్యం గచ్ఛతి ॥

తా : ఇంకా బ్రహ్మజ్ఞానిని ఎవరు స్తుతిస్తారో, ఎవరు భజిస్తారో, ఎవరు పూజిస్తారో వారికా జ్ఞాని చేసిన ఆగామి పుణ్యము వస్తుంది.

మూ : యే జ్ఞానినం నిన్దన్తి ద్విషన్తి దుఃఖప్రదానం కుర్వన్తి తాన్ ప్రతి జ్ఞానికృతం సర్వమాగామి క్రియమాణం యదవాచ్యం కర్మ పాపాత్మకం తద్గచ్ఛతి ॥

తా : ఎవరు జ్ఞానిని నిందిస్తారో, ఎవరు ద్వేషిస్తారో, ఎవరు దుఃఖపెడతారో వారికా జ్ఞాని చేసిన, చేస్తున్న చెప్పరాని పాపకర్మములన్నీ చేరతాయి.

ఇక్కడ మనము ఒక విషయము గమనించాలి. బ్రహ్మజ్ఞాని ఉద్దేశ్యపూర్వకంగా ఏ పుణ్యపాపకర్మలు ఆచరించదు. కాబట్టి అతనికి ఆ ఫలితములంటవు. ఇంకా అటువంటి బ్రహ్మజ్ఞానిని ద్వేషించు వారికి అతను చేసిన పాపము, పూజించు వారికి అతను చేసిన పుణ్యము లభిస్తుంది అని భావము.

మూ : తథా చ ఆత్మవిత్ సంసారం తీర్త్వా బ్రహ్మానన్దమిహైవ ప్రాప్నోతి ॥

తా : ఈ విధముగా ఆత్మవేత్త సంసారమును దాటి యీ లోకములోనే బ్రహ్మానందమును పొందును.

మూ : తరతి శోకమాత్మవిత్ ఇతి శ్రుతేః॥

తా : ఆత్మవేత్త శోకమును దాటుతున్నాడని వేదముపదేశిస్తున్నది.

మూ : శ్లో॥ తనుం త్యజతు వా కాశ్యాం శ్వపచస్య గృహేఽథవా ।
జ్ఞానసమ్ప్రాప్తిసమయే ముక్తోఽసౌ విగతాశయః ॥ ఇతి స్మృతేశ్చ

తా : ఆత్మజ్ఞానము ప్రాప్తించిన సమయమందే జీవన్ముక్తుడైన జ్ఞాని తన దేహమును కాశీలో విడిచినా, చండాలుని ఇంటిలో విడిచినా విగతాశయుడు (ఏ ఆశయములు లేనివాడు) కాబట్టి నిత్యముక్తుడని ధర్మశాస్త్రములు వక్కాణిస్తున్నాయి.

# 15. జీవేశ్వర ఐక్యం

వేదాంత బోధలో ముఖ్య అంశం – జీవాత్మ, పరమాత్మల ఐక్యం. ఆత్మ అంటే చైతన్యం. అది ఏకం. ఐక్యం అంటే ఒకటి అని అర్థం. అందువల్ల ఆత్మచైతన్యం ఒక్కటే. ఆ ఒక్క చైతన్యమే పదార్థరూపంలో ప్రకటితమవుతోంది. ఆ చైతన్యం శరీరత్రయమనే ఒక్క పదార్థం ద్వారా ప్రకటితమవుతున్నప్పుడు ఆ చైతన్యాన్ని జీవాత్మ అంటారు. అదే చైతన్యం సమష్టి ప్రపంచంనుంచి లేదా ప్రపంచత్రయంనుంచి ప్రకటితం అవుతున్నప్పుడు అదే ఆత్మను పరమాత్మ లేదా ఈశ్వరుడు అంటారు.

అందువల్ల ఒకే ఆత్మను జీవాత్మ అనీ, పరమాత్మ అనీ అంటారు, అది పనిచేసే మాధ్యమాన్నిబట్టి. ఎప్పుడైతే అనాత్మ మాధ్యమాన్నీ, వస్తువు మాధ్యమాన్నీ తొలగిస్తామో, అప్పుడు అటు జీవాత్మా లేదు, ఇటు పరమాత్మా లేదు. ఉన్నది ఒకటే ఆత్మ, జీవాత్మ పరమాత్మలు కానిది. అందువల్ల అనాత్మ ద్వారా పనిచేసే ఒక్క ఆత్మకి రెండు పేర్లు – జీవాత్మ, పరమాత్మ – ఉన్నాయి.

ఆ ఆత్మని నేనే.

ఈ శరీరంనుంచి పనిచేస్తున్నప్పుడు నేను జీవాత్మను. సమష్టి ప్రపంచంనుంచి పనిచేస్తున్నప్పుడు నేను పరమాత్మను. జీవాత్మ పరమాత్మ ఐక్యం లేదా ఆత్మ ఏకత్వం అంటే అర్థం యిదీ.

ఇంకో ముఖ్యమైన అంశం కూడా ఉంది. దాన్ని కూడా టూకీగా చూద్దాం. అది ఒక ప్రత్యేక అంశం. అది ఆత్మ, అనాత్మల మధ్య సంబంధం గురించి. ఉన్నది ఒక్కటే ఆత్మ అంటున్నాం; జీవాత్మ, పరమాత్మలు భిన్నం కాదు, ఏకం అంటున్నాం. మరి ఆత్మ, అనాత్మల మధ్య సంబంధం ఏమిటి? ఆత్మకీ, పదార్థానికీ మధ్య సంబంధం ఏమిటి? వేదాంతం చెబుతుంది, వాటి మధ్య సంబంధం ఆధారమిచ్చేది – ఆధారపడేది; చేయూతనిచ్చేది – చేయూత పొందేది. అంటే, పదార్థం చైతన్యంమీద ఆధారపడింది.

ఉదాహరణకు, మన ముందు ఒక గడియారం ఉందనుకోండి, అది ఉందో లేదో చెప్పటానికి మనం ముందు ఆ గడియారాన్ని చూడాలి. అలాగే ప్రపంచంలో ఏదైనా ఉందో లేదో నిరూపించటానికి, దాన్ని చూడాలి లేదా దాని గురించిన ప్రత్యక్ష లేదా పరోక్ష జ్ఞానం ఉండాలి. కాని మనం ఉన్నామా లేదా నిరూపించటానికి ఏమీ ప్రమాణం అక్కరలేదు. మనం జీవించి ఉండటమే దానికి ప్రమాణం. అందువల్ల పదార్థం ఉందనీ, అది పనిచేస్తుందనీ నిరూపించటానికి చైతన్యం కావాలి, కాని చైతన్యం ఉందని నిరూపించటానికి పదార్థం అక్కరలేదు. అందువల్ల చైతన్యాన్ని సత్యం, పదార్థాన్ని మిథ్య

అంటుంది శాస్త్రం. సత్యం అంటే స్వతంత్రం, మిథ్య అంటే పరతంత్రం (స్వతంత్రానికి వ్యతిరేకం).

దీనికి సాధారణంగా చెప్పే ఉదాహరణ కుండ – మట్టి. కుండ ఉన్నా లేకపోయినా మట్టి వుంటుంది. కాని మట్టి లేకుండా కుండకి ఉనికి లేదు. అలాగే – బంగారం సత్యం, ఆభరణాలు మిథ్య. నీరు సత్యం, అలలు మిథ్య. ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య.

అందువల్ల సత్యం అంటే స్వతంత్రం, మిథ్య అంటే పరతంత్రం. ఆత్మ ఒకటే, అనాత్మలు ఎన్నో. వ్యష్టిగా చూస్తే అది జీవాత్మ, సమష్టిగా చూస్తే అది పరమాత్మ.

అందువల్ల మొత్తం వేదాంత బోధని మూడు వాక్యాల్లో క్రోడీకరించవచ్చు.

**ఆత్మ సత్యం, అనాత్మ మిథ్యా, జీవాత్మ, పరమాత్మ ఏకం.**
**ఇది వేదాంత సారం.**

ఈ జ్ఞానాన్ని ఎలా సముపార్జించాలో, దాని లాభాలేమిటో చూద్దాం.

### 15.1 జ్ఞానాన్ని సముపార్జించే మార్గం

జ్ఞానాన్ని సముపార్జించే మార్గాన్ని యోగం అంటారు. ఈ మార్గం మూడు దశల్లో ఉంది. అవి – శ్రవణం అంటే అజ్ఞాననివృత్తి. మననం అంటే సంశయనివృత్తి. నిదిధ్యాసనం అంటే విపర్యయనివృత్తి. ఆత్మ గురించిన శంకలను మననం ద్వారా తీర్చుకుని, మనకున్న విపరీత భావనలను నిదిధ్యాసనం ద్వారా నివారించాక, ఈ జ్ఞానం పరిపూర్ణజ్ఞానం అవుతుంది. మనం జ్ఞాననిష్ఠులం అవుతాం.

శ్రవణం ఒక సమర్థవంతమైన గురువు ఆధీనంలో చేస్తాము. మననంలో మన పాత్ర కూడా ఉంటుంది.మనకు కలిగిన సంశయాలను, గురువు ఆధీనంలో తీర్చుకుంటాము. నిదిధ్యాసనంలో గురువు పాత్ర ఏమీ ఉండదు. పూర్తిగా మన కృషిమీదే ఆధారపడి ఉంటుంది. మనం నేర్చుకున్న జ్ఞానాన్ని నిదిధ్యాసనంలో ఉపయోగించాలి. పచనమైన ఆహారం మాత్రమే ఎలా శరీరానికి శక్తినిస్తుందో, అలా అవగతమైన జ్ఞానం మాత్రమే మనకు ఫలాన్నిస్తుంది.

### 15.2 జ్ఞానఫలం

జ్ఞానం పొందడంవల్ల కలిగే లాభాన్ని జ్ఞానఫలం అంటారు. ఈ లాభాన్ని రెండు రకాలుగా చూపిస్తుంది శాస్త్రం 1. జీవించి ఉండగా కలిగే ఫలం – జీవన్ముక్తి.
2. మరణానంతర ఫలం – విదేహముక్తి.

**15.2.1 జీవన్ముక్తి** – ఇది జీవించి ఉండగా కలిగేఫలం. అనేక రూపాలుగా ఈ ఫలాన్ని మానసిక స్థాయిలో అనుభవిస్తాము.మానసిక స్థాయిలో ఎదుర్కొనే సమస్యలు

అభద్రతాభావం, భయం, లేమి, ఈర్ష్య, కోపం. ఈ మానసిక సమస్యలను సంసారం అంటారు. ఈ జ్ఞానం కేవలం మానసిక స్థాయిలో లేదా సైకలాజికల్ స్థాయిలో కలుగుతుంది. కాబట్టి మనసుకే మేలు చేస్తుంది కాని, శారీరక స్థాయిలో కాదు.

జీవన్ముక్తి అంటే సమస్యలు ఉండవని కాదు. సమస్యలు ఉంటూనే ఉంటాయి. కాని మనం అనారోగ్యకరంగా స్పందించము. జీవన్ముక్తివల్ల కలిగే మూడు లాభాలు 1. స్వతంత్రత 2.పూర్ణత్వం 3. సమత్వం.

**15.2.1.1 స్వతంత్రత** – మొట్టమొదటి లాభం స్వతంత్రత. మనం మానసికంగా, లేదా సైకలాజికల్‌గా స్వతంత్రులం. అంటే మనం కోరింది లభించినా, లభించకపోయినా మనం ఉద్రేకపడం. ఎప్పుడైతే మనం బాహ్యవస్తువులమీద ఆధారపడ్డామో, అప్పుడే అవి ఉన్నా, లేకపోయినా బాధపడతాము. జ్ఞానం వ్యక్తులు, పరిస్థితులు, వస్తువులనుంచి మనకు స్వాతంత్ర్యం ఇస్తుంది. అప్పుడు మనం ఎవరో కావాలనుకోము, ఒంటరిగానూ బాధపడము.

**15.2.1.2 పూర్ణత్వం** – రెండో లాభం పూర్ణత్వం. జీవితం సఫలమైందన్న భావం. మనకు 'నేను ఆత్మని, ఈ శరీరానికే పరిమితమవలేదు, నేను సచ్చిదానంద స్వరూపాన్ని, అందువల్ల అనంతాన్ని,' అని తెలుసు. మననుంచి ఏదీ దూరంగా లేదు. ప్రతీదీ మనకు చెందినదే. ఒంటరితనానికి కాని, మనని ఎవరైనా త్యజించటానికి కానీ తావే లేదు. మనం ఒక వ్యక్తి అయితే ఒంటరితనమో, త్యజింపబడ్డ భావనో వస్తుంది. కాని మనం సర్వవ్యాపకం అయినప్పుడు వీటికి చోటేది? ఆకాశాన్ని ఎవరైనా త్యజించగలరా? అలాగే సర్వవ్యాపకమైన మనని కూడా ఎవరూ త్యజించలేరు.

**15.2.1.3 సమత్వం** – మూడో లాభం సమత్వం. జీవితంలో కలిగే ఒడిదుడుకులను సమానంగా ఎదుర్కొనే ధైర్యం. షాక్ అబ్జార్బర్‌లా పనిచేస్తుంది జ్ఞానం. మన భవిష్యత్తులో జరగబోయే విషయాలు మన చేతిలోలేవు. మనమేం వాటిని అదుపులో పెట్టలేము. కాని వాటిని ఎదుర్కొనేశక్తి వస్తుంది. జ్ఞానం పొందాక, దారుణమైన కష్టాలు కూడా తాత్కాలికంగా బాధిస్తాయే కానీ, శాశ్వతంగా బాధించలేవు.

ఒక విషయం గుర్తుంచుకోవాలి. శారీరకంగా మనం బాహ్యప్రపంచంమీద ఆధారపడక తప్పదు. మన ప్రాథమిక అవసరాలు – కూడు, గుడ్డ, నీడ – వీటికోసం ప్రపంచంమీద ఆధారపడాల్సిందే. కాని భావపరంగా మనం స్వతంత్రులమవుతాము. దీన్ని జీవన్ముక్తి అంటారు. అంటే జీవించి ఉండగానే స్వేచ్ఛ (ముక్తి) అని అర్థం.

**15.2.2 విదేహముక్తి** – ఇది అర్థం చేసుకోవాలంటే, అజ్ఞాని చనిపోయాక, అతనికేమవుతుందో ముందు తెలుసుకోవాలి. అప్పుడే జ్ఞాని మరణానంతర పరిస్థితి అర్థమవుతుంది.

అజ్ఞాని విషయంలో అతను మరణించినప్పుడు భౌతికశరీరం పడిపోతుంది. భౌతికశరీరం పంచభూతాలలో కలిసిపోతుంది.

స్థూలశరీరం పడిపోయినా, సూక్ష్మశరీరం, కారణశరీరాలు ఇంకా ఉంటాయి. స్థూలశరీరం పడిపోయాక, చిదాభాసతో కూడిన సూక్ష్మ, కారణశరీరాలు మరో జన్మ కొనసాగించటానికి ఇంకో శరీరాన్ని పొందుతాయి. ఆ శరీరాన్ని భూలోకంలో గాని, ఇతర లోకాలలో గాని పొందవచ్చు. అందువల్ల మరణానంతరం ఒక అజ్ఞాని ప్రయాణం చేస్తాడు.

ఇంకోవిధంగా చెప్పాలంటే అజ్ఞానియొక్క సూక్ష్మశరీరం, కారణశరీరాలు ప్రయాణం చేసి, ఇంకో శరీరాన్ని పొందుతాయి. దాన్నే పునర్జన్మ అంటారు. సూక్ష్మ, కారణశరీరాలు మళ్ళీ జీవించి, స్థూలశరీర పతనానంతరం మళ్ళీ ఇంకో శరీరాన్ని పొందుతాయి. కాని చావు, పుట్టుకలనేవి స్థూలశరీరానికి మాత్రమే వున్నాయి.

జ్ఞానియొక్క స్థూలశరీరం స్థూలప్రపంచంలో కలుస్తుంది. సూక్ష్మశరీరం సూక్ష్మప్రపంచంలోనూ, కారణశరీరం కారణప్రపంచంలోనూ కలుస్తాయి. శాస్త్రప్రకారం, మూడు శరీరాలూ సమష్టిలో కలిసిపోతాయి. అంటే శరీరత్రయం, ప్రపంచత్రయంలో కలుస్తాయి.

జ్ఞాని వ్యష్టిగా కాక, సమష్టిగా మారతాడు. అందువల్ల ఇక అతన్ని జీవాత్మ అనలేము. ఎందుకంటే స్థూలశరీరం ఉంటేనే జీవాత్మ ప్రసక్తి వస్తుంది. శరీరత్రయం పోగానే జ్ఞాని పరమాత్మలో ఐక్యం అవుతాడు. తన ఉనికిని కోల్పోయి, జీవాత్మ పరమాత్మలో ఐక్యం చెందుతుంది, తన ఉనికిని కోల్పోయి నది సాగరంలో ఐక్యం చెందినట్టుగా. పైగా జ్ఞానికి పునర్జన్మ లేదు. ఎందుకంటే సూక్ష్మ, కారణ, శరీరాలు లేవు, యింకో స్థూలశరీరాన్ని పొందటానికి.

అందువల్ల విదేహముక్తి అంటే పునర్జన్మనుంచి ముక్తి పొందటం. విదేహముక్తి ఫలాన్ని జ్ఞానం ఎందుకు ఇస్తుంది? శాస్త్రం దీన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో చెబుతుంది. కర్మలన్నింటినీ నాశనంచేయటంద్వారా జ్ఞానం పునర్జన్మని ఆపుతుంది.

**గమనిక: బ్రహ్మ–బింబచైతన్యం పటం ఆఖరి పేజీలో చూడవచ్చు**

జీవేశ్వర ఐక్యం టూకీగా –

| | | |
|---|---|---|
| జీవ | = | విశ్వ + తైజస + ప్రాజ్ఞ(శరీరత్రయం + ప్రతిబింబ చైతన్యాలు) |
| ఈశ్వర | = | విరాట్ + హిరణ్యగర్భ + అంతర్యామి |
| | | (ప్రపంచత్రయం + ప్రతిబింబచైతన్యాలు) |
| జీవ (స్వరూపం) | = | ఈశ్వర (స్వరూపం) = బింబచైతన్యం |

## తత్త్వబోధలో ఈ పాఠమునకు సంబంధించిన భాగము

మూ: ఏవమ్ పిణ్డ బ్రహ్మాణ్డయోరైక్యం సమ్భూతమ్ ।

తా : ఈ విధముగా పిండ – బ్రహ్మాండములకు ఐక్యము సిద్ధించుచున్నది. పిండమంటే జీవుని స్థూలశరీరము. సమష్టి స్థూలశరీరములన్నీ కలిపి బ్రహ్మాండమవును.

మూ: స్థూలశరీరాభిమాని జీవనామకం బ్రహ్మ ప్రతిబిమ్బం భవతి। న ఏవ జీవప్రకృత్యా స్వస్మాత్ ఈశ్వరం భిన్నత్వేన జానాతి ॥

తా : స్థూలశరీరాభిమానముగల ఆత్మ జీవుడను పేరుతో వ్యవహరింపబడుతున్నది. ఆ జీవుడే ప్రకృతి బద్ధుడై తనకన్నా ఈశ్వరుడు భిన్నుడని తలుస్తున్నాడు. బింబస్థానీయుడగు పరమాత్మకు జీవుడు ప్రతిబింబమువంటి వాడని భావము.

మూ : అవిద్యోపాధిః సన్నాత్మా జీవ ఇత్యుచ్యతే ॥

తా : అవిద్య (అజ్ఞానము) ఉపాధిగాగల ఆత్మే జీవుడని చెప్పబడుతున్నది.

మూ : మాయోపాధిః సన్నీశ్వర ఇత్యుచ్యతే ॥

తా : మాయ ఉపాధిగాగల ఆత్మే ఈశ్వరుడని చెప్పబడుతున్నది. మాయచే అవిచ్ఛిన్నమైన (ఆవరింపబడిన) చైతన్యము ఈశ్వరుడనీ, అవిద్యచే అవిచ్ఛిన్నమైన (అజ్ఞానముతో ఆవరింపబడిన) చైతన్యము జీవుడనీ తెలుసుకోవాలి.

మూ : ఏవం ఉపాధి భేదాజ్జీవేశ్వరభేదదృష్టిః యావత్పర్యన్తం తిష్ఠతి తావత్పర్యన్తం జన్మమరణాదిరూపసంసారో న నివర్తతే ॥

తా : ఈ విధముగా ఉపాధిభేదముచే జీవుడు ఈశ్వరుడు వేరను భేదదృష్టి ఎంతవరకూ ఉంటుందో అంతవరకు జన్మమరణముల రూపములో ఉన్న సంసారము తొలగదు.

మూ : తస్మాత్ కారణాన్న జీవేశ్వరయోః భేదబుద్ధిః స్వీకార్యా ॥

తా : అందువల్ల జీవుడు, ఈశ్వరుడు భిన్నులను భేదబుద్ధి స్వీకరింపదగదు. అంటే ద్వైత దృష్టే సంసారహేతువనీ, అద్వైతదృష్టివల్ల మోక్షము సిద్ధించుననీ గ్రహించాలి.

మూ : నను సాహఙ్కారస్య కించిజ్ఞస్య జీవస్య నిరహఙ్కారస్య సర్వజ్ఞస్య ఈశ్వరస్య తత్త్వమసీతి మహావాక్యాత్ కథమభేదబుద్ధిః స్యాత్ ఉభయోర్విరుద్ధధర్మాక్రాన్తత్వాత్ ఇతి చేన్న॥

తా : ఓయీ ! తత్త్వమసి అను మహావాక్యము జీవేశ్వరులు అభిన్నులని ప్రతిపాదిస్తున్నది. జీవుడహంకారము కలవాడు. కించిజ్ఞుడు. ఈశ్వరుడన్నచో అహంకారము లేనివాడు. సర్వజ్ఞుడు. ఇటువంటి విరుద్ధ ధర్మములుగల జీవేశ్వరులకు ఐక్యం ఎలా సరిపోతుంది అంటే అది సరిగాదు.

మూ : స్థూల – సూక్ష్మశరీరాభిమానీ 'త్వం'పదవాచ్యార్థః॥ ఉపాధి నిర్ముక్తం సమాధిదశాసమ్పన్నం శుద్ధచైతన్యం 'త్వం' పద లక్ష్యార్థః॥

తా : స్థూల, సూక్ష్మ శరీరాభిమానముగల జీవునకు, 'త్వం' పదము వాచ్యార్థమవుతున్నది. ఉపాధినుంచి విడివడి సమాధి దశతో సంపన్నమై శుద్ధచైతన్యమైన జీవునకు 'త్వం' పదము లక్ష్యార్థమవుతున్నది.

మూ : ఏవం సర్వజ్ఞత్వాది విశిష్టః ఈశ్వరః తత్పద వాచ్యార్థః ॥ ఉపాధి శూన్యం శుద్ధచైతన్యం తత్పద లక్ష్యార్థః ॥

తా: ఈ విధముగానే సర్వజ్ఞత్వము మొదలైన ధర్మములతో కూడిన ఈశ్వరునకు తత్పదము వాచ్యార్థమవుతున్నది. ఉపాధి లేని శుద్ధచైతన్యస్వరూపుడైన ఈశ్వరునకు తత్పదము లక్ష్యార్థమవుతున్నది.

మూ : ఏవం చ జీవేశ్వరయోః చైతన్యరూపేణాఽభేదే బాధకాభావః ॥

తా : ఇలా చైతన్యస్వరూపముచే జీవునకు, ఈశ్వరునకు భేదము లేదనుటలో నిరాకరణము లేదు.

మూ : ఏవం చ వేదాన్తవాక్యైః సద్గురూపదేశేన చ సర్వేష్వపి భూతేషు యేషాం బ్రహ్మ బుద్ధిరుత్పన్నా తే జీవన్ముక్తా ఇత్యర్థః ॥

తా : ఈ విధంగా వేదాంతవాక్యములచేత సద్గురూపదేశమువల్ల సర్వభూతములందు ఎవరికి బ్రహ్మబుద్ధి ఉత్పన్నమగునో వారే జీవన్ముక్తులని అర్థము.

మూ : ప్రశ్న – నను జీవన్ముక్తః కః?

తా : జీవన్ముక్తుడంటే ఎవరు?

మూ : ఉత్తరము – యథా దేహోఽహం పురుషోఽహం బ్రాహ్మణోఽహం శూద్రోఽహమస్మీతి దృఢనిశ్చయః తథా నాహం బ్రాహ్మణో న శూద్రో న పురుషః కిం త్వసఙ్గః సచ్చిదానన్దస్వరూపః ప్రకాశరూపః సర్వాన్తర్యామీ చిదాకాశరూపోఽస్మీతి దృఢనిశ్చయరూపోఽపరోక్ష జ్ఞానవాన్ జీవన్ముక్తః॥

తా : ఎలా నేను దేహమును, నేను పురుషుడను, నేను బాహ్మణుడను, నేను శూద్రుడను అను దృఢనిశ్చయము కలుగుతున్నదో అలాగే నేను బ్రాహ్మణుడను కాదు, శూద్రుడను కాదు, పురుషుడను కాదు, నేను సంగములేని వాడను, సచ్చిదానంద స్వరూపుడను, ప్రకాశరూపుడను, సర్వాంతర్యామిని, చిదాకాశరూపుడనై ఉన్నాను అనే దృఢనిశ్చయరూపమైన అపరోక్షజ్ఞానము ఎవరికి ఉంటుందో అతనే జీవన్ముక్తుడు.

మూ: బ్రహ్మైవాహమస్మీత్యపరోక్ష జ్ఞానేన నిఖిలకర్మబన్ధ వినిర్ముక్తః స్యాత్॥
తా : నేనే బ్రహ్మనై ఉన్నాననే అపరోక్ష జ్ఞానముతో జీవన్ముక్తుడు సర్వకర్మబంధములనుంచి విముక్తుడవుతాడు.

**జీవేశ్వర ఐక్యం – మహావాక్య విచారణ ద్వారా!**

వ్యష్టిగా చూస్తే చైతన్యాన్ని జీవాత్మ అంటారనీ, సమష్టిగా చూస్తే, చైతన్యాన్ని ఈశ్వరుడు లేదా పరమాత్మ అంటారనీ శాస్త్రం చెబుతుంది. ఈ రెండింటి మధ్య తేడా వాటిని ప్రతిబింబించే మాధ్యమంవల్ల ఏర్పడింది. బింబ చైతన్యంలో ఏమీ తేడా లేదు. జీవ ఈశ్వర ఐక్యం సూచించే వాక్యాలు ఎన్నో ఉన్నాయి ఉపనిషత్తులో. ఈ వాక్యాలని మహావాక్యాలు అంటారు.

నాలుగు మహావాక్యాలు – **1. తత్త్వమసి 2. అహం బ్రహ్మ అస్మి 3. అయమాత్మా బ్రహ్మ 4. ప్రజ్ఞానం బ్రహ్మ**

**1. తత్త్వమసి –** అది నువ్వే అయి ఉన్నావు. అది అంటే భగవంతుడు, నువ్వు అంటే జీవుడు. ఆ భగవంతుడు నువ్వే. ఈ మహావాక్యం ఛాందోగ్యోపనిషత్తులో వస్తుంది.

**2. అహం బ్రహ్మ అస్మి –** నేను బ్రహ్మను. గురువు తత్త్వమసి అని బోధిస్తే, శిష్యుడు నేను బ్రహ్మను అనే సత్య నిష్ఠలో ఉంటాడు. ఈ మహావాక్యం బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది.

**3. అయమాత్మా బ్రహ్మ –** ఈ ఆత్మే బ్రహ్మ. ఈ మహావాక్యం మాండూక్యోపనిషత్తులో వస్తుంది.

**4. ప్రజ్ఞానం బ్రహ్మ –** ప్రజ్ఞానమే బ్రహ్మ. ఈ మహావాక్యం ఐతరేయోపనిషత్తులో వస్తుంది.

మహావాక్యం అనేది జీవ, ఈశ్వర ఐక్యం సూచించే వేదాంతవాక్యం. వేదాంతంలో ప్రాథమిక అంశం ఇది. మిగతా అంశాలు దీని తర్వాతే. జీవుడు, ఈశ్వరుడు ఒకరే అన్నది అర్థం చేసుకోవటానికి మనం మహావాక్యాన్ని విశ్లేషించాలి. దీన్ని మహావాక్య విచారణ అంటారు. ఇదెలా చేస్తాం?

ఈ వేదప్రతిపాదనని అర్థం చేసుకోవటానికి ఒక ఉదాహరణ చూద్దాం. ఒక చీకటి గది ఉందనుకుందాం. అందులో తలుపులు, కిటికీలు మూసి ఉన్నాయి. దీపం లేదు. కాని మనకు చీకటి గదిని వెలుగుతో నింపాలని ఉంది. మన దగ్గర టార్చ్ లైటు లేదు. అగ్గిపుల్ల కూడా లేదు. కాని ఒక అద్దం ఉంది.

ఇప్పుడు అద్దాన్ని తీసుకుంటే, దానికి స్వతహాగా ప్రకాశించే శక్తి లేదు. అంతేకాదు అది వెలుతురుని యిచ్చే వస్తువు కాదు. ప్రకాశించే వస్తువు కాదు. ఇప్పుడు మనం మన బుద్ధిని ఉపయోగించి, ఒక ప్రయోగం చేస్తాము. మనం ఆ గది తలుపునో, కిటికీనో తెరిచి, అద్దాన్ని ప్రత్యేకంగా ఒకచోట పెడతాము. పైన ఆకాశంలో ఉన్న అసలు సూర్యకాంతిని అద్దంలో ప్రతిబింబించేలా పెడతాము.

ఇప్పుడు అద్దంలో సూర్యుని ప్రతిబింబం కనిపిస్తుంది. అద్దం సూర్యకాంతిని పొందేసరికి, ఆ అద్దం కూడా ప్రకాశిస్తుంది. అదే సమయంలో, అది కాంతిని వెదజల్లే వస్తువు అవుతుంది. స్వతహాగా ప్రకాశంలేని అద్దం ప్రకాశించే అద్దం అవుతుంది. సూర్యుని ప్రకాశానికీ, అద్దం ప్రకాశానికీ మధ్య తేడా ఏమిటి? సూర్యకాంతి సహజమైనది కాని అద్దాన్ని తీసుకుంటే అది అరువు తీసుకున్న కాంతితో ఇప్పుడు కొత్తహొదాని పొందింది. అది చీకటి గదిని కాంతివంతం చేసింది.

ఈ ప్రతిబింబ సూర్యకాంతిని ఎటన్నా తిప్పచ్చు, అద్దం పెట్టిన కోణాన్ని మార్చటం ద్వారా. ఈ ప్రతిబింబ సూర్యకాంతివల్లే పౌర్ణమిరాత్రి చంద్రుడు వెన్నెల కాంతిని యిస్తాడు. ఇందులో మనం మూడు విషయాలని గ్రహించాలి –

1. అసలు సూర్యుడు 2. ప్రతిబింబించే మాధ్యమం 3. ప్రతిబింబ సూర్యుడు.

ఎన్ని ప్రతిబింబమాధ్యమాలు ఉంటే అన్ని ప్రతిబింబసూర్యులు ఉంటారు. కాని అసలు సూర్యుడు ఎప్పుడూ ఒక్కడే.

మరి అన్ని ప్రతిబింబసూర్యులు ఉంటే, వాటి ప్రతిబింబనాణ్యతలో ఏమైనా తేడా ఉందా? ఉంది! మాధ్యమలక్షణాన్నిబట్టి, ప్రతిబింబలక్షణం ఉంటుంది. చిన్న మాధ్యమం చిన్న ప్రతిబింబాన్నీ, పెద్ద మాధ్యమం పెద్ద ప్రతిబింబాన్నీ చూపిస్తాయి. ఈ ప్రతిబింబాల్లో చూడటానికి తేడా ఉన్నా, వాటిని ప్రతిబింబింప చేసే బింబసూర్యుడు ఒక్కడే.

ఎవరన్నా వచ్చి చంద్రకాంతి, చంద్రుణ్ణుంచి వచ్చేది కాదు, అది సూర్యకాంతి అంటే మనకు వినటానికి వింతగా ఉండవచ్చు. కాని విజ్ఞానశాస్త్రంలోకి వెళితే, అది నిజమని తెలుస్తుంది. దీన్ని విచారణ అంటారు. మనకొక బంధువు మనీ ఆర్డరు పంపారనుకోండి. అది మనకెలా వస్తుంది? పోస్టుమాన్ ద్వారా వస్తుంది. అంటే పోస్ట్‌మాన్ మనకు తన సొంత డబ్బిచ్చినట్టా? కాదు. అలాగే చంద్రుడు పోస్ట్‌మాన్‌లా పనిచేస్తాడు. సూర్యకాంతిని భూమ్మీదకి రాత్రి సమయంలో చంద్రుడు ప్రసరింపజేస్తాడు.

ఇంకోమాటలో చెప్పాలంటే చంద్రుని కాంతి, నిజానికి సూర్యకాంతే. అందువల్ల ప్రతిబింబిస్తున్న సూర్యకాంతులు వాటి మాధ్యమాల తేడావల్ల విభిన్నకాంతులను వెదజల్లుతున్నా వాటికి కాంతిని ఇచ్చేది సూర్యుడొక్కడే.

ఇప్పుడు ఈ ఉదాహరణను జీవ ఈశ్వర ఐక్యానికి అన్వయిద్దాము. అసలు సూర్యుడు సర్వవ్యాపకమైన చైతన్యం. మనకు ప్రతిబింబమాధ్యమాలు రెండు ఉన్నాయి. మొదటిది శరీరత్రయం. దీన్ని చిన్న అద్దంతో పోల్చవచ్చు. రెండోది ప్రపంచత్రయం. దీన్ని పెద్ద అద్దంతో పోల్చవచ్చు. శరీరత్రయంలో ప్రతిబింబించిన చైతన్యాన్ని జీవుడు అంటారు. ప్రపంచత్రయంలో ప్రతిబింబించిన చైతన్యాన్ని ఈశ్వరుడు అంటారు.


పైపైన చూస్తే జీవ – ఈశ్వరుల మధ్య తేడా కనిపిస్తుంది. ఎందుకంటే ప్రతిబింబ మాధ్యమంలో తేడా ఉంది, వాటి ద్వారా కనిపిస్తున్న ప్రతిబింబాల్లో తేడా ఉంది. ఒక వ్యక్తి శరీరత్రయం వెనుకనుంచి పనిచేసే జీవాత్మశక్తి అల్పంగా కనిపిస్తుంది. అతని జ్ఞానం అల్పం. అతను ఆక్రమించే ప్రదేశం అల్పం. అదే ఈశ్వరుని విషయానికొస్తే, అతను మొత్తం ప్రపంచత్రయం ద్వారా పనిచేస్తాడు. అతను సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి. ప్రకృతిశక్తులన్నీ అతనివే.

అందువల్ల పైపైన చూస్తే, జీవ ఈశ్వరుల మధ్య భేదం ఉండటమే కాదు, అవి పూర్తిగా విభిన్నంగా ఉన్నాయి, జీవుడు దాసుడైతే ఈశ్వరుడు స్వామి; జీవుడు జీవరాశిలో ఒక భాగం అయితే, ఈశ్వరుడు మొత్తం జీవరాశి సృష్టికర్త.

వేదపూర్వభాగం, వేదాల్లో మొదటి భాగం, ఈ పై పై తేడాలకి ప్రాముఖ్యతనిస్తుంది. పూజలు, యజ్ఞయాగాదులు, ప్రాయశ్చిత్తకర్మలు జీవ–ఈశ్వర భేదాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పరచిన ప్రార్థనలు. కాని వేద అంత భాగం కొచ్చేసరికి, ఉపనిషత్తులు జీవుడిలోని చైతన్యం, ఈశ్వరునిలోని చైతన్యం రెండూ ఒకటే, అది బింబచైతన్యం అని చెబుతుంది.

మరి ఈ తేడా ఎందుకు వచ్చింది? దాన్ని ప్రతిబింబించే మాధ్యమంవల్ల వచ్చింది. అలా జీవుడూ–ఈశ్వరుడూ ఒకే చైతన్యం ప్రతిరూపాలు కాబట్టి స్వరూపరీత్యా అవి రెండూ ఒకటే. ఈ విషయాన్ని గ్రహించటమే జీవ ఈశ్వర ఐక్య జ్ఞానం అంటారు. అన్ని ఉపనిషత్తుల సారాంశం ఒకటే. అది ఈ ఐక్యత గురించి చెబుతుంది. వీటి ఐక్యత గురించి చెప్పే ఏ వాక్యాన్నైనా మహావాక్యం అంటారు. వేదాల్లో అలాంటి మహావాక్యాలు ఎన్నో ఉన్నాయి, కాని ఒక్కొక్క వేదంనుంచి ఒక్కొక్క మహావాక్యాన్ని ఉదాహరణ కింద తీసుకుంటారు.

# బ్రహ్మ - బింబచైతన్యం


జీవ
విశ్వ
తైజస
ప్రాజ్ఞ
స్థూలశరీరం
ప్రతిబింబ మాధ్యమం 01
ప్రతిబింబ చైతన్యం 01
సూక్ష్మశరీరం
ప్రతిబింబ మాధ్యమం 02
ప్రతిబింబ చైతన్యం 02
కారణశరీరం
ప్రతిబింబ మాధ్యమం 03
ప్రతిబింబ చైతన్యం 03
స్థూలప్రపంచం
ప్రతిబింబ మాధ్యమం 04
ప్రతిబింబ చైతన్యం 04
సూక్ష్మప్రపంచం
ప్రతిబింబ మాధ్యమం 05
ప్రతిబింబ చైతన్యం 05
కారణప్రపంచం
ప్రతిబింబ మాధ్యమం 06
ప్రతిబింబ చైతన్యం 06
విరాట్
హిరణ్యగర్భ
అంతర్యామి
ఈశ్వర

# Some Important Links of
# ARSHA VIDYA TARANGINI TRUST

Our books are also available as free downloadable soft copies at

http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Our Gita Classes in Telugu, Audio Files, are available for download at

http://www.telugubhakti.com/telugupages/Adwaitam/BG/BGaudios.htm

**ARSHA VIDYA TARANGINI** conducts Vedanta Online Classes
in M S Teams every Tuesday to Saturday

Time 6.00 p.m to 7.30 p.m

Information of our online classes is available at

http://www.telugubhakti.com/AVTT/onlineclasses.htm

Arsha Vidya Tarangini Online Classes' videos are available at https://www.youtube.com/channel/UCvN1vYmtiImR1-r9AIVI6QQ/playlists

Name of our YouTube Channel is **ARSHA VIDYA TARANGINI**
you can simply search for **ARSHA VIDYA TARANGINI** in google or YouTube

## ఆర్ష విద్యా తరంగిణి పుస్తక ప్రచురణలు

**ప్రకరణ గ్రంథాలు**

01. అద్వైతవేదాన్త పరిచయము
02. భజగోవిన్దమ్
03. దృగ్దృశ్య వివేకము

**శ్రుతి గ్రంథాలు**

01. ముండకోపనిషత్
02. కఠోపనిషత్
03. తైత్తిరీయోపనిషత్
04. ప్రశ్నోపనిషత్
05. ఈశావాస్యోపనిషత్
06. ఐతరేయోపనిషత్
07. ఛాందోగ్యోపనిషత్
08. కేనోపనిషత్
09. కైవల్యోపనిషత్
10. బృహదారణ్యకోపనిషత్
11. మాండూక్యోపనిషత్

**స్మృతి గ్రంథము**

01. శ్రీమద్భగవద్గీత మొదటి షట్కము
02. శ్రీమద్భగవద్గీత రెండవ షట్కము
03. శ్రీమద్భగవద్గీత మూడవ షట్కము

**న్యాయ గ్రంథము**

బ్రహ్మసూత్రములు – చతుస్సూత్రీ

**ఇతర గ్రంథము**

01. వేదాంత జీవన విధానము – 01